సమగ్ర ఆంధ్రసాహిత్యం

ఆరుద్ర

తె.సా౦౭
ఆరుద్ర-1
4287

7

జిల్లా కేంద్ర గ్రంథాలయం, కడప

పరిచయ సం.

ప్రవేశ సం. 9122

పుస్తకం పేరు

894.81309
LIBB114B103
42873
D.el

తెలుగు సాహిత్య
సౌరభ సౌందర్యాలకు
వాచవి

సమగ్ర ఆంధ్ర సాహిత్యం

పదవ సంపుటం

మువ్వురాయల యుగం

ఆరుద్ర

డా॥ పి. వి. రాజమన్నారుగారి
'ప్రవేశిక'తో,
డా॥ దివాకర్ల వెంకటావధాని
గారి
పీఠికతో



యం. శేషాచలం అండ్ కంపెనీ
మద్రాసు : మచిలీపట్టణము : సికింద్రాబాదు

రూ. 5/-

SAMAGRA ANDHRA SAHITYAM (in 13 Vols.) — Vol. VII: Mali Rayala Yugam—By *Arudra*. Introduction: By Dr. P. V. Rajamannar. Published by *M. Seshachalam & Co.*, Madras - Machilipatnam - Secunderabad.

PRICE Rs. 5

First Edition: October '65

Copyright © M. Seshachalam & Co.

Art Work: Gangadhar

Printers:
Weldun Press,
146, T. H. Road, Madras - 21

D.C.L. CL. ...
Acc. ... 21864
ప్రాప్తిస్థానం:

ఆంధ్రప్రదేశ్
రాష్ట్రపతి రోడ్డు

బుక్ డిస్ట్రిబ్యూటర్స్
సికింద్రాబాదు

Regd. 212864

మా ఉద్దేశం

సాహిత్యాభిలాష గల సాధారణపాఠకులు ఆంధ్రసాహిత్యం గురించి సంపూర్ణంగా తెలుసుకోవా లనుకొంటే, వాళ్ళకు ఉపయోగించే పుస్తకాలు నేడు అందుబాటులో లేవు. నన్నయభట్టునుండి చిన్నయ సూరిదాకా ఆంధ్రసాహిత్యం అనేకవిధాలుగా, బహుముఖాలుగా సాగింది. ప్రజ్ఞావంతులైన తెలుగుకవులు రచించిన గ్రంథాలు అన్నిటికి అన్నీ అచ్చుపడి వెలుగుచూడలేదు. అచ్చయిన పుస్తకాలుగూడ అన్నీ అందరికీ లభించడంలేదు. లభించిన పుస్తకాలైనా అన్నీ సాధారణపాఠకులకు బోధపడేవివరణలతో లేవు. ఈ కొరతను తొలగించవలసిన బాధ్యత నేటి ప్రకాశకులపై ఉంది.

ఈ అవబోధంతోనే మేము అనిదంపూర్వమైన ఈ సాహిత్యసేవకు సమకట్టాము. వెయ్యిసంవత్సరాలపాటు వేవిధాలుగా పూచి, కాచి, పరిపరి పరిమళించిన నవరసాలనూ నవనవమైన నవకంతో, నేవళింతో తేనెవాకలూరించిన తెలుగు సాహిత్యాన్ని సార్వజనికోపయోగకరంగా, సర్వులకూ సులభావగాహంగా పన్నెండు సంపుటాలలోకి ఇమిడికగా కుదించి, తెలుగు మహాజనులకు అందింపబూనుకొన్నాము. సహస్ర సంవత్సరాల సాహిత్యాన్ని ఇంత శతాంశంలో క్లుప్తీకరించడం సాహసమైతే కావచ్చుగాని సాహిత్యపిపాస గల సాధారణపాఠకులు వెనువెంటనే పయనించడానికి ఈ సంపుటాలు చక్కని సోపానాలు కాగల వనడానికి ఎంతమాత్రమూ సందేహంలేదన్న సంకల్పదీక్షే మమ్ముల నీకృషికి ప్రేరేపించింది. ఆంధ్రసాహిత్యాన్ని మూలగ్రంథాలనుండి తనివితీరా గ్రోలడానికి ఈ సంపుటాలు సర్వాత్మనా సాయపడతా యనే ఆశిస్తున్నాము.

ఈ సంపుటాలలో ప్రముఖకవుల జీవిత విశేషాలూ, వాళ్ళు సాహిత్యాన్ని ఏయేవిధంగా, ఏయే వాతావరణాల్లో, ఏయే సాధన

బోధకాలతో పెంపొందింపజేసిందీ, వాళ్ళ కావ్యాలలోని గొప్ప దనమూ, వాటి నిగనిగ వెలుగులూ వివరించడం జరుగుతుంది. నిదర్శనకు ఆయాకవుల రచనలలోని రసవత్తర ఘట్టాలు కొన్ని ఉదాహరించడం కూడ జరుగుతుంది. ఆ రచనలలోని సొగసులూ, చమత్కారాలూ విశదీకరించడమూ జరుగుతుంది. ఒక్కొక్క కవి ఏయే గ్రంథాలు వ్రాసినదీ శృంగ్రాహికగా వివరించి, అముద్రితమైనవీ అలభ్యమైనవీ అయితే ఆ గ్రంథాలనుండి తగిన ఉదాహరణలు సుదీర్ఘంగాకూడ ఇవ్వబడుతాయి.

సాహిత్యమంటే ఒక్క పద్యకావ్యాలే కావుగనుక ఈ సంపుటాలలో ముఖ్యమైన శతకకవులూ, యక్షగాన రచయితలూ, వచన కర్తలూ, వాగ్గేయకారులూ మొదలైన మధురకవులను గురించికూడ కావలసినన్ని జీవితవివరాలూ, ఉదాహరణలూ ఉంటాయి.

ఈ సంపుటాలు చదివాక ఎటువంటి సామాన్య పాఠకుడికైనా సమగ్ర ఆంధ్రసాహిత్యంతో సన్నిహితసంబంధం ఏర్పడాలని మా ఉద్దేశ్యం; ఏర్పడితీరుతుం దని మా దృఢాభిప్రాయం.

ఇవి అన్నీ సాంతం చదివాక సర్వసాధారణపాఠకుడుసైతం కొమ్మలుతిరిగిన సాహితీపరుల అగాధచర్చలను కూడ సాధికారంగా, కరతలామలకంగా బోధపరుచుకునే అవకాశ ముంటుందని ఆశిస్తున్నాము.

ఈ సాహిత్యచరిత్రలో కడచిన సహస్రాబ్దాలనూ పక్కపేజీల్లో చేర్చినట్లు అందికగా యుగాలుగా విభజించి, తదనుసారంగా ఆయా యుగాల సమీక్ష జరుగుతుంది. అందులో ఇది మలిరాయలయుగ సమీక్ష సంపుటి.

పన్నెండు సంపుటాలని ఆదిని అనుకొన్నాముగాని రెడ్డిరాజుల యుగం వచ్చేసరికి ఆ యుగంలోని కవుల సంఖ్య, ప్రాముఖ్యం పెరిగి, నిర్ణయించుకొన్న పుటల సంఖ్యలో రచన ఇమడనందున ఆ యుగానికి తర్వాత గజపతులయుగమని అదనంగా ఇవ్వవలసివచ్చింది. కాగా ఈ సంపుటాల సంఖ్యకూడ 13 కు పెంచక తప్పిందికాదు.

యుగవిభజన (ఉజ్జాయింపుకాలాలు)

1. ఆదిమ – చాళుక్యయుగము (క్రీ. శ. 12 వ శతాబ్ది చివరదాకా)
   (రాజరాజు 1061 లో చనిపోయినా, చాళుక్యచోడులు 1180 దాకా ఆంధ్రపై అజమాయిషీ చేశారు. అందుకని.)
2. కాకతీయయుగం (క్రీ. శ. 1200 – 1290)
   (రాజ్యస్థాపన క్రీ. శ. 1000 లో జరిగినా, గణపతిదేవ చక్రవర్తితో కాకతీయ ప్రాభవం ప్రస్ఫుటంగా కనబడుతుంది. అందుకు యుగం 1199 నుండి ప్రారంభం. అది రుద్రమదేవితోనే తగ్గిందని చెప్పవచ్చు. రెండవప్రతాపరుద్రుని కాలంలో కొత్తగాలులు వీచాయి. కనుక యుగం 1290 తో అంతం చేయవచ్చు.)
3. పద్మనాయకయుగం (క్రీ. శ. 1300 – 1375)
   (మొదటి సర్వజ్ఞసింగమ నాయకుని రాజ్యారంభందాకా)
4. రెడ్డిరాజులయుగం (క్రీ. శ. 1375 – 1450)
   (స్థాపన 1325 లో జరిగినా...కొమరగిరిరెడ్డితో ప్రాభవం. ఒక ముక్కాలుశతాబ్దం వీరియుగంగా పరిగణిద్దాం)
5. గజపతులయుగం (1435 నుండి)
   (రెడ్డిరాజుల యుగానికి ఇది అనుబంధంలాంటిది. గజపతులరాజ్యం ఈయుగంలో మొదలై, తొలిరాయల యుగంలో వర్ధిల్లి, మలిరాయలయుగంలో మరింత ప్రాముఖ్యం చెందింది. ఆంధ్రదేశచరిత్రలో విస్మరించరాని పాత్రవహించిన వీరి పేర నొక యుగాన్ని పేర్కొనడం సముచితమే.)
6. తొలిరాయలయుగం (క్రీ. శ. 1450 – 1500)
   (ప్రౌఢదేవరాయల చివరికాలంనుండి, అనగా 1446 లేక 1450 నుండి సాళువరాయర్ల రాజ్యాంతందాకా)

7. మలిరాయలయుగం (క్రీ. శ. 1500 – 1550)
(కృష్ణదేవరాయలయుగం)

8. నవాబులయుగం (క్రీ. శ. 1550 – 1600)
(ఇబ్రహీం కుతుబ్ షాతో ప్రారంభం. కులీకుతుబ్ షా మరణానికి ఒకదశ ముందుదాకా)

9. నాయకరాజుల యుగం (క్రీ. శ. 1600 – 1670)
(రఘునాథ నాయకుడు, విజయరాఘవనాయకులదాకా)

10. కడపటి రాజుల యుగం (క్రీ. శ. 1670 – 1750)

11. కుంఫిణీయుగం (క్రీ. శ. 1750 – 1850)
(మెకంజీ, బ్రౌనుల సేవ. ఉత్తర సర్కారులను బుస్సీ పుచ్చుకున్నాడు. 1758 లో కంపెనీవారు ఉత్తర సర్కారులను స్వాధీనం చేసుకొన్నారు.)

12. జమీందారీయుగం (క్రీ. శ. 1850 – 1900)
(పరపాలన మొదలు సాహిత్యానికి జమీందారులే పోషకులని కవులు భావించడంచేత)

13. ఆధునికయుగం (క్రీ. శ. 1900 నుండి –)

సంపుటాల సంఖ్య పెరిగినా, సంకల్పించిన ప్రకారం అన్ని సంపుటాలూ సంవత్సరంలోగానే ప్రచురిస్తామని మనవిచేస్తున్నాము. మధ్యలో ఒకటిరెండు అధికమాసంగా ఎంచి రెండు సంపుటాలు విడుదల చేయదలిచాము.

మా ఈ కృషి మహాజనానికి ఏమాత్రం సంతృప్తి కలిగించినా మహాభాగ్యంగా పరిగణిస్తాము.

ప్రకాశకులు.

ప్రవేశిక

కందుకూరి వీరేశలింగం పంతులాదిగా అనేకపండితులు ఆంధ్రకవుల చరిత్రలు రచించారు. ఆంధ్రభాషాపరిణామంగురించి పలువురు పరిశోధకులు వ్యాసాలు, గ్రంథాలు వ్రాశారు. ఆంధ్రవాఙ్మయచరిత్రలుకూడా కొన్ని ఉన్నాయి. కాని, రమారమి రెండువేల సంవత్సరాల ఆంధ్రవాఙ్మయాన్ని —చాళుక్యయుగం మొదలు ఆధునికయుగం వరకు— సమగ్రంగా, సక్రమంగా, విపులంగా ప్రజాసామాన్యానికి అందజేసే పుస్తకం ఇదివరకూ లేదు. ఆ కొరత తీర్చడానికి సంకల్పించుకొన్న శేషాచలం కంపెనీవారి ఈ అసమానోద్యమాన్ని ఎంత మెచ్చుకొన్నా చాలదు. ఈ ప్రచురణలోకొన్ని ప్రశంసనీయాలైన అంశాలున్నాయి.

'మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్' అని అన్నాడు రామరాజభూషణుడు. నన్నయ భారతమే తెలుగులో మొదటి కావ్యరచన అనే అభిప్రాయం—సాధారణంగా. అయితే ఒక్కక్షణం ఆలోచిస్తే హఠాత్తుగా ఎటువంటి ప్రతిభాశాలియైనా అంత పరిపక్వమైన భాషాస్వరూపాన్ని సృష్టించడం అసంభవమని తోచకమానదు. నన్నయకు పూర్వం ఎన్ని వంద లేండ్లనుంచో ఆంధ్రభాష పుట్టి పెరుగుతూ వచ్చివుండాలి. ఆ అజ్ఞాతయుగం గురించి కొంతైనా తెలిసినవారి సంఖ్య అతిస్వల్పం. ఈ ప్రచురణ మొదటి సంపుటంలో నన్నయపూర్వపు భాషాస్వరూపం, స్వభావం గురించి పరిశోధనాపూర్వమైన చక్కని ఉంది. ఇది ఒక ప్రశంసనీయమైన విషయం.

ఇంకొకటి. ఇదివరకు రచింపబడిన ఆంధ్రవాఙ్మయ చరిత్రల్లో ఆధునిక సాహిత్యానికి అర్హమైన స్థానం ఇయ్యలేదు. ఈ చరిత్రలో దానికి ఉచితమైన ప్రాముఖ్యత ఇచ్చి దాని సర్వతోముఖవికాసం వర్ణింపబడ్డది.

కవుల జాబితాలతో, గ్రంథాల పట్టీలతో నింపి సాహిత్యచరిత్ర వ్రాయవచ్చు—చప్పగా. అటువంటిది కాదిది. కవులను గురించిన కథలూ కబుర్లు, వాళ్ళ జీవితాల్లోని ప్రధానఘట్టాలు, సాహిత్యవిమర్శలు—వీటితో రసవంతంగా, ఆకర్షణీయంగా వ్రాసిన చరిత్ర ఇది.

ఇక రచయితగురించి రెండుమాటలు. ఆరుద్రకు అద్వితీయమైన ఆంధ్రసాహిత్యజ్ఞానం ఉంది. అంతేగాక ప్రపంచసాహిత్యపరిచయం సహా ఉంది. పరిశోధకకృషి, విమర్శకదృష్టి ఉంది. సరళమైన సజీవభాషలో వ్రాయగల శక్తి ఉంది. వ్యవహారంలోని తెలుగు నుడికారం సొంపు అతనికి వెన్నతోడ పెట్టింది. సౌందర్యపిపాసి, రసికుడు, అన్నివిధాల ఇటువంటి చరిత్రకు తగిన రచయిత.

ఇంత సమగ్రమైన ఆంధ్రసాహిత్యచరిత్రను ప్రకటించడానికి పూనుకున్న శేషాచలం కంపెనీవారి ఆశయం శ్లాఘనీయం. ఆంధ్రభాషకు వారు ఒనర్చే సేవ అగణ్యం. ఆంధ్రలోకానికి ఇది ప్రశస్తమైన విశ్వాసకానుక. చదువుకొన్న ప్రతి ఆంధ్రుడు ఈ కానుకను రెండు చేతుల్తో పుచ్చుకోవలెనని నా కోరిక.

పి. వి. రాజమన్నారు.

పీఠిక

శ్రీ ఆరుద్రగారు మా తమ్ముని శిష్యులు. బాల్యమున విశాఖపట్టణములో చదువుకొనునప్పు డతనిదగ్గర కొంత సంస్కృత మభ్యసించిన సంగతి వారు కనబడినప్పుడెల్ల చెప్పుచుందురు. ఇట్లు బాల్యమునందలి అల్పకాలపరిమితమైన గురుత్వమును - అందును పాఠశాలాసంబద్ధమైనదానిని - మఱువక కృతజ్ఞతతో స్మరించుట ఈనాడొక గుణవిశేషమే అనవలెను. తద్ద్వారా వారు నాకు శిష్యప్రాయులైనారు. వారు సమగ్రాంధ్రసాహిత్యచరిత్రసృష్టికి పూనుకొనుచున్నట్లు తొలిసారి ప్రకటనమువలన ఎరిగి చాల సంతసించితిని. వారి ప్రతిభ నిశితమైన దని నాకు తెలియును. పద్యకథావ్యాసాత్మకములైన వారి రచనలు చదివినప్పుడు, మనోరంజకములైన వారి ఉపన్యాసములు విన్నప్పుడు అది పుష్కలముగా గోచరించి, ఎంతో తృప్తినొసగుచుండెను. ప్రకటితములైన ఆరు సంపుటములను చదువగా వారు చేసిన అపారమైన కృషి, చూపిన అసాధారణమైన పరిశోధనపరాయణత్వము మరింత తృప్తి కలిగించినవి. వారు పట్టి కవియేకాక మంచి పండితుడు, పరిశోధకుడు అని అందలి ప్రతిపుటయు చెప్పకచెప్పుచున్నది. ఆధునికయువకవులలో పాండితీపరిశోధనలందు మక్కువగలవారి సంఖ్య తక్కువ. శ్రీ ఆరుద్ర గారు వారికి శుభోదర్కమైన ఒక చక్కని బాట చూపినారు. చిరకాలము కళాశాలలలో సాహిత్యచరిత్రపాఠములు చెప్పువారెవ్వరో చేయదగిన ఈ మహాకార్యమును వారొక్కరు అతిసమర్థముగా నిర్వహించుచుండుట ఎంతయు ప్రశంసింపదగియున్నది.

మన వాఙ్మయమున విస్తృతములైన కవిచరిత్రలు రెండుమూడున్నవి. వానివలన ఆయాకవుల కాలాదులు, వారు రచించిన గ్రంథముల పేర్లు మాత్రమే తెలియును కాని వాని సాహిత్యపు విలువ సరిగా తెలియదు. సాహిత్యచరిత్రలుకూడ కొన్ని ఉన్నను అవి అతిసంగ్రహములైనవి; సామాన్యప్రజానీకమునకు సాహిత్యముతో పరిచయము కలిగింప

వలె ననుదృష్టితో వ్రాయబడినవి కావు. అందుచే తెలుగువారికి సమగ్రమైన తమ వాఙ్మయము సారస్యము నంతను చూరయించ్చు సాహిత్య చరిత్ర వ్రాయవలసిన ఆవశ్యక మెంతో యున్నది. శ్రీ ఆరుద్రగారి ఈ ప్రయత్న మా ఆవశ్యకమును చక్కగా పూరించుచున్నది. సుమారైదేండ్లనుండి ఈ విషయమున వారు చేయుచున్న కృషి వారి మిత్రులు పలువురితోపాటు నాకును తెలియును. ఆంధ్రవాఙ్మయమునందలి పెక్కు కావ్యములను స్వయముగా చదివి విలువకట్టుటయేకాక వారు వానిని గూర్చియు, వాని కర్తలనుగూర్చియు ప్రకటింపబడిన గ్రంథములను, విమర్శలను, వ్యాసములను సమగ్రముగా పరిశీలించి, ఆ పరిశీలనఫలితము నిందు సరసముగా సంగ్రహించి, సమగ్రాంధ్రసాహిత్య మను నామము నకు సార్థక్యము చేకూర్చినారు. కవులు సాహిత్యచరిత్ర వ్రాయుటలో ఒక సౌకర్య మున్నది. వారు కవిహృదయమును చక్కగా ఎరుగజాలుటయేకాక చరిత్రనుకూడ కమ్మని కవిత్వముగా జాలువారింతురు. ఈ చరిత్రలో అట్టి కమ్మదనము పెక్కుచోట్ల ఆస్వాదనీయ మగుచుండును.

ఇది మలిరాయల యుగము. క్రీ. శ. 1500 నుండి సుమారు డెబ్బది సంవత్సరములు ప్రౌఢసుందరముగా సాగిన ఆంధ్రసాహిత్యముచరిత్ర. సాహితీసమరాంగణసార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయల ఉదారపోషణమును పొందినకతమున ఇది స్వర్ణయుగ మైనది. ఈ యుగమున కావ్యము లెంత ఎక్కువగా సృష్టింపబడినవో అంత ప్రౌఢములై పరిఢవిల్లినవి. నిజమున కాంధ్రవాఙ్మయమునందలి కవితాప్రౌఢిమను ఆస్వాదింపవలెనన్న - అందలి అలంకారికరచనాసౌష్ఠవము నాని ఆనందింపవలెనన్న - అందలి కవుల భావనాపాండితీశౌండీర్యము చవిచూచి షరవశింపవలెనన్న - ప్రబంధములనే పఠింపవలెను. ఆంధ్రవాఙ్మయమహావనమున ప్రబంధయుగము పూదేనియయేటికాలువలచే, పరిపక్వఫలరససంపదలచే, సురభికుసుమవిసరములచే పఠిత్రపాంథుల మనోనయనేంద్రియముల కానందోల్లాసములు కలిగించు హృద్యమైన ఉద్యానవనము. అందు చొచ్చిన వారికిలోకమే స్వర్గమై ఆనందబ్రహ్మసాక్షాత్కారమగును. శ్రీ ఆరుద్రగారు 'రుద్వేలనిర్వాణభవ్యరసాస్వాదరసాయన'మైన తత్కావ్యసౌందర్యము నిందు రెండువందల ఆరువదినాలుగు పుటలలో అందిచ్చినారు.

మొట్టమొదట వారీయుగమునందలి రాజకీయపరిస్థితుల పర్యాలోకనము కావించినారు. సాహిత్యముపై సమకాలిక మత సాంఘిక రాజకీయ పరిస్థితుల ప్రభావ మధికముగా ఉండును. అందుచే వాని నన్నిటిని కలిపి సమీక్షింపవలసిన అవసర మున్నది. బైచరాజు వెంకట నాథుడు పంచతంత్రములో చెప్పినట్లు ఈ యుగమున వెంటివిద్యల ఆదరణము అంతరార్పణ మెట్లయ్యెనో, అది ప్రబంధములలో ఎట్లు ప్రతిఫలించెనో వారు చక్కగా సూచించినారు.

కవుల కాలములను నిర్ణయించుటలోకూడ శ్రీ ఆరుద్రగారు చేసిన కృషి శ్లాఘనీయము. ఉన్న అభిప్రాయముల నన్నిటిని పరిశీలించి ఆంతరసాక్ష్యము దేనిని బలపరచునో దానిని వారు నిష్పక్షపాతముగా ప్రకటించినారు. పినవీరభద్రుని పూర్వకవిస్తుతిలో నుతించిన కారణమున వారు గోపరాజు 1500–1530 వరకు జీవించియుండునని నిర్ణయించినారు. రాయలవారి భువనవిజయసభలో ఉండిన అష్టదిగ్గజకవు లెవ్వరో ఇంతవరకును నిర్వివాదముగా నిర్ణీతము కాలేదు. అసలా యెనమండుగురు ఆంధ్రకవు లగుదురో కారో అను విషయమునకూడ భిన్నాభిప్రాయములున్నవి. శ్రీ ఆరుద్రగారు పూర్వవిమర్శకుల అభిప్రాయము లన్నియు సూచించి నిర్ణయము పాఠకులకు విడిచినారు. సందిగ్ధమైయున్న ఈ విషయమున ఇంతకన్న చేయదగిన దేమియు లేదు. శ్రీ ఆరుద్రగారు అయ్యలరాజు రామభద్రుని విడిచి పుత్తేటి రామభద్రుని ఆ ఎనమండుగురిలో చేర్చుట యుక్తిసహముగనే యున్నది. అల్లే విష్ణుమాయానాటకకర్తృత్వమునుగూర్చిన చర్చయు హేతువాదపూర్వకమై యింపునింపుచున్నది.

ప్రతికవి కావ్యమునందలి కథాంశములను వివరించుచునే వారు కావ్యవిమర్శకూడ కావించియున్నారు. ఆయా కావ్యములందలి గసవంతములైన పద్యములను ఉదాహరించి వాని సౌందర్యమును ప్రకటించినారు. లోకమున ప్రసిద్ధములై ఉన్న కథలను, చాటుపద్యములను అక్కడక్కడ సూచించి వానికి సమన్వయము కావించినారు. తత్కాలప్రవృత్తు లా కావ్యములలో నెట్లు ప్రతిఫలించుచున్నవో విశదీకరించినారు. రాయలవారి ఆముక్తమాల్యదనుగూర్చి వారు చేసిన సమీక్ష సరసమును, సమగ్రమునై ఉన్నది. మనుమంచిభట్టు అశ్వలక్షణసారమునప్పా డేల వ్రాయవలసివచ్చెనో వారు సూచించిన హేతువు సమంజస

ముగా నున్నది. చరిగొండ ధర్మన్నను, నాదెండ్ల గోపమంత్రిని ఒక్కచో చేర్చుట ఉచితమే. ధర్మన్న తన కావ్యమునకు మూలము బ్రహ్మాండపురాణ మని చెప్పెను కాని అది పరిశీలింపవలసి ఉన్నది. బ్రహ్మాండపురాణమున ఆ కథ కనిపించుట లేదు. కథాంశవిమర్శతో పాటు రసపాత్రపోషణ పరిశీలనముకూడ నింక కొంచెము విపులతర ముగా నుండుట వాంఛనీయము.

సదాశివరాయలతో మలిరాయల యుగము ముగియుట కతన భట్టుమూర్తి, నూరన, రామకృష్ణుడు మున్నగు మహాకవుల నిందు చేర్చుట కవకాశము లేకపోయినది. గ్రంథపరిమాణదృష్టితో హరిభట్టు, వెన్నెల కంటి నూరన్న మున్నగువారి 'నిరకవు' లను పేరుతో నూచించి మాత్రము విడిచివేయవలసివచ్చినది. శ్రీ ఆరుద్రగారు చెప్పిన ట్లీయుగ మున సాహిత్య 'మేనుగుపాడి'. సంపుటముల సంఖ్యను దృష్టిలో నుంచు కొని చెప్పవలసిన విషయములను చెప్పమానినచో సమగ్రతకు భంగము వాటిలును.

ఇందలి రచనాపద్ధతినిగూర్చి ఒక్క మాట చెప్పి విరమింతును. రచన సర్వత్ర సరళమై, భావగంభీరమై, విశదమై, కథవలె సామాన్యులకుకూడ చదువవలెనను ఆసక్తి కలిగించుచున్నది. విమర్శ నిష్పక్షపాతము, సత్యనిష్ఠము నై అలరారుచున్నది. "అతని విగత నేత్రాలనుండి కారిన రక్తాశ్రువుల వేడివల్ల రాయల కీర్తికాంత పాదాలత్తుక లావాగా మారింది. రాయల కుత్తుకలో కత్తులు పాటపాడాయి"వంటి వాక్యములు కవిత్వమును గుమ్మరించుచున్నవి. మా తమ్ముని శిష్యుడు సాహిత్యచరిత్ర నింత సరసమంజులముగా వ్రాయగలవాడైనందు కానందముతో పులక రించుచు, దీని నింత రమ్యముగా ప్రకటించుచున్నందుకు యం. శేషాచలం కంపెనీవారి నభినందించుచు, మిగిలిన సంపుటములనుకూడ త్వరలో చదువవలె ననుు ఉత్కంఠతో ఉవ్విళులూరుచు, ముగించుచున్నాను.

బరకత్పుర,
హైదరాబాదు
2_10_65

దివాకర్ల వేంకటావధాని

కృతజ్ఞతలు

నేను ఉద్దేశించిన కొండంత పథకానికి నేడు కన్పిస్తూన్న గోరంత రూపకల్పనలో సంగోరు దీనితో ముగిసింది.

ఈ సంపుటాలు వెలువడుతున్న వెంటనే ఆసక్తితో చదివి ఆదరాభిమానాలతో నాకు ఉత్తరాలు వ్రాస్తున్న శ్రేయోభిలాషు లందరికి నా వందనాలు. నిర్మాణాత్మకమైన సూచనలిస్తున్న వారికి ధన్యవాదాలు. సాఫు వ్రాస్తున్నప్పుడో, ప్రూఫు దిద్దుతున్నప్పుడో పొరపాట్లు దొర్లుతున్నాయి. వీటితోబాటు విమర్శకులు సూచించే నా లోపాలూ, కొందరి కోపాలూ రెండవ ముద్రణలో సర్దుకొంటాయని మనవి చేస్తున్నాను.

ఈ రచనకు కావలసిన గ్రంథా లెన్నింటినో నామిత్రు లెందరో ఎరువిస్తున్నారు. వారికి నాకృతజ్ఞతలు. తొలినుంచీ పుస్తకాలు ఇస్తున్న మిత్రులు వేదం వెంకటరాయశాస్త్రిగారు, వేదం లక్ష్మీనారా యణ శాస్త్రి, దేవుళ్ల చిన్నికృష్ణయ్య గార్ల మేలు మరువలేను. అముద్రిత గ్రంథాలనుకూడా ఎరువిచ్చిన స్నేహితులు నిడుదవోలు సుందరేశ్వరరావు, డాక్టరు బిరుదురాజు రామరాజుగార్లకు నా ధన్య వాదాలు. తొలినుంచి నాకృషిని ప్రోత్సహిస్తున్న శ్రీ ఈరంకి రాయన్న, పర్వతనేని గంగాధరరావుగార్లకు నాకృతజ్ఞతలు.

ఈ ప్రణాళికకు ప్రవేశిక వ్రాసిన డాక్టరు పి. వి. రాజమన్నారు గారికి, ఈ సంపుటానికి పీఠిక వ్రాసిన గురుతుల్యులు డాక్టరు దివాకర్ల వెంకటావధాని గారికి ప్రకాశకులతోపాటు నా వందనాలు.

పుస్తక సేకరణలో తోడ్పడుతున్న మిత్రులు శ్రీ టి. వి. రంగా చార్యులుగారికి, సాఫువ్రాసి ప్రోత్సహిస్తున్న నా అర్ధాంగి శ్రీమతి రామలక్ష్మికి నా కృతజ్ఞత.

ఆరుద్ర.

ఇందులోని విషయాలు

మా ఉద్దేశం		iii
ప్రవేశిక - డా॥ పి. వి. రాజమన్నారు		vii
పీఠిక - డా॥ దివాకర్ల వెంకటావధాని		ix
1. మల్లిరాయల యుగం	...	1
2. కొరవిగోపరాజు	...	17
3. మాడయ్య కవి	...	30
4. మనుమంచి భట్టు	...	44
5. మాదయ్యగారి మల్లన	...	54
6. కృష్ణదేవరాయలు	...	70
7. నంది తిమ్మన	...	143
8. చరిగొండ ధర్మన్న, నాదెండ్ల గోపమంత్రి		166
9. అల్లసాని పెద్దన	...	177
10. ధూర్జటి	...	201
11. సంకుసాల నరసయ్య	...	216
12. చింతలపూడి ఎల్లన్న	...	227
13. పిడుపర్తి కవులు	...	246
14. తాళ్ళపాక కవులు	...	250
15. ఇతర కవులు	...	257

సమగ్ర ఆంధ్ర సాహిత్యం

౭. మలిరాయలయుగం



మలిరాయలనాటి ఆంధ్రదేశము

1

మహారాయల యుగం



ది ఆంధ్రసాహిత్యచరిత్రలో ఎంతో ప్రాముఖ్యమున్న యుగం; స్వర్ణయుగం! అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మన, మాదయగారి మల్లన్న, ధూర్జటి, తెనాలి రామకృష్ణుడు, సంకుసాల నరసయ్య, రాధామాధవకవి మొదలైన ఆజానుబాహు లందరూ ఈ యుగంలోనివాళ్ళే. భారతదేశచరిత్రలోనే కాక, ప్రపంచ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయే మహావ్యక్తి కృష్ణదేవరాయల పరిపాలన ఈ యుగంలోనే ప్రజాక్షేమానికి మంగళకై శికీగీతాలను పాడింది. చాణక్యుణ్ణి చంపిపుట్టి యుగంధరుని తలదన్నే మహామంత్రి అప్పాజీ తిమ్మరుసయ్య స్వహస్తాలతో ఈ యుగానికి రూపురేఖలు దిద్దాడు. అతని అమృత హస్తాల చలువవల్ల విజయనగర సామ్రాజ్యం వికసించిన పువ్వులాగ గుభాళించింది. అతని విగతనేత్రాల నుండి కారిన రక్తాశ్రువుల వేడివల్ల రాయల కీర్తికాంత పాదాల లత్తుక లావాగా మారింది. రాయల కుత్తుకలో

కత్తులు పాట పాడాయి. ఈ యుగంలోని విజయనగర సామ్రాజ్య చరిత్ర ఆంధ్రులు విస్మరించ లేని పుట్టుమచ్చ.

విద్యారణ్యులవారి ఆశీర్వాదంతో సంగమవంశ రాజులు ఈ సామ్రాజ్యాన్ని క్రీ. శ. 1335 లో స్థాపించారు. కళలను పోషిస్తూ, కవులను ఆదరిస్తూ ఆశ్రితులకు అగ్రహారాలిస్తూ ఉద్భటవివాదాలలో గెలిచినవారికి కనకాభిషేకాలు చేస్తూ సంగమరాజులు క్రీ. శ. 1485 దాకా పాలించారు. ఈ వంశంలోని కడపటిరాజులు అతిదుర్బలులై అవినీతి పరులుగా మారినందువల్ల, పేరి కొలువులోనే ఉన్న దండనాయకుడు సాళువ నరసింహరాయలు సామ్రాజ్యాన్ని సంరక్షించడానికి క్రీ. శ. 1485 లో అధికారాన్ని హస్తగతం చేసుకొని వజ్రసింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడు తాళ్ళపాక అన్నమయ్యగారిని సత్కరించి సంకీర్తనలను ప్రోత్సహించాడు. పిల్లలమర్రి పినవీరయ్యను పోషించి కృతి పుచ్చుకొన్నాడు. సాళువ నరసానాయకుడు క్రీ. శ. 1490 లో మరణించాడు. అతడు మృత్యుముఖంలో ఉన్నప్పుడు యుక్తవయస్సు రాని తన కుమారులను తన కుడిభుజంలాంటి సాళువ నరసానాయకునికి అప్పగించాడు. ఈ ఇద్దరు కొడుకుల్లో ఎవరు యోగ్యులైతే వాళ్ళకా పట్టం కట్టమన్నాడు. నిశ్చింతగా కన్నుమూశాడు.

విశ్వాసపాత్రుడైన నరసానాయకుడు తన స్వామి చెప్పిన మాటలు నెరవేర్చాడు. నరసింహరాయల పెద్ద కొడుకు తిమ్మరాజును గద్దెపై కూర్చోపెట్టాడు. అయితే దురదృష్టవశాత్తూ అతడు పట్టుమని పదినెలలు కూడా జీవించ

లేదు. ఈ అభాగ్యుని తరువాత అతని సోదరుడు తమ్మి రాజును, ఇమ్మడి నరసింహరాయ లనే పేరిట నరసానాయకుడు గద్దె కెక్కించాడు. ఇతడు క్రీ. శ. 1490–1506 వరకు పాలించినట్లు శాసనాలు ఉన్నాయి. అయితే, నరసింహరాయలంతకాలమూ గద్దెమీద కూర్చొని పాలించలేదు. పెనుకొండ దుర్గంలో బంధితుడుగా ఈ రాయలు బ్రతుకుతూఉంటే అతని పేరుమీదుగా నరసానాయకుడు అధికారం చెలాయించాడు. దీనికి స్వార్థం కాక సామ్రాజ్య రక్షణే కారణం. కొంతమంది సామంతులకు నరసానాయకుని పాలన కిట్టలేదు. అతణ్ణి తప్పించడానికి రాయలను గుప్పిట్లో పెట్టుకోవాలని చూశారు. ఎదురుతిరిగిన రాయలను నరసానాయకుడు బంధించక తప్పింది కాదు. సామ్రాజ్యంలోని కలహాలను అదనుగా చూసుకొని సామంతులు తిరగబడ్డారు. పరరాజులు కత్తిదూశారు. ఏకకాలంలోనే, ఇంటా బయటా ఉన్న శత్రువులతో నరసానాయకుడు పోరాడి, జయించి రాజ్యానికి కొంత భద్రత చేకూర్చాడు.

ఈ విజయాలలో నరసానాయకునికి ఇద్దరు ఎంతగానో తోడ్పడ్డారు. ఒకరు సాళువ తిమ్మరుసయ్య; రెండవవారు నరసానాయకుని పెద్దకొడుకు వీరనరసయ్య. నరసానాయకుని కార్యకర్తగా, మంత్రిగా, విశ్వాసపాత్రుడుగా ఆనాటి రాజకీయ చరిత్రలో తిమరుసయ్య ప్రముఖపాత్ర వహించాడు. ఈ ప్రధానే కాక చేతికందివచ్చిన కొడుకు కూడా రాచకార్యాలలో పాల్గొనడంవల్ల నరసానాయకునికి బరువు కొంత తగ్గినట్లుండేది. తండ్రి కొలువులో వీరనర

సయ్య అంతికాన ఉండేవాడు. నరసానాయకుని కొలువును అతనికి వరాహపురాణం అంకితం ఇచ్చిన నందిఘంటకవులు ఇలా వర్ణించారు:

అష్టభాషాకవితావ్యబ్జసంభవులైన సుకవిపుంగవులు సంస్తుతులు సేయ
సంకీర్తరాగరంజకులైనగాణల గములు గీతప్రబంధములు పాడ
కలకంకణక్వాణకరసగోరవాలైన రమణులు వింజామరములు వీవ
వరబలాధికులైన శరణాగతారాతిసామంతు లుభయపార్శ్వముల గొలుక
కూర్మితనయుండు నరసయ్య గుణనిధాన-మంతికంబునసేవింప నలదికొన్న
సురభికాశ్మీరగంధంబు సోడుముట్ట-నుండె బేరోలగమునయనోత్సవముగ.
[వరాహపురాణం, 1-11]

ఈ కూర్మితనయుడే తన తరువాత సామ్రాజ్యాన్ని సంరక్షించాలని నరసానాయకుడు భావించి రాచకార్యాలలో పాల్గొన నిచ్చినట్టుంది. తండ్రి ఆశలను నరసయ్య వమ్ము చెయ్యలేదు. నరసానాయకుడు క్రీ. శ. 1503 లో మరణించాడు.[1] సామ్రాజ్యానికి హక్కుదారుడైన రాయలు పెనుగొండ దుర్గంలో ఇంకా ప్రమగ్నుతూనే ఉన్నాడు. బంధితుడైన రాజుపేరిట రాజ్యాన్ని ఏలడం అనే నాటకం నరసయ్యకు మనస్కరించలేదు. తన తండ్రి కున్నంత ఓపిక అతనికి లేకపోయింది. చెరలోఉన్న రాయలను చంపించి తానే గద్దెకెక్కాడు. రాయ కిరీటంతోపాటు, నరసయ్య వీర నరసింహరాయ లనే పేరును ధరించాడు. ఇతనితోనే వాస్తవానికి మలిరాయల యుగం ప్రారంభమయింది.

---

1. *Studies on Krishnaraya of Vijayanagara-* by Dr. Oruganti Ramachandrayya.

వీరనరసింహరాయలు గద్దెకెక్కాక మూడేళ్లపాటు రాజ్యం చేశాడు. ఇత డింత సమర్థుడైనా, ఇతని ప్రధాని సాళువ తిమ్మరుసయ్య ఎంత రాజకీయ దురంధరుడైనా పరిపాలన ప్రశాంతంగా జరగలేదు. ఒకవైపు సామంతులు, మరొకవైపు శత్రురాజులు కత్తులు దూసి ఒత్తిడి తెచ్చారు. వీరనరసింహ నాయకుడు నమ్మకస్థులైన స్నేహితులను, బంధువులను కూడగట్టుకొన్నాడు. తన సవతి తమ్ముడు కృష్ణరాయలను రాజధానికి కాపుగా ఉంచి వీరనరసింహరాయలు శత్రువులపై దండు నడిపించుకొని వెళ్లి నిశ్చయించాడు. అందుకు కృష్ణరాయలు అంగీకరించలేదు. సైన్యాలతో తానే వెడతా నన్నాడు. అప్పటి కతడు పదహారేళ్లవాడు. నూనూగుమీసాల నూత్న యౌవనంలో ఉన్నాడు. ఇటువంటి అర్భకుని సైన్యంతో పంపడానికి వీరనరసింహరాయలు మొదట అంగీకరించలేదుగాని చివరకు ఒప్పుకొన్నాడు. కృష్ణరాయలు యుద్ధాలలో భాగా రాణించిన ట్లుంది.

వీరనరసింహరాయలు రాజకీయ తంత్రం భాగా తెలిసినవాడు. ఆధునికయుద్ధాలలో విజయం సంపాదించా లంటే ఆశ్వికబలం చాలా అవసరం. అయితే గుట్టాల వర్తకం ఆరోజులలో గుత్త వ్యాపార మైంది. జాతి గుట్టాలను మహమ్మదీయ వర్తకులే దిగుమతి చేసేవారు. వాటిని బహమనీ సుల్తానులకే విక్రియించేవారు. ఈ గుత్త వ్యాపారాన్ని అరికట్టడానికి వీరనరసింహరాయలు చక్కని రాజనీతి ప్రదర్శించాడు. అప్పుడప్పుడే మన

దేశంతో పోర్చుగీసువారు వర్తకసంబంధాలు పెట్టుకుంటున్నారు. వాళ్లకు రాయలు ప్రోత్సాహం యిచ్చి జాతి గుర్రాలను వాళ్లద్వారా దిగుమతి చేయించుకున్నాడు. ఆశ్వికదళాలను పెంపొందింప జేశాడు. జాతిమత విచక్షణ లేకుండా అర్హత గలవారినందరినీ గుర్రపురౌతులుగా పటాలంలో చేర్చుకున్నాడు. ఈ చర్య విజయనగర సామ్రాజ్యానికి వజ్రకవచ మైంది.

ప్రధాని సాళువ తిమ్మరుసయ్య మంత్రాంగం, నమ్మకస్థులైన ఆరవీటివంశం వాళ్ల సహాయం, తమ్ముడు కృష్ణరాయల ఉత్సాహం వీరనరసింహరాయలకు పెట్టని కోటలుగా ఉన్నాయి. కప్పమీయక తిరుగుబాటు చేసిన సామంతులపై వీరనరసింహరాయలు స్వయంగా సైన్యాలు నడుపుకొంటూ వెళ్లాడు. పశ్చిమతీరంలోని తుళువ రాజ్యాధిపతులను పాదాక్రాంతులను చేసుకొన్నాడు. ఆతరువాత కనుమలు దాటి కర్ణాటకంలో ప్రవేశించి ఉమ్మత్తూరు, శ్రీరంగపట్నం సామంతులను ముట్టడించాడు. అయితే వాళ్లు లొంగలేదు. పైపెచ్చు, రాయల బలాలను ఓడించారు. ఇది వీరనరసింహరాయలకు హృదయశల్య మైంది. మంచాన పడ్డాడు. అపజయానికి లోడు మరోబెంగ పట్టుకొంది. తన తరువాత తన కొడుకు రాజ్యానికి వస్తాడన్న ఆశ సన్నగిల్లింది. వీరనరసింహరాయల కుమారుడు ఎనిమిదేళ్ల వాడు. ఈ పసివాణ్ణి తోసిరాజని, కృష్ణరాయలు గద్దెనెక్కితాడని వీరనరసింహరాయలు భయపడ్డాడు. ప్రధాని తిమ్మరుసయ్యను పిలిపించి తన భయాలు చెప్పాడు. కృష్ణరాయలను తక్షణం

బంధించి, రహస్యంగా వధించి అతని కళ్లు తనకు చూప మన్నాడు. రాజాజ్ఞ విన్న తిమ్మరుసయ్య నిష్క్రమించాడు.

అతడు వెను వెంటనే కృష్ణరాయలను బంధించాడు. రహస్యప్రదేశంలో ఉంచాడు. అయితే వధించలేదు. ఆ మహామంత్రికి, అపస్మారకం లోనికి దిగజారుతున్న రాజు గారి ఆజ్ఞకంటె అల్లకల్లోలం కాబోతున్న రాజ్యరక్షణ ముఖ్య మనిపించింది కాబోలు. సమరాలలో శక్తిసామర్థ్యాలు చూపెడుతున్న కృష్ణరాయలు ప్రజలకు రామరక్ష కాబోయే సూచనలు తిమ్మరుసయ్య గ్రహించాడు. ఏ వేగులవాళ్లో కొన్ని రహస్య వర్తమానాలు ఆయనకెవిని వేశారు. గజపతి ప్రతాపరుద్రుడు దండెత్త బోతున్నాడు. వీరనరసింహరాయలు సామంతుల చేతిలో అపజయం పొంది మనోవ్యథతో మృత్యుముఖంలో ఉన్నాడు. ఈస్థితిలో చాలా పెద్ద శత్రువుతో రాజ్యం యుద్ధం చేయవలసివస్తే సైన్యాలకు ప్రోత్సాహం ఇచ్చే ప్రభువు ముందు నడవాలి. కృష్ణరాయలే అందుకు తగినవాడు. అతణ్ణి చంపి వీరనరసింహరాయల ఎనిమిదేళ్ల కుమారుణ్ణి గద్దెమీద కూర్చోపెడితే రాజ్యాన్ని ఈనగాచి నక్కలపాలు చేసినట్లు అవుతుంది. నరసానాయకునితోపాటు తాను పాతికేళ్లనుంచి పాటుపడి రాజ్యాన్ని ఇలాగ ఒక కొలికికి తెచ్చాడు ఇది ఇప్పుడు పుటుక్కున తెగిపోయేటట్టుంది. అందుకే సాళువ తిమ్మరుసయ్య కృష్ణరాయలను రహస్యప్రదేశంలో సజీవునిగానే ఉంచి ఒకమేకను చంపి దాని కళ్లను తీసుకువెళ్లి వీరనర

సింహరాయలకు చూపించాడు. మంచాన పడ్డ రాజుగుండెలు కుదుటపడ్డాయి. కన్నులు మూత పడ్డాయి.

ఇది క్రీ. శ. 1509 జూలైలో జరిగింది. తిమ్మరుసయ్యకు వచ్చిన వర్తమానాలు నిజమైనవే. ప్రతాపరుద్ర గజపతి విజయనగరంపై దాడిచేశాడు.[1] వీరనరసింహరాయలు లేడు. అతని కుమారులు పసివాళ్లు. వాళ్లను చంద్రగిరి కోటకు పంపించి మర్యాదలతో బంధించి తిమ్మరుసయ్య తగిన కట్టుదిట్టాలు చేశాడు. కృష్ణరాయలను విడిపించాడు. రాజుగా ప్రకటించాడు. 1509 ఆగస్టు 7 వ తారీఖున కృష్ణరాయలు రాజ్యస్వీకారం చేశాడు. (ఆ నాడు కృష్ణాష్టమి) గజపతిసైన్యాలపై కృష్ణరాయలు కత్తిదూశాడు. యుద్ధం ఏకారణాలవల్లనో చాలా స్వల్పకాలమే జరిగింది. గజపతి పలాయనం చిత్తగించాడు. కృష్ణదేవరాయలు "గజపతిగజ కూట పాకల" అనే బిరుదు సముపార్జించుకున్నాడు.[2]

---

1. క్రీ. శ. 1509 లో గజపతి విజయనగరంపై దాడిచేశాడని ఓరుగంటి రామచంద్రయ్యగారు నిరూపించారు. సరిగ్గా ఆసమయానికే చైతన్యప్రభువు పూరీజగన్నాధానికి విచ్చేశాడు. అప్పుడు గజపతి విజయనగరంపై యుద్ధంలో ఉన్నాడని చైతన్యభాగవతం చెప్తూంది.

"ఏసమయ ఈశ్వర ఆయలా నీలాచలే
తఖనె ప్రతాపరుద్ర నాహిక ఉత్కలే
యుద్ధర సేగియాచ్ఛేన్ విజయనగరే
అతయేవా ప్రభూనా దేఖలెన్ సెయిబారె"

Studies in Krishnaraya, P. 46.

2. 'పాకలం' అంటే ఏనుగులకు వచ్చే పిత్తజ్వరం.

గజపతిని జయించి, రాజధానిలో అడుగుపెట్టి ఇంక పట్టాభిషేకం చేసుకొందా మనుకొనే వేళకు కృష్ణదేవరాయలకు మరొక అవాంతరం వచ్చిపడింది. బిజాపురాన్ని పాలించే యూసఫ్ ఆదిల్ ఖాన్ విజయనగరంపై దాడిచేశాడు. అయితే గజపతిని ఓడించినట్టే ఇతణ్ణికూడా కృష్ణరాయలు, అద్భుత వశాత్తూ, అవలీలగా ఓడించాడు. ఈ విజయంవల్ల కృష్ణదేవరాయలు 'పరిభూత సురత్రాణ' అనే బిరుదును సంపాదించుకున్నాడు.

1509 ఆగస్టులో రాజ్యస్వీకారం చేసిన కృష్ణరాయలు వజ్రసింహాసనాన్ని అధిష్ఠించకముందే రెండు బిరుదులు సంపాదించి శాలివాహనశకవత్సరాలు 1431 మాఘశుద్ధ చతుర్దశినాడు, అనగా క్రీ. శ. 1510 జనవరి 23-24-వ తారీఖుల మధ్య పట్టాభిషేకం చేసుకొన్నాడు.[1] తనకు ప్రాణదానం చేసి రాజ్యాన్ని ప్రసాదించిన సాళువతిమ్మరుసును శిరఃప్రధానిని చేసుకొన్నాడు. రాయలవారికి నిజంగా అతను ప్రధాని కాడు; తండ్రిలాంటివాడు. తిమ్మరుసయ్యను కవులిలా పొగిడారు:

అయ్యఅనిపించుకొంటివి_నెయ్యంబున కృష్ణరాయనృపపుంగవుచే
నయ్యా సీసరి యేరీ_తియ్యని విలుకాడ వయ్య తిమ్మరుసయ్యా!
[చాటుపద్య మణిమంజరి 1_పుట 105]

తిమ్మరుసయ్య తొలిరోజులలో నూరిపోసిన రాజ

---

1. డాక్టరు నేలటూరి వెంకటరమణయ్యగారి అభిప్రాయప్రకారం కృష్ణరాయల పట్టాభిషేకం 9_4_1509 నాడు జరిగింది. చూ. భారతి 1946, సంపుటి 26, సంచిక 4, పుట 290.]

నీతులవల్ల, తీర్చిదిద్దిన కూపురేఖలవల్ల కృష్ణదేవరాయలు అనన్యసామాన్యసామ్రాజ్యాధిపతి అయ్యాడు. తన అద్వితీయపరాక్రమంతో సంపూర్ణదక్షిణభారతాన్ని జయించడమేకాక గయలో జయశాసనం వేసేటంత మహోన్నత కీర్తులు సముపార్జించుకొన్నాడు. క్రీ. శ. 1510 లో పట్టం కట్టుకొన్నది లగాయతు క్రీ. శ. 1530 లో మరణించే దాకా 20 సంవత్సరాలు నిరుపమానమైన జీవితం గడిపాడు. ఎన్నో దుర్గాలు పట్టుకొన్నాడు. ఎన్నో యుద్ధాలు జయించాడు. ఎందరో కవులను పోషించాడు; భూషించాడు. ఎన్నో కృతులు మెచ్చుకొన్నాడు; పుచ్చుకొన్నాడు. నిత్యకళ్యాణం పచ్చతోరణంగా జీవితం గడిచింది. (రాయల ఇతరజీవితవివరాలను కవిగా అతనిగురించి చెప్పుకొంటున్నప్పుడు తెలుసుకొందాం.) ఈ నిండుచంద్రుడు అస్తమించే టప్పుడు దీగ్ఘగ్రహణం పట్టింది. తెలుగుజాతి విడుపుస్నానం చేసేలోగా ఆ బ్రతుకు తెల్లవారింది.

తన అన్న వీరనరసింహరాయలలాగే కృష్ణదేవరాయలు కూడా అవసానకాలంలో తన కొడుకులకోసం తాపత్రయపడ్డాడు. దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకొండామని, తాను బ్రతికిఉండగానే తన కుమారునికి పట్టం కట్టాడు. అప్పుడాబాలుని వయస్సు ఆరేళ్లు. దురదృష్టవశాత్తూ, పట్టంకట్టిన కొద్దికాలానికే, కృష్ణరాయల కుమారుడు మరణించాడు. తిమ్మరుసయ్యే విషం పెట్టి చంపించాడని కిట్టనివాళ్లు చెపుకొరికారు. రాయలు నమ్మాడు. మమకారం వివేకాన్ని తోసిరాజంది. రాయలు గుడ్డివాడయ్యాడు.

తిమ్మరుసయ్యకళ్లు తోడించాడు. కటకటాలవెనుక పెట్టించాడు. చేయరాని ఘాతుకకృత్యం చేశాక రాయలు పశ్చాత్తాపం చెందాడు. తరువాత వివేకోదయం అయినట్టుంది. తన తిరువాత, తన రెండవకుమారుడు (పద్దెనిమిది మాసాలవాడు) రాజవుతాడన్న ఆశ ఎలాగూ లేదు. అందుచేత రాజ్యం తన సోదరుడు అచ్యుతదేవరాయలకు సంక్రమించాలని శాసించి మరణించాడు.

అధికారవాంఛ మహాచెడ్డది. అప్తులనే పగవాళ్ళను చేయిస్తుంది. కృష్ణరాయలకు మగసంతానం చాలా ఆలస్యంగా కలిగినా పుత్రికాలాభం ఆదిలోనే కలిగింది. తిరుమలాంబ అనే కుమార్తెను ఆరవీటివారి వంశంలోని రామరాజు కిచ్చి పెళ్ళిచేశాడు. అల్లుడు అన్నివిధాలా సమర్థుడే. సంస్కారంలో, సాహసంలో ఎవరికీ తీసిపోడు. చివరకు స్వార్థంలో కూడా! తన మామగారి తరువాత తాను రాయసింహాసనం అధిష్ఠించాలి; లేదా ముక్కుపచ్చలారని మరిదికి సంరక్షకుడుగా ఉండాలి; గాని పినమామగారు (అందులోనూ సవతి పినమామగారు) అచ్యుతదేవరాయలు రాజ్యానికి రావడ మేమిటని రామరాజు భావించాడు. అడ్డుపెట్టాడు. దానికి తోడు పక్క-రాజ్యాలలో ప్రభువు ఎప్పుడు మరణిస్తాడా, ఎప్పుడు దాడి చేద్దామా అని ఎదురుచూస్తున్న పరరాజులు ముట్టడించారు. అచ్యుతదేవరాయలు తన సవతి అన్నగారి ఆజ్ఞప్రకారం రాజ్యాన్ని వెంటనే హస్తగతం చేసుకోలేకపోయాడు. పరరాజులను జయించి, అయినవాళ్ళతో రాజీ చేసుకున్నాడు. కొంత

రాజ్యం కృష్ణరాయల శిశువుపేర అళియరామరాయలు[1] వీలుకోవడానికి ఒప్పందం జరిగింది. ఈ సంధినల్ల సమర్థులైన కొందరు రాజోద్యోగులు నొచ్చుకున్నారు. కృష్ణరాయల ఆదేశాన్ని తు.చ.తప్పకుండా అమలుజరపనందుకు కొందరు నాయకులు తిరగబడ్డారు. అచ్యుతదేవరాయలు వాళ్లను అణచివేశాడు. తన భావమరిదితరపున కొంత రాజ్యానికి సమ్మతించిన అళియరామరాయలకు రావలసినదికూడా దక్కని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉన్నట్టుండి కృష్ణరాయల కుమారుడు మరణించాడు. అళియరామరాజు అధికారం సన్నగిల్లసాగింది. దానిని నిలదొక్కుకోవడాని కతడు ఎన్నో ప్రయత్నాలుచేశాడు. అడ్డంపెట్టుకొని పాలించడానికి ఒక వారసుడు అవసరం అయ్యాడు. రామరాజు ఒక వ్యక్తిని పట్టాడు. అచ్యుతదేవరాయలఅన్నకొడుకు సదాశివరాయలే సింహాసనానికి తగిన వారసుడనిచెప్పి రామరాజు ఏలసాగాడు. అచ్యుతదేవరాయల కాలమంతా దండయాత్రలతోనూ, తిరుగుబాటులతోనూ గడిచిపోయింది. క్రీ. శ. 1530 లో పదవి చేపట్టిన అతడు క్రీ. శ. 1542 లో తన సవతి అన్న గారిలాగే మరణించాడు.

అచ్యుతదేవరాయలు కన్నుమూసేటప్పుడు అతనికి యుక్తవయస్సురాని ఒక కుమారుడున్నాడు. అతని పేరు వెంకటాద్రి. ఈ పసివాణ్ణి గద్దెమీద నిలిపి ఇతని మేనమామ సలకంరాజు చినతిరుమలరాజు రాజ్యం చేయ

---

1. 'అళియ' అంటే కన్నడంలో 'అల్లుడని అర్థం.

సాగాడు. కొన్ని నెలలు గడిచాయో లేదో మేనమామకు రాజ్యకాంక్ష ఎక్కువైంది. మేనల్లుణ్ణి పదభ్రష్టుణ్ణి చేసి రాయసింహాసనం దక్కించుకోవడానికి ఎత్తులు వేయసాగాడు. ఇవి రాజమాతకు తెలిశాయి. తన తోడబుట్టినవాడు ఇంత ద్రోహానికి ఒడికడుతున్నాడని ఆమె ఆందోళన చెంది బిజాపూరుసుల్తానుల సహాయం అర్థించింది. తురకసేనలు విజయనగరంపైకి రాసాగాయి. ప్రజలు భయపడ్డారు పరసేనలు రాజ్యంలో అడుగుపెట్టకుండా ఉండాలంటే సమర్థుడు రాయసింహాసనం ఎక్కాలి. అందుచేత సలకం చిన తిరుమల రాజుకే పట్టం కట్టారు. ఆతడు శత్రుసైన్యాలను వెళ్ళగొట్టాడు. విజయం సాధించాక అతనికి పట్టపగ్గాలు లేకపోయాయి. కర్కోటకుడయాడు. దారుణ దమననీతిని అనుసరించాడు. మేనల్లుణ్ణి చంపించాడు. నాయకులను ఏదో ఒక సాకుతో వధించాడు.

ఈ నిరంకుశునికి భయపడి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతకసాగారు. సదాశివరాయల పేర రాజ్యాధికారాన్ని కొనసాగిస్తున్న అళియరామరాయలు ఇదే తరుణమని భావించాడు. సలకం చినతిరుమలరాజుపై యుద్ధంచేసి ఓడించి చంపాడు. క్రీ. శ. 1543 లో సదాశివ రాయలు సంపూర్ణ విజయనగర సామ్రాజ్యానికి అధిపతి అయ్యాడు. పేరు కతడు రాయలేగాని రామరాజే సూత్రధారి. కొంత కాలానికి అళియరామరాజు ప్రత్యక్షంగా రాయనామాలు బిరుదులను స్వీకరించి కాహాటంగా ప్రభుత్వం నడపటం మొదలుపెట్టాడు. సదాశివరాయ

లెలాగో క్రీ. శ. 1576 దాకా పాలించాడుగాని అతడు గద్దె ఎక్కిననాడే మలిరాయల యుగం అంతమై ఆరవీటివారి ప్రాభవం ఎక్కువయిందని చెప్పాలి.

రాజకీయంగా చూస్తే, కృష్ణరాయల అనంతరం ఈ యుగంలో కుట్రలూ, కూహకాలూ ఎక్కువగా కనబడతాయి. అయితే సాంస్కృతికరంగంలో అవిచ్ఛిన్నమైన సంప్రదాయం సనలెత్తుతూనే ఉంది. రాయలవారంత కాక పోయినా తదితరులు సయితం ఈ కాలంలో కళలను పోషించారు. దాసానుదాసులు సైతం హుందాగా ఉండేవారు. మంత్రులదగ్గర మంత్రులుకూడా కృతులు అంకితం పుచ్చుకొనేవారు. కృష్ణరాయల అంతఃపురంలో సంగీతనాట్య విద్యలకు ఆచార్యుడుగా ఉండే భండారు లక్ష్మన్న[1] ఒక చిన్నసైజు సామంతుడుగా నిండుపేగోలగంలో ఉండేవాడు. ఇతడు భానుకవిచేత పంచతంత్రం అనువాదం చేయించాడు. తిమ్మరుసు మేనల్లుడు నాదెండ్ల గోపమంత్రి కొండపీటి దుర్గానికి పాలకుడుగా ఉండేవాడు. ఇతనిదగ్గర పనిచేసే ఊరదేచయ్య తెనాలిరామలింగని తొలిరచనను అంకితం పుచ్చుకొన్నాడు.

కృష్ణరాయలవారి తరువాత రాయసింహాసనానికివచ్చిన అచ్యుత దేవరాయలుకూడ సాహిత్యాన్ని పోషించాడు. అతడు స్వయంగా 'తాళమహోదధి' అనే గ్రంథం సంస్కృతం

---

1. ఇతడు 'సంగీతసూర్యోదయం' అనే గ్రంథాన్ని సంస్కృతంలో వ్రాశాడు.

2

కొరవిగోపరాజు



ర్వజ్ఞుడు కానివాడు సత్కవి యగునే అనే భావంతో కావ్యాలను విజ్ఞాన సర్వస్వాలుగా, నిఘంటువులుగా తయారుచేసే సంప్రదాయాన్ని మొదలుపెట్టిన కవులలో కొరవి గోపరాజు ప్రథముడు. అతడు తన 'సింహాసనద్వాత్రింశిక' అనే కావ్యంలో ఇలా అన్నాడు:

ఎప్పటి కేయది ప్రస్తుత-మప్పటి కావిద్య మహిమ మచ్చుపడంగా
చెప్పక సర్వజ్ఞత్వము-చొప్పడునే? కావ్య మంత సులభమె ధాత్రిన్?
[సింహా. 1-22]

సర్వజ్ఞత్వం ఉట్టిపడేటట్లు కావ్యం ప్రాయడం అంత సులభం కాకపోయినా అటువంటి గ్రంథాలు చదువుకొనడానికి చాలా సులభ్యంగా ఉండడం ఎంతో ముఖ్యం. తెలుగున తేటగా కథలు తెల్పితే కావ్యం పొందులేదనే కాలంలో ఎక్కువగా తెలుగువైపే మొగ్గి విక్రమార్కుని సింహాసనంపై ఉన్న ముప్ఫయిరెండు బొమ్మలూ చెప్పిన

కథలను సరసోక్తి కావ్యంగా వ్రాశాడు. తెలుగులో అప్పటికే విక్రమార్క-చరిత్రను జక్కన చంపూ కావ్యంగా వ్రాసి పేరు పొందాడు. కూచిరాజు ఎర్రన్న బేతాళపంచవింశతి కథనం చేశాడు. వెన్నెలకంటి అన్నయ్య తన షోడశ కుమార చరిత్రలో కొన్ని బేతాళ విక్రమార్క-కథలు వ్రాశాడు. సంస్కృతంలో ఈ కథలు ఎలాగూ ఉండనే ఉన్నాయి. ఇప్పుడూ 'ఎంగిలి' కావ్యా ఎందుకు? అని ఎవరైనా ప్రశ్నిస్తే గోపరాజు ఇలాగ సమాధానం చెప్తున్నాడు.

సుగుణులు 'బాణోచ్ఛిష్టం-జగత్త్రయ'మ్మనగ గొంత చదువగ బ్రియమే
తగ తోడంటిన పా లిం-పుగ బెరుగయి యున్న నది యభోజ్యం బగునే?
[సింహా. 1-26]

రసభావాలు మునుపటికన్నా కొత్తవి ఎలాగ వస్తాయి అని ఎదురుప్రశ్న వేస్తూ ఇలాగ జవాబు చెప్పాడు:

సంబంధము లగు రసభా-వంబులు మునుకంటె నభినవనంబులు గలవే
యంబుధినె కాక బహుర-త్నంబులు వర్తకుల కేమి తా బండినవే?
[సింహా. 1-27]

పూర్వకవులు గొప్పవాళ్ళే కావచ్చు; ఇప్పటి కవులు తల్లికి కడగొట్టు కొడుకులు; వీళ్ళంటేనే ఆమెకు ప్రియం అని చెప్పాడు. పాత కథలు పాతధోరణిలోనే చెప్పడంవల్ల ఏం ప్రయోజనం? కర్ర ఊత ఇస్తే గుడ్డివాడు సైతం ఎక్కడికైనా నడుచుకొని పోతాడు. తన వచోవిశేషం కన బరుస్తూ పూర్వకథలు చెప్పాలి. ఇక ఇందులో తప్పులంటారా? ఆదరించక చెడా మడా తిడితే బాణమయూర కాళిదాసాదులకైనా తప్పులు తప్పవు. ఇక అన్యులసంగతి

చెప్పాలా? కాబట్టి, నీతో కేమిటి పొమ్మనక ఒప్పులే చూసి సత్కవులు మెచ్చుకోండి. తప్పు లుంటే అనుమానించక తీర్చి దిద్దండి. 'నేర్పరులైనవారిచే సానలబట్టి తీర్చినను సన్నపురత్నము వన్నె కెక్కదే?' అని గోపరాజు విన్నవించాడు.

బమ్మెర పోతరాజులాగే కొరవి గోపరాజుకూడా 'సహజ పాండిత్యం' కలవాడు. అందుకే పాతిక పద్యాలలో ఇలా విన్నపం చేయవలసి వచ్చింది (సింహాసన. 1: 14-38 దాకా). చతురమైన, హృద్యమైన అనవద్య గద్యపద్య విద్యవలన విదోద్యితులైన పూర్వ కవీశ్వరుల ప్రసాదం వల్ల ఆసాదితమైన సహజ సాహిత్య తరంగాలు ఉప్పొంగే అంతరంగంతో గోపరాజు ఈ విన్నపం చేసి రసభావాలు ముప్పిరి గొనేటట్లు ముప్పయి రెండు బొమ్మల కథలు పన్నెండు ఆశ్వాసాలలో చెప్పాడు. ప్రథమాశ్వాసంలో కథావతారిక ఉంది. రెండునుంచి పదకొండో ఆశ్వాసందాకా మూడేసి కథల చొప్పున ముప్పయి చెప్పాడు. చివరి ఆశ్వాసంలో రెండు బొమ్మల కథలు కథనంచేశాడు. ఈ పన్నెండు ఆశ్వాసాలలో తన సర్వజ్ఞత్వం ప్రకటించుకొందుకు సవిస్తరంగా ఈ క్రింది విషయాలు, వర్ణనలు, చమత్కారాలు గుప్పించాడు.

ప్రథమాశ్వాసం:— (1) పద్మిని మొదలైన స్త్రీజాతులు, (2) అవశకునాలు, (3) దేగవేట, (4) చేపలలో రకాలు.

రెండవ ఆశ్వాసం:—(5) చతుర్భాషాకవిత్వం, (6) సురత తంత్రాలు, (7) వంటలు.

తృతీయాశ్వాసం:—(8) పుత్రోదయం, (9) పురుడుపోసే పద్ధతి, (10) వర్ష వర్ణన, (11) వసంతవర్ణన, (12) వృక్షాల రకాలు, (13) పుష్పాపచయం.

చతుర్థాశ్వాసం:—(14) నిరోష్ఠ్యదండకం, (15) రాజనీతులు, (16) సూర్యాస్తమయ వర్ణన, (17) సంధ్య, (18) అంధకారం, (19) చంద్రోదయం, (20) వెన్నెల, (21) మూషకేశ్వర స్థలపురాణం, (22) విద్యాప్రశంస, (23) ఛందోవిషయాలు, [1] (24) స్త్రీ అనే పదానికి తెలుగులో పర్యాయపదాలు, (25) సానివాడ, (26) మధుపానం.

పంచమాశ్వాసం:—(27) ఆధ్యాత్మిక విద్యాయోగం, (28) శ్లేషమూలోపమానంతో ఛందస్సులతో అరణ్యవర్ణన, (29) సూర్యోదయ వర్ణన. (30) సంగీతం, (31) విరహావర్ణన. చంద్రోపాలంభనం, (32) వివాహావర్ణన.

సప్తమాశ్వాసం:—(33)వసంతవర్ణన, (34) అంకయుద్ధం, (35) బంధకవిత్వం, (36) శరద్వర్ణన.

అష్టమాశ్వాసం:— (37) వేట, (38) సామల రకాలు, (39) పుణ్యతీర్థాలు.

---

1. గోపరాజు పదమూడు వర్ణ్లు మాత్రమే చెప్పాడు. రేచన (భీమన) కాలంలో పదిమాత్రమే ఉన్నాయి. అనంతుడు (క్రీ.శ. 1435) ఇరవైనాలుగు చెప్పాడు. పదమూడు చెప్పినవాడు ఈ ఇద్దరికీ మధ్యకాలంవాడని పారబడడానికి అస్కారం లేకపోలేదుగాని రాయల వాచకంలో ఇరవైవర్ణ్లు మాత్రమే ఉన్నాయి. విశ్వనాథనాయనివారి సేనాపతి (క్రీ.శ. 1575) అనంతునికి కనీసం ఒకశతాబ్దం అర్వాచీనుడు. (క్రీ. శ. 1550 లో ఉన్న చిత్రకవి పెద్దన 27 యతులు చెప్పాడు. అందుచేత గోపరాజు కాలనిర్ణయానికి ఈ యతుల లెక్క పనికిరాదు.

నవమాశ్వాసం:—(40) వేసవి, (41) స్వప్నఫలాలు.

దశమాశ్వాసం:— (42) జ్యోతిషం-గ్రహాంతులు, (43) వాదం, చదరంగం, (44) చోరశిక్ష.

ఏకాదశాశ్వాసం:—(45) రత్నాలు, (46) పద్యాలు వ్రాసే పద్ధతులు, (47) సప్తసంతానాలు, (48) ఇంద్రజాలం (ఇండియన్ రోప్ ట్రిక్). (49) వితంతు ధర్మాలు, (50) అరవైనాలుగు కళలు.

ఈ వివిధ విషయాలను కేవలం కేటలాగులా ఏకరువు పెట్టక సందర్భోచితంగా, విసుగుపుట్టకుండా చెప్పడంలోనే గోపరాజు గొప్పతనం ఇమిడిఉంది. గోపరాజుకూడా నిజంగా కవిపట్టపు రాజు, ఉచితార్థ కళారాజితుడు. భావ మెరిగిన వాడు. ఇటువంటివాళ్ళను రాజులు చేపడితే రాజ్యం కాదే అన్నాడు, చూడండి.

ఏజనులైన సద్గుణ-యోజితులై భావమెరిగి యుచితార్థకళా
రాజితులగు కవిరాజుల-రాజులు చేబట్టికేని రాజ్యముగాదే?

[సింహాసన. 1-29]

అయితే గోపరాజు ఏరాజునూ ఆశ్రయించలేదు. తన కృతిని నరాంకితం చెయ్యలేదు. తిక్కనగారిలాగా హరిహర నాథునికే అంకితం ఇచ్చాడు. హరిణీ, హరుణ్ణీ, విడివిడిగా చక్కని పద్యాలలో చల్లగా ఒకసారి దేశ్యాలతో, ఒక సారి తద్భవాలతో వర్ణించాడు. విక్రమార్కుని సింహాసనం ఎక్కబోతూ భోజరాజుముప్పయి రెండుసార్లుహరినో, హరుణ్ణో ప్రార్థించాడు. చేసిన చమత్కారం చేయకుండా గోపరాజు ఈ ప్రార్థనలు వ్రాశాడు. కావ్యంలో అక్కడక్కడ సందర్భోచితంగా హరిహర స్తుతులు రచించాడు. ఇతరదేవత

లను కూడా చమత్కారంతో నుతించాడు. గంగను నుతించడంలో ఉన్న వ్యంగ్యం చూడండి. "ఒకడి పాదాలు అభిషేకించి, ఇంకొకడి నెత్తిక్కి, మరొకడి వెంటపడినదానివై నా నువ్వు పవిత్రురా" లనే అంటాడు.

ఒకనియడుగు జేరియొకని యూదల నెక్కి-యొకని వెంట వచ్చియొకని గలిసి
పెడతి పారితనుచు విందు మట్లయ్యునీ-జీవనంబు లోకపావనంబు.
[సింహా. 6-12]

గంగ విష్ణుపాదాన పుట్టి శివుని శిరస్సు ఎక్కి భగీరథునివెంట వెళ్లింది. ఈపురాణకథలను అలాగ చమత్కరించాడు. ఎంతటి మలినుడైనా గంగవల్ల పవిత్రుడవుతాడని శివుణ్ణి ఉదాహరణగా చూపించాడు. చూడండి.

కామునిగాల్చి బూడిదను గంధముగా గొని యొద్దు నెక్కుచుం
బామును దోలు నెమ్మలు గపాలములుం దన మేని సొమ్ములుగా
గాముల గూడి యాడుచును గాడు గృహంబుగ నున్నవాడు గం
గామృత మాదలం జిలికినంత సదాశివు డయ్యె నెల్లెడన్.
[సింహాసన. 6-8]

గంగానదిలో తల కడిగితే చలి ఎందుకు వేయదో వివరిస్తున్నాడు. వినండి.

మలినుడు మైగడిగిన ని-ర్మలుడౌ టది చెల్లు లోకమాతా, నీలో
దల దడిపిన జలిలేదని-వెలయుట యీ హరుని నుదుటి వేడిమిజుమ్మా.
[సింహాసన. 6-11]

భావాలలో ఇటువంటి వ్యంగ్యమే కాకుండా చెప్తే గాని తెలియని బంధకవిత్వంకూడా గోపరాజు చూపించగలడు. విక్రమార్కునివద్దకు ఒక వేదబ్రాహ్మణుడు తనకుమార్తెను తీసుకువచ్చి ఇలాగ స్తుతించాడు :

రాజ్యంబు వదలక రసికత్వ మెడలక జయశీల ముడుగక నయము చెడక
దీనుల జంపక దేశంబు నొంపక నిజ ముజ్జగింపక నేర్పు గలిగి
విప్రుల జుట్టాల వెన్ను సొచ్చినయట్టివారిని గొల్చినవారి ప్రజల
హర్ష ంబుతో గాచి యన్యాయ ముడుపుచు మున్ను జెప్పినరీతి జెన్నుమీరి
చేతలొండులేక పాత్రల విడువక_యశముకలిమి తమకు వళముగాగ
వసుధ యేలురాజవర్ంబులోననయ్యాదివిష్ణుమూ ర్తి వంద్రు నిన్ను.

[సింహాసన. 7_75.]

ఈ పద్యంలోనే ఆ బ్రాహ్మణుడు నిగూఢంగా ఒక విన్నపం చేశాడట. ఈ సీసపద్యంలోని ప్రతిఅర్ధపాదంలోని మొదటి అక్షరాలనూ చదువుకొంటే-'రాజా, దీని వివాహం చెయ్యవయ్యా' అనే వాక్యాన్ని గోపరా జిలా పద్యంలో బంధించాడు. ఇటువంటి చిక్కు-ప్రశ్నల పద్యాలు గోప రాజుకు ఇష్టమే. విక్రమార్కుని వద్దకు మఠం గట్టివాడు వస్తాడు. నాలుగు భాషలలో దీవించి ''నాపేరు ఆరక్షరాలు. అందులో మొదటి అక్షరం తీసివేస్తే నేను అశ్వవేదిని అవుతాను. మొదటి రెండు అక్షరాలు తీసివేస్తే నాట్యాకర్త నవుతాను. నాల్గు తీసివేస్తే చాలా నేర్పరిని. అన్ని అక్షరాలూ కలిపి చదివితే బుద్ధిబలం గల ప్రౌఢుణ్ణి. నేతిబీరకాయలాగా కాకుండా సార్థకనామధేయుణ్ణి'' అన్నాడు. 'ఏదీ మళ్ళీ చెప్పు.' అని విక్రమార్కుడు అడిగి, అతగాడు చెప్పాక-నువ్వు 'చతురంగతద్జ్ఞ'అనే పేరుకలవాడివి' అన్నాడు.

[సింహా. 2_47, 48.]

కొరవిగోపరాజు కాలంలో చదరంగం బాగా ప్రచా

రంలోకి వచ్చింది. 'తోసిరాజు ఆటకట్టు' అనిపిస్తానని ఒక ఆటగాడు చెప్పుకొన్నట్టు గోపరాజు బ్రాశాడు.

చతురంగంబున నే నతి-చతురుడ గరితురగమంత్రిశకటభటప్ర
స్థితిపరహస్తముచేయుదు-క్షితి మెచ్చగ రాజు బంటుచే గట్టింతున్.
[సింహా. 10-59]

గోపరాజు తన సమకాలికక్రీడను చెప్పా డనడం సిద్ధవాదాంశం. కృష్ణదేవరాయలవారితో బొడ్డుచర్ల తిమ్మన చదరంగం ఆడేవాడు.

శతసంఖ్యలొక్కటైనను-సతతము శ్రీకృష్ణరాయజగతీపతితో
చతురంగమాడి గెలుచును-ధృతిమంతుడు బొడ్డుచర్ల తిమ్మన భళిరే![1]
[చాటుపద్య మణిమంజరి]

'చదరంగం'లో ప్రజ్ఞ చూపించినందుకు రాయలవారు తిమ్మనకు 'కొప్పోలు' అగ్రహారం ఇచ్చారు. ఈ క్రీడ మలి రాయల యుగంలో ఇంత ప్రచారం పొందడంవల్ల ఈ కాలపు గ్రంథాలలో చదరంగంప్రస్తి కనబడుతుంది. 'శూన్యగృహంబులు చతురంగఫలకంబులయంద' అని మాదయగారి మల్లన పురవర్ణన చేశాడు.[2] కుమార్తెను అత్తవారింటికి పంపించేటప్పుడు 'సారె'లో ''జాలవల్లికలు, పలుమానికముల చదరంగంబులు, సొగటాసారెలు' కూడా కుంతలేశ్వరుడు పెట్టాడని సంకుసాల నరసయ్య చెప్పాడు.[3] తేటవెన్నెల మించు, తెరచిరా జనిపించు నకలంకహారవల్లి

---

1. చాటుపద్య మణిమంజరి, ప్రథమభాగం. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, పుట 155.
2. రాజశేఖర చరిత్ర 1-58.
3. కవికర్ణ రసాయనం, 3-195.


కలతోడ' గంధర్వులు హిమగిరికి వచ్చారని తెనాలిరామ లింగడు చెప్పాడు.[1] ఈవర్ణన లన్నీ రాయలవారు చదరంగం పోషించడంవల్లే కావ్యాల్లోకి జొరబడ్డాయి.

కొరవిగోపరాజు రాయలవారి కాలానికి కొంచెం ప్రాచీనుడని పరిశోధకులు తలుస్తారు. ఇతని కాలం క్రీ. శ. 1430–1490 అని కొందరు నిర్ణయించారు.[2] అయితే గోపరాజు క్రీ.శ. 1500–1530 వాడని నా అభిప్రాయం. ఇతడు పూర్వ కవిస్తుతిలో పిల్లలమర్రి పినవీరభద్రుని నుతించాడు (సింహా. 1–12.) పినవీరయ్య కాలం నిర్వివాదం. క్రీ.శ. 1485–1490లో రాయల సింహాసనం అధిష్ఠించిన సాళువనరసింహరాయలకు జైమినిభారతాన్ని పిల్లలమర్రి పినవీరయ్య కృతి ఇచ్చాడు. గోపరాజు క్రీ. శ. 1490 దాటాకనే సింహాసనద్వాత్రింశిక వ్రాసిఉండాలి. అందుచేత అతని కాలం క్రీ. శ. 1500–1530 అని భావించవచ్చు.

అయితే గోపరాజు కాలాన్ని పూర్వపరిశోధకులు ఒక అర్ధశతాబ్దం ప్రాచీనం చేయడం అతడు తన కావ్యంలో చెప్పిన వంశక్రమంవల్లనే జరిగింది. వెలనాటి చోళుల వద్ద ఉండే వెన్నయామాత్యుడు తన వంశకర్త అని గోపరాజు చెప్పుకొన్నాడు. ఇతని కాలం క్రీ.శ. 1220. ఈ వెన్నయామాత్యుని దగ్గిరనుంచీ కొరవివారి వంశవృక్షం ఇలా వ్రాయవచ్చు.

---

1. ఉద్భటారాధ్యచరిత్ర, 1–97.
2. ఆంధ్రకవితరంగిణి, VI, చాగంటి శేషయ్యగారు, పుట 147.



వెన్నయామాత్యుని దగ్గిరనుంచీ తరానికి నలభై సంవత్సరాలు లెక్కపెడితేగాని గోపరాజుకాలం క్రీ. శ. 1430 అవడం లేదు. ఇది చారిత్రికపరిశోధకుల నియమాలకు విరుద్ధం. సామాన్యంగా ముప్ఫయి సంవత్సరాలకే లెక్కిస్తారు. పాతిక సంవత్సరాలు క్షేమం. అప్పుడు వెన్నయ్యకూ, అతని పౌత్రుడైన అమరేశ్వరునికీ మధ్య కొన్ని తరాలు గతించిఉండాలి. పౌత్రుడు అంటే నాప్తాత్తా కొడుకుకొడుకు కాదు, వంశంలోనివాడు అని అర్థంచెప్పుకొనడం చారిత్రిక సాంప్రదాయం. తన పెదతాతగారి కుమారులు బాచన,

సింగనలు కుమార అనపోతసింగనవద్ద మంత్రులుగా ఉండే వారని గోపరాజు చెప్పాడు (సింహా. 1-48). క్రీ. శ. 1399-1421 దాకా రాచకొండలో రెండవ అనపోతనాయకుడు పాలించాడు. ఇతనిదగ్గరే బాచనసింగనలు ఉండేవారని భావిస్తే గోపరాజుకాలం క్రీ. శ. 1450 ప్రాంతాలుకాక తప్పదు. అయితే పద్మనాయకరాజ్యపు అవసానకాలంలో క్రీ. శ. 1430-1475 దాకా పాలించిన ముమ్మడి సింగమ నాయకుని కాలంలో ఈ బాచన, సింగన లుండేవారనుకొంటే గోపరాజుకాలం క్రీ. శ. 1500 అవుతుంది.[1]

గోపరాజుతండ్రి కసవరాజుకూడా మంత్రిత్వం చేశాడు. రాణా మల్లనరేంద్రుని వద్ద ఇత డుండేవాడు. ఈ రాణాగారి గురువుగారి పేరు బ్రహ్మదేవఒడయరు. ఈతడు శైవాచారప్రథమసింహాసనాధీశ్వరుడు. ఇతని కుమార్తె కామమ్మను కసవరాజు వివాహం చేసుకొన్నాడు. రాజగురువుల కుమార్తెను పెళ్లిచేసుకోడంవల్ల కాక, స్వీయ ప్రతిభవల్లనే కసవరాజు ప్రభుత్వోద్యోగి అయ్యాడని భావించవచ్చు. తన తండ్రిని గురించి గోపరా జిలాగా చెప్పాడు:

తంత్రముచే గార్యము పర-తంత్రము గాకుండ బతిహితమె చేయు మహా
మంత్రులలోపల కసవయ-మంత్రి విచారమున దివిజమంత్రియుం బోలెన్.

[సింహాసన. 1-54]

---

1. ఈ నిర్ణయంప్రకారం ఆంధ్రకవితాపితామహుడు కొరవి సత్తె నారనకాలంకూడా క్రీ శ. 1480-75 ప్రాంతాలు అవుతుంది. చూ: సమగ్రాంధ్రసాహిత్యం, IV సంపుటి-రెడ్డిరాజులయుగం. పుటలు, 91-95.

కొరవి కసవరాజూ, అతని వీలిక రాణామల్లనరేం ద్రుడూ ఉండే ఊరిపేరు వేములగల్లు. ఇది ఎక్కడుందో పరిశోధకులు సరిగ్గా నిర్ణయించలేదు. తెలంగాణాలో ఉండ వచ్చు. సింహాసనద్వాత్రింశికలోని 21 వ బొమ్మకథలో గోపరాజు ఒక ధర్మపురిని ప్ గద్యపద్యాలలో వర్ణించాడు. ఇది కరీమ్‌నగర్ జిల్లాలో గోదావరిబడ్డున ఉంది. ఇది సుప్ర సిద్ధవైష్ణవక్షేత్రం. ఇక్కడి నరసింహాలయం విఖ్యాతమైనది. ఈ గ్రామంలో రామేశ్వరాలయంకూడా ఉంది. ఈ జమిలి దేవాలయాలను గోపరాజు ఇలా పేర్కొన్నాడు:

హరిహరు లేకంబనియెడు-పురాణవచనంబు దృష్టముగనొకచోటన్
నరసింహుండును, రామే-శ్వరుడును గల ధర్మపురికి వచ్చె గడంకన్.

[సింహా. 8-177]

కరీంనగర్ జిల్లాలో ప్రసిద్ధక్షేత్రాలైన రామేశ్వరం ధర్మపురిని ఈ 21 వ కథలో పేర్కొన్నాడు, వేములవాడను కృత్యాదిని స్మరించాడు. కాబట్టి కొరవిగోపరాజు కరీంనగరు జిల్లావాడు కావచ్చు. ఈజిల్లాలో వేములగల్లు ఉందేమో శోధించి స్థానికులు తెలియజేస్తే సంతోషం. గోపరాజు వరంగల్లుకు దగ్గిరలోవాడన్నది స్పష్టం. 'కాకతిమూలశక్తి గనిగా నొనరించిన పైడిచట్టు' అనే 'ఏకశిలాభిధానమున నెన్నిక కెక్కి ధరిత్రిలోని వేపోకల బోనియిట్టి సిరిపుట్టిన యింటికి ఓరుగంటికి' ఒక పాత్రను గోపరాజు పంపించాడు. ఆఊళ్లో చందనగంధులను, విటులను, జాణలను, దానవినోదులను, ప్రభాసుందరమూర్తులను, కవులను, శూరులను చూపించాడు. అక్కడనుంచి దూరంలో ఉండే గంగదగ్గరకు పంపిం

చాడు. అది త్ర్యంబకశిరోద్భూత గోదావరినది. ఓరుగల్లుకు నూహమ్మెళ్ళ కైవారంలో ఉండే ఏదో గ్రామంలో గోపరాజు ఉండేవా డని చెప్పవచ్చు. భావిపరిశోధనవల్ల రాణా మల్ల నరేంద్రుడు ఎక్కడివాడో తేలవచ్చు.

ఉచితార్థకళారాజితులగు కవిరాజుల రాజులు చేప డితే రాజ్యము కాదే అన్న గోపరాజు తా నెందువల్లనో ఏరాజునూ చేరక, చక్కని కవితారాజ్యాన్నే ఏలుకొన్నాడు. ఇతనికి రాజనీతులు విపులంగా తెలుసు. ఇతడు ఈకావ్యంలో అక్కడక్కడ వ్రాసిన నీతిపద్యాలు నేకరిస్తే ఒక నీతిశాస్త్రమవుతుందన్న వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారి మాటలు అక్షరాలా నిజం.[1] గోపరాజుకావ్యంలోని వర్ణనలను పట్టి ఆకాలంనాటి ఆచారవ్యవహారాలను సవిస్తరంగా సురవరం ప్రతాపరెడ్డిగారు గుర్తించారు.[2] సాంఘికచరిత్ర రచనకు ఉపయోగపడుతూ రసవంతంగా వ్రాసిన కావ్యాలలో గోపరాజుకావ్యం ప్రథమశ్రేణిలో ఉంటుంది.

---

1. సింహాసనద్వాత్రింశిక, పీఠిక, పుట 3.
2. ఆంధ్రుల సాంఘికచరిత్ర, 3-వ ప్రకరణం.

3

మాడయ్యోకవి



హాభారతానికి జైమినిభారతం ఎటువంటి అనుబంధగాథో, రామాయణానికి మైరావణచరిత్ర అటువంటి గాథే. అహిమహిరావణులన్న పేర్లు కూడా రావణాసురకుంభకర్ణులంతె సుప్రసిద్ధమైనవే. ఆంజనేయుడు తోకతో కోటకట్టి రక్షించుకుంటున్న రామలక్ష్మణులను ఎత్తుకొనిపోయి పాతాళలోకంలో భద్రకాళికి బలివేయబోయిన మైరావణచరిత్ర ఆంధ్రదేశంలో ఈనాడు ఆబాలగోపాలానికీ తెలిసిన గాథే. ఆ ఘట్టాలు కొట్టిన పిండే. ఈ మైరావణచరిత్రను మొట్టమొదట ఆంధ్రసాహిత్యంలో పద్యకావ్యంగా రచించిన కవిపేరు మాడయ్య. ఇతడు వీరనరసింహరాయల కాలంలో 1485-1508 ప్రాంతాల మధ్య ఉండేవాడు. ఇతని జన్మస్థలం గుడివాడ. ఇది కృష్ణా జిల్లాలోని గుడివాడే అని చెప్పవచ్చు. పిఠాపురందగ్గిర ఇంకో గుడివాడ ఉంది కాని, బహుశా అది ఈకవి స్వగ్రామం కాదేమో!

3. మాడయ్య కవి

ఏ గుడివాడ జన్మస్థలం అయినా, మాడయ్య అక్కడ నిలకడగా ఉన్నవాడు కాదు. దేశం అంతా సంచారం చేశాడు. ఇతడు సర్వాగమశబ్దశాస్త్రచతురవివేకుడు.[1] తన విద్వత్తు చూపించడానికి, ప్రతికక్షులను జయించడానికి చాలా ఆస్థానాలకు వెళ్ళాడు. కర్ణాటసామ్రాజ్యాధిపతి వీరనరసింహరాయలను మెప్పించాడు. కోటసింగన మంత్రి గారి కొలువులో 'తస్కరకవిరాజు' నెవరినో ఇతడు ఓడించి దట్టించాడు. మొనమొన్నటి జయపురంసంస్థానాన్ని ఆరోజులలో నందాపుర అనేవారు. ఆ మన్యంభూములుకూడా మాడయ్య సందర్శించి కాంచనాభరణాల బహుమతులు అందుకొన్నాడు. కిమిడిరాజ్యాన్ని పాలించే రాజులనుండి రెండు గుట్రాలను కానుకగా పుచ్చుకున్నాడు. అఖిలకావ్య లక్షణలక్ష్యసాగరాన్ని నవమతిసూత్రితో క్రోడీకరించాడు.

ఇన్ని రాజ్యాలు సందర్శిస్తూ, అక్కడి కవులతో వాదాలు పెట్టుకుంటూ జీవితం గడిపిన మాడయ్య నిలకడగా అక్కడక్కడ అప్పుడప్పుడు నిర్మించి పుస్తకాలు వ్రాశాడు. 'దేవేంద్రవిజయం' అనే ద్విపదకావ్యాన్ని వ్రాసి ఎర్రమంత్రికి అంకితం ఇచ్చాడు. ఇతడు కేసన్నను వినుతుని సుతుడు. ఇతని బావమరిది కాండవవంశంలోని వేజర్ల అబ్బయ్యగారి గోపమంత్రి. తన బావమరిది ఎర్రయ్యకు ఒక కావ్యాన్ని మాడయ్య అంకితం ఇవ్వడం చూసి గోపమంత్రికూడా కృతిని పుచ్చుకోవాలని అనుకున్నాడు. కవిని పిలిపించి 'మైరావణచరిత్ర'ను చెప్పించాడు. తొలి

---

1. మైరావణ చరిత్ర, 1-17.

కావ్యాన్ని ద్విపదగా వ్రాసినా దీనిని మూడు ఆశ్వాసాల ప్రబంధంగా మాడయ్య రచించాడు. అష్టాదశవర్ణనలలో వీలైన కొన్ని మాత్రమే వర్ణించాడు. అన్నీ పులిమి కావ్యాన్ని చెడగొట్టలేదు.

మాడయ్య కవి తన కావ్యంలో నన్నయతిక్కనలను మాత్రమే ఇలాగ నుతించాడు:

గక్కనిచేత జిక్కువడి రాయిడిబొందినయట్టి వేదముల్
చక్కగ జేసి వ్యాసుడు ప్రశస్తము సేసిన భారతం బిలన్
దక్కగ నాంధ్రభాష విశదంబుగ జెప్పిన నన్నపార్యునిం
దిక్కనసోమయాజిని మదిం దగ నొల్చెద గావ్యభూతికిన్.

[మైరావణ చరిత్ర, 1_12]

కవిత్రయంలో మూడవవాడైన ఎర్రయ్యగారిని ప్రస్తుతించకపోయినా వారి నక్కడక్కడ అనుకరించాడు. ఎర్రయగారు తమ హరివంశంలో ప్రోలయవేమారెడ్డిని వర్ణిస్తూ అతడు అనేకదానాలు చెప్పి చేసి చేయుచున్నాడు; చేయనున్నాడు. 'పునరుక్తికృతి శుభావలులన్నల్ల'[1] అన్నారు. మాడయ్యకూడ సరిగ్గా ఇలాగే తన కృతిపతిని వర్ణించాడు.

తన మనమ్మంత్రి సురమంత్రి ననుసరింప_దన గభీరిమ వననిధి తరము డింప
వెలసి వెలయుచునున్నాడు వెలయగలడు_గురుతరోదారవేజర్ల గోపశౌరి.

[మైరావణ చరిత్ర, 1_15]

ఎర్రయ్యగారిని ఇలా అనుకరించినా ఎందువల్లనో వారి పేరెత్తలేదు. వీరినే కాదు. శ్రీనాథునికూడా నుతించలేదు. వంటకాలను వర్ణించడంలో మిగతా తెలుగుకవు

---

1. హరివంశం, పూర్వ. 1_19.

లంతా శ్రీనాథుని తరువాత చెప్పవలసినవాళ్ళే. ఉడుకు బచ్చలి కూరనైనా చక్కగా పద్యంలో ఇమిడ్చే నైపుణ్యం అతనికే చెల్లుతుంది. మాడయ్యకవి మైరావణచరిత్రలో చివర శ్రీరాములవారికి కౌసల్యాదేవి వడ్డించిన వంటకాలను ఇలా వర్ణించాడు:

ఒసపరియైన రాజనపు టోగిరమున్ మిరియంపు గూరలున్
గసగస లానవాలు గడు గమ్మని నెయ్యిని బిండివంటలున్
రసములు పాయసంబు మధురంపు ఫలంబులు నూరగాయలున్
బసగల భక్తితో బసిడిపళ్లెరమందున బెట్టె నెంతయున్.

[మైరావణ చరిత్ర, 3_189]

మైరావణచరిత్రలో కౌసల్యాదేవిచేత రాములవారికి వడ్డన చేయించడానికి కారణం జైమినిభారతంలో పినవీర భద్రుడు దేవకీదేవిచేత వడ్డింపించడమే. చూడండి ఆ పద్యాలు.

కనకపీఠి జతుష్షష్టికాకబోల_విరచితంబైన పసిడిపళ్లెరమునందు
దేవకీదేవి వడ్డింప ద్రౌపిమోర_బంకజోదరు డారగింపంగదొడగి.
మెత్తనై మిలమిల మెరయురాజన్నంబు నొలుపుబప్పులును సద్ఘృతంబు
నప్పడంబులు వడియములు దాలింపులు బలుచని నులివెచ్చపడిదములును
బులుసుగూరలును బజ్జులు దియ్యచేరులు బంచదారలు నానవాలు జున్ను
బులగంబు బహువిధంబుల పిండివంటలు పాయసంబులు వడపప్పు తేనె
పానకంబులు సీగరులు ఫలరసాయ_నములుబచ్చిళ్లు కలవంటకములు బెరుగు
నూరుగాయలు మొదలుగా నుచితవృత్తి_నారగింప జతుర్విధాహారములను.

[జైమిని భారతము, 3_49,50]

ఈ వంటకాల పద్యం శ్రీనాథుని అనేకపద్యాలకు అనుసరణ. ముఖ్యంగా హరవిలాసంలోని ఒక పద్యమూ,

క్రీడాభిరామంలోని ఒక పద్యమూ దీనికి వరవల్లుపెట్టా యేమో చూడండి.

మిరియము నుల్లియుఁ బనుపు మెంతియు నింగువ జీరకంబు శ
ర్కరయును జింతపండును గరాంబువు గమ్మని నేయి తైలమున్
బెరుగును మేళవించి కడు బెక్కువిధంబుల పాకశుద్ధి వం
డిరి సితియాలునిం గటికిడెందమునం దరళాత్ము లిద్దరున్.
[హారవిలాసము, 2_121]

కప్పురభోగివంటకము కమ్మని గోధుమపిండివంటయున్
గుప్పెడు పంచదారయును గ్రొత్తగ గాచిన యాలనే పెస
ర్పప్పును గొమ్మునల్లనటిపండ్లును నాలుగు నైదు నంజులున్
లప్పలతోడ గ్రొంబెరుగులత్కృణవజ్ఞు లయింట దూకకున్.
[క్రీడాభిరామము, 166]

ఇలా పినవీరభద్రుని ద్వారా, శ్రీనాథుని ప్రభావం కనబడుతున్న మాడయ వాళ్ళనుకూడా నుతించలేదు. శ్రీనాథునిచూసే మాడయ్య దేశసంచారం నేర్చుకున్నాడని భావించడంలో తప్పు లేదు. సభలలో వాదించడం ఇతనికి ఇష్టం. కుకవినింద చేసే సందర్భంలో సభలలోని పండిత మ్మన్యులనే తిట్టాడు.

పాంకపు గావ్యలక్షణము పోక డెరుంగక దిట్టకూళలై
కొంకక వంకరర్థములు గూర్చి సభాస్థలి బ్రౌఢులట్లు ని
శ్శంక జరించుచున్ సుకవి సంఘము పల్కుల మెచ్చ కూరకే
యంకము సేయువచ్చు నల యయ్యల మున్నగ బ్రస్తుతించెదన్.
[మైరావణచరిత్ర, 1_13]

ఇందులో 'ప్రస్తుతించు' అనే క్రియకు 'మిక్కిలి కొనియాడు' అనే నైఘంటికార్థం ఉన్నా, వెటకారంగానే కవి

వాడాడు. ఇలాగ జాతీయాలు వాడడం ఈ కవి కలవాళ్ళే.

శ్రీరాముని తో నీకు విరోధ మెందుకని మైరావణుడు మొదట హితోపదేశం చేసేటప్పుడు కోపంతో రావణుడు ఇలా అంటాడు:

ఇచ్చట నిను దలచిన పని_మెచ్చగ జేసితివి, చాలు, మెల్లన నిక నీ
వచ్చిన త్రోవనె క్రమ్మర_విచ్చేయుము వలవ దిచట వెర చెద వనినన్.

[మైరావణ చరిత్ర, 1_115]

ఈ మైరావణుడు ఎంతటి మాయావో విభీషణుడు సుగ్రీవాదులకు చెప్పినప్పుడు మాడయ్య చాలా అరుదైన ప్రయోగం చేశాడు. చూడండి.

మనలోన మనకు గలహము_పెనుపంగా నేర్చు మిత్ర భేదము వుట్టన్
ఎనమండ్రలోన బదుగుర_గనుమాయల మొరగి తివియగా నేర్చు దగన్.

[మైరావణ చరిత్ర, 1_124]

మైరావణుడు ఎనమండుగురిలో పదిమందిని కనుకట్టుతో లాగుతాడట! ఇతనికి శ్రీరాముడు దేవుడని మొదటే తెలుసు. ఈ సంగతి రావణునితో చెప్పి విధిలేక రాముణ్ణి ఎత్తుకుపోవడానికి ప్రయత్నిస్తాడు. అప్పుడాతని భార్య మాతంగి తన భర్తకు రాముని గొప్పతనం చెప్తుంది, దశావతారాలలో పరశురామావతారం కాక ఆరు వర్ణించి అవి శ్రీరాముని పూర్వావతారాలని హెచ్చరిస్తుంది. అతడు తెలిసి తెలిసి చావు తెచ్చుకొంటాడు. అతని మరణ వార్తను చెప్పడానికి రాక్షసాంగనలు వెళ్ళినప్పుడు మాతంగి ఎలాఉందో మాడయ్య బాగా వర్ణించాడు.

ఇరుగెలంకుల దైత్యతరుణీకదంబంబుగొలువ గద్దియమీద నలరుదాని
సలలితసత్కళాసౌభాగ్యరేఖల బాలామియొప్పుల బరగుదాని [దాని
నవరత్నమయ భూషణములకు దన మూర్తిభూషణంబైయుండ బొలుచు
మృదుపాణిపద్మంబు మెరుగుజెక్కిట జేర్చి తనభర్త సేమంబు దలచుదాని
వృద్ధపుణ్యాంగనలు సెప్ప వీనులలర
కథలు వినుచున్న ధర్మమార్గంబు దాని
కలితతన్వంగి మాతంగి గాంచి మొక్కి
హస్తములు మోడ్చి కడు గంపితాత్మ అగుచు. [మైరావణ చరిత్ర,3_135]

ఈ వర్ణనలోని 'కథాశ్రవణం' రంగనాథ రామాయణంలోని రావణాసురుని తల్లిని జ్ఞాపకం చేస్తుంది. లంకను విడిచిపెట్టి శ్రీరాముని శరణువేడడానికి ముందు విభీషణుడు తల్లిదగ్గరకు వెడతాడు. ఆ ఘట్టంలో ఆమె ''వెన్నెలరస మాన విదళించి తీసిరి మిన్నేటి నురుగుతో మెరుగుపెట్టినట్లు'' నెరసిన కనుబొమలతో, నెరసిన శిరస్సుతో ఉంది. ముదుక కూప్పసాలు తొడిగింది. పురాణాలు వింటూంది. ఆసంగతి రంగనాథరామాయణకర్త ఇలా చెప్పాడు.

వెలసిన లనయొద్ది వేదఘోషములు
సలలితమ్ముగుచున్న జలఘోషములుగ
వినుతబహుద్విజవితతులు చెలగ
గనుపట్టు జాహ్నవిగంగనా నొప్పి
బహుపురాణంబులు బహువేదములును
బహుశాస్త్రములు వెలుగ్గ బ్రహ్మరాతనులు
బహుభంగిజదువంగ బహుభక్తి వినుచు
బహుశనిర్మలశుభప్రభ దేజరిల్ల
నుండియు రావణు నొప్పమి దలచి_కొండంత వగపుచేకొనియున్నతల్లి
గాంచి దండమువెట్టి కన్నుల నీరు_నించి దుఃఖితుడైన ...
[రంగనాథ రామాయణం, పుట 259]

మాడయ్య కాలంలో రాచవారి ఆడవాళ్లకు పుణ్యాం గనలు పురాణం చెప్పేవారు కాబోలు. రాచమాతల వైభ వాన్ని ముక్కుతిమ్మన్నగారు కూడా చక్కగా విశదం చేశారు. ఇంద్రుని తల్లి అదితిని ఎలా వర్ణించారో చూడండి.

తొడలపైజాచిన యడుగుగెందమ్ములనొయ్యన బొలోమియొత్తుచుండ
బార్శ్వభాగంబున బంకేరుహాసనుకామినీరత్నంబు కతలుసెప్ప
బనిబూని యంతంతి వినయావనతవృత్తి సప్తర్షికాంతలు సంచరింప
వీజనచామర వీటీకరండాదికములు దిక్పతిసతీగణములు దాల్ప
విమలచింతామణీ మయవేదిమీద_గల్పకలతాంత కల్పితతల్పసీమ
నధివసించిన నిఖిలలోకైక వంద్య_నమరమాత్రికకుక్షినయ్యదితిగనియె.

[పారిజాతాపహరణం, 3-24]

పెద్దకోడలి తొడలమీద అడుగులుచాపి ఆమెచేత ఒత్తించుకొంటూ చదువుల సరస్వతి చెప్పే కథలు వింటూ సామంతుల భార్యలచేత వింజామరలు వేయించుకొంటూ పురోహితుల భార్యల విధేయతచూస్తూ భోగాలు అనుభవించేది. నిజంగా నిఖిలలోకైక వంద్య. సామ్రాజ్యాధిపతికి జనయిత్రి. రాణివాసంలోని స్త్రీలు ఇలా కథలు - బహుశా రామాయణం - వినిపించుకొంటే పురుషులు పురాణాలు వినేవారు.

ఆరోజులలో రామాయణం పారాయణం చేయడం ఒక వ్రతం అని నికరంగా చెప్పవచ్చు. మాడయ్యసోదరుడు మల్లన రాచవారి మన్ననలు పొందాడు. 'రామాయణ పారాయణ పఠనవ్రతం'లో కీర్తి సంపాదించాడు. ఈ సంగతి తనతో తనకృతిపతి చెప్పినట్లు మాడయ్య కృత్యాదిని వ్రాశాడు.

నీయగ్రజుండు దక్షిణ-రాయనృపప్రవిమలాబ్ధి రమణీయుడు రా
మాయణపఠనవ్రతని-ర్వ్యాయతఘనయశుడు మల్లనార్యుడు పేర్మిన్.

[మైరావణ చరిత్ర, 1-20]

తన కాలంలో ఇంత ప్రసిద్ధమైన పురాణ పఠనాన్నే మాడయ్య మాతంగి శుద్ధాంతంలో పేర్కొన్నాడు. భర్త మరణించాడని తెలిశాక మాతంగి రోదనాన్ని ఇలా వర్ణించాడు:

అల్లన యాణిముత్తియము లాకలిదీర మెసంగి మీలు దా
మొల్లక పాయగా నుమియ నుర్విని రాలెడు రీతి గుప్పలై
ఝల్లన గంటినీరు కుచశైలములం దురలంగ నేడ్చె ను
త్పుల్లసరోజనేత్ర తన పూరుషు సారెకు బేరు వాడుచున్.

[మైరావణ చరిత్ర, 8-138]

ఆడవారి కళ్లు చేపలలాగే ఉండవచ్చు. కన్నీటి చుక్కలు ఆణిముత్యాలలాగ ఉండవచ్చు. శోకిస్తున్న ఆడ దాని కంటి చేపలు కక్కుతున్న ముత్యాలలాగ కన్నీటి చుక్కలు రాలాయని వర్ణించడం బాగానే ఉంది. అయితే మగడు చచ్చి వీడుస్తూన్న దాని నిలా చూపించడం కొంచెం ఎబ్బెట్టుగానే ఉంటుంది. మాడయ్య అక్కడక్కడ మంచి వర్ణనలు చేశాడు. మొట్టమొదట అయోధ్యా పురాన్ని వర్ణిస్తూ ఇలా ఉత్ప్రేక్షించాడు:

ఆపురమున గల మణిమయ-గోపురముల సంచరించు కోమలు లెపుడున్
నూపురములందు జుక్క-ల-దాపింపంగాదె రాజు తనలో గందెన్.

[మైరావణ చరిత్ర, 1-40]

అయోధ్యను వర్ణిస్తూ మాడయ రామరాజ్యంలో పామరులు, మూర్ఖులు, అలసులు, తామసులు, అజ్ఞాన

మతులు, ధైర్యహీనులు, సోమరులు లేరని చెప్పాడు.[1] ఆదర్శరాజ్యంలో అందరూ విద్వాంసులే అని వర్ణించడంలో ఈ కవి మనస్తత్వం బోధపడుతుంది. ఇతణ్ణి కృతిపతి ఇలా పొగడాడట!

రసములు తొమ్మిదింగలుగు రమ్యనవార్థసుశబ్దమూధురీ
విసరము లుల్లసిల్ల నతివిస్ఫుటలక్షణమూర్ధి బ్రౌఢిమన్
రసికుల నెమ్మనంబులను రాగము నొంద దెనుంగుబాసనిం
పెసగగ జెప్పనేర్తు సరి యెవ్వరు నీకును మాడ ధీమణీ!

[మైరావణ చరిత్ర, 1-22]

ఇతడు ఏఏ రాజ్యాలు సందర్శించాడో మొదట మనం చెప్పుకొన్నాం. ఆ సంగతు లన్నీ కృతిపతినోట మాడయ్యే ఈ పద్యంలో విశదంచేశాడు. చూడండి.

మెప్పించినాడవు మెరవడి గర్ణాటనరనాయకుని వీరనారసింహు
దట్టించినాడవు తస్కరకవిరాజు గోటసింగనమంత్రి కొలువులోన
గాంచినాడవు కనత్కాంచనాభరణంబు లేపార నందాపురీశుచేత
నందినాడవు నుత్తమాశ్వద్వయంబును కిమిడిభూమండలరమణుచేత
నవమతిస్ఫూర్తి గ్రోడించినాడ వఖిల-కావ్యలక్షణలక్ష్యసాగరము నెరయ
నిన్ను వేర్వేర నింక వర్ణింప నేల-ప్రౌఢ వన్నింట సర్వయమాడసుకవి.

[మైరావణచరిత్ర, 1-18]

ఇందులో మాడయ అఖిల కావ్యలక్షణలక్ష్యసాగరము క్రోడీకరించాడని ఆనాటివాళ్లు చెప్పినా ఈనాటివాళ్లు ఇతడు లక్షణ విరుద్ధమైన ప్రయోగా లెన్నో చేశాడని నేటి చిన్న వ్యాకరణ దీపంతో వెదకి తప్పులు పట్టుకొంటారు. యకా

---

1. మైరావణ చరిత్ర, 1-59.

రంబును, వు వ్రూ వొ వోలును దెలుగుమాటలకు మొదట లేవు అని చిన్నయసూరి సూత్రీకరించాడు (బాల. సంజ్ఞ. 17). అయితే మూడయ్య కావ్యాన్ని చూస్తే 'వొ' కారంతో మొదలయ్యే పదం కనబడుతుంది. నాటి రాత్రి రామ లక్ష్మణులను కాళికి బలియివ్వాలని మాతంగితో మైరావణుడు చెప్పే ఘట్టంలో ఈ ప్రయోగం చేశాడు.

కావునను మొరగి దశరథ-భూవరతనయులను నాదు పూనిక దక్కన్
ఈవేళ దెచ్చి కాళిక-కే 'వొ'ప్పన చేతు దలక కిమ్మ్మల దరుణీ.

[మైరావణచరిత్ర, 1-141]

ప్రాసస్థానంలో 'వొప్పన' అనే మాట వాడాడు. ఒకారంతో మొదలవవలసిన మరికొన్ని మాటలు 'వ'కారంతో మూడయ్య ప్రయోగించాడు. వలచుధాతువుకు వ్యతిరేకంలో 'ఒల్లను' అని ప్రయోగించాలని లాక్షణికులు అనుకొంటారు. అయితే మూడయ్య కావ్యంలో 'వల్లను' అనే రూపం కనబడుతుంది. శ్రీరాముణ్ణి మైరావణుడు ఎత్తుకొనిపోయాక విలపిస్తున్న సుగ్రీవు డిలా అంటాడు:

త్రుళ్ళిన రావణాసురుని ద్రుంపక సంతత శోకమగ్నయై
తల్లడ మందుచున్న వసుధాసుత గావక వీరధర్మమున్
బొల్లుగ జేసి రాఘవులు వోయినయప్పుడె మేను ప్రాణము
వ్వల్లను నంగదుం గొనుచు వారిధి మెల్లనె దాటు డిందరున్.

[మైరావణచరిత్ర, 2-60]

ఇందులో 'ఒల్లను' అనే మాట దిద్దడానికి వీలులేని యట్టిస్థానంలో ఉంది. అందుచేత మైరావణచరిత్రను సంస్కరించిన పండితులు ఇలా వ్రాశారు:

"ఇందు వలచుధాతువునకు వ్యతిరేకమునందు 'ఒల్లను' అని ప్రయోగింపవలసియుండగా 'వల్లను' అను గ్రామ్యరూపము వాడబడినది".[1]

అయితే "వ్యతిరేకంబునందు వలచున కొల్ల విభాషనగు" అని చిన్నయసూరి సూత్రీకరించాడని మరిచిపోకూడదు. (బాల. క్రియ. 107) 'ఒల్ల' రానప్పుడు 'వల్ల' రావచ్చునని విస్మరిస్తేనే ఇది గ్రామ్యరూప మనుకోడం జరుగుతుంది. మాడయ్య ఈ కావ్యంలో 'పుడమిశుడు' అనే ప్రయోగాలు పద్ధెనిమిది చేశాడు. కొన్ని లక్షణ విరుద్ధా లని పరిష్కర్తలు దిద్దేశారు.

"ఇందు 'పుడమిశ' అనునది గ్రామ్యరూపము. పుడమిశబ్దము సంస్కృతమనుభ్రాంతిచే నీశశబ్దముతో సవర్ణదీర్ఘమున గలుపబడినది. ఇట్టిచోట్ల మేము 'పుడమిదొర' యని సవరించుచు వచ్చితిమి. విశేషముగ మార్పుచేయనక్కరలేకుండ దిద్దుటకు వీలున్నచోట్ల నిట్లే మరికొన్ని సవరింపబడినవి"[2] అని పరిష్కర్తలు చెప్పారు. పండితులు దిద్దిన అసలుపాఠాలు దొరికితే 'అఖిలకావ్యలక్షణలక్ష్యసాగరం' వ్రాసినవాళ్లు సహితం ఒకనాడు వాడే అపురూప ప్రయోగాలు మనకు దక్కేవి. మాడయ్య తన 'దేవేంద్ర విజయం' అనే ద్విపదలో ఇటువంటివి ఎన్ని ప్రయోగాలు చేశాడో! అతడు లక్షణవిరుద్ధమైన అర్థాలను చెప్పినవారిని క్షమించలేదు. తస్కరకవిరాజును ఇటువంటి సందర్భంలోనే

---

1. శ్రీరామకృష్ణకవుల, మైరావణచరిత్ర, పీఠిక, పుట 3.
2. " " " పుట 4.

దట్టించి ఉంటాడు. ఈ కవి ఎవరో, వీ పుస్తకాలు వ్రాశాడో తెలియదు. సంస్కృతంలో బిల్హణచరిత్ర వ్రాసిన చోర కవికీ, ఇతనికీ సంబంధం లేదు. మాడయ్య తన కావ్యంలో ఆ సంస్కృతకవిని స్తుతించాడు.

ప్రార్థనము సేతు శివభద్రు బదరసేను
జోరు భవభూతి దండి మయూరు బాణు
మాఘు భారవి నుద్భటు మరియు బేరు
గల కవీంద్రుల జింతింతు గరిమతోడ. [పైరావణచరిత్ర, 1-11]

తస్కరకవిరాజు కోటసింగరాజుగారి కొలువులో ఉండేవాడని మాడయ్యపద్యంవల్లనే తెలుస్తుంది. ఈ కోట సింగరాజు ముప్పయిరెండు ప్రసిద్ధమంత్రులలో ఒకడు. ఇతడు రాజమండ్రివద్ద ఉండే పట్టిసవీరభద్రేశుని భక్తుడు.[1] ఈ కోట సింగరాజు నిరతాన్నదాత. ఇతణ్ణి కీర్తించే భట్రాజుల పద్యాలను వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చాటుపద్యమణిమంజరిలో క్రోడీకరించారు.

గడుసరి లోభి యర్థ మది కన్నపుదొంగల బందిపోటుకున్
బుడమిని వారకాంతలకు భూపతికిం జను గోటసింగ! నీ
పడసిన యర మారులకు బాంధవకోటికి యాచకాళికిన్
గుడికిని సత్త్రికాలకును గూపతటాకవనప్రతిష్ఠకున్.
[చాటుపద్యమణిమంజరి, 94]

ఇతని కీర్తి భార్యవల్ల వచ్చిందని మృదువుగా హాస్యమాడిన పద్యం ఒకటి ప్రసిద్ధమైనదే.

---

1. చాటుపద్యమణిమంజరి, 2-వ భాగం, పుట 72.

కోటసింగరాజుమాటవాసియె గాని_గంగమాంబవలన ఘనత కెక్కె
గంగమాంబ జగతి గయ్యాళి యైనను_సింగరా జి కేమి చేయగలడు?
[చాటుపద్యమణిమంజరి, 94]

ఈ చాటువులు ఎవరు చెప్పారో తెలియదు. మాడయ్య చెప్పినా చెప్పిఉండవచ్చు. చాటువులే కాక నీతిపద్యాలు వ్రాయడంలో మాడయ్య సిద్ధహస్తుడు. మైరావణుని చేత రావణునికి 'పరస్త్రీహరణం పాప' మని ఇలా చెప్పించాడు:

పరులకు నవ్వు పట్టు తన బంధుజనంబుల కెల్ల నింద య
స్థిరముల కాలయంబు కడు సిగ్గుల చేటున కాస్పదంబు స
త్పరమమునుల్రోవగాక కడు భాసురకీర్తికి మూలహాని యౌ
వ్వరికి బరాంగనంగలియ వర్తనమే బల మెంత గల్గినన్.
[మైరావణచరిత్ర, 1_107]

సుమతిశతకం మొదలైన ప్రబోధశతకాలలోని నీతులవంటివి కూడా మైరావణచరిత్రలో ఉన్నాయి. మైరావణుని మేనల్లుడు నీలమేఘునకు పట్టం కట్టి హనుమంతు డిలా హితోపదేశం చేస్తాడు:

చేరకు పాతివ్రత్యల_గోరకు పరధనము లెంత కోపంబైనన్
బోరకు విప్రులతోడను_నేరకు గలలోనవైన నిష్ఠురభాషల్.
మనుపుము దీనజనావళి_మనుపుము బాంధవుల ప్రీతి మరి దానవులన్
దనుపుము పిత్రృదైవంబుల_ననుపును సత్కీర్తి దిశల కయగం బేర్మిన్.
[మైరావణచరిత్ర, 3_162, 163]

మాడయ్య సత్కీర్తిని మైరావణచరిత్ర చక్కగా చాటుతుంది.

4

మనుమంచి భట్టు



నాది నుంచి భారతీయసైన్యాలను గజ, తురగ, రథ, పదాతి దళాలు అనే చతురంగబలా లుగా విభజించేవా రన్నసంగతి సుప్రసిద్ధం. వీటిలో అశ్వబలం చాలా ముఖ్యమైనది. శత్రువులను సూటిగా ఎదుర్కొనడానికి, పారిపోయేవాళ్ళను వెంట తరుమడానికీ, తన సైన్యాల పార్శ్వాలను రక్షించుకొన డానికీ, యుద్ధవార్తలు దేశంఅంతటా రహస్యంగా చేర వేయడానికీ, శత్రుసేనను చీల్చి త్రోసుకొని చెండాడడానికీ మన పూర్వులు అశ్వదళాలను ఉపయోగించారు. వేగం, సాహసం అవసరం అయ్యేచోట్ల అశ్వదళమే విజయసాధక మని భారతీయుల విశ్వాసం.[1]

ఈ అభిప్రాయాన్నే మనుమంచిభట్టు అనే కవి ఒక పద్యంలో ఇలా చెప్పాడు:

---

1. సంగ్రహ ఆంధ్రవిజ్ఞానకోశం, 3-వ సంపుటి, పుట 596.

కరిరథవీరభీషణవికారజలగ్రహకోటిచేత దు
స్తరమగు వైరిభూరణసైన్యపయోనిధి నెన్న నశ్వమం
దరగిరి ద్రచ్చెగాక మరి తక్కిన రీతుల ద్రచ్చవచ్చునే
యరయగ వీరలక్ష్మి నిలనాభళకంపధరాతలేశ్వరా!

[అశ్వలక్షణసారము, 1_72]

ఇది 'హయలక్షణవిలాసం' అనే అశ్వశాస్త్రంలోని పద్యం. మంచిజాతి గుఱ్ఱాల లక్షణాలు విశదపరచే గ్రంథాలు సంస్కృతంలో ఎన్నిఉన్నా తెలుగులో మొదటిగ్రంథం కాకతీయుల కాలంలోనే వెలసింది. ఎవరో పేరు తెలియని కవి 'శాలిహోత్రం' అనే అశ్వశాస్త్రం రచించాడు. దానిని కొలనువారి వంశంలో ఉన్న గన్నయ్యకు అంకితంఇచ్చాడు. ఈ గ్రంథం చాలాప్రసిద్ధ మయింది. దీనిలోంచి ఒక పద్యాన్ని తీసుకుని మడికిసింగన తన సకలనీతిసమ్మతంలో ఇలా ఉదాహరించాడు:

నాలుగుకాళ్లును గొనయును_వాలము వదనము విశాలవక్షము దెలుపై
మేలైన యష్టమంగళ_నేలెడు పతి యేలు నవని నేలెడు పతులన్.

[సకలనీతిసమ్మతం, 827]

మడికి సింగన శాలిహోత్రంలోని దని ఉదాహరిం చిన ఈ పద్యమే కొద్దిమార్పులతో మనుమంచిభట్టు రచిం చిన 'అశ్వలక్షణసారం' అనే గ్రంథంలో ఉన్నట్టు కనబడు తుంది.[1]

నాలుగుకాళ్లుం గొనచెవి_వాలము వదనము విశాలవక్షము తెలుపై
క్రాలునది యష్టమంగళి_నేలిన పతియేలు ధరణి నేలినపతులన్.

[అశ్వలక్షణసారము, 1_27]

---

1. ప్రచురణకర్తలు: కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు.

వాస్తవాని కీ పద్యం శాలిహోత్రం అనువదించిన రచయిత దే గాని మనుమంచి భట్టుది కాదు. శాలిహోత్రం లోని చాలాపద్యాలను లేఖకులు ఇతర గ్రంథాలలో వ్రాసుకొన్నారు. కొండపల్లి వారు అచ్చువేసిన అశ్వలక్షణ సారం మొదటి అంకురంలో తొలి 62 పద్యాలూ శాలి హోత్రం లోనివే. 63 వ పద్యం ఇలా శ్రీకారంతో మొద లవుతుంది.

శ్రీజన్మసదనరాజ-వ్రాజిత యసమాననయనరాజీవునకున్
రాజులకు దుగ్ధవారిధి-రాజునకున్ కుమారకంపరాజున కెలమిన్.

ఆతరువాత వచనం ఇలా ఉంది:

అభ్యుదయపరంపరాభివృద్ధిగా నా యొనర్పం బూనిన హయలక్షణ విలాసం బను కృతికి కథావిధానం బెట్టిదనిన. [అశ్వలక్షణసారం, 1-64]

ఈకృత్యాదివాక్యాలవల్ల తొలి 62 పద్యాలలో కొన్ని ఇంకొక గ్రంథంలోని వని స్పష్టం. ఈ పద్యాలు గన్న భూపాలునికి అంకితం. శాలిహోత్రంలోనివే అని ఈ పద్యం రుజువు చేస్తూంది.

అనఘుడు శాలిహోత్రుడు వాయంబులకున్ మును జెప్పినట్టి యా
యనుపమలక్షణంబులు వయఃపరిమాణము రోమజంబులన్
దెనుగున నెల్లవారలకు తేటపడన్ రచియింతు సత్కవుల్
విని కొనియాడ దానగుణవిశ్రుతకన్నయ మేదినీశ్వరా !
[అశ్వలక్షణసారం, 1-2]

కాకతీయుల కాలంలో అనువదించిన ఈ గ్రంథం లోని పద్యాలు ఇలాగైనా తెలియవస్తున్నందుకుసంతోషమే. కాకతీయుల కాలంలోనే ఒక అశ్వశాస్త్రం తెలుగులోనికి

వచ్చినా, మళ్లా ఇంకొక హయలక్షణ విలాసం ప్రాయ డానికి కారణం తొలిరాయల యుగంలో గుర్రాలప్రాముఖ్యం చాలా హెచ్చింది. వాటికోసం చాలాయుద్ధాలు, విప్ల వాలు, దారుణాలు జరిగాయి. అథర్వవేదకాలం నుంచే యుద్ధంలో అశ్వాలు వాడుతున్నా, అశ్వమేధయాగాలు చేస్తున్నా, మనవాళ్లు మంచిజాతి గుర్రాలను యవనదేశాల నుండి దిగుమతి చేసుకుంటూ ఉండేవారు. పశ్చిమతీరాన, గోవారేవు పట్టణం ఒకనాడు విజయనగర సామ్రాజ్యంలో ఉండేది. 'మూరు' లనే వర్తకులు ఈ రేవులో అరబ్బీ, పారశీక దేశాలనుంచి మంచి గుర్రాలు దిగుమతిచేసేవారు. వాటిని బహమనీ సుల్తానులకు, ఇక్కడి హిందూరాజులకు విక్రయించేవారు. అయితే మతపక్షపాతంతో, బహమనీ సుల్తానులకు, వారి ఆశ్రితులకు మాత్రమే ఉత్తమాశ్వా లను విక్రయించేవారు. కొన్నాళ్లకు విరూపాక్షరాయల కాలంలో (క్రీ. శ. 1465-1478) విజయనగర రాజులకు ఏరకం గుర్రాలైనా అమ్మడం మానివేశారు. తన రాజ్యంలో ఉన్న రేవులో దిగుమతిచేసే గుర్రాలను తన శత్రువులకు అమ్ముతున్నారన్న కోపంతో విరూపాక్షరాయలు గోవా పట్టణంలో ఉన్న పదివేల 'మూరు'లను చంపించాడు. ఈ ఘోరకృత్యం జరిగాక బహమనీసుల్తానులు కొంకణంపై దాడి చేసి గోవారేవును హస్తగతం చేసుకున్నారు. ఆ తదుపాత, అది మళ్ళా విజయనగరం చేతికి రాలేదు. పశ్చిమసముద్రంమీద జరిగే వ్యాపారంపై బహమనీసుల్తా

నుల ఆజ్ఞలకు లోబడి ఉంది. వాళ్లు నిజంగా అశ్వపతులయ్యారు.

ఈ చారిత్రకపరిస్థితులను చూస్తే మళ్ళీ ఒక అశ్వశాస్త్రం తెలుగులో రచించవలసిన అవసరం కనపడుతుంది. అందుకే మనుమంచిభట్టు హయలక్షణవిలాసం రచించాడు. ఇది చాలా ప్రచారం పొందింది. ఎందరో దీనిప్రతులు వ్రాసుకొన్నారు. అయితే ఇంతకుముందు ఉపయోగిస్తున్న శాలిహోత్రంలోని పద్యాలను లేఖకులు ఈ హయలక్షణవిలాసంలో చేర్చుకొన్నారు. ప్రాచీనగ్రంథంలోని భాగాలనే కాక అనంతర లేఖకులు అర్వాచీనగ్రంథంనుండి కూడా కొన్ని భాగాలను హయలక్షణవిలాసంలో కలుపుకొన్నారు. ఏకాలంలో వాడో తెలియని ఒక కవి (కామయ్యశిష్యుడు) అశ్వశాస్త్రాన్ని వ్రాసి, ఏ రాజ్యపువాడో తెలియని ఉత్తమ గండదొడ్డభూపాలునికి అంకితమిచ్చాడు. మద్రాసు ప్రాచ్యలిఖితగ్రంథాలయంలో 'హయలక్షణవిలాసం' అనే తాళపత్రగ్రంథంలో 41 కమ్మలు ఉన్నాయి. వాటిలో 23 కమ్మలలో మనుమంచి భట్టారకుని గ్రంథంలోంచి, మిగతా పదినిమిది కమ్మలలో ఈ 'ఉత్తమగండ-అశ్వశాస్త్రం' అనదగ్గది ఉంది.[1] అందులోని చివరిపద్యాలలో ఇలా ఉంది:

గాయకసత్కవీంద్రబుధకల్పమహీరుహమైన దొడ్డభూ
నాయకకీర్తియెంత సురనాగమహో.....కృతిన్
దోయధిసప్తకావృతచతుర్దిశభూమి వెలుంగుచుండ్రు
హ్మాయువు శ్రీయు నయ్యెడు మహామహిమోత్తమగండభూవరా!

---

1. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, R 482. కైఫ్. కేటలాగు, 3_వ సంపుటి, మూడవభాగం, పుట 1250.

కరివరదుని గమలాసను-నిరుగురువుల విద్య శిక్ష యిచ్చిన...
...నొగి గ్రియవిద్యకు-గరకలితాబ్జములు మోడ్చి కామయ గొల్తున్.

ఈ అశ్వశాస్త్రాన్ని అంకితంపుచ్చుకొన్న ఉత్తమ గండభూవరుడు ఎవరో తెలుసుకొనడానికి ప్రయత్నిద్దాం. ఛందోగ్రంథాలలో 'ఉత్తమగండచ్ఛందం' అని ఒకటి ఉంది. దాన్ని గురించి రావూరి దొరస్వామిశర్మగారి లిలా వ్రాశారు: "ఉత్తమగండబిరుదము గల సాళువకంపరాజున కంకితము. కంపరాజు హయలక్షణసారకర్త. ఈ ఛందఃకర్త చిత్రపు భీమన యని లక్షణశిరోమణివలన దెలియు చున్నది."[1]

సాళువ కంపరాజు అశ్వశాస్త్రాన్ని అంకితం పుచ్చు కొన్నాడేగాని రచించలేదు. కంపరాజుకు 'ఉత్తమగండ' అనే బిరుదు ఉన్నట్టు కనపడదు. (1) మాసరగండ. (2) బబ్బరబాహ, (3) రాయచౌహత్తమల్ల, (4) ధరణీ వరాహ, (5) కఠారిరాయ అనే బిరుదులే కంపరాజు కున్నట్టు మనుమంచిభట్టు గ్రంథంవల్ల తెలుస్తున్నాయి. R-482 గ్రంథంలో ఉత్తమగండభూవరుని పేరు దొడ్డరాజు. ఇతని తండ్రిపేరు భీమరాజు. సాళువకంపరాజు హయలక్షణసార కర్త అని రావూరివారు ఏ ఆధారాలవల్ల చెప్పారో తెలి యదు; గాని, అతడు నిజంగా అశ్వశాస్త్రాన్ని వ్రాస్తే అతనికి తన హయలక్షణవిలాసాన్ని మనుమంచిభట్టు అంకితం ఇవ్వడంలో ఎంతో ఔచిత్యముంది. అలాగే—తొలి శాస్త్రీయగ్రంథం శాలిహోత్రంకూడా గుర్రాలను దిగుమతి

1. తెలుగుభాషలో ఛందోరీతులు, పుట 403.

చేసుకొనే కొంకణమండలాన్ని పాలించే గన్నయ్యకు అంకితం ఇవ్వడంలో ఎంతో చారిత్రకమైన ఔచిత్యం కనబడుతుంది.

హయలక్షణవిలాసంలోని కృత్యాదిపద్యాలు లభించలేదుకనుక మనుమంచి భట్టునుగురించిన వివరాలు తెలియవు. గ్రంథం ఆశ్వాసాంతగద్యలో ఇలా ఉంది:

ఇది సకలసుకవిజనసంస్తూయమానకవితాచాతురీధురీణనిఖిలభాషాప్రవీణభైరవాచార్యపుత్రపరమపవిత్రమనుమంచిభట్టుప్రణీతంబైన హయలక్షణవిలాసంబు.

దీనివల్ల ఇతని తండ్రి భైరవాచార్యుడని, ఇతడు కవితాచాతురీధురీణుడని, నిఖిలభాషాప్రవీణుడని తెలుస్తుంది. శాస్త్రీయగ్రంథాలలో కవితాచాతుర్యం చూపడానికి ఆస్కారాలు తక్కువ అయినా చక్కని ధారతో, మృదువైన పదాలతో చక్కని కవిత్వం వ్రాశాడు.

వరశుభలక్షణంబులను వర్ణనకెక్కిన ఘోటకంబులన్
ధరణిపు డెక్కబోవలయు దజ్జగతీపతి కోరివచ్చినం
పరుదున శత్రులక్ష్మివిభవాన్వితయై యభిసారికాకృతిన్
గురమున గంపధూరమణదోర్బలభీమఖమార మన్మథా!

[అశ్వలక్షణసారము, 1_75]

ఈహయలక్షణవిలాసాన్ని అంకితం పుచ్చుకొన్న సాళువకంపరాయలు కర్నూలుజిల్లా చింతకుంటగ్రామం వాడని, క్రీ. శ. 1442–1459 ప్రాంతాలవాడని చాగంటి శేషయ్యగారు అభిప్రాయపడుతున్నారు.[1] ఈ కంపరాయల

1. ఆంధ్రకవితరంగిణి, 6-వ సంపుటి, పుటలు 108_110.

తండ్రిపేరు బొబ్బళరాయలు. క్రీ. శ. 1442 లో "శ్రీమన్మహా మండలేశ్వర అవుబళ దేవమహారాజులకు వోబాయ్యమ్మకున్న సుపుత్రుడైన శ్రీమన్మహామండలేశ్వర మిూసరగండకతారి సాళువకంపయ్య దేవమహారాజు"ల శాసనం ఒకటి లభి స్తూంది. దీనిని నిడుదవోలు వెంకటరావుపంతులుగారు ప్రక టించారు.[1] "శ్రీపంతులుగారి పరిశోధనలవలన చరిత్ర కారుల కగపడకుండ దాగియున్న కంపభూపతి బయలు పడుటయు, మనుమంచిభట్టుకాలము సరిగా నిర్ణయమగుటయు తటస్థించినది" అని చాగంటి శేషయ్యగారు వ్రాశారు.[2]

అయితే దురదృష్టవశాత్తూ ఈ శాసనంలోని కంప రాయలూ, మనుమంచిభట్టుకృతిని అంకితం పుచ్చుకొన్న కంపరాయలూ విభిన్నవ్యక్తులు. శాసనంలోని కంప రాయల తల్లిపేరు ఓబాయమ్మ. కృతిభర్తయైన కంపరాయల తల్లిపేరు భీమాయమ్మ. పైన ఇంతకు ముందు ఉదాహరించిన 'వరశుభ లక్షణంబులు' (1-75) పద్యంలో అతడు భీమకుమారు డనే ఉంది. డాక్టరు బిరుదురాజు రామరాజుగారు సంపాదించిన హాయలక్షణ విలాసం సమగ్ర ప్రతిలోని ఒకసీస పద్యపు ఎత్తుగీతిలో ఇలా ఉంది.

ఉరముపై నొండు బోగల్గు తురగరత్న
మగ్గి జయమిచ్చు భద్రాజ్య మనుభవించు
భవ్యచారిత్ర భీమకంబాసుపుత్ర
రాజకులధీత యోబళరాయకంప. [అముద్రితము, 2-44]

---

1. భారతి, విరోధి, ఆషాఢం.
2. ఆంధ్రకవితరంగిణి, 6-వ సంపుటి, పుట 108.

అందులోనే ఇంకొక పద్యంలో "ప్రభుతుద (నుత?) భీమాంబపుత్ర పరమపవిత్రా" (2-49) అని ఉంది. ఈ సంబుద్దే శాలిహోత్రంలో కలసిన ఒక పద్యంలో ఉంది. అది ముద్రితప్రతిలో కనబడుతుంది (1-40). ఈ సాక్ష్యాలవల్ల శాసనంలోని కంపరాయలు, కృతిని అంకితం పుచ్చుకొన్న కంపరాయలు వేరువేరు వ్యక్తులని స్పష్టమవుతున్నది. కాబట్టి మనుమంచిభట్టు కాల నిర్ణయసమస్య మళ్లా మొదటికి వచ్చింది. సాళువ అనే ఇంటిపే రుంది కనుక సాళువమంగు (క్రీ. శ. 1352) వంశంలోనివాడు. ఈ మంగ రాజకు వీర బొబళరాజు అనే అన్నగారు ఉన్నాడు. హయ లక్షణ విలాసం కృతిపతి బహుశా ఈ బొబళరాజు కుమారుడో, ఆ సంతతివాడో కావచ్చు. ఈ సాళువకంపరాయలు కృష్ణదేవరాయల సేనాని అని అశ్వలక్షణసారంలో ఉన్న ఈక్రిందిపద్యంవల్ల చెప్పవచ్చు.

శ్రీకరకటాక్షవిజయ-శ్రీకాంతాకృష్ణరాయసిదకృపాణా,
స్వీకృతపత్వరపర-భీకరభటయూథకంపపృథ్వీనాథా. [అశ్వ. 3-1]

కృష్ణదేవరాయల సైన్యాధిపతులలో తామెరిగినంత వరకు ఓబలకంపరాయల పేరు కనిపించలేదని కొందరు పరిశోధకులు వ్రాశారు.[1] అయితే ఉదయగిరిదుర్గాన్ని జయించాక రాయలవారు ఒక 'కంపన్న'ను అక్కడ 'తాణ్యం' ఉంచారని ఒక ప్రాచీనగ్రంథం చెప్తున్నది.[2] ఈ కంపన్న ఓబళకంపరాయలు కావచ్చు. ఏమైనా ... గుర్రాలకోసం

---

1. విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్ర వాఙ్మయ చరిత్రము, మొదటిభాగం, వేటపమళ్ళ అచ్యుతరావుగారు, పుట 275.
2. రాయవాచకం, పుట 91, పంక్తి 21.

యుద్ధాలు జరిపిన కాలంలోనివాడే అని ఊహించడానికి ఆస్కారంఉంది. గుర్రాల అవసరాన్ని మనుమంచి భట్టు ఇలాగా చెప్పాడు:

దూరము బోవునప్పుడును దుర్దమశత్రున్పపాలసైన్యముల్
బోరున గెల్చుచున్నపుడు బొంకముతో మృగయావినోదని
ద్యారతి దేలునప్పుడు నరాధిపకోటికి వాజులట్లు దెం
పారజయాదికారణము లారసి చూడగ నల్గనేర్చునే? [1-69]

ఇవాళ దూరం వెళ్ళేటప్పుడు కారులు, సైకిళ్లు, యుద్ధాలలో టాంకులు, వేటలో జీపులు వాడుతున్నాము. గుర్రాలను రాజభవనంలో అలంకార ప్రాయమైన అంగ రక్షకులు మాత్రమే ఉపయోగిస్తున్నాను; అశ్వికదళాల అవసరం చాలా తగ్గిపోయింది. అయినా మంచి గుర్రాలను పెంచడం, వాటిని పరుగెత్తించడం ఒక ఖరీదైన వినోదంగా ఉంది. ఈ క్రీడ జూదంగా మారి కొన్నిచోట్ల వ్యసనంగా కూడా పరిణమించింది. గుర్రప్పందాలు ఆడే ప్రతిఒక్కళ్లూ అశ్వలక్షణాలను, గుర్రాల మంచి లక్షణాలను రేసుకు ముందే కాలలో పరిశీలిస్తూనే ఉంటారు. ఈనాడు తెలుగువాళ్లలో చాలామంది శ్రీమంతులకు పందెపుగుర్రాలు ఉన్నాయి. కాని వాటికి తర్ఫీదుఇచ్చేవాళ్లకు తెలుగు హయలక్షణ గ్రంథాలు ఉపయోగపడుతున్నాయని చెప్పలేం.

మన భాషలో కూడా ఇటువంటి గ్రంథం ఒకటి ఉందని మనుమంచిభట్టు కృతి సజీవంగా ఉండి రుజువు చేస్తూంది.

5

మాదయ్యగారి మల్లన

పైలూ పూసలూ ఐదువతనానికి చిహ్నాలని ఆంధ్రమహిళలు భావిస్తారు. మంగళసూత్ర ధారణతోపాటే నల్లపూసలుకూడా పెళ్ళినాడు వాళ్లు ధరిస్తారు. ఈ ఆచారం ఆదిమకాలంలో లేదు. కాకతీయయుగంలోని కవులు పెళ్ళిని వర్ణిస్తూ తలంబ్రాలు పోసుకోడాన్నే వర్ణించారు. శ్రీనాథుడు, పోతరాజుగారు మంగళసూత్రాన్ని పేరొక్కన్నారు. తెలుగు ఇల్లాలి మెడలో నల్లపూసలను తొలిసారి కట్టించిన కవీశ్వరుడు మాదయగారి మల్లన. అతడు రచించిన రాజశేఖర చరిత్రలో సూర్యోదయాన్ని ఇలా వర్ణించాడు :

సవిధక్షీణపరాగాగ్నిసాక్షిగాగ-దమ్మివిందు కరగ్రహణ మొనర్పఁ
బాలుఁ బద్మినికిని నల్లపూసదండ-గట్టినా డవ నెలదేటిగములు పొదలె.

[రాజ. 2-69]

కథానాయకుని వివాహాన్ని వర్ణిస్తున్నప్పుడు ఐరేని కుండలను, దంపతి తాంబూలాలనుకూడా మాదయగారి

మల్లన పేర్కొన్నాడు. ఐరేని కుండల విషయం చెప్తూ చమత్కరించాడు.

కన్నెచనుదోయిచుట్టముల్ గానబ్రీతి_వాని కళ్యాణవేళకై వచ్చినట్టి
తమ్మిపూమొగ్గలో యన దార్చిరచట_బూజకుండలు తారకారాజముఖులు.
సింధుభూపాలు సతీకృతి చెలగి పద్మ_జాండమివ్వల నీరీతినావరించు
జూడు డనుమాడ్కి దెల్లని సున్న మలది_మానవతు లందునిలిపి రైరేనికడవ.
[రాజశేఖరచరితము, 3_176,177]

వధూవరులను పసిడిమంచంపై కూర్చోపెట్టి మాదయ గారి మల్లన దంపతీ తాంబూలాలు ఇప్పించాడు.

మగువయునాధుడుం బసిడిమంచముపై వసియించి రొండొరుల్
మొగములు వంచి యోసరిలి మించిన సిగ్గుల గన్నుగోనలన్
నగవు దొలంక విప్రమిథునంబుల కిచ్చిరి దివ్యవాసనల్
బుగులుకొనంగ జేసిన యపూర్వమనోహరపీటికాకళల్.
[రాజశే. 3_180]

లగ్నం పెట్టింది లగాయతు, గృహప్రవేశందాకా జరిగిన పెళ్లితంతును మాదయగారి మల్లన 75 గద్యపద్యాలలో వర్ణించాడు (3-154 నుండి 3-228 దాకా). అసలు రాజశేఖరచరిత్ర అంతా కలిసి 516 గద్యపద్యాలకావ్యమే. అంటే పెళ్లివర్ణన మొత్తం కావ్యంలో అరవవంతుకు ఎక్కువగా, ఏడవవంతుకు కొంచెంతక్కువగా ఉందన్నమాట. ఈ కావ్యం ఇంత చిన్నదైనా మన సాహిత్యంలో దీని కొక ప్రత్యేకమైన స్థానం, దీని రచయిత కొక శాశ్వతమైన కీర్తి ఉన్నాయి. అనంతరకవుల కావ్యాలలోని కథాప్రణాళికలకు ఈ రాజశేఖరచరిత్ర ప్రస్ఫుటమైన నమూనా. "అనగనగా ఒక కథానాయకుడు. అత డొక అమ్మాయిని చూశాడు.

మోహించాడు. ఆమెకూడా అతనిపై మరులుగొంది. ఇద్దరూ విడివిడిగా విరహంలో పడ్డారు. చందమామనూ, చల్లగాలినీ, మన్మథుణ్ణీ అమాంగాపతు శాల్తీలన్నిటినీ ఇద్దరూ తిట్టి పోశారు. ఈ విరహం ఉద్ధతమైన తరువాత పెద్దలు పెళ్లి చేస్తారు. నూతనదంపతులు సుఖంగా ఉంటారు.'' ఇలాంటి పిసరంత కథను తీసుకొని కొసరికొసరి వర్ణనలు చేసుకొంటూ కావ్యాలుగ్రాయడం అనంతరకవులలో పరిపాటి. దానికి రాజశేఖరచరిత్ర వినాయకపూజ చేసింది.

మూదయగారి మల్లనకు శాశ్వతమైన కీర్తి రావడానికి ఈ కావ్య మొక్కటే కారణం కాదు. అతడు అష్టదిగ్గజాలలో ఒకడు. రాయలవారు దండయాత్రలు చేస్తున్నా తీర్థయాత్రలు చేస్తున్నా వెంటవెళ్ళే కవులలో మల్లన ఒకడు. రాయలవారు మూడు ఇళ్ల తురకలతో చేసిన యుద్ధంలో మొదటి జగడాన విజయం లభించినప్పుడు ముక్కుతిమ్మనగారు ఒక పద్యం చెప్పారు. అప్పుడు అల్లసాని పెద్దనగారు, మూదయగారి మల్లనకూడా అక్కడ ఉన్నారు.[1] రాయలవారి యిష్ట కథా వినోదమైన సగరిసియోగులు, కవీశ్వరులు, విద్వాంసులు మొదలైనవారి నింపుసభలో మల్లయ్య తప్పకుండా ఉండేవారు.[2] రాయలవారి కొలువు కూటంలో ఈ కవి ఆదినుంచీ ఉంటున్నా, ఆ చక్రవర్తికి ఏదీ అంకితం ఇచ్చినట్లు లేదు. రాజశేఖరచరిత్రలో రాయల ప్రస్తికికూడా లేదు. ఈ గ్రంథాన్ని నాదెండ్ల అప్పమంత్రి

---

1. రాయవాచకం, పుటలు 115, 116.
2. అందులోనే, పుట 89, పంక్తి 20.

అంకితం పుచ్చుకొన్నాడు. ఇతడు అప్పాజీ తిమ్మరుసయ్యకు సయానా మేనల్లుడు, సాక్షాత్తు అల్లుడు. క్రీ. శ. 1516-1520 మధ్య ఇతడు వినుకొండ, గుత్తిసీమలకు పరిపాలకుడుగా ఉండేవాడు.

అప్పమంత్రి చేసిన దానాలు అనేకం. అందులో 17 దానాలకు శాసనాధారా లున్నాయి. ఇతడు మంగళ గిరి పానకాలస్వామికి ప్రాసాదం కట్టించాడు. తొమ్మిది బంగారు కలశాల మండపం నిర్మించాడు. తన పేరుమీదుగా అప్పాపురం అనే గ్రామాలు వినుకొండలో ఒకటి, నాదెండ్లలో ఒకటి, రేటూరులో ఒకటి అగ్రహారాలుగా దానం చేశాడు. సర్వదుంబాలాగా గ్రామాలు దానం చేయాలంటే ఇచ్చేవాడు కనీసం సామంతప్రభువంత హోదా కలవాడై ఉండాలి. అప్పాజీ ధర్మమా అని, అతని అల్లుడు అంత దర్జాగా బ్రతికినవాడే.

అయితే నాదెళ్ళవారికి తిమ్మరుసయ్య మూలంగా రాజప్రాపకం లభించలేదు. ఒకరకంగా చూస్తే తిమ్మరుసయ్య నాదెళ్ళవారి వల్లనే రాచకొలువులో చేరిఉంటాడు. అప్పమంత్రి ముత్తాత పేరు మల్లయ్య. ఈయనకు గంగన, చిట్టిగంగన్న అనే ఇద్దరు తమ్ములున్నారు. వీళ్ళలో చిట్టి గంగన్న చాలా గొప్పవాడు. సాళువ నరసింహరాయల వద్ద మంత్రిగా ఉండేవాడు. ఈ నరసింహరాయలే తాళ్ళపాక అన్నమయ్యను బాల్యంలో సేవించినవాడు. పిల్లలమర్రి పిన వీరయ్యను పోషించి జైమినిభారతం కృతిపుచ్చుకొన్నవాడు. ఈ సాళువ నరసింహరాయలవద్ద చిట్టి గంగన్న చాలా

పెద్దపదవిలో ఉండేవాడు. ఇతని గురించి మాదయగారి మల్లన్న ఇలా చెప్పాడు:

సాళువనారసింహమనుజప్రభుకార్యకళాధురంధరుం
డై లవణాబ్ధివేష్టితధరాధిపదుర్మతమంత్రమంత్రిశుం
డాలవితానకేసరియనంగ ననంగసమానరూపరే
ఖాలలితాంగు డట్టి చిటిగంగన యొప్పు గుణానుషంగుడై. [రాజ. 1-19]

చిటిగంగన అండానికి మన్మథుడే కాక అద్భుతమైన మాటకారి. ఇతర రాజుల సభలలో సహితం అనర్గళంగా మాట్లాడి అందర్నీ ఆకట్టుకొనే చాతుర్యం కలవాడు.

అంగాధీశకళింగరాజమగధాధ్యక్షాదిభూభృత్సభా
రంగాభంగవిహారముల్ ఘనశిలాగ్రావస్థలీసంసర
ద్గంగోత్తుంగతరంగనిర్గళితనిధ్వానోద్భటప్రక్రియా
సాంగత్యంబులు చిట్టిగంగవిభువాచాసంభ్రమారంభముల్.[రాజ. 1-20]

ఇటువంటి మంత్రి దగ్గిర శుశ్రూష చేసి సాళువతిమ్మరుసయ్య మహామంత్రి అయ్యాడు.[1] చిటిగంగనే రాయల కొలువులో తన శిష్యుణ్ణి ప్రవేశపెట్టా డని భావించవచ్చు. ఉద్యోగమిప్పించడమే కాక తిమ్మరుసయ్యకు తన కుటుంబంలోని పిల్లనే ఇచ్చి చిటిగంగన పెళ్ళిచేయించాడు. తన పెద్దయ్యగారి మనుమరాలు లక్ష్మమ్మతో తిమ్మరుసయ్య పెళ్ళి జరిపించాడు. అంతే కాదు. తిమ్మరుసయ్య చెల్లెలు కృష్ణమాంబను తిమ్మయ్యకు ఇప్పించాడు. బావమరుదులు ఒకరి చెల్లెలిని ఇంకొకరు వివాహంచేసుకోడం కుండమార్పు పెళ్ళి అంటారు. చిటిగంగన ఇటువంటి పెళ్ళి చేయించి

---

1. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, పుట 821.

నాదెళ్ళవారికీ, సాళువవారికీ గల సంబంధ బాంధవ్యాలకు రెండుపక్కలనుంచీ పీటములల్లు వేశాడు.

తిమ్మరుసయ్య చెల్లెలు కృష్ణమాంబకు ముగ్గురు కుమారులు. పెద్దవాని పేరు తోనయ్య. ఇతడు కేవలం అగస్త్యభ్రాత. ఇతని గురించి మనకు ఏమీ తెలియదు. మిగతా ఇద్దరూ రామలక్ష్మణులంత ప్రసిద్ధులు. వీళ్ళలో పెద్దవాడు అప్పనమంత్రి. రెండవవాడు గోపమంత్రి. మేన మామపలుకుబడివల్లనే కాక స్వయంప్రతిభవల్లకూడా వీళ్లు ఉన్నతోద్యోగాలలో రాణించారు. రాయలవారి రాజ్యారంభకాలంలో నాదెళ్ల గోపమంత్రి గుత్తిదుర్గానికిపాలకుడుగా ఉండేవాడు. అప్పమంత్రి ఏ హోదాలో ఉండేవాడో తెలియదుగాని, ఒకపక్క మంత్రులు, ఇంకోపక్క శూరులు, మరొపక్క విద్వద్బ్రహ్మలు, సత్కవివర్యులు, గాయకులు మొదలైన వాళ్లతో నిండిన పేరోలగంలో ఉండి, 'కవిత్వారూఢ విశేషగోష్ఠి' ఆలించేటంత ఘనమైన అధికారంలో మాత్రం ఉండేవాడు.[1] ఇతడు మాదయగారి మల్లనను పిలిపించి ఇలా అన్నాడు:

నీ విపుడు చెప్పదలచిన-భావరసోద్యన్మహాప్రబంధము నాపై
గావింపు మంకితింబుగ-గోవిదహృదయప్రమోదగుంభితఫణితిన్.
[రాజ. 1-14]

మాదయగారి మల్లన నిజంగానే కోవిదహృదయాలు ప్రమోదగుంభితమయ్యే ఫణితిలోనే, భావరసాలలో ఉద్యన్మహాప్రబంధం చెప్పాడు. ఈ రాజశేఖరచరిత్ర నిజంగా

1. రాజశేఖర చరిత్ర, 1-12.

అతని స్వకపోలకల్పితమే నని భావించాలి. దానికి మూలం ఏపురాణంలోనూ ఉన్నట్టు కన్పించదు.[1] మల్లన చెప్పలేదు. కథ ఎక్కడిదో చెప్పకపోవడం అలా ఉంచితన గురించి కూడా ఆట్టే వివరాలు చెప్పుకోలేదు. తను అయ్యంకిపురం అనే అగ్రహారానికి వైభవాకరమైన సత్కవి నని చెప్పుకున్నాడు. ఈగ్రామం కృష్ణాజిల్లాలోఉంది. అయినా మల్లన కడపజిల్లాలో పెరిగినట్లు ఉంది. కడపతాలూకాలో ఉన్న పుష్పగిరిలో అఘోరశివాచార్యు లనే గురువు ఉండేవాడు.[2] మల్లన ఆయన శిష్యరికం చేసి ఇంతవా ణ్ణయానని చెప్పుకొన్నాడు. ఈ అఘోరశివా చార్యులకు ఇంకా ప్రసిద్ధులైన శిష్యులున్నారు. నండిఘంటకవులు, ముక్కతిమ్మన ఈయన శిష్యులే. నలుగురు ప్రథమశ్రేణికవులకు గురువైన అఘోర శివాచార్యులు గొప్పవాడై ఉండాలి. అతడు దీక్షాగురువు కాక విద్యాగురువే అయిఉంటాడని పరిశోధకులు భావిస్తున్నారు.

ఈగురువుపద్ద తా నేమేము నేర్చుకొన్నదీ మల్లన వివరించి చెప్పలేదుగాని రాజశేఖరచరిత్రలో ఒక గురువును ఇలా వర్ణించాడు:

---

1. బండారు తమ్మయ్యగారు, వేంకుమళ్ల అచ్యుతరావుగారు రాజశేఖర చరిత్రపై వ్యాసాలు వ్రాశారు. ఇద్దరూ, దీనికి మూలక ఏదో తెలియదని, ఎన్నో గ్రంథాలు వెతికాక, చెప్పారు. చూ. విజయనగర సామ్రాజ్యముందలి ఆంధ్రవాఙ్మయ చరిత్ర, 2-వ భాగం, పుట 305.

2. ఇతని శాసనాలు ఒకటి క్రీ. శ. 1501 లోనూ (A. R. 307 of 1905), ఇంకొకటి క్రీ. శ. 1541 లోనూ (A. R. 303 of 1905) ఉన్నాయి.

సరసాహారము లింటబెట్టి బహుశిష్యశ్రేణికిం దెల్పు శా
స్త్రరహస్యస్థితి చెప్పు నధ్యయనసంధ్యల్ హవ్యకవ్యంబులన్
సురకోటిం బితృకోటి నేమరక ప్రోచున్ విప్రవర్గంబులో
సరిలే రెచ్చట నమ్మహాత్మకుననున్ సౌజన్యభవ్యోన్నతిన్. [రాజ. 3-11]

బహుశా అఘోరశివాచార్యులు శిష్యులను ఇంట పెట్టుకొని సరసాహారం పెట్టి శాస్త్రరహస్యాలు నేర్పిఉంటాడు. తన వైదుష్యాన్ని మల్లన చెప్పుకోలేకపోయినా తాను సృష్టించిన ఒక చిలుకను ఉద్దండపండితుని చేశాడు. అది 'వచోహేవాక కాకోదరస్వామి'. అది వ్యాసులవారితోనైనా వాదించగలదట.

వాదింతున్ బహువేదశాస్త్రకలనావైయాత్యసంసిద్ధి న
వ్వేదవ్యాసులతోడ నైన మది సంవీక్షించి యెచ్చోట నే
గాదన్నన్ మరి నిర్వహింపగ నశక్యంబేరి కస్మద్వచ
శ్శ్రీదాంపత్యము నాక నాక యనుకోసిగ్గయ్యెడున్ భూవరా. [రాజ.3-22]

తన గుణాలనే తను సృష్టించిన చిలుకకుకూడా ఆపాదింపజేశాడు మల్లన. తనసంగతి తాను చెప్పుకోడానికి అతడూ సిగ్గుపడతాడు. స్వంత బాకా ఊదుకొనేవాళ్ళంటే అతనికి గిట్టదు. గ్రంథారంభంలో కుకవులను ఇలా నిరాకరించాడు.

గాఢార్థప్రతిపాదనక్రమకళాకౌశల్యము ల్లేక వా
చాఢక్కార్భటితోడ దామెతముమర్ఝాయుంచు నైవారముల్
ప్రౌఢిం జేయుచు ప్రాజ్ఞులన్నగుచు గర్వగ్రంథులై యుండు న
మ్మూఢస్వాంతుల మెచ్చకుండుటయ సమ్మోదంబు మాబోంట్లకున్.
[రాజ. 1-9]

రాజశేఖర చరిత్రలో గాఢార్థప్రతిపాదన చేసే కళా

కౌశల్యం లేకపోతే లేకపోవచ్చుగాని వాచాఫకార్భటి ఎంతమాత్రం లేదు. సరససంస్కృతపుష్ప గుచ్ఛంనుంచి ప్రభూతమైన తెనుగునెత్తావి అఖిలదిశలలోను గుబాళించ డానికి తరుణపవమానమయ్యే కవిత్రయంవారి విశేషచతుర వాచానియూషిని మల్లన మెచ్చుకొంటాడు. అనుసరిస్తాడు (రాజ.1-7). రాజశేఖర చరిత్ర నెత్తావిలాగా ఉల్లాసకరమే.

అవంచిక అని ఒక నగరం ఉంది. దానిని హేమ ధన్వానృపతి పాలిస్తూ ఉండేవాడు. ఆ ఊళ్లో సంపదలకేం లోటు లేదు. దేశం సస్యశ్యామలంగా ఉండేది. పుష్కలంగా ఉన్న ధాన్యరాసులను కవి ఇలా వర్ణించాడు:

కాకరపండువంటి జిగి కల్గిన మేలిపసిండి ధాత్రికిన్
ప్రేకము ద్రవ్వి పోసినను పేయియుగంబులు చెల్లు ధాన్యముల్
పోకకు బుట్టె డమ్మినను బోనొక కల్పము బట్టు జూడ్కిపై
రేకటిదీర వైశ్యపతు లిండ్లు గనుంగొననొప్పు నప్పురిక్. [రాజ. 1_50]

ఆ ఊరి ఐన్నత్యాన్ని చెప్పాలంటే మాటలు చాలవు కాబోలు. కవి దానిని ఆకాశాని కెత్తేస్తున్నాడు. చూడండి.

అన్నగరి చిరుతఏనుగు_గున్నలపై నెక్కి నిక్కి కోయగవచ్చున్
మిన్నేటి పసిడితామర_లన్నన్ మరి ఏమి చెప్ప నందలికరులన్?
[రాజ. 1_51]

ఏనుగు పాడిగా దేశం వర్ధిల్లి ప్రజల కే కొరతా లేకపోయినా రాజుగారికి ఒక చింత ఉంది. ఆయనకు సంతానం లేదు. పిల్లలకోసం అల్లాడినాక ఆయన కొక మెరుపులాటి ఆలోచన తట్టింది.

నీలకంఠుని శిరసుపై నీళ్లు చల్లి_పత్తిరి సుమంతి యెవ్వడు పారవైచు
గామధేనువు వానింట గాడిపసర_మల్లసురళాళి వానింట మల్లెచెట్లు.
[రాజ. 1_65]

నిర్లక్ష్యంగా నీళ్లు చల్లి పత్రి పారవేస్తేనే గోరికలు తీర్చే పాడిఆవును, పూలచెట్టును స్వంతంచేసుకోవచ్చు. భక్తిగా ఆరాధిస్తే ఇక చెప్పేదేముంది అని ఆ రాజు శివుణ్ణి పూజించడం ప్రారంభించాడు. తాను శివభక్తుడవడమే కాకుండా తన ప్రజలందరినీ శైవుల్ని అవమన్నాడు. పరమ శివుని పాటించనివాడు తనకు పగవాడని రాజు చాటించాడు.

ఎచ్చట జూచినం బ్రమథహిండితచండనికాతవర్తనం
బెచ్చట జూచినన్ గుహగణేశ్వరభవ్యగుణానువాదనం
బెచ్చట జూచినన్ శివసమాహిత పుణ్యకథానుకీర్తనం
బచ్చుపడంగ జేసె నత డాదిమశైవకులాగ్రగణ్యుడై. [రాజ. 1_70]

ఇంత ఉద్ధ్రోలంగా ఆరాధించాక ఆ రాజు కల ఫలించింది. రాణి కడుపు పండింది. పుట్టిన పాపకు రాజశేఖరుడనే పేరు పెట్టారు. అతడు పెరిగి పెద్దవాడయ్యాడు. ఒకనాడు రాజు పేరోలగంలో ఉండగా కొలువుకూటంలోనికి ఒక ముని మండిపడుతూ వచ్చాడు. 'ఏం జరిగింది మహాత్మా' అని రాజు అడిగితే 'ఏం చెప్పను? నాకుమార్తె నోక రాక్షసుడు ఎత్తుకుపోయాడు' అని జటిలకౌశికుడనే ఆ ముని వాపోయాడు. ఇంతకూ ఆ అమ్మాయి పసిపాప. రాక్షసుని కూతురికి ఊడిగంచెయ్యడాని కా అసురుడు నరపాపలను తీసుకుపోయాడట.

పరమమాయావి అయిన ఆ రాక్షసుణ్ణి సంహరించడానికి తనతో రాజశేఖరుని పంపించమని అడిగాడు. రాజు

పంపించాడు. మొదట రాక్షసుడు గర్వించాడు. "బెబ్బులి మీద చీంబోతు లంఘిస్తుందా?" అనుకొన్నాడు. అయితే రాజశేఖరుని చేతిదెబ్బ చూసి కాలికి బుద్ధిచెప్పి కాళికా దేవాలయంలోకి పోయి అమ్మవారి కాళ్లు పట్టుకొన్నాడు. రాజశేఖరుడు వెంబడించాడు. రాక్షసుణ్ణి కాళికకు బలి ఇస్తానని కత్తి దూశాడు. అప్పుడు అమ్మవారు శాంతస్వరూపంతో ప్రత్యక్షమైంది.

కొప్పుపై నొప్పెడు కొదమచంద్రునితోడ గస్తూరికాతిలకంబుతోడ
సీమంతవిరచితసిందూరరుచితోడ గ్రొత్తముత్తియపుజేర్పుకక్కతోడ
దళతళమను దంతతాటంకములతోడ రమణీయనాగహారములతోడ
గల్లుగల్లను రత్నకంకణమ్ములతోడ జిలుగైన చెంగావివలువతోడ
ముద్దుమోమున లేనవ్వు మొలకతోడ
జల్లుచూపుల కరుణారసంబుతోడ
శాంతరూపంబు గైకొన్న శంభురాణి
యమ్మహాకాళి ప్రత్యక్ష మయ్యె నపుడు. [రాజ. 2_88]

ఆమె సాక్షాత్కరించగానే రాజశేఖరుడు ఒక దండకంతో ఆమెను నుతించాడు. మల్లన ఈ దండకం శ్రీకారంతో మొదలవలేదు; 'నమస్తే నమః'తో అంతం కాలేదు. శ్రీనాథునిలాగే మూడయగారి మల్లన రెండు నగణాలపై రగణాలు నిలుపుతూ దండకం ప్రారంభించాడు. అమ్మవారు కనబడి రాజశేఖరుని దీవించి 'నాకు బదులుగా ఈ రాక్షసుణ్ణి మన్నించ'మంది. అసమానమైన ఒక మణిని బహూకరించి అంతర్ధానమైంది. తరువాత ఒక యోగిని వచ్చి రాజశేఖరునికి ఒక చిలుక నిచ్చింది.

తూచా తప్పక యుండ నాగమకథాస్తోమంబులం జెప్పు వా
చాచాతుర్యము గానరాగతభవిష్యద్వర్తమానార్థముల్
సూచించున్ మది మెచ్చ నీకుబుసుపుచ్చున్ నెచ్చెలిం బోలి యా
రాచిల్కం గయికొమ్ము పార్థివకుమారా యంచు వర్ణించుచున్.

[రాజ. 2_102]

మునికుమారైను రక్షించి తల్లిదండ్రులకు అప్పగించాడు. చిలుకను, మణిని తీసుకొని 'అనేకదూరం' వెళ్లాడు. ఒకచోట ఆకలి అయింది. మణిని తలచుకొన్నాడు. తక్కున నవకాయ పిండివంటలూ ఉద్భవించాయి.

కలమాన్నంబు ఘృతంబు శాయసము శాకవ్రాతముల్ పిండి వం
టలు పాల్దీనియ జున్ను వెన్న యిడియూనా లుక్కరల్ చక్కరల్
ఫలముల్ పానకముల్ రసాయనము లంబ ళ్లూరుబిం డ్లూరుగా
యలు బజ్జల్ దధిపిండఖండములు నం దావిర్భవించెం దగన్.

[రాజ. 2_127]

నంటకాలే కాకుండా వడ్డించేవాళ్లు కూడా మణిలోంచి వచ్చారు.

సంచితబాహుమూలరుచిసంసద పొంపిరివో గలంకులన్
గుంచె యొకర్తు వైక నొకకోమలపల్లవపాణి లీల వ
డ్డించె నృపాలమౌళికి గటీతటహాటక మేఖలాసము
ధ్వంచితకింకిణీరవము నందియమ్రోతలు సందడింపగన్. [రాజ. 2_130]

ఒక గురువుశిష్యులే కనుక మాదయగారిమల్లన ఈ ఘట్టంలో నందిఘంటకవులను జ్ఞప్తికి తెస్తున్నాడు. వాళ్లు తమ వరాహపురాణంలోని దుర్గమోపాఖ్యానంలో చేయించిన విందులు ఇక్కడ వడ్డింపించాడు. అయితే రాజశేఖర

చరిత్రలోని మణి సామాన్యమైనది కాదు. దీని గొప్ప తనాన్ని చిలుక ఇలా చెప్పింది :

అనఘచరిత్ర యామణి యనర్ఘ్య మొకానొక నాడు పార్వతీ
వనరుహపత్ర నేత్ర నెరవాదితనంబున జూదమాడి గె
ల్చిన మది గాతుకం బొదవ శీతమయూఖ కళావతంసు డ
వ్వనితకు నిచ్చె నీకు నతివత్సలతన్ గృపజేసి గాళియున్. [రాజ. 2_139]

భోజనా లయాక చిలుకలో రాజకుమారుడు సాగాడు. ఒకచోట ఒక అందకత్తె చెలికత్తెలతో విహరిస్తూంది. వాళ్లు పుష్పోపచయం చేశారు. జలకేళి కాపించారు. కథానాయకుడు ఆమెను చూశాడు. ఆమె అతణ్ణి చూసింది. తొలిప్రేమ కలిగింది. ఈ అతిలోకసుందరి ఎవరని రాజశేఖరుడు చిలుకను అడిగాడు. ఆమె పూర్వజన్మ కథను చిలుక చెప్పింది. శాపంవల్ల ఆమె ఈ దేశపు రాజకుమార్తెగా పుట్టింది. పూర్వం ఈ అమరపురంలో ఇద్దరు బ్రాహ్మలు ఉండేవారు. ఒకడు ధనికుడు. ఇంకొకడు వేదవాడు. దరిద్రం ఎంతైనా చేయిస్తుంది.

కులనిర్మూలనకారణంబు ప్రతిభాకుట్టాక ముద్యోగకో
పలతాదోహద మూజవంజవసుఖప్రత్యూహ మాత్మ్యశ్యథా
జ్వలనజ్వాలిక కామినీనయనపీఠాపాతసంరోధిని
త్యలఘుత్వాశ్రయభూమి లేమి యది యూహా మేలుగావింపదే!
పలుచగా చూచు నెంతయు బంధుసమితి_పిలువబిలువంగ బలుకరు బిడ్డలైన
బచ్చకక్కడుమాట గారాబుసతియు_లెక్క సేయదు లేమితూలించె నేని.
[రాజ. 3_14,15]

ఈ దరిద్రాన్ని దాటడానికి విష్ణుమూర్తిని తపస్సుతో మెప్పించడం తప్ప మార్గం లేదని వేదబ్రాహ్మణుడు

కావేరీతీరాన ఉగ్రతపస్సు చేస్తున్నాడు. అప్సు డొక్కడకు కొంతమంది గంధర్వకన్యలు వచ్చారు. అందులో ఇద్దరు ఒకి పూల గుత్తికోసం తగువులాడుకొన్నారు. 'నువ్వెంత?' అంటే 'నువ్వెంత?' అనుకొన్నారు. దగ్గరలో తపస్సు చేసుకొంటున్న మునిని ఎవరు మరులుగొల్పుతారో వాళ్లు గొప్పవాళ్లని తేల్చుకొన్నారు. గంధర్వరాకుమార్తె వయ్యారం ఒలకబోసింది. ముక్కుమూసుకొన్న బ్రాహ్మణుడు కళ్లు తెరిచాడు. మానవకాంతగా జన్మించమని శపించాడు. ఆ గంధర్వకన్యే ఈ రాకుమార్తె అని చిలుక చెప్పింది.

ఈ నాయకీనాయకులు ప్రేమించుకొన్నాక విరహంలో పడి, పెళ్లాడి గట్టెక్కారు. కథ కంచికి పోయింది. ఈ కావ్యంలో మల్లన ఏమీ సాధించినట్లు కనబడదు. కథా వృత్తం సర్వసామాన్యం. కథాకథనంలో చమత్కారాలు లేవు. ముఖ్యపాత్రలు పుస్తకాలలోంచి ఉద్భవించినట్లు ఉంటాయి. సంభాషణలు చెప్పుకోతగినంత గొప్పగా ఉండవు. ప్రకృతివర్ణనలో సూక్ష్మపరిశీలన వ్యక్తమవదు. అయినా మాదయగారి మల్లన ఆంధ్రసాహిత్యంలో ఒక స్థానం ఏర్పరచుకోగలిగా డంటే దానికి కారణం అతని చిత్తశుద్ధి. శ్లేషలూ, యమకాలూ మొదలైన వాటి జోలికి పోకుండా నిరాడంబరమైన కావ్యాన్ని సూటిగా చెప్పుకొని పోయాడు. సమకాలికసమాజాన్ని కావ్యంలో ప్రతిఫలించ డలచుకుంటే మల్లన చక్కగా చేసిఉండేవాడు. ఈ బ్రాహ్మణుని గురించి వ్రాస్తున్నప్పుడు ఎంతో చక్కగా

పాత్రస్వభావాలను చిత్రించాడు. భర్త చదువుకోని వాడైతే, చేతకానివాడైతే భార్య 'దేవుడా ఇంత చేశావా' అని దరిద్రాన్ని భరించవచ్చు; పక్కింటి వాళ్ళకు విద్యలో ఏమాత్రం తీసిపోనివాడైతే లేమి అనుభవిస్తే ఆ యిల్లాలు ఎంత బాధ పడుతుంది? ఆమె భర్తతో ఇలా మొరపెట్టుకొంది:

పెనిమిటి యనతి రాస్యుడు-ననభిజ్ఞుడు నైన దైవమాయని మదిలో
వనరుచు లేమిన్ బడదగు-నినుజెండియు నాకు నింత నెవ్వగ యగునే?
మండ జరాగ్ని దనయులు-చండతమంగలమువంటి సంసారమునిం
కొండు గతి లేదు దినదిన-గండం బేరీతి గడపగాదగు ననఘా.

చదివినారలు పెక్కు-సంధ్యలగించిత్తు దప్పకయుండ వేదత్రయంబు
పఠియించినారలు ప్రతిభాసమున్నిద్రసౌష్ఠవంబున మూలశాస్త్రవితతి
శోధించినారలు శుద్ధమతిన్మీఱి నఖిలపురాణేతిహాససమితి
చూచినారలు బుధస్తోమంబు గొనియాడ గావ్యనాటకముఖగ్రంథసీమ
యేమి చెప్పెడిదాన మీరికడలేపు-సకలవిద్యలు భూసురసమితి కెల్ల
నజున కెనవత్తు రన్నింట నకట మీర-లముకుందునికన్న నేవెలితిచెపుడు?

[రాజ. 8-19, 20, 21]

ఈ ఇల్లాలు ఇలా బాధపడడానికి ఇంకోకారణం కూడా ఉంది. పక్కింటి ముకుందుడు మహారాజుగా జీవిస్తున్నందుకు బాధలేదు. అయితే అతని సోమిదేవమ్మలు చూస్తేనే ఈ వేదరాలికి బాధ. అందుకే భర్తతో పోరుగు దంపతుల గురించి ఇలా అంటుంది.

ఆతని నడవడి జూడం-గా తామర తంపరగుచు గాదెలగొలుచున్
జేతవిడిముడియుబహుగో-వ్రాతంబును గల్గి రాజువడువున నుండున్.

వూచిన తలగెడుగతి వి_ద్యాచతురుం డతని సోమిదమ్మపారువునన్
వాచాలరత్నకంకణ_నూచితవిభవమున మెరయుజూడంగలనే?
[రాజ. 3_21, 22]

భార్య ఇలా ఈసుతో చెప్పినప్పుడు ఆ పేదబ్రాహ్మణుడు ఇలా అంటాడు:

ఏరికి బుద్ధి బలంబుఁ_కారణములు గావు సుప్రకలరె ధరిత్రిక్
నేరిచి బ్రతికినవారలు_నేరక చెడ్డటినాయ నీరజనేత్రా. [రాజ. 3_23]

వాస్తవికత ఉట్టిపడే ఇటువంటి సజీవపాత్రలతో మాదయగారి మల్లన కావ్యమంతా వ్రాయలేదే అన్న బాధ కలుగుతుంది. రాయలవారి కొలువులో చేరకముందు ఇతడీ కావ్యం వ్రాశాడు. ఆస్థానకవి అయి అష్టదిగ్గజాలలో చేరాక ఇతడేమైనా కావ్యాలు వ్రాశాడో లేదో మనకు తెలియదు. రాయలవారిపై ఇతడు చెప్పిన చాటువులైనా కనీసం మనకు దక్కలేదు. అయితే మాదయగారి మల్లన మున్నూట అరవైకోజులూ కవిత్వం చెప్తూ కూర్చోలేదు. అతనికి కొన్ని నియమాలు ఉన్నాయి.

చెప్పదగు కవిత రసము_ల్చిచ్చిల నప్పప్ప బళిబళీ యన లేదా
యెప్పుడు చేయక యుండుట_యొప్పసుమీ సుకవియెంతయుచిత్తగింపకో.
[రాజ. 1_8]

మాదయగారి మల్లన నిజంగా ఔచిత్యం తెలిసినవాడు. ఎక్కడ ఆగాలో తెలుసుకోవడం కళాకారుని ముఖ్యలక్షణం.

6

కృష్ణదేవరాయలు

శ్రీమన్మహారాజాధిరాజ రాజపరమేశ్వర శ్రీవీర ప్రతాప శ్రీ వీరకృష్ణరాయ మహారాయలు ఆంధ్ర సాహిత్యం చేసుకొన్న అదృష్టర కొద్ది పుట్టినా రన్న విషయంలో అభిప్రాయభేదాలు ఉండవుగాని ఆయన ఏసుమహూర్తాన, ఎప్పుడు పుట్టాడన్న విషయమే పరిశోధకులు ఇదమిత్థమని తేల్చలేదు. శాలివాహన శక వర్షాలు 1409 పరాభవనామ సంవత్సర మాఘబహుళ అష్టమి శుక్రవారానికి సరైన క్రీ. శ. 1487 ఫిబవరి 16 వ తారీఖున రాయలు జన్మించాడని కొందరు భావిస్తున్నారు.[1] రాయలవారి జాతకాన్ని, జననకాలాన్ని ఆనాటి పేరు మోసిన దైవజ్ఞు లెందరో పరిశీలించి ఫలితాలు చెప్పడానికి ప్రయత్నించి ఉంటారుగాని, వీళ్ళలో ఏ ఒక్కరు వ్రాసి పెట్టిన జాతకమైనా మనకు దక్కలేదు. అయితే ఇంత

1. ఓరుగంటి రామచంద్రయ్యగారు, *Studies on Krishnaraya*, P. 43.

వివరంగా నక్షత్రంతోసహితం రాయల జననకాలాన్ని పరిశోధకులు ఎలా నిర్ణయించగలిగారంటే వివిధశాసనాలు శోధించి ఇక్కడోవిషయం, అక్కడోసంగతి చేర్చి చరిత్రను తారీఖులతో సహా ఊహించగలిగారు.

వాసప్పనాయకుడనే భృత్యుడొకడు ప్రతి మాసి నెలలోనూ జ్యేష్ఠానక్షత్రంనాడు, అది రాయలవారి జన్మనక్షత్రం కనుక, ఉత్సవం జరిపించమని కంచితాలూకాలో ఒకగ్రామాన్ని దానంచేశాడు.[1] ఇందువల్ల రాయలవారు 'మాసి' నెల జ్యేష్ఠానక్షత్రంనాడు జన్మించారని తెలుస్తున్నది. మాఘమాసాన్ని తమిళంలో మాసి అంటారు. క్రీ. శ. 1503 లో నరసానాయకుడు మరణించినప్పుడు అతని రెండవ భార్యకుమారుడు కృష్ణరాయలు పదహారేళ్ళ బాలుడనే ప్రతీతి ఉండడంచేత క్రీ. శ. 1503 నుంచి పదహారేళ్ళు వెనక్కు వెడితే రాయల జన్మసంవత్సరం క్రీ. శ. 1487 అవుతుంది. అది పరాభవసంవత్సరం. ఆవీడు మాఘమాసంలో జ్యేష్ఠానక్షత్రం వచ్చిన రోజు బహుశాష్టమి. శుక్రవారం.

అయితే ఈ తారీఖును పరిశోధకులందరూ ఆమోదించలేదు. క్రీ. శ. 1509 లో రాజ్యానికి వచ్చినప్పుడు కృష్ణరాయల వయస్సు ఇరవైకి పైబడ్డదని పరదేశ చరిత్రకారుడు వ్రాశాడు.[2] రాయలు మరణించేనాటికి వృద్ధుడని ఆ

1. A. R. 216 of 1916.
2. న్యూనిజ్—*Forgotten Empire*, Sewel. P. 315.

చరిత్రకారుడే తెలియజేశాడు. రాయలవారు 20 సంవత్సరాలు పాలించారు. రాజ్యానికి వచ్చినప్పు డాయనవయస్సు ఇరవై అయితే, మరణించినప్పుడు నలభై అవుతుంది. అది వృద్ధాప్యం అనిపించుకోదు. అందుచేత, తండ్రి మరణించే నాటికి రాయలవారు ఇరవై యేళ్లు పై బడ్డవా డనడంలో పర దేశచరిత్రకారుని ఉద్దేశ్యం ఆయన యుక్తవయస్కుడని చెప్పడమే కావచ్చు. అన్నగారి మూర్ధాభిషేకం నాటికి రాయలవాడు ముప్ఫయిసంవత్సరాల లోపువా డని భావించ వచ్చు. అందుకే కొందరు చరిత్రకారులు రాయలు శాలివాహన శకవర్షాలు 1396 లో (క్రీ. శ. 1474) జన్మించి ఉండవచ్చు నని అంచనా వేస్తున్నారు.[1] అంటే రాయల 29 వ ఏట తండ్రి నరసానాయకుడు మరణించాడు. 32 వ ఏట అన్నగారు పట్టం కట్టుకొన్నాడు. తన 35 వ ఏట విజయనగర వజ్రసింహాసనాన్ని అధిష్ఠించా రని చెప్పవచ్చు.

వాసప్పనాయకుని శాసనంవల్ల రాయలవారి జన్మనక్షత్రం జ్యేష్ఠ అనీ, వారు మాఘమాసంలో జన్మించారనీ తెలుస్తున్నది. కొందరు చరిత్రకారులు ప్రతిపాదించే క్రీ. శ. 1474 లో రాయలవారు పుట్టిఉంటే అది విజయనామ సంవత్సర మాఘబహుళ అష్టమి గురువారం అవుతుంది. అయితే ఈ తారీఖు ఉర్థి అంచనాయేగాని దీనికి వేరేఆధారం లేదు. అందుచేత క్రీ. శ. 1474 నుండి 1487 లోపున

---

1. కేలటూరి వెంకటరమణయ్యగారు. భారతి, 1949, సంపుటం 26, సంచిక 4, పుట 285.

ఏతారీకునాడైనా రాయలవారు జన్మించి ఉండడానికి ఆస్కారం ఉంది. ఆ పదమూడు సంవత్సరాలలో మాఘమాసంలో జ్యేష్ఠా నక్షత్రం ఏయే తారీకులలో వస్తుందో, తిథినక్షత్రాలు ఏయే సమయాల్లో అంతమవుతాయో చూద్దాం.[1]

10-2-1474	గురువారం	విజయ	మాఘబహుళఅష్టమి(13)	జ్యేష్ఠ 75
1-2-1475	బుధవారం	జయ	మాఘబహుళదశమి (55)	,, 09
1476 లో మాఘ మాసం లేదు.[2]				
7-2-1477	శుక్రవారం	దుర్ముఖి	మాఘబహుళనవమి (66)	జ్యేష్ఠ 62
28-2-1478	బుధవారం	హేవిలంబి	మాఘబహుళదశమి (71)	,, 52
14-2-1479	ఆదివారం	విలంబి	మాఘబహుళఅష్టమి(38)	,, 78
4-2-1480	శుక్రవారం	వికారి	మాఘబహుళనవమి (70)	,, 91
25-2-1481	గురువారం	శార్వరి	మాఘబహుళదశమి (17)	,, 22
11-2-1482	సోమవారం	ప్లవ	మాఘబహుళఅష్టమి(44)	అనూ. 03 జ్యేష్ఠ 96
2-2-1483	ఆదివారం	శుభకృతు	మాఘబహుళనవమి (00) దశమి(10.91)	,, 37
23-1-1484	శుక్రవారం	శోభకృతు	మాఘబహుళదశమి(46)	,, 70
9-2-1485	బుధవారం	క్రోధి	మాఘబహుళనవమి (38)	,, 20
30-1-1486	సోమవారం	విశ్వావసు	మాఘబహుళదశమి (52)	,, 18
16-2-1487	శుక్రవారం	పరాభవ	మాఘబహుళఅష్టమి(09)	,, 33

పైపట్టికలో ఏ ఒక్కటైనా కృష్ణరాయలవారి జన్మదినం కావచ్చు. అయితే వీటిలో జ్యేష్ఠానక్షత్రయుక్త అష్టమినాడే ఆయన ప్రభవించి ఉండవచ్చు, నని ఊహా

1. స్వామికణ్ణుపిళ్ళైగారి ఎఫిమిరిస్ నుండి సేకరించిన వివరాలు.

2. మన్మథనామసంవత్సరంలో ఆశ్వయుజమాసంలోనూ, ఫాల్గుణంలోనూ రెండు అధికమాసాలు వచ్చాయి. అందుచేత మాఘం లేదు.

ఒకటి పొడముతున్నది. కృష్ణరాయలు శ్రీ కృష్ణుని అవతారం అని ఆనాటి జనులు విశ్వసించారు. అందుచేత వారి జన్మతిథి అష్టమి అని భావించడంలో అసంగతం ఉండదు. ఇదే వాస్తవమైతే పై తారీఖులలో నాలుగుమాత్రమే రాయలవారి పుట్టిన రోజులు కావడానికి ఆస్కారం ఉంది. ఆ నాలుగూ విడిగా వేసిచూద్దాం.

10_2_1474	గురువారం	విజయ	మాఘ బహుళ అష్టమి	జ్యేష్ఠ
14_2_1479	ఆదివారం	విలంబి	,,	,,
11_2_1482	సోమవారం	ప్లవ	,,	,,
16_2_1487	శుక్రవారం	పరాభవ	,,	,,

పై తారీఖులలో మొట్టమొదటిదే కృష్ణరాయలవారి జన్మదినం అని మనం అంగీకరిస్తే ఆయన కీర్తిశేషులయే నాటికి 56 సంవత్సరాల వారై ఉంటారు. అరవయ్యో పడిలో పడ్డంవల్ల అది వృద్ధాప్యంగా భావించవచ్చు. పరదేశ చరిత్ర కారుల ఊహలు నిజమే అని అంగీకరించడానికి ఆస్కారం ఉంటుంది. అయితే పై తారీఖును ఆమోదించే ముందు మరొక్కవిషయం గమనించాలి. కృష్ణరాయలు శ్రీ కృష్ణుని అవతారం అని మన పూర్వులు నమ్మడానికి మరొక కారణంకూడా ఉండవచ్చు. ఆయన కృష్ణాష్టమినాడు పట్టం కట్టుకొన్నాడని మనవాళ్లు విశ్వసించారు. ఆయన ఒక వేళ శ్రీజయంతినాడు జన్మించాడా? పై సంవత్సరాలలో కృష్ణాష్టమి ఏతారీఖులలో వస్తుందో చూద్దాం.

శ్రీజయంతుల పట్టిక

జయ	శ్రావణ బహుళ అష్టమి	(84)	శుక్ర	5-8-1474	కృత్తిక (26)
మన్మథ	,,	(79)	గురు	25-7-1475	భరణి (50)
దుర్ముఖి	,,	(45)	సోమ	12-8-1476	కృత్తిక (16)
హేవిలంబి	,,	(47)	శని	2-8-1477	కృత్తిక (58)
విలంబి	అధిక ,,	(12)	గురు	23-7-1478	భరణి (01)
					కృత్తిక (97)
	నిజశ్రావణ బహుళ అష్టమి	(49)	శుక్ర	21-8-1478	రోహిణి (26)
వికారి	శ్రావణ బహుళ అష్టమి	(05)	బుధ	11-8-1479	రోహిణి (57)
	,, నవమి	(99)			
శార్వరి	శ్రావణ బహుళ అష్టమి	(32)	ఆది	30-8-1480	కృత్తిక (66)
ప్లవ	,,	(03)	శని	18-8-1481	నక్షత్రం లేదు.
					శుక్ర. రోహిణి (99)
					ఆది. మృగశిర (09)
శుభకృతు	,,	(03)	బుధ	7-8-1481	రోహిణి (89)
శోభకృతు	,,	(25)	ఆది	27-8-1483	కృత్తిక (85)
క్రోధి	,,	(14)	ఆది	14-8-1484	రోహిణి (39)
విశ్వావసు	,,	(76)	బుధ	3-8-1485	కృత్తిక (79)
పరాభవ	అధిక ,,	(46)	సోమ	24-7-1486	భరణి (28)
	నిజ ,,	(79)	మంగళ	22-8-1486	రోహిణి (43)
పింగళ	శ్రావణ బహుళ అష్టమి	(47)	ఆది	12-8-1487	రోహిణి (99)

ఈ శ్రీజయంతుల పట్టిక చూస్తే వీటిలో ఏఒక్కటీ కృష్ణరాయల జన్మదినం కాకపోవచ్చు అనిపిస్తుంది. ఏమంటే కృష్ణాష్టమినాడు జ్యేష్ఠానక్షత్రం రావడానికి ఆస్కారం లేదు. రాయలవారి కాలంలో ఉండి వారి జన్మనక్షత్రాన్ని చెప్పిన వాసప్పనాయకుని శాసనాన్ని మనం కొట్టిపారెయ్యడానికి వీలు లేదు. కృష్ణరాయలవారు శ్రీజయంతినాడు పుట్టారు; అందుకే శ్రీకృష్ణరాయ లనే పేరు పెట్టారని ఊహాగానం చేస్తే కమ్మగా ఉంటుందిగాని అది చారిత్రక ప్రమాణాలకు విరుద్ధం. కాబట్టి వారు మాఘమాసంలో జ్యేష్ఠానక్షత్రయుక్తఅష్టమినాడే జన్మించారని ఆతారీఖును ఆమోదించడమే మంచిది. రాయలవారు విజయనామ సంవత్సర మాఘబహుళ అష్టమి గురువారంనాటికి సరియైన క్రీ. శ. 1474 ఫిబవరి 10 తేదీనాడు జ్యేష్ఠానక్షత్రంలో జన్మించా రని ప్రస్తుతానికి నిర్ణయించి ఆయన చరిత్ర చెప్పుకొందాం.

కృష్ణదేవరాయలు తన తల్లికి తొలిచూలుబిడ్డ అయినా తండ్రికి రెండవ కుమారుడు. నరసానాయకునికి ముగ్గురు భార్యలు. పెద్దభార్యపేరు తిప్పాజీ. ఆమెకు వీర నరసింహరాయలు జన్మించాడు. రెండవ భార్యపేరు నాగాంబ. ఈమెకుమారుడే కృష్ణరాయలు. మూడవభార్య పేరు ఓబాంబ. ఈమెకు ఇద్దరు కుమారులు. ఒకడు అచ్యుతదేవరాయలు; రెండవవాడు రంగరాయలు. క్రీ. శ. 1485-90 ల మధ్య, అంటే కృష్ణరాయలకు పదకొండుదాటాక పదహారు వచ్చేమధ్య కాలంలో నరసానాయకుడు సాళువ

వారి కొలువులో మన్నన వడసి రాయలకు కుడిభుజంగా ఉండేవాడు.[1] సుకవిరాజులను ఉద్ధరిస్తూఉండేవాడు.[2] 'స్వీకృత కవితాప్రవాహ సితఫేన గుళుచ్ఛాకార మౌక్తిక స్వచ్ఛాకల్పు'డై నరసానాయకుడు ఉండేవాడు.[3] ఇటువంటి విద్వాగోష్ఠులలో తండ్రి ఉండేటప్పుడు సభలోనే ఉండి వినే అవకాశాలు కృష్ణరాయలకు ఎన్ని ఉన్నాయో లెక్క చెప్పలేంగాని అతని సవతిఅన్నగారు వీరనరసింహానాయకులు తండ్రికి కూర్మితనయుడై పేరోలగంలో ఉండేవాడు. కృష్ణ రాయలకు అప్పటికి పదహారుసంవత్సరాలుకూడా లేవు. కనుక సభలో కూర్చొనడానికి అవకాశం కలుగలేదు. అయితే మేడసోరణగండ్లలోంచి కొలువుకూటంలోనికి చూస్తూ బాల కృష్ణరాయలు ఆనాడు పేరుమోసిన కవుల కావ్యాలు వినేవాడు కాబోలు. నందిఘంటకవులను పిలిపించి తన తండ్రి కర్పూరతాంబూలం ఇచ్చి వరాహపురాణం కృతిచెప్పమని ఆదేశించటం విన్న బాల కృష్ణరాయలలో ఏ భావాలు కలిగాయో. ఎప్పటికైనా మనంకూడా ఇలాగ కృతులు అంకితం పుచ్చుకోవాలన్న కోరిక సుప్తచైతన్యంలో అవ్యక్తరాగాలను ఆలపించిఉంటుంది.

రాయలకు చిన్న తనంనుంచీ సంగీతసాహిత్యాలంటే ఇష్టం. బాల్యంలో వీణ నేర్చుకొన్నాడు. గురుదక్షిణగా కృష్ణయ్య అనే విద్వాంసునికి విలువైన ముత్యాలహారాలు,

1. వరాహపురాణం, 1-52.
2. ,, 2-190.
3. ,, 11-1.

వజ్రాలహారాలు ఇచ్చాడు. కావ్యనాటకాలంకారాల మర్మాలు అవగాహన చేసుకొన్నాడు.[1] నానాకళలలో వేత్త అయ్యాడు. అపరభోజుడనీ, ఆంధ్రభోజుడనీ పొగడ్తలు అందుకొనడానికి తగినంత లోతుగా పునాదులు తవ్వుకొన్నాడు. మేధావదసాధారణబోధాకరహృదయుడు[2] అని ముందుముందు ముక్కు-తిమ్మనగారిచే పిలిపించుకొందుకు తగినట్టు పెద్దపెద్ద పండితులకుసహితం సాధారణంగా బోధపడని జ్ఞానానికి ఆకరమయ్యేటట్టు తన హృదయాన్ని విశాలం చేసుకొన్నాడు.

చిన్నప్పటినుంచీ కృష్ణరాయలకు ముక్కు-తిమ్మన గారితో సహవాసం ఉండిఉండవచ్చు. తిమ్మనగారు నంది వారి చిరంజీవి. నందిఘంటకవులలో ఘంటసింగన మేనల్లుడు. జంటకవులు నరసానాయకుని దర్శనం చేసుకొనేటప్పుడు చినతిమ్మన బాలరాయలతో పరిచయం చేసుకొనడానికి ఆస్కారం లేకపోలేదు. పొడుగాటి ముక్కున్న తిమ్మన్న గారు చిన్నప్పుడే రాయలవారి వైదుష్యాన్ని పొడగట్టి వుండవచ్చు. తిమ్మనలాగే అల్లసాని చొక్కరాజుగారి అబ్బాయి పెద్దిరాజుకూడా చిన్నప్పుడే రాయలవారి విద్యా మిత్రుడు కావచ్చు. అల్లసానివారి నివాసగ్రామం సాళువ వారి ముఖ్యపట్టణమైన చంద్రగిరికి మరీ దూరంలో లేదు. అల్లసానివారు కడపజిల్లా కమలాపురంతాలూకాలోని

---

1. హంపికాసనం, క్రీ. శ. 1410. ఎపిగ్రాఫియా ఇండికా, 1 వ సంపుటి, పుట 361.

2. పారిజాతాపహరణం, 1-26.

కోకట్రగామంలో ఉండేవారు.[1] ఆనాడు చిత్తూరుజిల్లా చుట్టుపక్కల పరగణాలన్నిటికి చంద్రగిరి హృదయంలాగా ఉండేదని భావించవచ్చు. అక్కడినుంచే సాళువవారు రాయ సింహాసనానికి ప్రస్థానం చేశారు. సైన్యనాయకపట్టభద్రత్వం పొందిన తుళువవారు అక్కడే ఆతరువాత నివసించిఉండవచ్చు. విజయనగరంలో రాజాశ్రయం సంపాదింపదలచిన పరిసరప్రాంతాలవాళ్ళకు చంద్రగిరి మొదటిమజిలీ కావచ్చు.

కృష్ణరాయల బాల్యం చంద్రగిరిలోనే గడిచిందనీ, అక్కడ ఒక వంక అల్లసాని పెద్దనగారితో, ఇంకొకవంక ముక్కుతిమ్మన గారితో రాయలకు పరిచయం ఏర్పడిందనీ భావిస్తే, వాళ్లతో కలిసి కృష్ణరాయలు ఎన్నో సంస్కృ తాంధ్రగ్రంథాలు చదివి ఉండవచ్చు. తన రచనలుచదివి వినిపించిఉండవచ్చు. ఉత్తరోత్తరా, రాయలను 'కర్ణకుండలిత రసాఖండకవికావ్య' అని అల్లసాని పెద్దనగారు సంబో ధించారు (మను-1-82). అఖండరసకావ్యాలు కర్ణభూష ణాలు గావడానికి ముందే రాయలవారు తమ చెవులలో కవులకు ఇల్లు కట్టించి ఇచ్చిఉంటారు. రాయలవారి రచనలు తోడికవిమిత్రులకు వీనుల విందు చేస్తే ఆ రసికులు 'ఔను' అనిఉంటారు.

పదహారేళ్లు నిండి, మూమూగుమీసాల మూత్న

---

1. ఈ గ్రామాన్నే తరువాత రాయలవారు పెద్దనగారికి దాన మిచ్చారు. అల్లసానివారి నివాసగ్రామం బళ్ళారిజిల్లా దూపాడుపరగణా లో 'దొరాల' అనే ఊరు అని వీరేశలింగంపంతులుగారు వ్రాశారు. ఆంధ్రకవులచరిత్రము, 2-వ భాగం (1898), పుట 29.

యౌవనం వస్తూన్న వయసు గల రాయలు చంద్రగిరినుండి విద్యానగరానికి మారిఉంటాడు. క్రీ. శ. 1490లో సాళువ నరసింహరాయలు మరణించాడు. రాజ్యభారం నరసా నాయకునిమీద పడింది. అతడు భార్యలతో, పుత్రులతో రాజధానిలో స్థిరనివాసం ఏర్పరచుకొనిఉంటాడు. కృష్ణ రాయలు మహామేధావిగా పరిణతి చెందడానికి చక్కని అవకాశాలు లభించాయి. ఆనాడు విజయనగరం అక్షరాలా విద్యానగరమే. తెలుగు, కన్నడం, తమిళం, సంస్కృతం, పారసీకం, అరబ్బీ మొదలైన భాషలలో ఉద్దండపండితులు, మహాకవులు రాజధానికి వచ్చిపోతూఉంటారు. వీరందరి సైదుష్యాన్ని ఆకళించుకొనే అవకాశం రాయలకు కలిగింది.

కృష్ణరాయలు కేవలం విద్యాపరిశ్రమలలోనేకాక రాజోచితవిద్య లన్నింటిలోనూ కృషిచేశాడు. ఆయన వ్యాయామస్థిరసంధిబంధువు.[1] చక్కని కండలు తిరిగినవాడు. ఆనాడు విజయనగరంలో వాడవాడలా సాముగరడీలు ఉండేవి. ఆ శాలికాగారాలలో ఆడవారుకూడా కసరత్తు చేసే వారు. హరిబక్క అనే పౌరుషవంతురాలు తన తండ్రిని కుస్తీలోచంపిన జెట్టీలతో ద్వంద్వయుద్ధం చేసి అందర్నీ చంపి పగదీర్చుకుంది.[2] రాయసైన్యాలలో హంతకులు ఉండేవారు. కృష్ణరాయలు ప్రతిరోజూ కసరత్తు చేసేవాడు. పొద్దున్నే చిన్న గిన్నెడు కుసుమనూనె వ్రాగి అదేనూనె ఒళ్ళంతా పట్టించుకుని సాముచేసి, సవారీలుచేసి, కుస్తీలు

---

1. మనుచరిత్ర, 6-123.
2. పాలటూరు, 2-వ భాగం.

పట్టేవాడు. రాయలవారిలా కసరత్తూ, ముద్గరాలూ, సంగడాలూ తిప్పడం చూసే కాబోలు అల్లసాని పెద్దన ఉత్తరోత్తరా ఇలా వర్ణించారు:

ఉరుసంధ్యాతపణోణమృత్కలితమై యొప్పారు బ్రహ్మాండమ
ద్గరిడిం గాలపుహోంతగాడు చరమాగస్కంధమున్ జేర్చి ని
బ్బరపుక సంగడమో యనన్ శశి డిగెం బ్రాగ్భూమిభృత్కటకే
తరబాహాగ్రపుసంగడం బనగ మార్తాండుండు దోచెన్ దివిన్.

[మనుచరిత్ర, 3-59]

బ్రహ్మాండమైన గరిడీశాలలో ప్రభాతసంధ్య పరచిన ఎర్రమన్నులాగా ఉందట. అందులో కాలమనే హొంతకారి సూర్యాచంద్రులనే సంగడాల జతను రెండు చేతులా పట్టుకొని కసరత్తు చేస్తున్నాడట. చంద్రుడనే సంగడం దిగిందట. సూర్యుడనే సంగడం పైకి లేచిందట. పెద్దనగారు భావించిన కాలమనే హొంతకారి రాయలవారి ఆకాశంలోనే కనబడి ఉంటాడు. సంగడాల సాము ఒక్కటేకాక రాయలు వివిధ సైనికవిద్యలలో ఆరితేరినవాడు. ఆయన వాజ్ఞ్యోహాణ నైపుణీనకులుడు.[1] 'ఆవల్గత్తురగబహువిధాగోహకళావేవం తుడు.[2] అశ్వహృదయాన్ని బాగా అర్థం చేసుకొని రకరకాల గుఱ్ఱపు స్వారులలో ఆరితేరి ఎటుపడితే అటు దూకించేటంత నైపుణ్యం సంపాదించడానికి చిన్నప్పటినుంచి శిక్షణ అవసరం.

విజయనగరానికి రాగానే మూలబలాలలో ముఖ్య దండనాధులలో ఎవరో ఒకరికి కృష్ణరాయలను నరసానాయ

---

1. పారిజాతాపహరణం, 4-92. 2. మనుచరిత్ర, 1-43.

కును అప్పచెప్పిఉంటాడు, వాళ్ళ తర్ఫీదులో కృష్ణరాయలు సైనికవిద్యలు నేర్చిఉంటాడు. కృష్ణరాయలు పైలాపచ్చీసు లోనికి వచ్చేనాటికే దండనాయకు డైఉండవచ్చు. అతని ఖర్చుపెచ్చాలకోసం నరసానాయకు డేగో ఏర్పాటుచేసి ఉంటాడు. కృష్ణరాయ లాడబ్బును రెండుచేతులా కర్చుపెట్టి ఉంటాడు. ఆయనఉద్దేశ్యంలో 'సిజభోగముల కగువెచ్చము వెచ్చంబు కాదు విత్తంబునకుఁ'.[1]

రాయలు యౌవనంలో భోగలాలసు డవునో కాదో చెప్పలేంగాని అతడు భోగంవాళ్లను, వాళ్ల వాడలో, చాలాసార్లు చూసిఉంటాడు.

విజయనగరంలోని సూళెబజారులో వేశ్యలు శమ ళ్లెమూదు అరుగులమీద చాలా తీరుబాటుగా కూర్చొని ఏయేవిధాలుగా పొద్దుపుచ్చుతారో రాయలు బాగా పరిశీ లించాడు. గాజులు గలగలలాడిస్తూ వీధిఅరుగుమీద సాని భూతులు సారెలు వేస్తే, ఆ చప్పుడుకు యతుల గుండెలు ఝల్లుమంటాయట. మన్మథుడిలాంటివాడు ఆపక్కనుంచి పోతున్నా వాళ్లు కావాలని మొగమెత్తి చూడకుండా పరాకు నటిస్తారట. అయితే శ్రీకార్యపరులైన వాళ్లు అటు వస్తే వాళ్లు లేచి మొక్కుతారట. వాళ్లు పాచికలు బాగా కుదిపి వేస్తున్నప్పుడు కొప్పుముడి ఊడిపోతే రెండో చేత్తో దానిని సవరించు కొంటూన్నప్పుడు బయటపడ్డ వాళ్ల రవికలోని చనుకట్టు గలీబులో ఉన్న మన్మథుని తలగడలాగా కనబడు

---

1. ఆముక్తమాల్యద, 4-262.

తుండట. ఇవన్నీ రాయలు స్వయంగా చూసి ఉత్తరోత్తరా వర్ణించాడు (ఆముక్తమాల్యద 1-59).

✓ విజయనగరంలోని వారకాంతల సంగతి రాయలకు బాగా తెలుసు. వాళ్లు చక్కగా తాంబూలం వేసుకొని కెంపుల్లాగ ఎరుపెక్కిన పలువరుసను ఒక నవ్వు గింజత్తో తోముతూ ఉంటారు. అదిమినా బట్టల కంటుకోని విధంగా వంటినిండా నిగ్గులు తేరేటట్టు పసుపు రాసుకొని జలకమాడుతారు. పైటలోపలే చేయి ఆడించి పలుచగానే వక్షోజాలకు పరిమళద్రవ్యాల చందనాన్ని పూసుకొంటారు. వేసుకున్న హారాలలోని మంచిముత్యాలు ఏకారణంవల్లనైనా రవ్వలో తెగిపోతే లక్ష్యపెట్టరు. మనిషిని చూసీచూడగానే ఏకులనో ఇట్టే చెప్పేస్తారట. విటుడున్నదంతా ఊడ్చేసి పేదవాడితే పోషించగలరట. రాజులు తమవాడను వెలిరాణివాసంగా భావించేటట్టు చేయగలరట. వాళ్లు మాట్లాడుతూ కావ్యాలు మాట్లాడగల జాణలట (ఆముక్త మాల్యద, 1-60).

విజయనగరంలోని నాగవాసంలో సంచరిస్తున్నప్పుడు వీయింటి మేడమీది పంచలోనో ఒక యువతి రాయల కిళ్లు పడింది. భుజంమీదినుంచి తీసుకున్న జడ చనుకట్టుమీదికి పడి వేసి ఆముద్దరాలు కురులు విప్పుకుంటూంది. ఆమె చనుగవ వీణకుండే కాయలవలె ఉన్నాయి. జడనున్న పువ్వులు గోటితో మీటుతున్నప్పు డవి దంతపు మెట్లలాగా కన బడ్డాయి.[1] చిన్నప్పటినుంచి వీణ అంటే చెవికోసుకొనే

1. ఆముక్తమాల్యద, 1-62.

రాయలకు చిక్కి ఎడలించుకొన్న చిన్నది వీణ మీటుకు న్నట్లు కనబడడంలో వింత లేదు.

చిన్నాజీ అనే సానిపిల్లతో కృష్ణరాయలకు పరిచయం అయింది. ఆ పరిచయం ప్రగాఢానురాగంగా మారింది. కృష్ణరాయల కప్పటికి పాతికేళ్లుకూడ లేవు. తొలిప్రేమలోని నిర్మలత్వం అతని మాటలలో వెలువడి చిన్నాజీని వినిర్మలం చేసింది. అతడు భాసచేశాడు. ఏనాటికైనా తాను రాజ్యాధిపతి అయితే ఆమెను వివాహం ఆడి దేవేరిగా చేసుకొంటానని వాగ్దానంచేశాడు. ఆమె విశ్వసించింది. రాయ లింకా తండ్రిచాటుబిడ్డ. రాత్రులు నగరు దాటి యథేచ్ఛగా రాలేడు. అందుకే రహస్యంగా ఆమెను కలుసుకుంటూ ఉండేవాడు. ప్రధాని తిమ్మరుసయ్యవి పాము చెవులు; పిల్లిగుడ్లు. రాతిపూట కోటనుంచి కండచీమ కాలు బయటపెట్టినా, మరునాడు ఆసంగతి ఆయనకు తెలుస్తుంది. సరసానాయనింవారి రెండవ సుపుత్రుడు రాత్రుల్లు నగరు వెలుపల రహస్యంగా వీరో రాచకార్యాలు చక్కబెడు తున్నాడని తిమ్మరుసయ్యకు ఆరెకులు విన్నపాలు చేసు కొన్నారు.

విజయనగరంలో రాత్రిళ్లు గస్తీ తిరిగే ఆరెకులు పెయ్యికళ్ళతో చూస్తారు. ఎవరైనా వీధైనా పారేసు కొంటే తీసి భద్రంచేసి నమ్మకంగా హక్కుదారులకు అంద జేస్తారు. ఈ ఆరెకుల కంటపడకుండా తప్పించుకొందామని కృష్ణరాయలు వరిమళ్లలో కాలువపక్క నక్కి కూర్చుంటే చూసిఉంటారు. అతని తలగుడ్డ తెల్లగా, బాతురెక్కలా

ఉందేమో, బాతులను చూసి ఆరెకులు వస్త్రమని భ్రమిం చారని కృష్ణరాయలు ఉత్తరోత్తరా ఒక పద్యం చెప్పాడు.

తలబత్తుచ్చటగ్రుక్కి బాతుపులు కేదారంపుగుల్యాంతర
స్థలి నిద్రింపగ జూచి యారెకు లుషస్స్నాతప్రయాతద్విజా
వలిపిండీకృతశాటులన్నవిధతద్వాసంబు జేర్పంగ రే
వుల డిగ్గ న్వేసబారువాని గని నవ్వు న్నాలిగోప్యోషముల్.

[ఆముక్త. 1-65]

బ్రాహ్మణులు తెల్లవారుజామునే స్నానాలుచేస్తారు. వాళ్లు కాలుపలబడ్డున అప్పుడప్పుడు వస్త్రపు పిసుచలు మరిచిపోవచ్చు. రెక్కలలో తలలు మూర్చుకొని నిద్రపోతున్న బాతులు వస్త్రాలలాగా కనబడితే ఆ బట్టలకు బాపనయ్యలకు ఇచ్చేద్దామని ఆరెకులు దగ్గరకు వెళ్ళారు. ఆ చప్పుడుకు బాతులు లేచి ఈదుకొంటూపోతే పైరుకాపరి యువతులు నవ్వారట. రాయలవారు ఇంత కమ్మగా వర్ణించిన సంఘటన ఆయనజీవితంలో బాగా హత్తుకుపోయింది కావచ్చు.

కృష్ణరాయలు రాత్రిపూట చేస్తున్న ఘనకార్యాల సంగతి తెలియగానే తిమ్మరుసయ్య వెంటనే ఈ యువకుడికి పెళ్ళిచేయించాలని నిశ్చయించాడు. ఈ అబ్బాయి వివాహంతో ఏదైనా రాచకార్యం నెరవేరుతుందా అని ఆలోచించాడు. విజయనగరసామ్రాజ్యానికి పక్కలో పల్లేరు కాయలలా ఉమ్మత్తూరు, శ్రీరంగపట్నం సామంతులు బాధాకరంగా ఉంటున్నారు. వీరిలో ఒకరిని వియ్యంతో లొంగదీసుకుంటే కొంత బాగుంటుందని తిమ్మరుసయ్య

భావించాడు. శ్రీరంగపట్నం పాలించే చామరాయల కుమార్తె తిరుమలదేవిని కృష్ణరాయల కిచ్చి వివాహం చేయడానికి నిశ్చయించాడు. తిమ్మరుసయ్య తలచుకొంటే ఆగుతుందా? వెంటనే, క్రీ. శ. 1498 లో, అంటే కృష్ణ రాయల 24 వ ఏట వివాహం జరిగిఉంటుంది. సుముహూర్తాన్ని సూచించడానికి ఇసుకగడియారం వాడిఉంటారు. తెర కట్టారు. కృష్ణరాయలు జీలకర్ర బెల్లం వధువుశిరస్సుపై పెట్టాడు. ముక్తలసేసలు జల్లుకొన్నారు. ఈ వివాహక్రియ లన్నీ రాయలవారికి జ్ఞాపకంవచ్చాక ఉత్తరోత్తరా శర త్కాలాన్ని పెళ్ళితో సరిపోల్చారు.

కెగలు స్రవంతిపై ఇసుక క్రిందగువేళ నినుండు మేఘపుం
డెరసనబల్లగా విరహదీప్తకరప్లుతమూసజీరకో
త్కరగుడమట్లు పద్మినుల గ్రమ్మునకేసరమాధ్విపోల్చెబై
గర మరుదారె దేంట్లు సెకగందిన ముత్తెపు సేసలో యనన్.

[ఆముక్తమాల్యద, 4-150]

శరత్కాలంలో వీట్లో పైఇసుక కెరలి కిందికి పోతుంది. అది నీటిగడియారంలా ఉంది. సూర్యుడు మేఘాల చెనకకు పోయాడు. అది పెళ్లికొడుకుముందు తెర కట్టిన ట్లుంది. తామరపువ్వుల కేసరాలపై మకరందం బాగా అలుముకొంది. ఆ కేసరాలు, తేనె జీలకర్ర బెల్లంలాగా ఉన్నాయి. విరహంవేడికి బెల్లం కరిగి చెయ్యంతా అంటు కొన్నట్టు కనిపిస్తూంది. తుమ్మెదలు సెగకు కందిన ముత్యాల లాగా ఉన్నాయట. తెలుగుపెళ్ళిళ్ళలో జీలకర్ర బెల్లం పెట్టడం పెళ్ళిలో మొదటితంతు. అయితే ఈ తొలిచర్యను

P. Suryaprasad

తెలుగుసాహిత్యంలో రాయలవారికి ముందు ఎవరూ వర్ణించినట్లులేదు. తోలిరాయల యుగందాకా మిగిలిన కవులు నీటి గడియారాన్నే పేర్కొన్నారు గాని రాయల వారే ఇసుకగడియారాన్ని ప్రప్రథమంగా సూచించారు.

చిన్నాదేవిమీద ఎంత ప్రేమ ఉన్నా రాయలవారు తిరుమలదేవితో అన్యోన్యంగానే ఉన్నారు. ఆదంపతుల ఆశలు పండి అనతికాలంలోనే ఒడి నిండింది. రాణివాసంలో ఉయ్యాల కట్టారు. రాయలవారికి, బహుశా, వారి ఇరవై అయిదవ యేట, క్రీ. శ. 1499 లో ప్రథమపుత్రిక జనించింది. ఆ తొలిచూలు బిడ్డకు తిరుమలాంబ అని పేరు పెట్టారు. రాయలు తన కుమార్తెకు ఏడుకొండలవాడి పేరు పెట్టడంలో కారణముంది. ఆయనకు తిరుపతి వెంకటేశ్వరుడంటే అమితభక్తి. చిన్నప్పుడు రాయలు చంద్రగిరిలో వుండేవాడు. అక్కడికి తిరుపతి కనుచూపుమేరదూరంలో ఉంటుంది. గుర్రమెక్కి రికాబుకాళ్ళను కొంచెం జాడిస్తే కళ్ళుమూసి కళ్లు తెరిచేలోగా అడివారం చేరుకోవచ్చు. రాయలు ఎన్నోసార్లు చిన్నప్పుడు కొండ ఎక్కి కొలచుకొని ఉండిఉంటాడు. ఈ గాఢభక్తిని అల్లసాని పెద్దనగారు గ్రంథస్థం చేశారు. "శ్రీ వెంకటేశపదపద్మావేశిత సదయ హృదయా!" అని తన ప్రభువును సంబోధించారు.[1]

రాయలకు 25 వ ఏట పుత్రిక జనించింది. 29 వ యేట, క్రీ. శ. 1503 లో, తండ్రి మరణించాడు. దానితో

1. మనుచరిత్ర, 3-1.

రాజకీయపరిస్థితులు మారాయి. అన్న పట్టం కట్టుకున్నాడు. తనతోబాటు రాచకార్యాలలో తమ్ముణ్ణి కూడా కలుపుకొని వుంటాడు. అప్పట్నించి సాహిత్యవ్యాసంగానికి వీరో రెండు పాటి కాలాన్నే రాయలు కేటాయించినట్లు భావించవచ్చు. వివాహం అయింది మొదలు తండ్రిమరణందాకా వున్న అయిదుసంవత్సరాలలో కృష్ణరాయలు కావ్యరచన చేసినట్లు వూహించవచ్చు.

ఉత్ప్రేక్షలు, ఉపమలు, స్వభావోక్తులు అతిశయించేటట్లు రాయలు మదాలసచరిత్రను మొదటరచించాడు. ఇది మార్కండేయపురాణంలో వున్న కువలయాశ్వచరిత్ర కావచ్చు. కువలయాశ్వుడు మదాలసను వివాహం చేసుకున్నాడు. రాయలు రచించిన మదాలసచరిత్రను విని రసికులు చాలా మెచ్చుకున్నారు. ఈకృతి చెప్పాక రాయలు 'సత్యావధూపరిణయం' అనే కావ్యం ప్రారంభించాడు. ఇది బహుశః పారిజాతాపహరణం కావచ్చు. సత్యభామను తృప్తిపెట్టడానికి కృష్ణుడు చేసిన పనులన్నింటిలోకీ పారిజాతం తేవడమే గొప్పది. దానిని రాయలవారు హరివంశంలో చదివి ఆ ఘట్టం ప్రత్యేకంగా ఒక కావ్యానికి తగినంత ఇతివృత్తం కలదని భావించి భావం, ధ్వని, వ్యంగ్యం మొదలైన కావ్యగుణాలకు పెన్నిధాన మయ్యేటట్లు నిర్మించారు. వేదాలు, పురాణాలు, ఉపసంహితలు శ్రద్ధగా చదివి వాటిలోని గాథలు ఏర్చి సకలకథాసారసంగ్రహం అనే సంకలనాన్ని రాయలు సమకూర్చాడు. విన్నవాళ్ళ పాపాలు పటాపంచలయ్యేటట్లు సూక్తినై పుణ్యంతో 'జ్ఞానచింతా

మణి' అనే కృతి తాను నిర్మించినట్లు రాయలు తరువాత చెప్పుకున్నాడు. ఆయన 'రసమంజరి' అనే కావ్యాన్ని కూడ వ్రాశాడు. ఈ మధుర కావ్యాలన్నీ ఆయన సంస్కృత భాషలోనే రచించాడు. అయితే ఏబక్కటీ నేడు లభించవు.

రసమయ కావ్యాలు రచించే రాయలు కలాన్ని పక్కకు పెట్టి కత్తిని చేపట్టవలసిన అవసరం క్రీ. శ. 1506 వాటాక వచ్చింది. ఆయేడు అతని సవతిఅన్నగారు వీర నరసింహరాయలు విజయనగర సామ్రాజ్యపు రత్నసింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇందుకు అభ్యంతరం చెప్పి ఎదురు తిరిగిన సామంతులను అదుపులో పెట్టవలసిన బాధ్యత ప్రధాని తిమ్మరుసయ్యమీద ఎంత వుందో అంత వీరనరసింహ రాయలు కృష్ణరాయలపైనకూడా పెట్టినట్లుంది. అతనికి తమ్ముడంటే వాత్సల్యం, తల్లి నాగాంబ అంటే గౌరవం వున్నాయి. తన తల్లీ, సవతితల్లీ కౌసల్యా, సుమిత్రలవంటివారనీ, తనూ. తన తమ్ముడూ రామలక్ష్మణులవంటివారనీ వీరనరసింహరాయలు ఒక శాసనంలో ఇలా వ్రాయించాడు.[1]

తిప్పాజీనాగలాదేవ్యోః కౌసల్యాశ్రీసుమిత్రయోః
దేవ్యో రివ నృసింహేంద్రాత్తస్మా త్పంక్తిరథా దివ
వీరౌ వినయినౌ రామలక్ష్మణౌ వివ నందనౌ
జాతౌ వీరనృసింహేంద్ర కృష్ణరాయమహీపతీ.

---

1. కంచికామకోటిపీఠాధిపతుల వద్దనున్న తామ్రశాసనాలలో నెం. 112, పుట 22 అని నేలటూరు వెంకటరమణయ్యగారు ఉదాహరించారు. భారతి, 1949 మార్చి, పుట 161.

తన తమ్ముడు వినయసంపన్ను డని మహీపతిఅని వీరనరసింహరాయలు చెప్పాడు. 'మహీపతి' అనే మాట వాడడంవల్ల కృష్ణరాయలకు రాచకార్యాలలో ప్రముఖ స్థానం యిచ్చినట్లు కనబడుతుంది. వీరనరసింహరాయల పరిపాలనను సుస్థిరం చేయడానికి కృష్ణరాయలు ఎంత పాటుపడినా అన్నగారు అదృష్టహీనుడు. మూడేళ్లుమాత్రమే రాజ్యం చేశాడు. క్రీ. శ. 1509 జూలైలో అతడు మంచాన పడ్డాడు. దీనికి ముందు ఎదురుతిరిగిన సామంతులను అణచడానికి వెళ్ళి ఉమ్మత్తూరుదొరల చేతిలో ఓడిపోయాడు. తను ఆఖ్టెకాలం బతకనని అతనికి తెలుసు. మహాప్రధాని తిమ్మరుసయ్యకు తన అంతిమకోరిక చెప్పి మరణించాడు.

రాజ్యక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అప్పాజీ తిమ్మరుసయ్య రాయసింహాసనంపై కృష్ణరాయలను ఎలాగ ఎక్కించినదీ ఇంతకుముందు ముచ్చటించుకున్నాం. పట్టం కట్టుకొన్నాక రాయలు ఒక కచ్చితమైన దినచర్య ఏర్పాటు చేసుకున్నాడు. నిద్ర లేవగానే ఒక జాముసేపు వైద్యుల తోనూ, జ్యోతిషులతోనూ ముచ్చటించేవాడు. 'సుఖంగా నిద్రపట్టిందా?' అని కుశలప్రశ్న వేసి ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకొనే వైద్యులతో ఊరు తెల్లవారక ముందు సల్లాపించడంలో రాయల జాగ్రత కనపడుతుంది. జాము పొద్దెక్కాక మంత్రులతో, సామంతులతో సంప్రతింపులు. ధనార్జననియుక్తులైన కాయస్థులతో గోష్ఠి చేసి రాజ్యంలోని ఆదాయవ్యయాల లెక్కలు వినేవాడు. తరువాత అంగ

మర్దనం, మల్లులతో వ్యాయామం చేసేవాడు. వంటవాళ్ళతోటి, వేటకాళ్ళతోటి మాట్లాడేవాడు. వేటకాళ్లు తెచ్చిన మాంసం ఎలా వండాలో వంటవాళ్ళకు పురమాయించేవాడు. ఏయేమాంసాలు తీసుకురావాలో వేటకాళ్ళకు చెప్పేవాడు.

అపరాహ్ణసమయంలో దేవతార్చన. ఆర్యులతో ధర్మాధికారులతో గోష్ఠి. భోజనం చేశాక, భుక్తాయాసంతీరడానికి విదూషకునితో సల్లాపం. తరువాత కవులతో, పౌరాణికులతో విద్వావినోదం. ఆపిమ్మట చాకులతో మంతనాలు. సంజవేళ పాటకచేరీ. రాత్రి సుఖనిద్రకు ముందు ప్రేయసీ గోష్ఠి.

కృష్ణరాయల తొలిప్రేయసి చిన్నాజీ. దేవుడు మేలు చేసి తానెప్పటికైనా రాజ్యానికి వస్తే ఆమెను దేవేరిగా చేసుకొంటానని ఎప్పుడో ఆమెకు మాటిచ్చాడు. పట్టం కట్టుకున్నాక అది నిజంగా నిలబెట్టుకున్నాడు. చిన్నాజీ చిన్నమదేవి అయింది. పట్టమహిషి తిరుమలదేవితో పాటు చిన్నాజీకికూడా రాయలు సమానహోదా యిచ్చాడు. దండయాత్రలకు సడిచినా తీర్థయాత్రలకు కదలినా రాయలు దేవేరు లిద్దరినీ వెంటపెట్టుకొనే వెళ్లేవాడు. వాస్తవానికి కళింగదిగ్విజయ యాత్రకు వెళ్లేముందు రాయలు భార్యలతో తిరుపతివెళ్లాడు. క్రీ. శ. 1513 ఫిబ్రవరి 10 తారీఖునాడు తిరువేంగళదేవునికి నవరత్న ఖచితమైన కిరీటం చేయించాడు. పట్టాభిషేకంలో తాను అటువంటి కిరీటం

ధరించాడో లేదోగాని దేవునికి చేయించిన కిరీటం అపూర్వ మైంది.

1555 తులాల బంగారం కేవలం వొమ్మొచ్చుకే (అంటే కిరీటం కింది భాగాన ఉండే మట్టుకుమాత్రం) వాడారు. మిగిలిన కుందనంపనికి 1076 తులాల బంగారం పట్టింది. 2822 కెంపులు, 160 పచ్చలు (ఇవి నూటఎనిమిది రత్నాలు), 423 పాతవజ్రాలు, మధ్య మాణిక్యంతో కలుపు కొని 3 మాణిక్యాలు, 10 వైడూర్యాలు, 10 గోమేధికాలు, 3130 ముత్యాలు ఈ కిరీటంలో ఉన్నాయి.[1] ఈ మహా దానాన్ని రాయలు చేస్తున్నరోజునే పట్టమహిషితిరుమల దేవి 374 తులాల బంగారుపళ్ళాన్ని స్వామివారి ఆనవాల నైవేద్యసేవకు దానం చేసింది.[2] ఆనాడే, అదేఊరు గల బంగారంతో ఒక పైడిగిన్నె అదే ఆనవాలసేవకు చిన్నమదేవి ఇచ్చింది.[3] రాయల దేవేరు లిద్దరికీ ఏమాత్రం తేడా లేదని ఈదానాలే వక్కాణిస్తాయి. రుక్మిణీసత్యభామలవంటి ఈ ఇద్దరేకాక రాయలకు మరోఇద్దరు భార్య లున్నారట. నూనిజ్ అనే చారిత్రిక సంచాలకుడు ఈ సంగతి చెప్పాడు. అయితే పేయస్ అనే విదేశీయుడు రాయలవారికి 12 మంది భార్యలని వ్రాశాడు. ఇందులో కొందరు భోగపత్నులు కావచ్చు.

రాయలు స్త్రీలోలుడని చెప్పలేంగాని 'కవితాస్త్రీ లోలు'డని అల్లసాని పెద్దనగారు ఎలుగెత్తి, సగర్వంగా

---

1. తిరుపతిదేవస్థానం శాసనాలు, సంపుటి 3, నెం. 32. 2. అదేసంపుటిలో, నెం. 51. 3. అదేసంపుటిలో, అదే నెం. 51.

చెప్పారు.[1] రాయలవారు తొలిదండయాత్రనుంచీ పెద్దనగారు ముక్కుతిమ్మనగారు మాదయగారి మల్లన మొదలైన కవులను వెంటపెట్టుకొని ఉండేవారు. రాయలు పట్టాభిషేకం చేసుకొన్న కొత్తలో బీజాపురం, అహమ్మదునగరం, గోలుకొండ రాజ్యాల ఏలికలు ముగ్గురూ ఉమ్మడిగా రాయలపై దాడిచేశారు. గోలకొండవారి సరదు స్థలాలలో మూడులక్షల తురకలు మోర్చావేసి పాళెందిగారు. కృష్ణవేణి దాటి డెరిజావేశారు. డెరిజావేయడం అంటే అమీతుమీ తేలే దాకా వేసిన డేరా ఎత్తమనే ప్రకటన. ఈ గుడారంలో సుల్తాను ఉంటాడు. ఇది పడిపోతే సుల్తాను పరాజయం పొందినట్టే. అందుకే సర్దారులు, అమీరులు అంతా కలిసి డెరిజాను వేయి కళ్ళతో కాపాడుతారు.

కృష్ణ దాటి, మూడిళ్ళ తురకలు డెరిజా వేశారని వినగానే రాయలవారు ఆగ్రహించారు. ఏంచేయాలని అమరనాయకం వారందరినీ ప్రశ్నించారు. పెమ్మసాని రామలింగానాయకుడనే మహాశూరుడు ఇలా సలహా చెప్పాడు :

తురకలతో యుద్ధం అనగా ఎంత? దేవరవారి ప్రతాపంవల్ల డెరిజాతాళ్లు తెగతోస్తాను. అప్పుడు భేరి తాడనం చేసి నడిస్తే తురకలు మూడుతెగలవాళ్లూ పటాపంచ లవుతారు.

అన్నాడు. తాను వెళ్ళి డెరిజాతాళ్లు కోస్తానని శపథం చేశాడు. మూడిళ్ళ తురకలూ డెరిజా వేశారని తెలియగానే స్వయంగా రాయలు తానేం శపథం చెయ్యలేదు. అది తన రాజనీతికి విరుద్ధం. యుద్ధంలో ఎప్పుడూ

---

1. మనుచరిత్ర, 1-45.

ప్రభువు ప్రతిజ్ఞలు చేయకూడదట. రాయలవారు ఇలా గ్రంథస్థంచేశారు:

ప్రతిన వలదు వైరిపట్టున నృపతికి
దండువెడల దీరకుండు దీరు
గాకయుండియుండి కాలాంతరమున నో
గార్యకాడో యంకకాడో నృపుడు. [ఆముక్తమాల్యద, 4-263]

రాజు శత్రువుమీద ఎప్పుడూ ప్రతిజ్ఞ చేయకూడదు. దండెత్తినప్పుడు కార్యం తీరితే తీరవచ్చు. లేకపోతే తీరక పోవచ్చు. రాజు కార్యవాది అవాలిగాని ఖడ్గవాదిలాగా మారకూడదు. అంకకాడు ఉత్త జట్టీకోరు. కార్యవాది కనుకనే రాయలు తాను స్వయంగా శపథం చేయక తన సేనానులచేత చేయించాడు. రాజు ఎప్పుడూ శూరాలాపం చేయకూడదని మరొక నిషేధం రాయలవారు చేశారు.

శూరాలాపములకునతి-శూరుడు దానయ్యె నృపతి సోకోర్వదగు
న్వా రుబ్బుదు రందున నిజ-శూరత దొరలందు గనుట సూ కార్యములన్.
[ఆముక్తమాల్యద, 4-244]

ఇటువంటి రాజనీతులు తొలియుద్ధం దగ్గిరనుంచీ రాయలవారు అమలులో పెట్టారు. ఎమ్మెసాని రామలింగమ నాయకుడు శపథం చేసినట్టుగానే డెరిజాతాళ్లు తెగకోశాడు. రాయలవారు భేరీతాడనం చేయించి మదమత్తి నెక్కు-క్రోసి ఉభయచక్రాలతో, మకలకొక్కాలతో, నూటయిరవై ఘట్టాల ఏనుగులతో, అరవై వేల గుర్రాలతో, అయిదు లక్షల సిపాయిదళంతో పొట్లంగా నడిచారు. రాయల వారి సైన్యం వరదలాగా నడిస్తే నిజంగా కృష్ణవేణమ్మకు

కూడా ఆ కాలంలో వరదలు వచ్చాయి. ఈ రెండు వరదలకూ తట్టుకోలేకపోయారు తురకలు. తమ ఏనుగులను, గుర్రాలను, గుడారాలను వదలిపెట్టి పారిపోయారు. రాయలవారు కృష్ణవేణిఒడ్డుకు వచ్చి మూడు తెగలతురకల గుర్రాలను, వీనుగులను నగరిలో కట్టిపెట్టమన్నారు. గుడారాలు, నిశానీలు, నగారాలు మొదలైనవి మొదటి జగడాన దొరికాయి కనుక అవన్నీ నగరికట్టమని, దివాణానికి చెందుతాయని అన్నారు. ఇటువంటి ఆజ్ఞ రాజు ఇవ్వకపోతే ఎవరికి దొరికినవి వాళ్లు అంకించుకోనడం ఆనాటి నీతి. రాయలవారు నగరినియోగుల కీయవలసిన ఆజ్ఞ నిచ్చి ముక్కతిమ్మన మొదలైన కవీశ్వరులకేసి చూసి "నేటి జయం వీరికి?" అని అడిగారు. అప్పుడు తిమ్మనగారిలా పద్యం చెప్పారట:

నరసింహకృష్ణరాయా!-దురమున నీపేరుపేర దురకల గ్రుంచెన్
గరిరాజవరదుడవని నీ-కరిఘటములు నిన్ను జూచి గ్రక్కున తిరిగెన్.
[రాయవాచకం, పుట 89]

తిమ్మనగారీపద్యం చెప్తున్నప్పుడు యుద్ధరంగంలోని గుడారంలో అల్లసాని పెద్దనగారు, మూడయ్యగారి మల్లన గారుకూడా ఉన్నారు. యూసఫ్ ఆదిల్ ఖాన్ ను రాయలవారు సంహరించాక అల్లసాని పెద్దనగారు ఈపద్యం బహుశ యుద్ధరంగంలోనే చెప్పారు.

అలుకన్ ఘోటకఘట్టికాఖురపుటీహల్యన్నురాసానిపు
చ్చలువోదున్నిచలచ్చమూగజమదాసారప్లుతిన్గ్రిపు
షక్-లసస్యం బిడి యేకధాటి భళిరా కట్టించి తౌ దృష్టి కే
దులఖానోగ్రకపాలమర్దపవరిద్భూజాంగలక్ష్మీకిన్. [ఆము క్త. 1-42]

ఖురాసానిదేశంనుంచి వచ్చిన తురకల శిగస్సులనే పుచ్చతోటలను గుర్రపుడెక్కలనే నాగళ్ళతో దున్ని ఏనుగుదళాల మదధారలనే వర్షంతో తడిపి, ఏకధాటిగా కీర్తిపంట పుష్కలంగా పండించి దానికి దిష్టిబొమ్మగా ఏదులఖాన్ కపాలాన్ని రాయలవారు నిలిపారట. ఈపద్యంలో రాయలవారికి చాలా ఇష్టమైన రూపకాలంకారం ఉంది. రాయలవారి కేదైనా పద్యం నచ్చితే దానిని ఒకటికి రెండు సార్లు చదివించుకొని విని కంఠతా పడతారు. దీని కొక నిదర్శన ముంది.

రాయలవారు రోజూ నిత్యకృత్యంగా ప్రాతఃకాలంలో పద్యనీతి చదవమని వింటూ ఉండేవారట. ఒకనాడు పద్య నీతి చంద్రయ్య తను వచ్చి చదవడానికి వీలులేక కుమారుని నగరికి పంపించాడట. అతడు మేలుకొలుపు లయ్యాక సంజయనీతి, విదురనీతి, చాణుక్యనీతి, భర్తృహరినీతి శతకం మొదలైనవి చదివాడట. రాయలవారు సావధాన చిత్తులై ఉన్నారు. చంద్రయ్యకొడుకు ఈపద్యం చదివాడు.

బలవర్ధము సామంతుల-బలమునకగ్గలముగల నృపాలున కొదవే
బలిమె పెఱనృపతికాజ్ఞా-బలసంపద కెంతదవ్వు బద్దెనరేంద్రా!

ఈ పద్యం అతడు చదివాక రాయలవారు దానిని ఇనుమారుముమ్మారు చదవమని మనస్సుకు తెచ్చు కున్నారు. తరువాత దానిమీద తక్షణం తీసుకోవలసిన చర్య తీసుకున్నారు. కరణాలను పిలిపించి రాజ్యంలో గిరి దుర్గ, జలదుర్గ, స్థలదుర్గా లెన్ని? కోటలు ఎన్ని? ఎవరెవరికి ఎంత ఎంత జీతం? సైన్య మెంత? మొదలైన వివరాలన్నీ

లెక్క చెప్పమన్నారు. ఈవరకన్ను వీరనరసింహ రాయల వారు లెఖ్ఖపఖ్ఖాలడిగి పరామర్శించెడివారు గాదు. ఇప్పుడు స్వామివారు లెఖ్ఖలు పరామరిక చేస్తున్నారుగనుక ఏయే లెఖ్ఖలు విన్నపం చెయ్యమన్నారో ఆయా లెక్కలు సేకరించి వ్రాసి నేటమర్నాట అన్నియు విన్నపం చేస్తామని చిన్న భండారం కరణాలు చెప్పారు. తక్షణచర్య తీసికొనడం అన్నది రాయలవారి జీవితవిజయాల కీలకం. ఆయన రాజ నీతిలో ఒకటే నియమం పెట్టుకున్నారు, వినండి.

లాలన నారక్షుల గమి_నేలి తెలిసి ప్రుచ్చనాజ్ఞయిడ కతడు చొరం
బో లాతి నిడనయశ మెం_తేలేవడె భూలపృథువణిజ్న్యాయమునన్.

[ఆముక్త. 4_239]

"లాలించి రక్షకభటులను ఏలి దొంగ ఎవరో తెలుసు కొని వెంటనే శిక్షించమని రాయలవారి శాసనం. ఆలస్యం చేస్తే ఒకవేళ దొంగ పారిపోతే, తమ పీకలమీది కొస్తుం దని రక్షకభటు లెవరో దారేపోయేవాడిని తీసుకొచ్చి కొట్లో తోస్తారు. వాడే అసలు దొంగ అనుకొని రాజు శిక్షిస్తే అపఖ్యాతి. ఇది 'ఘనమైన శూలం, లావుపాటి సెట్టి' న్యాయంలాగ తేలుతుంది" అని రాయలవారు పిట్టకథ జ్ఞాపకం చేశారు. రాయలవారి ఆముక్తమాల్యదకు చాలా ప్రతిభావంతమైన వ్యాఖ్యానం వ్రాసిన వేదం వెంకటరాయ శాస్త్రిగారు ఈ న్యాయాన్ని ఇలా విడమరిచారు వినండి.

పంచమహాపాతకపట్టణములో అవకతవక ప్రభువుకడ ఒకడు తాను ఇల్లు కట్టుకొనుటకు మట్టిగోడ పెట్టుకొనగా వర్షము కురిసి గోడ కూలిపోయిన దనియు, అపరాధిని దండింపవలె ననియు విన్నయిడెను.

ఈ తప్పెవరిదని రాజు అడుగగా మేఘుని దని ఆవివేకపుప్రధానము చెప్పెను. మేఘుని కొరుతవేయుడని రాజు తలారులకు ఆజ్ఞాపించెను. 'పొగవలన మేఘుడయినాడు. పొగది తప్పుగాని మేఘునిది గాదు' అని ఆరెకులు చెప్పిరి. 'పొగను కొరుత వేయు'డని రాజు ఆజ్ఞాపించెను. 'పొగకు కారణము కమ్మరయావము' అని యొక సభ్యుడు చెప్పెను. 'ఆవమును కొరుతవేయుడు' అని రాజు ముదలయిడెను. 'ఆవములేదు, దానినిపెట్టిన కమ్మరియున్నాడు' అని మరియొక సభ్యుడు చెప్పెను. అంత కమ్మరికి ఆజ్ఞ అయినది. కమ్మరి 'అయ్యవారి ఇంటి పెండ్లి. నేను అరివేణికుండలకై ఆవ మిడితిని. మీరు పెండ్లికుమారుని వేయవలయును గాని నన్ను వైచెదరేమి?' అని ఆరెకులతో వాదించెను. వా రీమాట రాజుతో చెప్పగా రాజు పెండ్లికుమారుని కాజ్ఞయిడెను. పెండ్లికుమా రుని పీటలమీదనుండి కొర్తికిం గొనిపోయిరి. అతడు కొర్తిం జూచి 'అయ్యా, కొర్రు లావుగా ఉన్నది. నేను సన్నపాటివాడను. నన్ను వైచెదరేమి' అని వాదించెను. ఆ వాదము ఆరెకులు రాజుతో చెప్పగా రాజు ఆలోచించి, 'అవును. ఆ కొర్తికి తగిన లావుపాటివానినే వైవ వలసినది. ముమ్మాటికి ఇదే సెలవు. మరి రాకుడు' అని ముగించెను. అంతట ఆరెకులు లావుపాటివానిని సెట్టి నొకనిని కొర్తికడకు గొంపో యిరి. అతడు ధనమిచ్చెదనన్నను 'మేము రాజాజ్ఞ మీరుదుమా? లంచము గొందుమా? ధర్మస్థాపన జరుగవలదా?' అని వానిం గొరుతం దివిచిరి.

—ఇదయ్యా శూలపృథు వణిజ్నాన్యయము.[1]

రాయలవారికి హాస్యరసమంటే చాలా ఇష్టం. ఆయన మానవనైజాన్ని బాగా పరిశీలించిన వ్యక్తి. తమ ఉద్యో గాలు కాచుకోందుకు నిర్దోషులను సహితం అధికారులు బలిచేస్తారని తెలుసు. ఈసంగతి ఘాటుగా చెప్పక సున్ని

1. ఆముక్తమాల్యదసంజీవిని, పుట 450.

తంగా పిట్టకథ న్యాయంతో ముడిపెట్టారు. అధికారు లెంత లంచగొండ్లో రాయలకు తెలుసు. అందుకే ఇలాగ చెప్పారు.

మనమున కొండురెండుమరుమంత్రముల న్నరిపోగ జెప్పినం
జనపతు లాతనిం బిలువ సాగుదు రాగతి సారె బిల్చినన్
చ్చనువునకే ధనాది గొని సంగతిగానివి క్రొవ్వి చేయకి
ప్పునృపతి తద్బహిశ్చరితముం జరుచే బరికింపగాదగున్.

[ఆముక్త. 4_265]

ఎవరైనా ఒకటికి రెండు సార్లు మనస్సుకునచ్చే ఆలోచన చెప్తే రాజులు అటువంటి అధికారిని అడపా తడపా పిలిపిస్తూనే ఉంటారు. ఇది చూసి రాజుగారితో ఈమ తరఫున సిఫార్సు చేయమని ప్రజలు లంచా లిస్తారు. అది పుచ్చుకొని తనమాట సాగుతుందనే గర్వంతో అతడు అసంగతపు ఆలోచనలు చెప్పవచ్చు. కాబట్టి అలాంటి వాళ్ళ బ్రతుకులు రాజు, చారులచేత జాగ్రత్తగా కని పెట్టాలి. ఎప్పుడూ కూడా నిద్రపోతున్న భల్లూకంలాగ ఒక కన్ను తెరచుకునే ఉండా లన్నది రాయలవారి నినాదం.

కన్నొకటి నిద్రలో బెరకంట జూగ
రంబు గావించు భూరువోగ్రంబుమోది
యచ్చభల్లంబుగతి భోగ మనుభవించు
నెడను బహిరంతరులపై దృష్టి వలయు. [ఆముక్త. 4_241]

ఇంత జాగ్రత్తగా ఉండేవారు కనుకనే రాయలవారికి యుద్ధాలలో, రాచకార్యాలలో ఎప్పుడూ ఓటమి లేదు. మూర్ధాభిషేకం చేసుకొన్న కొత్తలో మూడిళ్ళ తురకల మీద గెలుపు సాధించారు. తరువాత ఉమ్మత్తూరు శివన

సముద్రం మొదలైన సామంతులను అదుపులో పెట్టాడు. పెనుగొండనుంచి శివనసముద్రందాకా ఉన్న రాజ్యాన్ని కట్టుదిట్టం చేసి నమ్మిన ఉద్యోగులను నియమించాడు. తరువాత తిరుపతివెంకన్న దర్శనం చేసుకొని కళింగంపై దిగ్విజయ యాత్రకు బయలుదేరాడు.

కళింగ దండయాత్ర నాల్గు ఘట్టాలుగా జరిగింది. మొదట ఉదయగిరి దుర్గాన్ని పట్టుకొన్నాడు. తరువాత ఒక ఏడాదికి అద్దంకి, వినుకొండ, బెల్లంకొండ, నాగార్జున కొండ మొదలైన దుర్గాలు కైవసం చేసుకున్నాడు. కొండవీటి దుర్గాన్ని జయించాడు. అప్పుడా దుర్గంలో ఉన్న ప్రతాపరుద్ర గజపతి రాణి ఒకామె, పుత్రుడు వీరభద్రగజపతి పట్టుపడ్డారు. వారిని రాయలు సముచితరీతిని మర్యాదలతో బంధించాడు. శత్రువుల జనానా పట్టు పడితే వాళ్ళను పుట్టింటి వారిలాగా మర్యాదలు చేయాలని రాయల ఘర్మాజ్ఞ.

రాష్ట్రమెరియింపుకొనుము దుర్గములు తదవ
గోధ మగపడ్డ బుట్టింటి రూఢి నడపు
పరుషములు తిర్రిపుల రాయబారులెదుట
బలుకకుము సంధియొకవేళ వలసియుండు. [ఆము క్త. 4_267]

పగవాడి దేశం తగలబెట్టు. దుర్గాలు తీసుకో. అంతే కాని అతడి స్త్రీజనం దొరికితే పుట్టింటివాళ్లకులాగ మర్యాదలు చెయ్యి. శత్రురాజుల రాయబారులవద్ద కటువుగా మాట్లాడకూడదు. ఎప్పుడేనా సంధి అవసరం వస్తుంది.

అప్పు డీ పరుషవాక్యాలు అడ్డురాకూడదు—అని రాయల వారు చెప్పారు.

పగవాళ్ళపట్ల ఎంత ఉదారంగా ఉండాలో తనవాళ్ళ విషయంలో మరింత వాత్సల్యంతో ఉండాలన్నది రాయల వారికి బాగా తెలుసు. సామాన్యప్రజలపట్ల, ముఖ్యంగా సైతులపట్ల ఆయన ఉదారుడు.

దేశవైశాల్య మర్థసిద్ధికిని మూల-మిల యొకింతైన గుంటకాల్వలు రచించి
నయము పేదకు నరి గోరునను నొసంగి-ప్రబలజేసిన నర్థధర్మములు పెరుగు.
[ఆముక్త. 4-236]

దేశం ఎంత విస్తరిస్తే అంత ఎక్కువగా ఆదాయ ముంటుంది. ఎంత చిన్న దేశమైనా కాలువలు ప్రవ్వించాలి ధనరూపమైన పన్నులూ ధాన్యరూపమైన పన్నులూ ఇత రులకన్నా పేదలమీద తక్కువగా వేయాలి. అప్పుడే ధర్మార్థాలు రెండూ అభివృద్ధి అవుతాయి. పన్ను లిచ్చు కోలేక ప్రజలు పరాయిదేశాలు పట్టిపోతే వారించక, వారిపశువులను తీసుకోవచ్చనీ, ఇళ్లు పడగొట్టి వంట చెరుకు చేసుకోవచ్చుననీ భావించే యుద్ధభూమిలో నక్కల్లాంటి అధికారు లుండే రాజుకు ఏడుదీవులు జయించినా సమృద్ధి లేదట. వినండి.

ప్రజలవసిచన్న బిలువ కప్పసుల గొలుచు
నమ్మి యిం డ్లింధనంబున కాయె నటెడు
కలని నక్కైన యధికారి గల నృపతికి
నేడుదీవులు గొన్న సమృద్ధి లేదు. [ఆముక్త. 4-237]

ఇటువంటి దృక్పథం ఉంది కాబట్టే రాయలవారు

తాము ఏయే దుర్గాలు జయించారో వాటిని సమర్థులకిచ్చి, కొన్ని చోట్ల పాతవాళ్లనే నియమించి వ్యవసాయానికి వసతులు కల్పింప జేసేవారు. కొండవీడును జయించాక ఆదుర్గరక్షణ దానిని సాధించిన సాళువ తిమ్మరుసయ్యగారికి రాయలు అప్పచెప్పాడు. ఆయన సమర్థుడైన తనమేనల్లుడు నాదెళ్ళ గోపమంత్రిని పిలిపించి కొండవీడుమీద పెత్తనం ఇచ్చాడు. కొండవీటివద్ద రాయలవారు ప్రతాపరుద్ర గజపతి కుమారుని మన్నించిన విషయాన్ని ముక్కు-తిమ్మనగారిలా చమత్కరించారు:

మునుకొని కొండవీటికడ మూఢత రుద్రుడు కృష్ణనందను
న్మనసిజు నిర్జయించె నది మానుషమే నరసేంద్రు కృష్ణరా
ధునృపతి కొండవీటికడ నావహభూమి ప్రతాపరుద్రనం
దనుడగు వీరభద్రు గరుణామతి గాచె జగత్ప్రసిద్ధిగన్.

[పారిజాతాపహరణం, 1-21]

పూర్వం కొండయింటివద్ద ఈశ్వరుడు కృష్ణకుమారుడైన మన్మథుని చంపాడు. అది అమానుషమని ఇవాళ కొండవీటి కృష్ణుడు రుద్రుని కొడుకును కాచాడు!

ఈ విజయాన్ని సాధించాక రాయలవారు అమరావతికి వెళ్ళి అక్కడ తులాపురుష దానం చేశారు. శ్రీశైలం వెళ్ళి స్వామిదర్శనం చేసుకొన్నారు. ఇది క్రీ. శ. 1515లో జరిగింది. బహుశా ఈ సంవత్సరమే రాయలు తమ కుమార్తెకు వివాహం చేసిఉంటారు. గోలకొండ సుల్తానులవద్ద వుండే ఆరవీటి రామరాజు ఆకొలువు మానుకొని రాయలవద్ద చేరాడు. ఇతని యోగ్యతలు గుర్తించి, తన కుమార్తె

నిచ్చి రాయలు వివాహం చేశారు. ఈ శుభకార్యం అయ్యాక రాయలవారు మళ్లీ కళింగదండయాత్రకు వెళ్లారు. ఈసారి తెలంగాణా అంతటినీ స్వాధీనం చేసుకొన్నారు. ఈ విజయాలను ముక్కు-తిమ్మనగారు ఇలా వర్ణించారు:

ఉదయాద్రివేగ యుత్యుద్ధతి సాధించె, వినుకొండ మాటమాత్రన వారించె
గూటము లొదరంగ కొండవీ డగలించె, బెల్లముకొండ యచ్చెల్ల జెరిచె
దేవరకొండ యుద్వృత్తి భంగముసేసె, జల్లిపల్లె సమగ్రశక్తి డుల్చె
గినుకమీర ననంతగిరి క్రిందుబడజేసె,గంబంబు మెట్టు గ్రక్కున గదల్చె
బలనికాయము కాలిమట్టులనె యడచు
గటకమును నింక ననుచు నుత్కలమహీశు
డనుదినమ్మును వెరచు నెవ్వనికి నతడు
రాజమాత్రుండె శ్రీకృష్ణరాయవిభుడు? [పారిజా తా. 1-23]

ముక్కు-తిమ్మనగారు ఉదయగిరినుంచి కంబంమెట్టు దాకానే రాయలవారి విజయాలు చెప్పి ఆతరువాత వాటిని పారిజాతాపహరణంలో స్పష్టంగా పేర్కొనక పోవడంచేత క్రీ. శ. 1516 లో తెలంగాణా విజయాలు లభించిన వెంటనే పారిజాతాపహరణ రచన జరిగిఉంటుందని, అది ఆయేడే రాయలవారికి కృతిసమర్పణ జరిగిఉంటుందని ఊహించ వచ్చు. కొండపల్లి - తెలంగాణా విజయాలు సిద్ధించాక రాయలవారు ఊరుకోలేదు. ఏకధాటిని జమ్మిలోయగుండా మంటలదారి చేసుకొంటూ కోనమన్నెం కాల్చి గోదావరిని అట్టుడికించి సింహాచలం వెళ్ళి అక్కడకు దగ్గరలో ఉన్న పొట్నూరువద్ద సేనలను ఆపించి ఎప్పటికైనా గజపతి వస్తాడా యుద్ధమిస్తాడా అని ఎదురుచూసి ఆర్నెల్లు ఆగి ఇంక రాడని

నిశ్చయించుకుని జయస్తంభం నాటించి సింహాచలంలో దేవుణ్ణి దర్శించి దానాలు చేశారు. ఇది క్రీ. శ. 1516 మార్చి 29 న జరిగింది.

ఆతరువాత రాయలవారు రాజధానిలో కొన్ని నెలలు ఉండి క్రీ. శ. 1517లో దక్షిణదేశయాత్రలకు వెళ్లారు. వివిధక్షేత్రాలు దర్శించారు. ఎట్టకేలకు రాయలవారికి 44 వ ఏట ఒక పుత్రుడు జన్మించాడు. తనతరువాత ఈ మహాసామ్రాజ్యానికి వారసుడు ప్రభవించాడని రాయలు పొంగిపోయి ఉంటాడు. ఆ పుత్రోత్సాహం ఇనుమడించి రాయలవారికి పట్టపగ్గాలు లేకపోయాయి. కళింగదండ యాత్రలో నిజంగా గజపతిని పాదాక్రాంతుణ్ణి చేసుకోవా లని సంకల్పించి, కూచివేశారు. దండు కదిలింది. వద్దని అప్పాజీ హెచ్చరించాడు. వినలేదు. గజపతుల రాజధాని కటకాన్ని రాయలవారు ముట్టడించారు. చుట్టూ దండు విడిసిఉంది. వద్దని వారించిన అప్పాజీకూడా ఉన్నాడు. గజ పతి చావో రేవో తేల్చుకోవా లనుకొన్నాడు. అతని సామంతులు, పదహారుమంది పాత్రులు విజృంభించ దల చారు. కథ అడ్డంతిరిగేటట్లుంది. అప్పాజీ చక్రం అడ్డువేశాడు. దొంగఉత్తరాలు వ్రాసి పదహారుమంది పాత్రులు వాస్త వానికి విజయనగరంవారి ఉప్పు తిని కటకంవారికి ద్రోహం తలపెట్టుతున్నారనే నమ్మకం గజపతికి కలిగేటట్లు చేశాడు. పాచిక పారింది. పాత్రుల తలలు తెగాయి. పట్టపురాజు పారి పోయాడు. కటకాన్ని రాయలు కాల్పించాడు. గజపతి బేరానికి దిగాడు. అప్పాజీ తన చాకచక్యంతో కయ్యాన్ని

వియ్యంగా మార్చి గజపతికుమార్తెను రాయలవారికి ఇప్పించి వివాహం జరిపించాడు. తన 45 వ వీట కృష్ణ రాయలు మరొక వివాహం చేసుకొన్నాడు.

రాయలవారికి మరోప్రేయసి ప్రాప్తిస్తుందని విద్వజ్జనులు ముందుగానే జోస్యం చెప్పారు. కటకాన్ని ముట్టడించడానికి ముందు బెజవాడలో ఆగి ఒక ఏకాదశినాడు రాయలవారు ఉపవాసం ఉన్నారు. ఆనాటి రాత్రి నాలుగో ఝామములో శ్రీకాకుళం ఆంధ్రవిష్ణువు కలలో కన్పించి ఒకటి ఆదేశించాడు. రాయలవారు నిద్రలేచి కాల్యకరణీయ విధులు తీర్చి నిండోలగంలో ఉండి వేదాగమ వినులగు విద్వజ్జనులను పిలిచి తన కల వివరించి దాని ఫలితం చెప్పమన్నాడు. వాళ్లు ఎన్నెన్నో మనవిచేసి చివరకు 'ఇతోధిక బహుప్రేయసీప్రాప్తి'ఉంటుందన్నారు. కలలో దేవుడు కోరినది గుళ్లూ గోపురాలూ కాదు; మడులూ మాన్యాలూ కాదు. రాయలవారు అడక్కుండ అటువంటివి దానంచేశాడు. ఆంధ్రవిష్ణువు అడిగింది ఏమిటంటే-ఒక పుస్తకం ప్రాయమనడమే. 'ఇప్పటిదాకా ఎన్నోరచనలు చేశావు. సంస్కృతంలో ప్రాసి మెప్పులు పొందిన నీకు తెలుగు అసాధ్యం అవుతుందా? కాబట్టి ఆంధ్రభాషను ఒక కృతి చేసి మాకు అంకితం యియ్యి' అన్న కోరికే కోరాడు దేవుడు. రాయలు వేయబోయే ప్రశ్న తనకు తెలుసుకాబట్టి దేవుడు ముందే చెప్పాడు. ఇతివృత్తం వివరించాడు. 'కన్నడరాయడా, నేను తెలుగురాయణ్ణి. నా కాకథ తెలుగులో చెప్పు' అన్నాడు. తెలుగులోనే ఎందుకు చెప్పమన్నాడంటే 'దేశం తెలుగు

దేశం; నేను తెలుగువల్లభుణ్ణి; తెలుగుకలకండలాగా తియ్యగా ఉంటుంది. దేశదేశాలరాజులు కొలుచుకొంటూఉంటే వివిధ భాషలు మాట్లాడే నీకు దేశభాషలందు తెలుగు లెస్సనని తెలియుదా!' అన్నాడు. ఆంధ్రవిష్ణువు తనతో చెప్పిన మాటలను రాయలవారు ఈవిధంగా గ్రంథస్థం చేశారు.

తెలుగదేల యన్న దేశంబు తెలుగేను-దెలుగువల్లభుండ దెలుగొకండ
యెల్లనృపులుగొలువ నెరుగవే బాసాడి-దేశభాషలందు దెలుగు లెస్స.

[ఆముక్త. 1-15]

ఆంధ్రవిష్ణువు ముచ్చటపడి చెప్పమన్న కథ చిన్నదే అయినా వన్నెకెక్కినది. శ్రీరంగంలో రంగమన్నారు స్వామి ఒక చిన్నదానిని పెండ్లిచేసుకొన్నాడు. ఆపిల్ల రోజూ తను జడలో ముడిచిన దండతీసి స్వామికైంకర్యానికి ఇచ్చేది. ఈమెపేరు గోదాదేవి. ఈమె ఇంకెవరో కాదు. ఈనాడు ఆంధ్రదేశపు శ్రీవైష్ణవులలో ఆడవాళ్లు చూడికుడుత్తమ్మ, ఆండాళ్లమ్మ అని పేరుపెట్టుకొంటారే-ఆపేర్లకు కారణభూతురాలు. అరవంలో 'చూడికుడుత్తనాచ్చియార్' అంటే ముడిచియిచ్చిన ముగుద అని అర్థం. దానినే రాయలవారు సంస్కృతీకరించి 'ఆముక్తమాల్యద' అన్నారు. ఈ చూడికుడుత్తమ్మ 'ఆండాళ్' కావడాని కొక కథ ఉంది.

తమిళదేశంలో శ్రీవిల్లిపుత్తూర్ అనే గ్రామంఉంది. క్రీ. శ. 725 ప్రాంతాలలో ఆ ఊళ్లో విష్ణుచిత్తుడనే భక్తుడున్నాడు. ఆయన పెరియాళ్వార్ అనే పేరున ప్రసిద్ధుడయ్యాడు. చక్కని భక్తిగీతాలు రచించి, వాటినిగానం చేస్తూ రోజూ కట్టిన పూలదండలు స్వామికి అర్పించేవాడు.

ఒకనాడు పెరియాళ్వారుకు తులసికోటలో ఒక ఆడపిల్ల దొరికింది. ఆ చక్కని బిడ్డను ఆయన శ్రీదేవో, భూదేవో, నీళాదేవో అని భావించి ఇంటికి తీసుకువెళ్లి పెంచారు. ఆపిల్ల పెరిగి పెద్దదయింది. ఆ కన్నె పాప రోజూ తండ్రి కట్టే తిరుమాలను తీసుకొని రహస్యంగా జడలో పెట్టుకొని నిలువు టద్దంలో చూసి మురిసిపోయి కొంతసేపు పోయాక దండను తీసి స్వామికైంకర్యానికి ప్రత్యేకించిన సజ్జలో ఉంచేది. దానిని పెరియాళ్వారు పెరుమాళ్లకు సమర్పించేవాడు.

తిరుమాలను తన కూతురు కురులలో పెట్టుకోవడం ఒక నాడు తండ్రి కళ్ళపడింది. అది అపచారంఅని ఆయన భావించాడు.ఎన్నాళ్లనుంచో ఇటువంటి కానిపని జరుగుతున్నందుకు ఆయన బాధపడ్డాడు. వేరే పువ్వులు సేకరించి ఇంకోదండ కట్టి స్వామివారికి సేవచేశాడు. ఆరాత్రి పెరియాళ్వారుకు కలవచ్చింది. అమ్మాయి ముడిచియిచ్చిన మాలలేఅధికంగా పరిమళిస్తున్నాయని, అవే తమకు ప్రీతికరమని భగవంతుడు చెప్పాడట. పెరియాళ్వారు కళ్లు తెరిచాడు. 'ఎన్నై ఆండాళ్, ఎన్నై ఆండాళ్,' అని కూతురును ప్రశంసించాడు. నాటినుంచీ ఆమెకు ఆండాళ్ అనే పేరు స్థిరపడిపోయింది. 'ఎన్నై ఆండాళ్' అంటే 'నన్నేలిన తల్లి' అని అర్థం.

ముడిచియిచ్చిన ముగుద కాబట్టి ఆండాళ్లమ్మకు 'చూడిదుత్త నాచ్చియార్' అనే మరోపేరు ప్రసిద్ధమైంది. ఆమెభక్తి ప్రగాఢమైనది. దేవుణ్ణే తప్ప వేరొకరిని పెళ్లాడ నని ప్రతిజ్ఞ చేసింది. తనకోరిక తీరడానికిమార్గశిరమాసంలో నోము నోచింది. శ్రీవిల్లిపుత్తూరునే గోకులంగా, ఆడపిల్లలను

గోపకాంతలుగా ఆమె రోజు కోపాశురం చొప్పున గానం చేస్తూ నోము నోచింది. ఆమె ఆనాడు పాడిన పాటలే తిరుప్పావై అనే సంకలనం అయాయి. ధనుర్మాసంలో నేడీ పాశురాలు పాడనిదే శ్రీవైష్ణవులకు తెల్లవారదు. ఆండాళ్లమ్మ పాడిన పాటలు ఎంత ప్రసిద్ధమైనా యంటే ధనుర్మాసాన్ని వైష్ణవులు తిథులతో లెక్కించడం మానేశారు. ఉదయం పాడే పాటలలోని తొలిమాటలతో ఆరోజును వ్యవహరిస్తారు.

చూడికుడుత్తమ్మ నోములు పండి శ్రీరంగనాథుణ్ణే పెళ్లి చేసుకుంది. ఆమె గానం చేసిన యితర గీతాలు 'నాచ్చియార్ తిరుమొళి' అనేపేర వైష్ణవులకు పారాయణగ్రంథాలు అయాయి. పెరియాళ్వార్ గానంచేసినవి దివ్యప్రబంధంలో చేరాయి. ఈయన మధురలోనున్న పాండ్యరాజుసభలో వాదం చేసి శ్రీవైష్ణవాన్ని స్థాపించాడు. రాజు బ్రహ్మరథం పట్టించి ఈయనను విల్లిపుత్తూరుపంపించాడు. ఆయనకు భగవంతుడు సాక్షాత్కరించాడు. ఇప్పు డాయన చెప్పిన గీతాలు సుప్రసిద్ధమైనాయి. అందులో మొదటిది ఇది.

పల్లాండుపల్లాండుపల్లాయిరత్తాండు-పలకోడి నూరాయిరం
మల్లాండ తిండ్రోళ్ మణివణ్ణా!-ఉన్ శేవ్వడి శేవ్వి తిరుక్కాప్పు!

దీని అర్థం బోధపడకపోయినా తెలుగువాళ్లు పలుసార్లు ఈగీతాన్ని వైష్ణవుల నోట వింటూనే ఉంటారు.

పలుయేండ్లు పలుయేండ్లు పలువేనవే లేండ్లు-పలుకోటి నూరేండ్లకున్
అరిమల్లురను గెల్చు మణివర్ణ నీ-అరుణచరణాల సిరికి తిరురక్ష.

అని పైదానికి అర్థం. విష్ణుచిత్తులవారూ, ఆండాళమ్మా తమిళంలో గొప్ప కవిత్వం చెప్పిన వ్యక్తులు. పన్నెండుమంది ఆళ్వారులలో ప్రముఖస్థానం ఉన్నవాళ్లు. వీరిచరిత్రను కావ్యంగా వ్రాయమని దేవుడే తనకు ఆదేశించాడని కృష్ణరాయలవారు భావించి 7 ఆశ్వాసాలలో 878 గద్యపద్యాలతో ఈ కావ్యాన్ని వ్రాశారు. అయితే ఇందులో 'అన్నంకన్నా ఆధరువులే ఎక్కువ'అన్నట్టు కథ కన్నా వర్ణనలే అధికం. ప్రథమాశ్వాసంలో 89 గద్యపద్యాలున్నాయి. వీటిలో 49 పద్యాలు మంగళాచరణంనుంచి షష్ఠ్యంతాలదాకా ఉన్న అవతారిక ఆక్రమించింది. 50 వ గద్యతో కథ ప్రారంభించి 51 నుంచి 76 దాకా 26 పద్యాలలో శ్రీవిల్లిపుత్తూరు పురవర్ణన. ఇందులో వరిగింజతో తాంబూలరక్తిమను తోముకొనే వారకాంతలు మొదలైన వారి ప్రసక్తి ఉంది. 77 వ పద్యంలో విష్ణుచిత్తులవారు రంగంలో అడుగుపెడతారు. 78 నుంచి 85 దాకా 8 గద్యపద్యాలలో ఆయన భార్యాసమేతంగా ఎలా అతిథిసత్కారాలు చేస్తారో చెప్పడం; 86 నుంచి 89 దాకా మూడు ఆశ్వాసాంతపద్యాలు ఉన్నాయి. ఎనిమిది గద్యపద్యాలలో రాయలవారు చేసిన విష్ణుచిత్తుని గృహవర్ణన ఆనాటి వైష్ణవసంసారిని కళ్ళముందు సజీవంగా చిత్రిస్తుంది.

గగనము నీటిబుగ కెనగా జడివట్టిన నాల్గు భార్యక
న్నొబగ సొరకుండ్ల నారికెడపుంబొరియ ల్గవులించి వండ న
య్యగపల ముంచిపెట్టు గలమాన్నము నొల్చిన ప్రప్పు నాలుగే
నొగిపినకూరలు న్వడియము ల్వరుగు ల్పెరుగు న్ఘృతప్లుతిన్.

[ఆము క్త. 1-80]

ముసురుపట్టిన రోజులలో పొయ్యి మండక, వండే ఇల్లాళ్ళ కష్టాలో పొగ పడుతుంది. తన భార్యామణికి ఈ బాధ లేకుండా ఎండు కొబ్బరిబోండాలను జాగ్రత్తచేశాడు. వరిఅన్నం. చాయపప్పు, నాలుగైదు సాతాళించిన కూరలు, వడియాలు, వరుగులు, పెరుగు, నెయ్యి ఆకొబ్బరిచిప్పలతో తోడి వడ్డించడానికి పీటలైనంత సమృద్ధిగా అవలీలగా వండి పెట్టుతుంటట. వానకాలంలో వంట వండడానికి ఇల్లాళ్ళు ఎంత శ్రమపడతారో మనోఘట్టంలో రాయలీలా వర్ణించాడు:

ఇల్లిల్లు దిరుగ నొక్కిం తబ్బు శిఖి యబ్బె నేనింటిలో బూరి యిడి విసరక
రాజదు రాజిన రవులుకొల్వాసలెగాని కల్గదు గూడు దాన గలిగ
నేని కూరగుట మండైన బెన్నొగ సుఖ భుక్తి నేకూర దాభుక్తి కిడిన
బ్రాగ్భక్తలకత్రిగుబహుజనాన్నముదీర నారుల కొదవు పునఃప్రయత్న
మాజ్యపటముఖ్యలయ మెన్నరాలయాంగ
దారులయ మెన్నరంతిక కారజనిక
పచనానాంధోగృహిణి రామి బడక మరుదు
వెడవెడనె యూర్వనొగిలిరజ్జడినిగృహులు. [ఆముక్త. 4_127]

ఇల్లిల్లూ తిరిగితే ఏదో కొద్దిగా నిప్పు దొరుకుతుందట. దొరికినా, ఇంట్లో ఎండుగడ్డి పెట్టకపోతే అది రాజుకోదట. రాజుకొన్నా ఇంటివాసాలు పొయ్యిలో పెడితేగాని ఆ నిప్పు రగుల్కొనదు. రగుల్కొన్నా అన్నం ఉడకదు. ఒకవేళ ఉడికినా ఇల్లంతా ఆవరించిన పొగతో సుఖంగా భోజనం చేయడం పడదు. ఇంతకూ వేళగాని వేళ ఎవరైనా వస్తారని ఎందరి కోసమో వండి వార్చిన అన్నం తోలిబంతివాళ్ళకే సరిపోతుంది. ఆడంగులు మళ్ళీ వంట

ప్రయత్నం చేసుకోవాలి. నేయిపోసి తడిపిన గుడ్డలు పొయ్యిలో పెట్టడానికైనా ఆసమయంలో నెనుకాడరు. ఇంట్లో ఉన్న కొయ్యసామాను పొయ్యిలో పడెయ్యడానికి సంకోచించరు. తరువాత అంట్లూ ఎంగిళ్లూ ఎత్తుకోవాలి. ఎంత రాత్రి అయినా పని తేమలదు. తొందరగా మగువ తన కేళికామందిరానికి రానందుకు ఇంటాయన తహతహ లాడుతాడు. కామయ్య కచ్చలో కందులు వేయిస్తాడు. వర్ష కాలంలో గృహస్థుల యిక్కట్లు రాయలవారు ఎప్పుడు చూశారో తూచాతప్పకుండా చిత్రించారు.

సాధారణగృహస్థులవంటివాడు కాడు కనుక విష్ణు చిత్తులవారు తన భార్య కీబెడద తప్పించే ఏర్పాట్లుచేశారు. అర్ధరాత్రికూడా ఆయింట్లో వడ్డనలు జరుగుతూనేఉంటాయి. ద్రావిడవేదాన్ని పారాయణచేస్తూఉంటారు. విష్ణుచిత్తులవా రీవిధంగా భాగవతులను సేవిస్తూఉంటారని చెప్పి రాయల వారు రెండో ఆశ్వాసంలోకి వెళ్లారు.

ద్వితీయాశ్వాసంలో కథ ఎత్తుగడకు, మొదటి దానికీ ఏవిధమైన సంబంధం లేదు. దక్షిణమధురను వర్ణించడం మొదలుపెట్టారు. 31 పద్యాలలో ఆ పురవర్ణన జరిగాక ఆ రాజ్యాధిపతి మత్స్యధ్వజుణ్ణి 6 పద్యాలలో వర్ణించారు. ఆరాజు నలాఉండమని, తీరుబాటుగా 26 పద్యాలలో వేసవికాలాన్ని వర్ణించారు (2-45 నుంచి 2-70 దాకా). అటువంటి వేసవిలో ఒక పరదేశి విప్రుడు ఒక అరుగుమీద పడుకున్నాడు. అప్పుడు, మొదట వర్ణించిన రాజుగారు మత్స్యధ్వజుడు భోగంవాళ్ళ ఇంటికి బయలు

దేరా డని చెప్పాను. వెలయాలి ఇంటికి వెళ్ళడానికి ఎంత హుందాతన మో చూడండి.

పన్నీటితో గదంబము జేసి పూసిన మృగనాభిపస రాచనగరు దెలుప
పాటలానిలము లార్పగ దపారపుజుంగు లలయ దావికి మూగు నళులజోప
గర్ణడోలామా క్తికచ్ఛాయ లెగబ్రాకు నుపహారరుచుల ద్రస్తరికి దన్న
శశికాంతి చెంగావి దసిలి మించిన కేలి స్వర్ణత్నరువు వాడి వాలు మెరయ
మెలత యడపము దేజర న్మేరువనగ_దలవరులు గొందరొలసి ముందర జనంగ
నర్థి రథ్యాంతరాంతఃపురాంతరమున_భోగినీసంగతికి రాజు వోవుచుండి.
[ఆముక్త. 2_75]

రాచనగరులో ఉండేవారే పన్నీటితో కలిపిన కస్తూరిపూసుకొనేవారు కాబోలు.సువాసనతోటే హోదాను ఆ నోజులలో పోల్చుకొనేవారు. సిగపూవుల పరిమళానికి మూగుతున్న తుమ్మెదలలాగ టోపీకుచ్చులు పాటలానిలం వల్ల ఊగుతున్నాయట. హారాల కాంతులు ఎగబ్రాకుతూ ఉంటే వాటిని చెవులనున్న ముత్యాల వెల్గులు కిందకు తోస్తున్నాయట. ఉదయచంద్రుని కాంతిలాంటి చెంగావి పంచె అంచుని పట్టుకొన్న చేతిలో బంగారుపిడి గల కత్తి మెరుస్తూఉంటే పరిచారిక పాన్‌దాన్ పట్టుకొని రాగా కొందరు తలారులు ముందు దారితీయగా భోగకాంత ఇంటికి రాజుగారు దయచేస్తున్నారు.

ఆసమయంలో అరుగుమీద పడుకొన్న పరదేశి విప్రుడు ఒక శ్లోకం చదివాడు. వర్షాకాలం నాల్గునెలల కోసం మిగతా ఎనిమిదినెలలు పాటుపడి సామానులు జాగ్రత్తచేసుకొన్నట్టు రాత్రి కావలసిన దానికి పగలు.

ముసలితనంలో కావలసినదానికి యౌవనంలోనూ, పరలోకంలో కావలసిన దానికి ఇహలోకంలోనూ జాగ్రత్త చేసుకోవాలని ఆ శ్లోకం చెప్తుంది. దీనిని వినగానే రాజుగారికి వైరాగ్యం వచ్చింది. తనకు ముక్తిమార్గం ఎవరు బోధిస్తారో వారి కింత ధన మిస్తానని చెప్పి అది కోటలో వేళ్లాడకట్టారు. రెండవ ఆశ్వాసంలో 86 వ పద్యందాకా ఈ కథ చెప్పి దీనికీ, మొదటి ఆశ్వాసంలో దానికీ రాయలవా రిప్పుడు ముడివేశారు. ఈ రాజుకు ఉపదేశం చేయమని విష్ణుచిత్తులవారిని భగవంతుడే పంపిస్తాడు. దీనితో రెండో ఆశ్వాసం ముగుస్తుంది.

మూడవ ఆశ్వాసంలో విష్ణుచిత్తుడు రాజసభలో ప్రవేశించడం, 3 పద్యాలలో పరమతాలను ఖండించడం, 5 పద్యాలలో స్వమతాన్ని స్థాపించడం జరుగుతుంది. తరువాత రాజుగారి కాయన ఒక పురాణకథ విన్పిస్తాడు. ఖాండిక్య కేశిధ్వజు లనే అన్నదమ్ములు భౌతిక రాజ్యంకోసం యుద్ధం చేస్తారు. ఆధ్యాత్మికజ్ఞానంకోసం కలుసుకొంటారు. ఇది 86 గద్యపద్యాలలో రాయలవారు చాలా చక్కగా కథనం చేశారు. గెలిచిన ప్రభువుగాని, ఓడిపోయిన రాజుగాని ఎలా ధర్మబద్ధులై ఉండాలో వివరించారు. ఈ ఆశ్వాసంలోని 93 పద్యాలలో మొదటి 13 పద్యాలూ చివరి 4 పద్యాలూ తీసేస్తే ఇదొక స్వతంత్రఉపాఖ్యానంగా నిలబడుతుంది.

నాల్గవ ఆశ్వాసం ఈ కావ్యంలో చాలా పెద్దది. ఇందులో 289 గద్యపద్యాలున్నాయి. మత్స్యధ్వజుని సభలో గెలిచిన విష్ణుచిత్తులవారు శ్రీ విల్లిపుత్తూరు

బయలుదేరడం, భగవంతుడు సాక్షాత్కరించడం, భక్తుడు పరవసించి దశావతారాలను కీర్తించడం, తరువాత మేళ తాళాలతో స్వగ్రామంలోకి ప్రవేశించడం ఒక భాగం. ఇందులో 37 గద్యపద్యాలున్నాయి. ఇందులో 15 పద్యాలు దశావతారప్రశంస. తొలిరాయలయుగంనుంచీ ప్రబంధ శాఖలో ఇదొక రెమ్మగా సాగింది. శ్రీనాథుడు మొదట శృంగారనైషధంలో దశావతారాల ప్రస్తుతి మొదలు పెట్టాడు. నలుడు మాధ్యాహ్నికపూజలో దశావతారాలను స్తోత్రం చేసినట్లు శ్రీనాథుడు 29 పద్యాలు (వాడు (8-120 నుంచి 148 దాక). తాళ్ళపాక అన్నమాచార్యుల వారు ఎన్నో సంకీర్తనలలో దశావతారాలను పేర్కొన్నారు. ఈ స్తుతులు ముక్కుతిమ్మనగారి హృదయానికి బాగా హత్తుకొన్నాయి. పారిజాతాపహరణంలో పదిపద్యాలలో అవతారాలను వర్ణించారు (3: 28-38 దాక). రాయల వారుకూడ ఇక్కడ అనుసరించారు. ఇది చూసి అల్లసాని పెద్దనగారు, తెనాలిరామకృష్ణుడు, ఆతరువాత చాలామంది అనంతరకవులు అవతారాల ప్రశంస చేశారు.

నాలుగ్గోఅశ్వాసంలో విష్ణుచిత్తులవారికథ 37 గద్య పద్యాలతో ఉన్నా ఒక సుదీర్ఘమైన వచనంలో విష్ణుచిత్తుల వారి ఊరేగింపును రాయలవారు వర్ణించారు. అది ఏ అల్ల సానిపెద్దసగారి ఊరేగింపునో స్ఫురణకు తెస్తుంది. మేళ తాళాలు, సానికూతుళ్లు, రాజకుమారులు, వారి సరసాలు, సల్లాపాలు, కేరింతలు, నవ్వులు, బుక్కదాసరులు, అగ సాలెలు, తొడతొక్కడీ, రద్దీ, కోలాహలం మొదలైనవి

లోకాతీతప్రజ్ఞతో రాయలవారు వర్ణించారు. తరువాత 247 గద్యపద్యాలలో యామునాచార్యులవారి కథను రాయలవారు చెప్పారు. నిజానికి కథనం 139 గద్యపద్యాలే అని చెప్పవచ్చు. ఏమంటే, మధ్య 108 పద్యాలలో రాయలవారు ఋతువర్ణనం చేశారు. దానికీ, కథకూ సంబంధం లేదు. యామునాచార్యులవారి చరిత్రం అనుకున్న 139 పద్యాలలో ఆయన చెప్పిన రాజనీతి 82 పద్యాలు. వీటిని కూడా తోలగిస్తే కథాభాగం 57 పద్యాలుమాత్రమే. ఈ కథ చిన్నదిగా కన్పించినా ఎన్నతగ్గదే.

పాండ్యరాజు పరమశైవుడు. అతని భార్యకు విష్ణు భక్తి. రాజుగారికి 'వీరశైవం' ముదిరింది. రాణిగారిలో విష్ణుభక్తి హెచ్చింది. ఆమెదినచర్యను రాయలిలా వరించారు.

వింగడంబైనట్టి ముంగిట నెలకొన్నబృందావనికి ప్రొద్దు బెట్టుదాన
దళమినా డేకభుక్తము జేసి యవలినాడోర్చి జాగరముతోనుండు నిట్లు
బారసి పోనీదు పైనిద్రబారుటక్కలువాడు మత్పుణ్యకథల ద్రోయు
నేమఁపుమూనాళ్లు కామింప దధినాథుమనునాడు కన్నును మనసు దనిఁకు
నారజపువన్నె బతిసెజ్జకనుగుగూర్మి-నరుగుచో నాభిమడిచి కప్పురపునాభి
బెట్టునిట్టులు మద్భక్తి పుట్టియును ని-జేశునెడభక్తిచెడదు మదిష్టమగుట. 1

[ఆము క్త. 4-50]

---

1. ఈ పద్యంలో 'బారసి' అనే ప్రయోగం ఉంది. దానికి 'ద్వాదశి' అని అర్థం. ఈ మాటను దోనయామాత్యుడు, భైరవకవికూడా వాడారు. సస్యానందం ముద్రాపకులు 'పారశి' అని అచ్చువేశారు. సరైన రూపం 'బారసి' అని ప-వర్గంలోని వర్ణత్రితీయంలోనే సాధురూపం ఉన్నదని తెలుస్తుంది. దీని దృష్ట్యా 'సమగ్రాంధ్రసాహిత్యం' 4-వ సంపుటి పుట 27 లోని విషయాన్ని సవరించాలి.

ఈపద్యంలో ఒకటి గుర్తించాలి. భర్త శైవాన్ని స్వీకరింపకపోతే అటువంటివాణ్ణి విడిచిపెట్టడం అవసరం అని వీరశైవం ప్రబోధించింది. పండితయ్య ఇది ఖచ్చితంగా ఆదే శించాడు (శివతత్త్వసారం, 231-233). ఇక్కడ రాయల వారుమాత్రం భార్యాభర్తలకు విడాకులు ఇప్పించలేదు. పతిభక్తి విష్ణుమూర్తి ఇష్టంగనుక ఆమె నిజేశునియెడ భక్తి చెడదట. ఈపాండ్యరాజును వైష్ణవమతంవైపు తిప్పడానికి విష్ణుమూర్తి యామునాచార్యులను నిర్ణయించారు. వైష్ణవ వటువు రాణిని కలుసుకొని "వాదం వెడితే నేను పరమతాలను ఖండించి విష్ణుతత్త్వమే పరతత్త్వ మని నిరూపిస్తాను. అయితే ఈసంగతి రాజుగారికి ఎవరు చెప్తారు? ఆయన విష్ణుభక్తి విముఖుడుకావున వైష్ణవుల మనవి విన్నవించడానికి అంతా భయపడుతారు. నువ్వు విష్ణుభక్తిపరాయణురాలవు. నీభర్త నీకు నిధేయుడు. ఆయనకు చెప్పి వాదం వెట్టించు" అని యామునాచార్యుడు కోరాడు. ఆమె భర్తకు విన్నవించింది. వాదం పెట్టించింది.

యామునాచార్యుడు సభలో ప్రవేశించాడు. రాజుగా రికి నవ్వు వచ్చింది. వైష్ణవవటుని ఆకారం హ్రస్వం. రాజుగా రిలా అన్నారు.

సంగతియెయోయిసుమంతటింగరావు-తత్త్వనిర్ణయవాదంబు తరమె నీకు
నోడితేనియబట్టి మొర్రో యనంగ-లింగమునుగట్టకుడుగ మెరింగినొడువు.
[ఆము క్త. 4-60]

వాదంలో ఓడితే నీకు లింగకాయ కట్టించకమానను అని

రాజు బెదిరించాడు. యామునాచార్యుడు భయపడలేదు. ఇలా చెప్పాడు.

పంతమైనను గానిమ్ము పార్థివేంద్ర-యుక్తులను నిగ్రహస్థాన మెవనినేని
యమ్మతెచ్చిన విద్వాంసుడనగ వలన-దెట్లు గావింపవలయు నట్లట్ల చేయు.
[ఆముక్త. 4-69]

అమ్మతెచ్చిన విద్వాంసుడని కనికరించనక్కరలేదు. నేను ఓడితే నీయిష్టం వచ్చినట్టు చేయవచ్చు అన్నాడు.

ఆరోజులలో రాజసభలలో అమ్మతెచ్చిన విద్వాంసులని ఉండేవాడుకాబోలు. ముక్కు-తిమ్మనగారు రాయలవారి కొలువులో 'అమ్మతెచ్చిన విద్వాంసులే' అన్న ప్రతీతి ఉంది. తిమ్మనగారు తిరుమలదేవి తెచ్చిన కవీశ్వరులనడంకన్న చిన్నాదేవి మెచ్చిన సాహిత్యబంధువు అనడానికే ఆసారాలు కనబడుతున్నాయి. 'అమ్మతెచ్చిన విద్వాంసు'డనే మాట వాడుతున్నప్పుడు రాయలవారి మస్తిష్కంలో ఏజ్ఞాపకాలు మెరిశాయో మనం చెప్పలేం. యామునాచార్యులవారుమాత్రం ఎవరో సమకాలికవ్యక్తులను గుర్తుచేసి ఉంటారు.

యామునాచార్యులవారు పరమతాలను ఖండించి స్వమతాన్ని వైదుష్యంతోనే స్థాపించినట్టు రాయలవారు వ్రాశారు. అయితే 'గురుపరంపరాప్రభావం' అనే వైష్ణవ గ్రంథంలో యామునాచార్యులు జయించిన పద్ధతి ఇంకొక రకంగాఉంది. ప్రతిపక్షి యామునాచార్యుని చూసి 'నీవు విద్వాంసుడవైనా, బాలుడవు. నాతో వాదించలేవు. అందు

చేత నువ్వు మూడు లౌకికవాక్యాలు చెప్పు. నేను వాటిని ఖండిస్తాను.' అన్నాడట. 'అలాగే కానీయండి'అని ఇసుమంత టింగణాలాంటి యామునాచార్యుడు చెప్పిన వాక్యాలు చాలా చిన్నవి. 'నీతల్లి గొడ్రాలు కాదు. ఈరాజు సార్వభౌముడు. రాజమహిషి పతివ్రత' అని మూడు ప్రకటనలు చేసి ఖండించమన్నాడు. ప్రతిపక్షి నోరు మూసుకొని పరాజయం ఒప్పుకొన్నాడు.[1]

రాయలవారు ఈవిధంగా మాటకారితనంతోకాక ఆధ్యాత్మికవాదంతోనే యామునవిజయం కథనం చేశారు. వారికి విశిష్టాద్వైతం క్షుణ్ణంగా తెలుసు. అందుచేత ఆ మతంలో తమకు నచ్చిన విషయాలను, అవకాశంకలిగినప్పుడల్లా, గ్రంథస్థం చేశారు. యామునాచార్యచరిత్రను పనికట్టుకొని విష్ణుచిత్తుని కథకు ముడిపెట్టారు. వాస్తవానికి పెరియాళ్వారుకు యామునాచార్యులు చాలా అర్వాచీనులు. అయినా రాయలవారు స్వతంత్రించి ప్రాచీనుణ్ణి చేశారు. దేవుని నోటంట ఈకథను సవిస్తరంగా చెప్పించారు. ఆముక్తమాల్యదలో నాల్గవఆశ్వాసం చివరిదాకా ఇదే కథ.

అయిదవఆశ్వాసంలో అసలుకథ మొదలవుతుంది. తిరుమలసికోటలో గోదాదేవి దొరకడం నాల్గుపద్యాలలో చెప్పించి ఆమెయవతారం ముచ్చటించారు. 30 పద్యాలలో నఖశిఖపర్యంతం వర్ణించారు. ఆమె చెలికత్తెలనుగురించి రెండుపద్యాలలో చెప్పి ఆమె ఆముక్తమాల్యద కావడం

---

1. ఆముక్తమాల్యద, వావిళ్ళప్రతి, ఉపోద్ఘాతం — మేడేపల్లి వెంకటరమణాచార్యులవారు, పుట 9.

రెండు పద్యాలలో చెప్పారు. ఒకటి సీసపద్యం. విష్ణుచిత్తుల వారు ధనవంతులైనా నిగర్వంతో మాలలు కడుతూ ఉంటారు. కుమార్తె తండ్రి

గట్టెడుకమ్మచెంగలువవిరుల
తోమాలెలలకలు దువ్వి కంతునకునార్ద్రనిబద్ధఖేటకం బనగ నీల [నంగు
వృషకకుద్రేఖనెడమ కొక్కింత యొరగ_నిడిన ధమ్మిల్లవలయంబు నడుగ
గొంతసే పర్థి గీలించి కూపవారి_నీడ వీక్షించి క్రమ్మర గూడ నునుచు.

[ఆముక్త. 5-38]

గోదాదేవి కొప్పు నెమలిఈకలతో చేసిన మన్మథుని డాలులాగా ఉన్నదట. అది నల్లఆంబోతుమూపురంతీరున ఉన్నదట. దానిక్రింద కొంచెంసేపు ఆ మాల పెట్టుకొని నూతిలో నీడ చూసుకొని మళ్ళీ ఆ మాల పూలబుట్టలో పెట్టేసేదట. దీనితరువాత పద్యంలో చూడికుడుతమ్మను మగ్గోలా వర్ణించారు.

ఆ నవలా యలంతిపసుపాడి దుకూలము డాల్చి గుబ్బచన్
గోనల దావు లుప్పతిల గుంభము తేటల నిగ్గుదేర గ
ప్రానన నాభి దీర్చి పితృబద్ధలతాంతము లర్థి గొప్పునం
బూని యొకింత సే పునిచి పుచ్చి చెలిం గని వెచ్చ నూర్చుచున్.

[ఆముక్త. 5-39]

రెండుపద్యాలలో ముడిచి ఇచ్చిన ముగుదను వర్ణించిన తరువాత ఆమెవిరహాన్ని సుదీర్ఘంగా చెప్పారు. ఆమె కొంచెంగా వివిధఅవతారాలలో ఆదివిష్ణువును ఎత్తిపొడుస్తుంది. చెలికత్తె లామెకు చిలిపిగానే జవాబుచెప్తారు. గోదాదేవి రాధాకృష్ణులను దెప్పుతుంది. అప్పు డామె పూర్వ

జన్మకథను చెలికత్తె లామెకు చెప్తారు. ఆమె ఇతోధికంగా విరహాంలో పడుతుంది. శైతోప్యపచారాలు చేస్తారు. ఆమె వ్రతం మొదలైనవి 51 గద్యపద్యాలలో వర్ణించారు. తరువాత 48 పద్యాలలో వసంతవర్ణన, మళ్ళీ గోదాదేవి మదన తాపం. ఆమెపరిస్థితిని తెలియని పెరిభాగుల విష్ణుచిత్తుడు ''దేవా, నాకూతు రేదో వింతతపస్సు చేస్తూంది. ఏకాదశి నాడు జాగరం ఉంటూం. ఆమె రోజూ ఉంటూంది. వద్దంటే వినదు. మేం చెంబులతో స్వామివారి తీర్థం పుచ్చుకొంటే, ఒళ్లు తడుపుకొంటుంది. అన్నీ విరుద్ధమే. ఇదేం తపం? పిచ్చి కాబోలు'' అని మొరపెట్టుకున్నాడు. ఆ ఛాందసానికి దేవుడు నవ్వుకొన్నాడట. అంతలో ఐదవఆశ్వాసం ముగిసింది.

ఆరో ఆశ్వాసంలో 'పేరుకొనగాని కులం'లో ఉన్న తన భక్తుని కథ దేవుడే చెప్పడం మొదలుపెడతాడు. పూర్వం వామనావతారంలో దేవుడు నివసించిన పుణ్యాశ్రమానికి మూడామడల దూరంలో ఒక మాలవాడ ఉంది. అందులో ఒక దాసరి ఉన్నాడు. అతడు రోజూ తెల్లవారు జామున ఈ మూడామడలదూరాన్నీ నడిచి ప్రభాతవేళ దేవాలయం వెలుపల మంగళాశికిగీతాలు పాడుతాడు. గర్భగుడి కడిగిన నీళ్లు తూముగుండాపారి, రాతితొట్టి నిండి బయటకు పారితే ఆనీళ్ళను తీసి వీధూద్రుడైనా యిస్తే మహాప్రసాదమని పుచ్చుకొని మాలదాసరి మహదానందం పొందేవాడు. ఒకనాడు అద్దమరేతిరిని ఇంట్లో పిల్లి జొర బడితే భయపడి కోళ్లు కూశాయి. అది తొలికోడికూత అని భ్రమసి మాలదాసరి లేచి మంగళాశికీగానానికి బయలు

దేరాడు. చీకట్లో దారితప్పి ఒక బ్రహ్మరాక్షసిపాలబడ్డాడు. ఆకలితో ఆవురావురుమంటున్న రాక్షసుడు దాసరిని తినదల చాడు: "సరే, నేను గుడిముందు గానం చేసివచ్చాక తిను" అన్నాడు దాసరి. రాక్షసుడు ఒప్పుకోలేదు. తత్త్వబోధ చేసి, ఒట్లు పెట్టుకొని చివరకు ఒప్పించి, గుడినద్ద పాడి, అన్నమాట నెరవేర్చుకొందుకు తిరిగివచ్చాడు దాసరి.

అతడు వస్తాడని రాక్షసుడు భావించలేదు. వచ్చాక అతణ్ణి తినదలుచుకోలేదు. మంగళశిక్షాగానఫలం తనకు ధారపోసి తన క్షీరాక్షసత్వం తొలగించమన్నాడు. దాసరి అంగీకరించలేదు. బ్రహ్మరాక్షసి వైష్ణవమతోద్ధారకులైన రామానుజులు, మనవాళమహాముని, శఠగోప సూరి, వేదాంతదేశికుల వైనాలు చెప్పాడు. ప్రపన్నుడైన తనను విపన్నుడిగా చేయవద్దంటాడు. దాసరి అంగీకరిస్తాడు. రాక్షసుడు తన కథ చెప్తా నంటాడు. ఇంతతో 69 గద్య పద్యాలున్న ఆరో ఆశ్వాసం ముగుస్తుంది.

ఏడోఆశ్వాసం మొదటి 25 గద్యపద్యాలు బ్రహ్మ రాక్షసుని కథ. తరువాతి 50 గద్యపద్యాలు చూడికుడు తమ్మ శ్రీరంగనాయకులను సేవించడం, అతనిలో ఐక్య కావడం, దేవుడు మాయావధూటినామెస్థానంలోనిలపడం, కూతురు కనబడక విష్ణుచిత్తుడు విలపించడం, దేవుడు నచ్చ్ నకొని సమాధానం చెప్పడం, పెళ్లిమాటలు, గోదాదేవికి రంగనాథునితో కళ్యాణం మొదలైనవి ఉన్నాయి. దీనితో కావ్యం ముగుస్తుంది.

ఆముక్తమాల్యద తెలుగులో ఉన్న పంచకావ్యాలలో అత్యంతప్రౌఢమైనది. అప్పుడప్పుడు వ్రాసిపెట్టిన ఘట్టాలను చప్పాచప్పాన జారుముడివేసి కలిపినట్లు కనబడుతుంది. ఏఘట్టాని కాఘట్టం చక్కగా ఉంటుంది. రాయల వారు పాత్రలను చిత్రించిన తీరు నిరుపమానం. ప్రతిపాత్రా సజీవంగా కనబడుతుంది. సన్నివేశాలన్నీ సహజంగా ఉంటాయి. ప్రకృతిపరిశీలన అద్భుతం. రాయలవారి చేతికి ఎముక లేకపోవచ్చుగాని నోటికిఅడ్డుపెట్టుకొంటారు.మాటలు వాడడంలో ఎక్కడలేని పొదుపూ వుంటుంది. తమ కొలువులో ఉద్యోగం ఇచ్చేవాడిని నిశితంగా పరీక్షించి అర్హుడైతేనే నియమించే పద్ధతిలో వ్రాసే పద్యాలలో ప్రతిమాటను తూచివేస్తారు. వ్యర్థపదాలను పరిహరించడంతో అర్థం మరీ ఘనీభవించి బుర్ర వేడెక్కితేగాని భావం కరిగి రసనిష్పత్తి జరగదు. రాయలవారి అలంకారాలు నిజంగా చక్రవర్తి ధరించవలసిన భూషణాలలాగా బోలెడంత నగిషీతో ఉంటాయి. ఉత్ప్రేక్షలు, ఉపమలు, రూపకాలు కోకొల్లలు. రాయలవారి స్వభావోక్తులుస్వైతం నేలమీద నడవవు. ఏనుగులెక్కినట్లు ఎత్తునేఉంటాయి. రాయలవారి పద్యాలు కొన్ని సాతాళించిన ఇనుపగుగ్గిళ్లు. మరికొన్ని బొంత అరటిపళ్లు. ఎవరైనా ఒలిచి పెట్టి ముక్కలు చేసి వ్యాఖ్యానపు పంచదారలో ముంచి ఇస్తే వాటి రుచి తెలుస్తుంది.

ఆముక్తమాల్యదకు వావిళ్ళవారు వ్రాసిన 'రుచి' వ్యాఖ్య, వేదంవెంకటరాయశాస్త్రిగారు వ్రాసిన సంజీవనీ వ్యాఖ్య ప్రసిద్ధాలు. వావిళ్ల వారిది విద్యార్థులకు, వేదంవారిది

విద్వాంసులకు ఉపయోగిస్తాయని ఈయూణ్ణివారు చెప్పిన మాటలు అక్షరాలా నిజం.[1] ఆముక్తమాల్యద వ్రజాల గని. సంజీవినీవ్యాఖ్య సానపట్టే కార్ఖానా. ఈ రెండు ముద్రిత వ్యాఖ్య లేకాక మూడు అముద్రితాలుకూడా ఉన్నాయి. గట్టుపల్లి శ్రీనివాసకవి (క్రీ. శ. 1800) మహాటీక వ్రాశారు. తరువాత క్రీ. శ. 1813 ప్రాంతాల ఉప్పలపాటిజోగిజగన్నాధరాజుగారు 'బుధమనస్తోషణి' అనే వ్యాఖ్య వ్రాశారు. క్రీ. శ. 1848 కి పూర్వమే గుడిపాటి వెంకటకవిగారు 'తాత్పర్యబోధిని' అనే వ్యాఖ్య వ్రాశారు. పాతవ్యాఖ్యాతల అభిప్రాయాలను అక్కడక్కడ పేర్కొంటూ వేదంవారు మహాభాష్యం వ్రాశారు. ఇందులోని లోపాలను సవరించడానికి తగిన సమీక్షను దీపాలపిచ్చయ్యశాస్త్రిగారు చేశారు. వెల్దండ ప్రభాకరరావుగారు ఆముక్తమాల్యదపై చేసిన సవిస్తర పర్యాలోకనానికి ఈయూణ్ణి వెంకటవీరరాఘవాచార్యులవారు సుదీర్ఘమైన భూమిక వ్రాశారు. అందులో ఆముక్తమాల్యదకు సంబంధించిన అన్నివిషయాలను సమగ్రంగా తెలియజేశారు. క్రీ.శ. 1856-57 దాకా ఆముక్తమాల్యదపై గాని, రాయలవారిపై గాని, కృష్ణకి కృష్ణకర్తకు సంబంధమున్న ఏయితరవిషయాలపై గాని వెలువడిన గ్రంథాలు, వ్యాసాలు ఏమిటో వివరిస్తూ ఒక పట్టికను క్రోడీకరించారు. వారు లెక్కించినవి 105 ఉన్నాయి.

---

1. ఆముక్తమాల్యద పర్యాలోకనం — వెల్దండ ప్రభాకరామాత్య రచనకు 'ఆంధ్రసాహిత్యసౌరభభూమిక'. కర్త: ఈయూణ్ణి వెంకటవీరరాఘవాచార్యులుగారు.

ఇంతెమంది ఇన్ని వ్యాసాలు, గ్రంథాలు వ్రాసి రాయలవారి మహోన్నతకవితావృక్షానికి నిచ్చెనలు వేశారు. ఈ నిచ్చెనల మీద అందరూ ఎక్కలేరు. రాయలవారి వైదుష్యాన్ని, వ్యక్తిత్వాన్ని, ప్రత్యేకమైన దృక్పథాన్ని అర్థంచేసుకొనడానికి ఏళ్ళూ పూళ్ళూ పడుతుంది. సామాన్య సాహితీప్రియులకు అంత తీరుబాటు ఉండదు. రాయలవారు నేటి ఆంగ్లసాహిత్యంలో జేమ్సుజాయిస్ కోవలోనివారు. జాయిస్ వ్రాసిన యూలిసిస్, ఫెన్నిగాన్స్‌వేక్ అనే ఉద్గ్రంథాలను కొమ్మలుతిరిగిన విద్వాంసులు సహితం చప్పున అర్థంచేసుకోలేరు. వాటిమీద వివరణలు, టీకలు, భాష్యాలూ బోలెడు వెలువడ్డాయి. జాయిస్ రచయితల రచయిత. రాయలవారి రాకోవలో తొలిపూస.

ఆముక్తమాల్యదలోని పద్యాలను రచిస్తున్నపుడు రాయలవారి దృష్టిలో తమ ఆస్థానంలోఉన్న విద్వాంసులే ఉన్నారేమో అనిపిస్తుంది. వారు ఔనుఅని మెచ్చుకొనడమే వారు ఆశించినట్లు భావించవచ్చు. ప్రభువు కనుక తా మేది చెప్పినా తలఊపుతారు. అది కాదు తనకు కావలసినది. నిజమైన మెప్పు కావాలి. అందుకే ప్రతిపద్యాన్నీ ఒక సారి గ్రామం చేశారు. ప్రతివర్ణనా ఒక తైలవర్ణ చిత్రంలాగా రచించారు. రాయలవారు ఇంత శ్రమతో ఈ గ్రంథాన్ని వ్రాస్తే కొందరు సాహిత్యనిష్ణాతులే దానిని అల్లసాని పెద్దన గారు వ్రాశారనే వాదాన్ని లేవదీశారు. దానికి రకరకాల కారణాలను చూపించారు. పెద్దనగారు వ్రాసిన 20 పద్యాలు ఆముక్తమాల్యదలో కనబడతాయి. రాయలవారు తమ

కలితార్థయు_క్తి గోచరించదు. ఇంతకూ రాయలవారు దేవునిచేత అబద్ధం ఆడించవలసినంత దిగజారా రనుకోవడం ఆంధ్రసాహిత్యానికే అవమానం.

రాయలవారి కలలో ఆంధ్రవిష్ణువు కనబడిన తేదీ ఏమిటా అని పరిశోధకులు బహువిధాల చర్చించారు. కుందూరి ఈశ్వరదత్తుగారు క్రీ. శ. 1519 జనవరి 27 అని నిర్ణయించారు. ఓరుగంటి రామచంద్రయ్యగారు ఆ సంవత్సరమే నవంబరు 3 అన్నారు. క్రీ. శ. 1519 ఆగస్టు 8 తారీఖునాటికి కళింగదిగ్విజయం పూర్తిఅయింది. సింహాచలంలో రాయలవారు శాసనం వేయించారు. దేవునికి దానం ఇవ్వడానికి గజపతివద్ద గ్రామాలు పుచ్చుకున్నారు. ఆగస్టుకు పూర్వమే 'కళింగదేశవిజిగీష' రాయలవారికి ఉండాలి. అప్పుడే దేవుడు కనిపించినట్టు రాయలవారు వ్రాశారు. కుందూరివారి తారీఖు ఆమోదయోగ్యంగా ఉంది.

కళింగవిజయం పూర్తిఅయ్యాక రాయలవారు సుఖంగా కాలుమీద కాలు వేసుకొని కూర్చోలేదు. అలా యుద్ధాలు చేస్తూనేఉన్నారు. క్రీ. శ. 1520 నుండి 1523 దాకా బీజాపురం తురకలతోనే బోలెడు యుద్ధాలు జరిగాయి. రాయచూరుదగ్గిరలో ఉన్న కెంబావి, నైరామనగ్రామాల వద్ద యుద్ధాలు కళింగవిజయానికి ముందే-బహుశ జరిగాయి. ఆతరువాత ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ రాయచూరు స్వాధీనం చేసుకొన్నాడు. రాయలవారు స్వయంగా సేనలతో దుర్గాన్ని ముట్టడించాడు. ఆదిల్‌ఖాన్‌ను ఓడించి అతని

తుపాకులు, ఫిరంగులు, ఏనుగులు, గుఱ్ఱాలు రాయలవారు స్వాధీనం చేసుకున్నారు. ఆదిల్‌ఖాన్ పారిపోయి ఇతర మహమ్మదీయరాజ్యాలవారి సహాయం కోరాడు. వాళ్ళు రాయలవారికి లేఖలు వ్రాశారు. ఆదిల్‌ఖాన్ వద్దనుంచి తీసుకొన్నవి అతనికి తిరిగి ఇవ్వమని సూచించారు. లేకపోతే తాము ఉమ్మడిగా రాయలపై దండు వస్తామని బెదిరించారు. 'మీరు రానక్కరలేదు. మీవద్దకు నేనే యుద్ధానికి వస్తా' నని రాయలవారు జవాబు చెప్పారు. మూడిళ్ళ తురకలూ నోరు మూసుకొన్నారు.

తరువాత ఆదిల్‌ఖాన్ మళ్ళీ బేరాలు పెట్టాడు. తన సొత్తు తనకు ఇమ్మని ప్రాధేయపడ్డాడు. ఆదిల్‌ఖాన్ స్వయంగా వచ్చి తన పాదాక్రాంతుడై తన పాదాలను ముద్దుపెట్టుకొంటే ఆ ఆయుధసంపదను తిరిగి ఇచ్చేస్తానని రాయలు చెప్పాడు. ఇస్మాయిల్‌ఖాన్ విజయనగరం దర్బారుకు రాలేదు. అతణ్ణి వెంటాడుతూ రాయలు కలుబరిగ దాకా వెళ్ళాడు. ఆ విజయయాత్ర అక్కడితో ఆగలేదు. ఆ 'పంచగౌడధాత్రీపదం' దాకా వెళ్ళినట్లు పెద్దనగారిసాక్ష్యం ఉంది.[1] రాయలవారు క్రీ. శ. 1522 లో వేయించిన జయశాసనం ఒకటి గయలో ఉంది. అప్పటికి రాయలవారి వయస్సు 48 సంవత్సరాలు.

ఏభయ్యోపడిలో పడగానే రాయలవారి దృక్పథం మారినట్టుంది. రాజనీతిని ప్రదర్శించవలసినసమయాల్లో అహంభావాన్నే ప్రకటింపసాగారు. మూడిళ్ళతురకలలో

---

1. మనుచరిత్ర, 1-11.

ఇద్దరు ఏదో మొహమాటానికి ఆదిల్ ఖాన్ తరఫున ఉత్తరాలు వ్రాస్తే, వాటికి నొప్పించక తానొవ్వక సమాధానం చెప్ప వలసిన రాయలవారు 'మీరు రానక్కర లేదు. యుద్ధానికి నేనే వస్తాను' అని జవాబు చెప్పడంలో వాక్చాతుర్యమే కనబడుతోంది. శత్రురాజుల మాతలదగ్గిరకూడా పరుషాలు పలుకకూడదన్న రాయలవారు ఇలా ప్రవర్తించడం వింతే.

క్రీ. శ. 1523 నుండి, అంటే రాయలవారి 49 వ సంవత్సరంనుంచీ వారిమీద అప్పాజీ ప్రభావం తగ్గుముఖం పట్టింది. అప్పటి కాశీరఃప్రధాని ముసలివాడు అయ్యాడు. ఎంత లేదన్నా సహస్రమాసజీవి. ఆ పండుముసలితనంలో అప్పాజీ గోవాపరిసరాలలో యుద్ధం చేశాడు. పోర్చుగీసు వాళ్ళ చేతిలో ఓడిపోయాడు. ఈ పరాజయంతో రాయల వారికి అప్పాజీమీద ఉండే గౌరవం తగ్గుముఖం పట్టిన ట్టుంది. పైగా క్రీ. శ. 1524 లో రాయలవారు తమ ఆరేళ్ళ కుమారునికి పట్టాభిషేకం చేశారు. ఈ శుభకార్యం చేయాలన్న ఉద్దేశాన్ని బయటపెట్టినప్పుడు ఆదిలోనే అప్పాజీ కొంచెం అడ్డుచెప్పిఉండవచ్చు. 'ఇప్పు డేమంత తొందర? చిరంజీవికి సంపూర్ణపట్టాభిషేకం కాక యువరాజ పట్టం కట్టండి' అని సలహా ఇవ్వడానికి ఆస్కారం ఉంది. రాయలవారు లక్ష్యపెట్టలేదు. తిరుమలదేవరాయలకు పట్టం కట్టారో లేదో, కొద్దికాలానికే ఆ బాలుడు మరణించాడు. కిట్టనివాళ్లు అప్పాజీ విషంపెట్టించాడన్న పుకారు లేవ దీశారు. రాయలవారు నమ్మి, చేయగూడని ఆఘాయిత్యం చేశారు.

అప్పాజీకళ్ళు తోడించినందుకు ఆప్రధాని కుమారులు తిరుగుబాట్లు లేవనెత్తారు. రాజ్యంలో అల్లకల్లోలాలు ప్రారంభం అయాయి. అంత్యకాలంలో అప్పాజీని రాయలు విడుదలచేయించారుకాబోలు. జ్ఞానోదయం అయి. తన తరువాత తన సవతితమ్ముడే వారసుడని సమర్థునికే రాజ్యమిచ్చారు. కుమారునికి పట్టం కట్టినది మొదలు మరణించేదాకా రాయలవారు అయిదేళ్ళు మానసికవ్యథలకు లోనై ఉంటారు. అప్పాజీకి చేసిన ద్రోహానికి మళ్ళీ మళ్ళీ మనస్సులోనే విలపించిఉంటారు. అప్పాజీ సామాన్యుడు కాడు. రాజకీయంగా ఎంత ధురంధరుడో సంస్కారంలో అంత విద్వాంసుడు. సకలాగమపారావారపారీణుడు. అగస్త్యుడు వ్రాసిన బాలభారతానికి మనోహరవ్యాఖ్య వ్రాసిన రాయల వారితోపాటు రాచకార్యాలలోనే కాక భువనవిజయంలో జరిగే సాహిత్యగోష్ఠులలోకూడా అప్పాజీ పాల్గొనేవారని ఊహించవచ్చు.

రాయలవారు విద్వాన్మోదాలు జరిపే సభాభవనం పేరు'భువనవిజయం'. ఆయన నివసించే మందిరంపేరు 'మలయకూటం.' భువనవిజయంలో ఎనిమిదిదిక్కులా ఎనిమిది సింహపీఠికలు వేసి వాటిపైన ఎనమండుగురు కవులను నిలిపి రాయలవారు విద్వాన్మోదాలు జరిపేవారు. ఈ ఎనమండుగురే అష్టదిగ్గజాలుగా ప్రసిద్ధిచెందారు. సాహిత్యగోష్ఠిలో అష్టదిగ్గజాలు ఉండడం వైష్ణవసంప్రదాయం. క్రీ. శ. 1370 నుంచి 1443 దాకా ఉన్న మనవాళమహాముని వద్ద అష్టదిగ్గ

అష్ట దిగ్గజాలు - ఆయాపండితుల ఎంపికలు

సర్గ సం	గురజాడ	కందుకూరి	చిలుకూరి	కొమర్రాజు	వేటూరి	నేలటూరి	చాగంటి	నిడుదవోలు	ఈయూణ్ణి
1.	...	...	...	...	కవిరాట్టు	...	...	...	...
2.	తిమ్మన	తిమ్మన	తిమ్మన	తిమ్మన	తిమ్మన	తిమ్మన	తిమ్మన	తిమ్మన	తిమ్మన
3.	ధూర్జటి	ధూర్జటి	ధూర్జటి	ధూర్జటి	ధూర్జటి(?)	ధూర్జటి	ధూర్జటి	ధూర్జటి	ధూర్జటి
4.	పెద్దన	పెద్దన	పెద్దన	పెద్దన	పెద్దన	పెద్దన	పెద్దన	పెద్దన	పెద్దన
5.	...	మల్లన	మల్లన	మల్లన	...	మల్లన	మల్లన	మల్లన	మల్లన
6.	...	...	...	...	...	...	...	రాధా మాధవకవి	రాధా మాధవకవి
7.	రామకృష్ణ	రామకృష్ణ	రామకృష్ణ	రామకృష్ణ	రామకృష్ణ	రామకృష్ణ	రామకృష్ణ	రామకృష్ణ	రామకృష్ణ
8.	అయ్యలరాజు	అయ్యలరాజు	అయ్యలరాజు	అయ్యలరాజు	...	...	...	...	...
9.	...	...	...	...	పుత్తేటి	...	...	పుత్తేటి	పుత్తేటి
10.	భట్టుమూర్తి	భట్టుమూర్తి	భట్టుమూర్తి	భట్టుమూర్తి	భట్టుమూర్తి	భట్టుమూర్తి	...	...	...
11.	...	...	...	...	రుద్రకవి	రుద్రకవి	...	రుద్రకవి	రుద్రకవి
12.	శంకరకవి	...	...	...	...	...	...	...	...
13.	నూరన	నూరన	నూరన	నూరన	నూరన	నూరన	...	...	...

జాలూ, నవరత్నాలూ ఉండేవారు.[1] రాయలవా రీసంప్రదా
యాన్ని అనుసరించారు. భువనవిజయంలో ఆసీనులైన
ఎనమండుగురు కవులు ఎవరో మనం నికరంగా చెప్పలేం.
అందరూ ఆంధ్రకవులే అనుకోకూడదు. ఈ కవులు ఎవరై
ఉంటారని వివిధపరిశోధకులు చర్చించి తలోపట్టికా
ఇచ్చారు. గురజాడ శ్రీరామమూర్తిగారి దగ్గరనుంచి నిడుద
వోలు వెంకటరావుగారి దాకా ఎవరెవరు ఏఏ పేర్లు
చెప్పారో ఈయూణ్ణినారు వివరించారు. వారి ఉద్దేశంలో ఈ
దిగ్గజాలు ఎవరై ఉంటారో సూచించారు. ఈవివరాలన్నీ క్రోడీ
కరించి పట్టికగా (పుట 134) ఇచ్చాను. నిడుదవోలు వెంకట
రావుగారు అష్టదిగ్గజాలపై ఒక సవిస్తరవ్యాసం వ్రాశారు.[2]
అందులో వారిచ్చిన జాబితానే ఈయూణ్ణివారు ఆమో
దించినట్లు కనబడుతుంది. రుద్రకవిసంగతింకా పరిశోధించా
లని మిత్రులు వేదం వెంకటరాయశాస్త్రిగారు వ్రాశారు.[3]
సంకుసాల నరసయ్య అష్టదిగ్గజాలలో ఒకడేమో అని నా
అనుమానం.

భువనవిజయంలో ఆసీనులైన అష్టదిగ్గజాలకు రాయల
వారు కడపమండలంలోని తిప్పలూరు అనే గ్రామాన్ని
సర్వాగ్రహారంగా చేసి దానంచేశారని ఒక శాసనంవల్ల

---

1. వెల్దండవారి 'ఆముక్త మాల్యద పర్యాలోకనం' భూమికలో ఈయూణ్ణివారు చెప్పారు. పుట 22.

2. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక, ఉగాదిసంచిక, 1955-56 మన్మథ.

3. ఆముక్తమాల్యద-వేదంవారి ముద్రణ, ప్రకాశకవిజ్ఞప్తి, పుట28.

తెలుస్తున్నది.[1] అయితే ఇది రాయలు స్వయంగా చేసిన శాసనం కాదు. అష్టదిగ్గజాలకు దానం చేసిన ఈగ్రామంలో దొమ్మరిపన్నులు రద్దుచేస్తూ ఇతరులు ఈ శాసనాన్ని వేశారు. దీనిమూలంగా అష్టదిగ్గజాలు ఉండేవారనీ, వారికి రాయలవారు దానాలుచేసేవారనీ మాత్రమే చెప్పవచ్చు. కాని ఆకవుల పేర్లేమిటో, ఏయే భాషలవారో చెప్పలేం.

రాయలవారి పోషణలో ఇతర భాషల కవులుకూడా చాలామంది ఉన్నారు. తమిళ, సంస్కృత, కర్ణాటక సాహిత్యాలలో ఉద్దండులు కొందరు రాయల ఆస్థానంలో ఉన్నవాళ్లే. రాయలవారు దిగ్విజయాలకు వెళ్లేటప్పుడు ఏనుగులూ, గుఱ్ఱాలూ మొదలైనవాటినేకాక పరరాజుల కోటలలో ఉండే సాహిత్యసైంధవాలను, కవిమత్తేభాలను విజయనగరం తీసుకొని వచ్చేవారు. ప్రతాపరుద్ర గజపతి ఆస్థానంలో ఉండే లొల్లలక్ష్మీధరుడూ, దివాకరుడూ మొదలైన సంస్కృతపండితులూ, భండారు లక్ష్మీనారాయణ అనే నూత్నభరతాచార్యుడూ రాయలవారి ఆస్థానానికి వచ్చారు. చింతలపూడి ఎల్లనకూడా బహుశా ఆప్రాంతాన్నుంచే వచ్చాడేమో.

రాయలవారి ఆస్థానంలో కేవలం కవులే కాక ఇతర కళాకారు లెందరో ఉండేవారు. నటులు, గాయకులు ప్రముఖులు. రాయలవారు ప్రతియేడూ వసంతోత్సవాలు జరిపించేవారు. అటువంటి ఉత్సవాలలో కొత్త నాటకాలు ఆడడం సంప్రదాయం. 'తాయకొండ నాటకం'

1. A. R. 282 of 1937-38.

అనేది ఆనాడు బహుళప్రచారం కలదని చెప్పవచ్చు. ఈ నాటకం ఆడినందుకు నట్టువనాగయ్యను రాయలవారు సన్మానం చేసి శాసనం వేశారు. ఆరోజుల్లో ప్రముఖ తార విషయంకూడా తెలుస్తూంది. పోతవరపు కట్టువ తిమ్మయ్య కూతురు పాత్రధారణ చేసింది. వసంతోత్సవంలో ప్రదర్శించడానికి రాయలవారే స్వయంగా జాంబవతీ పరిణయం అనే సంస్కృతనాటకం వ్రాశారు. చాలాకాలాని కీకృతి దొరికింది. ఈయన్ణి వా రీరూపకంలో కొంత భాగాన్ని ప్రకటించారు.[1] జాంబవతీ పరిణయమేకాక ఉషాపరిణయం అనే నాటకంకూడా వ్రాశారట. ఇది వెలుగు చూడలేదు. ఆ కాలంలో గంగావతరణం అనే మరొక నాటకంకూడా ప్రచారంలో ఉండేది.

సంస్కృతనాటకాలు, తెలుగు యక్షగానాలూ మాత్రమేకాక ఆరోజులలో బొమ్మలాటలుకూడా విరివిగా ఉండేవి. బొమ్మలాట విరూపాక్షయ్య కొడుకు బొమ్మలాట కాళ్తయ్య రాయలవారికి ఆప్తుడట.[2] చదరంగం ఆడే వాళ్లంటే రాయలకు ఎంత ఇష్టమో చెప్పక్కరలేదు. బొడ్డు చర్ల తిమ్మనకు అగ్రహారం దానంచేశారు. రాయలవారికి వేటకూడా చాలా యిష్టంకాబోలు. అల్లసాని పెద్దనగారు వర్ణించిన స్వారోచివేట రాయలవారిదే. దేవీనవరాత్రులలో దేవికి బలియివ్వడానికి ఒక అడవిదున్నను రాయలవారు

---

1. సంస్కృత సాహిత్యపరిషత్పత్రిక, అక్టోబరు 1934 అని ఆముక్త మాల్యద 'పర్యాలోకనం' భూమికలో చెప్పారు.

2. ఆముక్తమాల్యద (వేదంవారి ప్రతి) ప్రకాశక విజ్ఞప్తి, పుట 29

స్వయంగా వేటాడి పట్టుకువచ్చారు. ఒక్కవేటున దాని తలను తెగగొట్టగలమా లేమా అని వీరాధివీరులే తటపటాయిస్తే విశ్వనాథనాయకుడు అవలీలగా బలివేశాడు.

ఆకాలంలో శరన్నవరాత్రులు మహావైభవంగా జరిపేవారు. రాయలవారు వైష్ణవులే అయినా ఇతరదైవాలకు దానాలు, ఉత్సవాలు విస్మరించలేదు. అభిమానించి ఆచరించిన వైష్ణవమతంకూడా ఆయన ఎక్కువగా సంస్కృత గ్రంథాలనుంచే స్వీకరించారనుకోవచ్చు. పెరియాళ్వారు, చూడికొడుతనాచ్చి తమిళంలో చెప్పిన పాశురాలను రాయలవారు తెనిగించలేదు. ఆముక్తమాల్యదలో విరివిగా తమిళపదాలు ఉన్నాయి కనుక ఆ భాషాపరిజ్ఞానం లేదనుకోలేం. ఏకారణంచేతనో రాయలవారు గురుపరంపరలో ఆచార్యపురుషులనుగురించి చారిత్రకవిరుద్ధమైన విషయాలను గ్రంథస్థం చేశారు. జీవితకాలంలో ఎక్కువగా ఇతరవిషయాలపై కేంద్రీకరించడంవల్ల ఈ అశ్రద్ధ ఏర్పడింది కాబోలు.

రాయలవారు 56 సంవత్సరాల కాలం జీవించారు. ఈ కాలంలో వారు సంకులసమరాలు గావించారు. హేమాద్రిదానాలు చేశారు. సాహిత్యగోష్ఠులు జరిపించారు. ఆయన జీవితచరిత్రలోని కొన్ని ముఖ్యమైన తారీఖులను చూస్తే(ప్రక్కపుటల్లోని పట్టికలు చూడండి.) ఆయన సాధించిన విజయాలు తెలుస్తాయి. షష్టిపూర్తి జరుగకముందే అనుభవింపదగిన రాగభోగాలు అనుభవించారు.

వయసు	తారీఖు	విశేషాలు
	1474, ఫిబ్రవరి 10	జననం. విజయసంవత్సర మాఘ బహుళ అష్టమి గురువారం. జ్యేష్ఠా నక్షత్రం.
22	1496	కృష్ణరాయల తండ్రి నరసానాయకుడు శ్రీరంగపట్నాన్ని జయించాడు.
23	1497	కృష్ణరాయలకు చిన్నాదేవి అనే వేశ్యతో సహవాసం.
24	1498	కృష్ణరాయలకు పెళ్లిచేస్తే మంచిదని తిమ్మరుసయ్య భావించి ఉంటాడు. శ్రీరంగపట్నం ఏలిక కుమార్తె తిరుమలదేవితో వివాహం జరిగింది.
25	1499	కుమార్తె జననం.
29	1503	తండ్రి మరణం.
32	1506	అన్న పట్టాభిషేకం.
35	1509, జూలై 22	అన్న మరణం.
	ఆగస్టు 7	కృష్ణరాయల రాజ్యస్వీకారం.
	1509	గజపతిని ఓడించి 'గజపతి గజకూటపాకల' అనే బిరుదుపొందడం.
	1509	సాగరు. కలబురగ యుద్ధాలలో యూసఫ్ ఆదిల్ ఖాన్‌ను పరాభవించడం.
36	1510, జనవరి 24	కృష్ణరాయల పట్టాభిషేకం.
37	1511	రాయచూరు మున్నగు దుర్గాల ఆక్రమణ. బెడందకోట స్వాధీనం చేసుకొని మహమ్మదుసాహాను విడుదలచేసి బహమనీ రాజ్యపుగద్దె ఎక్కించాడు. ఈ కారణంగా 'యవనరాజ్యస్థాపనాచార్య' అనే బిరుదువచ్చింది.

వయసు	తారీఖు	విశేషాలు
38	1512, సెప్టెంబరు 22	ఉమ్మత్తూరు పాలెగాండ్రను అదుపులోకి తీసుకురావడం. పెనుగొండనుంచి శివసముద్రందాకా ఉన్న రాజ్యాన్ని కట్టుదిట్టంచేసి నమ్మకస్థులను ఉద్యోగులుగా నియమించడం.
39	1513, ఫిబ్రవరి 10	దిగ్విజయానికిముందు తిరుపతియాత్ర.
	1513, మే 2	తిరుపతిలో.
	1513, జూన్ 9	ఉదయగిరి విజయం.
	1513, జూన్ 13	రెండవసారి తిరుపతియాత్ర.
	1513, సెప్టెంబరు 20	రాజధానికి తిరిగిరాక.
40	1514	తూర్పు దండయాత్రలలో రెండవ ఘట్టం. అప్పంకి, వినుకొండ, బెల్లంకొండ, నాగార్జునకొండ, తంగెడ, కేతవరం మొదలైన దుర్గాలు స్వాధీనంచేసుకోడం.
41	1515, జూన్ 23	కొండవీటి దుర్గంపై గెలుపు.
	1515, జూలై 8	అమరావతిలో తులాపురుషదానం.
	1515, జూలై 25	శ్రీశైల స్వామిదర్శనం.
	1515	రాయలు తన ప్రేమాస్పదమైన తిరుమలాంబను ఆరవీటి రామరాజుకిచ్చి వివాహం చేశాడని భావించవచ్చు.
42	1516	తూర్పు దండయాత్రలలో మూడవ ఘట్టం. తెలంగాణాను స్వాధీనం చేసుకోవడం, కొండపల్లి విజయం.
	1516, మార్చి 29	సింహాచలంలో ప్రథమశాసనం.
43	1517, జనవరి 2	తిరుపతి దైవదర్శనం.
	1517, జనవరి 9	కంచిలో.
	1517, ఫిబ్రవరి 6	కుంభకోణం.
	1517, ఏప్రిల్ 1	తిరిగి కంచికి రాక.

వయస్సు	తారీఖు	విశేషాలు
44	1518	బహుకాలానికి రాయలకు పుత్రజననం.
45	1519, జనవరి 27	కళింగ దిగ్విజయంలో చరమఘట్టం.
	1519, ఆగస్టు 8	రాయలవారు విజయవాటికకు రావడం, కలలో శ్రీకాకుళ ఆంధ్రవిష్ణువు కనబడి ఆము క్తమాల్యదవ్రాయమని ఆదేశించడం.
46	1520, ఫిబ్రవరి 17	తిరుపతియాత్ర.
	1520, డిసెంబరు	రాయచూరు దుర్గాన్ని ఇస్మాయిల్ ఆదిల్ ఖాన్ ఆక్రమించదలచాడు. కొంబావి నైరామన యుద్ధాలు. ఇస్మాయిల్ పరాజయం.
47	1521, డిసెంబరు	ఇస్మాయిల్ రాయచూరును కైవశం చేసు కున్నాడు.
48	1522, మే 25	కృష్ణరాయలు స్వయంగా రాయచూరు ముట్ట డించాడు.
	1522, జూన్ 13	దుర్గం స్వాధీనం అయింది.
	1522, ఆగస్టు	ఆదిల్ ఖాన్ పాదాక్రాంతు డవుతాడని రాయలు ముదుగల్లు వెళ్లాడు. ఖాన్ లేడు. రాయలు బీజాపూరుదాకా వెళ్లాడు. ఖాన్ అక్కడ లేడు.
	1522, అక్టోబర్	రాయలు కలుబరుగకు వెళ్లాడు. సుల్తాన్ పుత్రులను విడుదలచేసి పెద్దవాడికి పట్టం కట్టాడు.
	1522	ఉత్తరహిందూస్తాన్ పై దిగ్విజయం. గయలో జయశాసనం.
49	1523	రాజ్యానికి తిరిగివచ్చాక, గోవా పరిసరాలు పరుల చేతిలో చిక్కాయని తిమ్మరుసును సైన్యంతో పంపడం. అప్పాజీ ఓటమి.

వయసు	తారీఖు	విశేషాలు
50	1524	రాయలు తన కుమారుడు తిరుమలదేవరాయలకు పట్టం కట్టాడు.
	1524	బాలరాయల మరణం. అప్పాజీపై అనుమానం.
51	1525	రాజ్యంలో తిరుగుబాట్లు; తిమ్మరుసు కుమారుని పితూరీ. రామరాయలు దానిని అణచడానికి వెళ్లాడు.
52	1526	మహమ్మదీయుల యుద్ధాలు.
55	1529	మహమ్మదీయులపై నొల్లవ రాయ చూడి యుద్ధం. రాయలకు జయం.
56	1530	రాయల నిర్యాణం.

నిఖిలభోగాలూ అనుభవించిన సాహితీ సమరచక్రవర్తి నిశ్చింతగా మాత్రం మరణించలేదనుకోవాలి. ఆయన దివికేగిన తరువాత ఆశ్రితులు, ఆప్తులు, అభిమానులు అంతా జీవచ్ఛవాలలాగా బ్రతుకు వెళ్ళదీశారు. మిగిలిన వాళ్ళ సంగతి ఎలా ఉన్నా అప్పాజీసంగతి చెప్పుకొంటే సిగ్గేస్తుంది. బాల్యంలో ఆయన దుర్భరదారిద్ర్యం అనుభవించాడు. మాధూకరం ఎత్తుకొని, సత్రాల భోజనం చేసి సకలశాస్త్రాలూ అభ్యసించాడు. ఒక సామ్రాజ్యాన్ని సృష్టించగలిగిన మహాప్రజ్ఞను స్వహస్తాలతో సానపట్టుకొన్నాడు. మృత్యుముఖంలో ఉన్న యువకుని రక్షించి పట్టం కట్టాడు. గయదాకా జయపరంపరలు లభించేట్టు రాజనీతి నెరపాడు. అప్పాజీ చేసిన దానాలుకూడా అనేకం.

రాయలవారు తిరుపతికి ఏడుసార్లువెళ్ళి ఎన్నో దానాలు చేశారు. తిమ్మరుసయ్యకూడా చాలాదానాలు చేశారు. తిరుపతిదేవాలయంవారు ఏటా తిమ్మరుసయ్యకు ప్రసాదం పంపేవారు. రాయలవారు పోయాక పట్టుకొనే కొమ్మ లేక, దినం వెళ్ళక తిమ్మరుసయ్యకు ఈ తిరుపతిప్రసాదాన్ని అమ్ముకోవలసిన దుస్థితి పట్టింది.[1]


రాజ్యాంతంలో నరకం తప్ప దంటారు. తన ప్రభువుకు స్వర్గం ఇప్పించడానికా అన్నట్టు అప్పాజీ భూలోకంలోనే తాను నరకం అనుభవించాడు! అటువంటి రాజు, ఇటువంటి మంత్రి ఇంక ఎక్కడా ఉండరు!

---

1. తిరుపతి శాసనాల సంపుటి 4, సంఖ్య 72, 74, 93. రాయలవారు పోయిన ఆరేళ్లదాకా అప్పాజీ బ్రతికి ఉన్నాడు. శాసనాల కాలం 1536.

7

నంది తిమ్మన



ధ్రులు అల్లాహ ముద్దుగా, అతిగా రాబంగా చూసుకొనే కావ్యనాయిక సత్యభామ. కూచి పూడి వారి ధర్మమా అని ఈమె కలాపమంతా తెలుగునాట మారుమ్రోగింది. అయితే ఈమె పూపు రేఖలూ. కోపతాపాలూ తొలిసారిగా ప్రస్ఫుటంగా చిత్రించిన కవి నందితిమ్మనగారు. ఆయన రచించిన పారిజాతాప హరణం మంచి కావ్యాలలో పంచదార చిలుక. ఆయన ముక్కు పారిజాత పరిమళాలను ఆఘ్రాణించింది. ఆ సౌరభాలు గాలి కెగిరిపోకుండా మాటల్లోనే వాటిని బంధించి మధుర కావ్యాన్ని ఆయన సంతరించారు. నందితిమ్మనగారికి ముక్కుతిమ్మనగారనే పేరు సుప్రసిద్ధం. 'ముక్కుతిమ్మనార్య ముద్దుపలుకు' అనే మాటలు నిగూఢమైనవి.

తిమ్మనగారి ముక్కు చాలా పొడుగ్గా ఉండబట్టి ఈ పేరు వారికి వచ్చిందని చెప్పుకోవాలి. అయితే ఆయన ఒక చక్కని చుక్క ముక్కును చక్కగా వర్ణించబట్టి. ఈపేరు

వచ్చిందని సంప్రదాయ సిద్ధంగా సాహితీలోకం చెప్పుకొంటుంది. ఆయన ప్రాసినదే అని ఈ క్రింది పద్యాన్ని ఉదాహరిస్తుంది.

నానానూనవిశానవాసనల నానందించు సారంగ మే
లా నన్నొల్ల దటంచు గంధఫలి పల్కాకన్ దపం బంది యో
షానాసాకృతి దాల్చి సర్వసుమనస్సారభ్యసంవాసియై
పూనెం ప్రేంఖణమాలికామధుకరీపుంజంబు లిర్వంకలన్.[1]

ఇది ముక్కు-మీద ప్రణయకోప ముండే సత్యభామ ముక్కును వర్ణించే పద్యం కాదు. దానిని తిమ్మనగారు రచించనూ లేదు. ఇది రామరాజ భూషణుని వసుచరిత్రలో రాజుగారి క్రీడాసచివునిచేత చేయించిన వర్ణనలోని ముక్కు-పద్యం. అయినా ఈ పద్యాన్ని తిమ్మనగారి దగ్గిర కొను క్కొనే తన గ్రంథంలో వసుచరిత్రకారుడు పెట్టుకొన్నాడని సాహితీపరులు సరదాకు చెప్పుకొంటారుగాని ఇది సత్యానికి సగమెరుక.

వాస్తవానికి ముక్కు-తిమ్మనగారు పారిజాతాపహరణం ప్రాయడానికి పూర్వకారణ ముందట. ఆయన రాయలవారి భార్యలలో ఒక దేవేరితరపున అరణంగా వచ్చిన కవి అని ప్రతీతి. రాణివాసంలో ఒక సంప్రదాయం ఉంది. రాత్రి పూట రాజుగారు విచ్చేసేదాకా రాణిగారు పాన్పుమీద తలగడదిక్కున తల పెట్టుకొని పడుకోకూడదు. పాదాల వైపునే పడుకోవాలి. ప్రభువు వచ్చాక, లేపితే 'ఉపవీతి' అన్నట్టు తిరగాలి. ఒకనాడు రాయలవారు ఎంతకూ పడక

---

1. వసుచరిత్ర, 2-47.

టింటికి రాలేదు. అర్ధరాత్రీ అపరాత్రీ దాటాక నిద్రకళ్ళతో వచ్చి రాణిని లేపకుండానే పడుకొన్నారట. నిద్రలో ఆమె కాలు వారి శిరస్సుకు తగిలిందట. వెంటనే ఇటు ఆయన, అటు ఆమె లేచారు. రాయలవారు, ఆమె కావాలనే కాలితోతన్నిందని కోపగించుకున్నారు. వెనువెంటనే ఆమె నగరు విడిచి వెళ్ళిపోయారు. మళ్ళీ ఆ గడపలో కాలుపెట్ట లేదు. అమ్మగారు కుమిలిపోయింది.

అమ్మ తెచ్చిన విద్వాంసుడు కాబట్టి తిమ్మనగారికి ఈ సంగతి తెలిసింది. రాయలవారిని సుముఖులను చేయడానికి పారిజాతాపహరణం కావ్యం వ్రాశారు. ఆకాలంలో కృష్ణదేవరాయలవారు శ్రీకృష్ణుని అవతారం అని అందరూ విశ్వసించేవారు. ఈ సంగతి జ్ఞాపకంచేసినప్పుడల్లా రాయలవారు సహజంగా పొంగిపోతారు. ఒకసారి ఆయన పురాణ కథాగోష్ఠి జరుపుతూ 'దాశరథులు ఎక్కువా? పాండవులు ఎక్కువా?' అని ప్రశ్నించారట. ఎవరూ జవాబు చెప్పక పోతే తామే చెప్పారు. పూర్తి దైవాంశలతో జన్మించిన దశరథుని సంతానం లోకోత్తరులనడంలో వింత లేదు. మానవులుగా పుట్టి మహనీయచరిత్రకు కారకులైన పాండవులే గొప్పవారని రాయలవారు తమ అభిప్రాయాన్ని తెలిబుచ్చారు. ఈ గోష్ఠిలో రాయలవారికి వింజామరవిసురుతున్న చాకలి చేతులు జోడించి "ఏలినవారి జన్మాలోకూడ పాండవులమీద పక్షపాతం మానలేదు" అని విన్నపించుకొన్నాడు. రాయలవారు బ్రహ్మానందం పొందారు. 'నీ కేం కావాలో కోరుకో' అన్నారు. 'దేవరకోట ఏలుకోవాలని

ఉంది మహాప్రభూ' అన్నాడు. వెంటనే, అది రాయలవారు వాడికి ఇచ్చేసినట్టు కట్టడి చేశారు.

ఈ ముచ్చట నాటి గోష్ఠిలో ఉన్న తిమ్మనగారికి తెలిసిందే. "ఏలినవారికి ఈజన్మలో నేకాదు, కృష్ణావతారంలోనూ ముద్దుభార్య మెత్తని కాలితాపులు తప్పలేదు. ఆ జన్మలో నూచ్చుకోలేదే, ఈజన్మలో ఎందుకిలా ప్రవర్తిస్తున్నారో మరి?" అని చీవాట్లు పెట్టడానికి తిమ్మనగారు రీకావ్యం వ్రాశారట. ఇందులో కొంత సత్యం ఉండవచ్చు. తిమ్మనగారు అమ్మతెచ్చిన విద్వాంసులు కాకపోయినా అమ్మమెచ్చిన సత్కవులు కాక పోరు. రాణివాసంవారికి వచ్చిన కష్టాన్ని తప్పించడానికి కలం పట్టుకొని ఉంటారు. రాయలవారు అడగాలేదు; కొలువులోసికి పిలిచి చేతిలో తాంబూలం పెట్టనూలేదు. అయినా తిమ్మనగారు ఈ కావ్యాన్ని వ్రాసి అర్జెంటుగా అంకితం ఇచ్చారు. కృత్యాదిపద్యాలలో రాయలవారు అపర కృష్ణావతార మని ఇలా వర్ణించారు:

యాదవత్వమున సింహాసనస్థుడు గాని సింహాసనస్థుడై చెన్నుమీరయ
ల్లయిల్లాలిడ్రతో గోడిగించుట జేసి పరకామినీసహోదరత జూప
మరి జరాసుతునకై మధురడించుటజేసిపరవర్దుర్దముల్ బలిమిగొనగ
భారిజాతము నాసపడి పట్టి తెచ్చుట నౌదార్యమున దాని నడుగువరుప
గోరితొలుమేన దనకైన కొదువ లెల్ల-మాన్చుకొనవచ్చిభువనైకమాన్యలీల
నవతరించిన కృష్ణు డౌనన గ మించె-నరసవిభు కృష్ణరాయభూనాథుకుండు.
[పారిజాతాపహరణం, 1-17]

శ్రీకృష్ణునికి ఎనమండుగురు భార్యలు. అందరూ సమ తాభిమానవతులే! ద్వారకానగరంలోని తోటలలో, కావలసిన తీరున నిర్మించిన కొండచరియలలోని తోటలలో,

పటిబడ్డున నున్న పొదరిళ్ళలో, జలకేళి చేసే నదుల తీరాన కట్టిన మణిమయ సౌధాలలో ఏవేళలో ఏభార్య ఎటువంటి సరసంకోరుకొంటే, ఆవేళలో, ఆతీరున ఆభార్యతో మాయా కల్పనచాతురితో కృష్ణుడు వినోదించేవాడు. అయితే ఆభార్యలలో ఇద్దరు తాము అందరికన్నా అధికుల మనుకొనేవారు. కులము, రూపము, మగని కూరిమి నాకే ఉందని ఇవతల రుక్మిణీ, అవతల సత్యభామా గొప్పలు చెప్పుకొనడంవల్ల వాళ్ళమధ్య రవరవలు పొడమాయి. ఈ పరిస్థితిలో ఒక నాడు కృష్ణుడు రుక్మిణీదేవి యింటికి వచ్చి ఏకాంతంలో కొంతమంది అందమైన పరిచారికలు పరిచర్యలు చేస్తూఉంటే చంద్రకాంత శిలా వేదికమీద కూర్చొని అత్యంత వినోద కేళితో జూదం ఆడడం మొదలుపెట్టాడు. ఇది తిమ్మనగారు పారిజాతాపహరణంలో పాత్రలను పరిచయంచేసిన తీరు.

మిగతాకవులు ఇంత సూటిగా కథారంగంమీదకు పాత్రలను ప్రవేశపెట్టరు. పురాన్ని వర్ణించి, అవ్వూరి నాని వాడలో విహరించి, కథానాయకుని గుణగణాలుజాబితాగా చెప్పి, అతని ఎనమండుగురు భార్యలను పేరొక్కని, వీలైతే వాళ్లను నఖశిఖపర్యంతం వర్ణించి అతరువాత ఒక్కొక్క భార్యతో కృష్ణుడు ఎలా భోగించేవాడో సవిస్తరంగా చెప్పి ముచ్చటతీర్చుకొని అసలు కథ ఎత్తుకొనేవారు. పాండిత్య ప్రకర్ష, కల్పనానైపుణ్యం ప్రదర్శించడానికి కాక వేరే ప్రయోజనం కోరి ప్రాసిన పుస్తకం కాబట్టి తిమ్మనగారు తిన్నగా కథలోకి దూకారు. నాటకంలాగా కావ్యాన్ని ప్రాశారు.

• •

తెర ఎత్తగానే రుక్మిణి యింట జూదమాడుతున్న కృష్ణుడు కనబడతాడు. అతడు నిజానికి తన వలపుతో జూదమాడుతున్నాడు. దీని పరిణామంవిషమిస్తుందని తెలిసే ఆడుతున్నాడు. ఆసమయంలో అక్కడికి నారదుడు ఆకస్మికంగా వచ్చినట్లు వచ్చాడు. కృష్ణుడు ధర్మపత్నిసమేతంగా ఆతిథ్యం ఇచ్చాడు. రుక్మిణి కనుసన్న చేసింది. పరిచారికలు రత్నసింహాసనం వేశారు. 'మీ రాకవల్ల కృతార్థుడనైనాను. నాపిూద తమరు అకారణంగా దయజూపిస్తున్నారు' అని కృష్ణుడు వినయంనటించాడు. నారదుడు 'స్వామీ, అలా అనడం భావ్యమా' అని చెప్పి, అప్పటిదాకా శ్రీకృష్ణుడెత్తిన అవతారాలను ఒక్కసీసంలో దబ్బున ముగించి తొందరగా రెండు కందపద్యాలలో 'నిన్ను నేను పొగడగలనా? ద్వారక వైకుంఠం. ఈ రుక్మిణి లక్ష్మీదేవి. మీరిద్దరూ ఉండబట్టే ఇక్కడికి తరుచు వస్తున్నాను' అని చెప్పి మొగ్గవిడుస్తూ ఉంటే ఆనాడే కోసిన పారిజాతపుష్పాన్ని మిన్నేటిపసిడినెత్తమ్మి చిగురుటాకులో పొదివి ఇచ్చాడు. కృష్ణునికి ఆశ్చర్యం వేసింది. పువ్వు తీసుకొని కృష్ణుడు రుక్మిణివంక చూసినా సత్యభామను తలచుకొన్నాడు.

ఇది రుక్మిణి కిస్తే సత్యభామ ఏమనుకుంటుందో! ఇక్కడ పుచ్చుకొన్నది అక్కడకు పంపిస్తే ఈ రుక్మిణి ఏమనుకుంటుందో? ఔనులే. ఇక్కడ ఉన్నాను కాబట్టి ఇది ఇంకొకరికి పంపకూడదు అని రుక్మిణికే ఇచ్చాడు. ఆమె తీసుకొని నారదునికి మ్రొక్కి, కొప్పులో పెట్టుకుంది. అర్ధనారీశ్వరమూర్తిలో గౌరమ్మ సిగపూవుగా లేతజాబిల్లి

తురుముకొన్నట్లు కాంతులు జిగేలుమన్నాయి. అప్పుడు రుక్మిణీదేవికి వింతజవ్వనం ఎలా వచ్చిందో ముక్కుతిమ్మనగారు ముద్దుపలుకులతో వర్ణిస్తున్నారు. వినండి :

మగమొల నగజాలు తెగ గీలుకొనువాలుగనుగవ కొకవింత కాంతి యొదవె
వలిజకుచవల పెకుచవలుదకుచవగనికుచనుదోయికొకవింతచాయదోచె
నెలతు మ్మోదల దిమ్మి వెలిజిమ్మి చెలువమ్మిగల వేణి కొకవింత నలుపు మీరె
నలచెందొవలవింపు చెలువెందు వెదచిందు మొగమునకొక వింత జిగి దొలంకె
జకుచదనమున కొక వింత చకుచదనము_జవ్వనంబున కొకవింత జవ్వనంబు
విభ్రమంబున కొక వింత విభ్రమంబు_గలిగె నద్దివ్యకుసుమంబు కితన సతికి.
[పారిజా. 1_56]

ఆమెఅందం ఇలాగ అతిశయించాక నారదుడు ఇంక కలహాజ్వాల రాజపెట్టదలిచాడు. 'అమ్మా, ఇది సమస్త లోకాలలో ఇప్పటికి నలుగురే ధరించారు. శచి, పార్వతి, లక్ష్మి, సరస్వతి తప్ప మరెవ్వరూ ముడవలేదు. నువ్వు హరికి బహిఃప్రాణానివి. నీవు ధరించబట్టి ఈపుష్పం ధన్యమైంది. ఈపుష్పం పరిమళంచెడదు; వాడదు; పరువం తప్పదు; పరాగపరిభరితంఅయి నిరంతరం జగదేకమనోహరంగా ఉంటుంది.' అని చెప్పి నారదుడు ఇంకొంచెం వివరాలు చెప్పాడు :

అలినీలాలక ! నీవు నీపతి రహస్యక్రీడ వర్తించువే
శ లతాంతాయుధసంగరంబునకు నుల్లాసంబు గల్పించు ను
జ్జ్వలదీపాంకురమై రతిశ్రమతనూసంజాత ధారాళ ఘ
ర్మలవంబు ద్రొలగింపగా సురటియై రంజిల్లు నిచ్ఛాగతిన్. [పారి. 1_60]

నిత్యబ్రహ్మచారి అయినా సర్వజ్ఞుడుకనుక నారదుడు రహస్యక్రీడలను గురించికూడ అభిభాషించాడు. తరువాత

'ఇన్నాళ్లూ సవతులందరిలో సత్యభామకనుసన్నలందే హరి వశంవదుడై తిరుగుతాడని విన్నాం. కాని నీపట్లనే అనురాగమున్నవాడు. కాకపోతే ఈ పువ్వు మరెవ్వరికో ఇవ్వక నీకెందు కిస్తాడు ?' అని ప్రశ్నించాడు. అంతటితో ఊరుకుంటాడా? కాస్త ఎగసనదోశాడు.

చక్కనిదాన నంచు నెలజవ్వని నంచు జగంబులోన బే
రెక్కినదాన నంచు బతి యెంతయు నా కనురక్తు డంచు ద్రా
నిక్కుచు విర్రవీగుచు గణింపదు కాంతల సత్య యింతకున్
గ్రుక్కక యున్నె నీమహిమసూచిన బోటులు విన్నవించినన్?

[పారిజా. 1_66]

ఈసంగతి చెలికత్తెలు చెప్తే సత్యభామ దుఃఖించకుండా ఉంటుందా అని కావాలనే నారదుడు అన్నాడు. చెలికత్తెలు చెప్పాలనే ఘోరాడు. వాళ్లు చెప్పడానికి వెళ్లారు.

రంగం మారింది. సత్యభామ తన శృంగారవనంలో నగరిపొంత చక్కగా తీర్చిదిద్దిన పూలతేనెల ఏటికాలవ వడ్డున చెంగల్వపుప్పొళ్లు నించిన చంద్రకాంతశిలావేదిక మీద చెలికత్తెలతో సరసగోష్ఠి చేస్తూ కృష్ణుని గుణాలు వర్ణిస్తున్నది. తుమ్మెదల గ్రోత, చిగురుల మధ్య బెదరిన కోకిలారావాలు, నీటి గాలులూ ఆమెకు పూర్వంలాగా హాయి పుట్టించడం లేదు. అందుచేత ఏదో అనుమానం వేసింది. వెంటనే తన భర్త మరోమగువను గూడి తనను మరిచిపోయే పను లేమిటి చేశాడో అని ఆమె సందేహించింది. అంతలో రుక్మిణినగరులో జరిగిన విషయాలు చూసిన చెలికత్తె వచ్చింది.

వస్తూనే 'అమ్మా, ఏం చెప్పను?' అంటూ అంతా చల్లగా చెప్పింది. నారదు డన్న విషయాలన్నీ పూసగుచ్చి నట్లు వీకరువుపెట్టింది. సత్యభామ విం ది. వేటువడ్డ ఉరగాం గనలాగ, నేయిపో స్తే 'భగ్గ'ని దరికొన్న హుతాశనకీలలాగా లేచి, కళ్లు ఎర్రపడగా, రుద్ధకంఠంతో "ఏమిటే? నారదుడు అలా అన్నాడా? ఆమాటలు గోపికావల్లభుడు చెవియొగ్గి విన్నాడా? రుక్మిణేముంది? చెప్పవే, ఇంకెందుకు మొహా మాటం." అంది. అన్నదేగాని చెలిక త్తెను చెప్పనివ్వలేదు. "మహా గొప్ప పువ్వని పొగడుతూ నారదుడు అచ్యుతునికి కానుక యిస్తే ఇవ్వొచ్చు. దానిని ఆయన తన కిష్టమైన వాళ్లకు ఇస్తే యిచ్చుకోనీ, మధ్యమాపేరె త్తవలసిన అవ సరం ఆమాయదారి ముని కేం వచ్చింది?" అని సత్యభామ మండిపడింది. అంతలోనే సమాధానం చెప్పుకొంది. "ముని ఏం చేశాడులే. రుక్మిణిని తిట్టి ప్రయోజనం లేదు. ధూ ర్త గోపాలుడు చేసిన దాన్నే చెప్పుకోవాలి. ప్రాణానికి ప్రాణం లాంటి మగడు ఇలా చేస్తే మనస్సు మండదా?" అనుకొంది. చెలిక త్తెలతో ఆసాదవెళ్లబోసుకుంది.

ధనమిచ్చి పుచ్చుకొన్నను-మనమున నౌర్వంగవచ్చు మగ డింతులపన్
జనవిచ్చి పుచ్చుకొన్నను-మనవచ్చునె యింక నేటి మాటలు చెలియా!

[పారిజా. 1-97]

పతి మేరతప్పితే కులకాంతలకు వేరుగతి లేదనుకొంది. 15 పద్యాలలో (1-83 నుంచి 97 దాకా) తిమ్మనగారు సత్యభామకోపాన్ని ప్రజ్వలింపజేశారు. అంతతో సత్యభామ ఈరంగంనుంచి నిష్క్రమించింది. ఎలాగ? పచ్చని చందనపు

వృక్షం తొఱ్ఱలోకి పోయే ఆడపాములాగా, కోపగృహం చెట్టుతొఱ్ఱలాగా చీకటిగానే ఉంటుంది. అలిగిన సత్యభామను తిమ్మనగారు ఇలా వర్ణించాడు.

మాసిన చీరగట్టుకొని మౌనముతోడ నిరస్తభూషయై
వాసెనకట్టు గట్టి నిడువాలిక కస్తురి పట్టు వెట్టి లో
గాసిలి చీకటింటికడకంకటిపై జలదాంతచంద్రరే
ఖాసద్భకాంగియై పొరలె గాఢమనోజవిషాదవేదనన్. [పారి. 1_99]

తలకట్టుకొని పడుకొన్నా ఆమెకు తలకుమించిన మోహం పుట్టుకొచ్చింది. చెమటపట్టింది. మనస్సు వెలవెల పోయింది. ఆమె కొంచెం కళ్లు తెరుస్తుంది, నవ్వుతుంది. తల ఊపుతుంది. పానుపుమీద పడుతుంది, లేస్తుంది. ప్రణయ కోపంలో వచ్చిన మదనతాపం అటువంటిది మరి! ఇక్కడి దృశ్యంమీద తిమ్మనగారు తెరదించాడు. తరువాత ఒక చిన్నప్రవేశకం. తాను ఆడిన జూదపుపర్యవసానం తనకు తెలుసు. శ్రీకృష్ణుడు నారదుని దగ్గిర ప్రద్యుమ్ననికూర్చోపెట్టి సత్యాగృహానికి బయలుదేరాడు. ఆగాలమీద మేఘాలమీద రథం తోలాడు. సత్యానగరు చిన్నబోయింది. నిశ్శబ్దంగా ఉంది. కృష్ణయ్య క్రమంగా కోపగృహానికివెళ్లాడు. దారిలో కొందరు చెలిక త్తెలతో మంతనాలాడి, కొందరిని వాడిచూపులతో, కొందరిని చేతిసన్నలతో మంచిచేసుకొన్నాక మధ్యం దినభానుమండలకరావళి హోవళివాడియున్న తీగలాగ ఉన్న సత్యను చూసి ఆశ్చర్యపోయాడు. తరువాత

ఈ లలితాంగిచంద మొకయించుక చూచెద నంచు భూర్తిలో
పాలుడు తాల్మవ్యంత మొక భామిని సత్యపిరుంద నుండి మం

దాలసలీలమై విసర నాదట గైకొని వీచె దద్వపుఃకీలితపంచసాయకశిఖిం దరికొల్పుచు నున్న కైవడిన్. [పారి. 1_109]

చెలిక త్తె చేతిలోని విసనకర్రను తీసికొని మాయకృష్ణయ్య విసరడం తాపం తగ్గించడానికి కాదు; కోపం హెచ్చించడానికే. ఆయ నలా విసరడం మొదలుపెట్టేసరికి ఆ గాలికి పారిజాతపరిమళాలు వీచాయి. రుక్మిణియింట నున్నప్పుడు ఆసువాసన అతని ఒంటికి అంటుకొనిఉండి. ఈ కొత్త తావి వాసన వేయగానే ముసుగు తీసి సత్య ఏకాంత గృహంలో నాలుగుపక్కలా చూచింది. భర్తను చూచి బాష్పకళికాతరళీకృతలోచన అయింది. మళ్లా తల వంచుకొని ముసుగు పెట్టుకొంది. నిట్టూర్చింది. అప్పుడు కృష్ణుడు ఏమీ తెలియనట్లు ఇలా అన్నాడు:

మన మరయం దలంచి యొకమార్గము వన్నితో నవ్వుటాలతో
నను వెరపించెదో యకట నాయెడ నిక్కము దప్పి గల్గెనో
వనజదళాయతాక్షి! పగవాడనె నన్నిటు లేల చూడ వో
క్కనిమిషమైన నీవు దయ గన్గొనకుండిన నిల్వనేర్తునే? [పారి. 1_116]

అనునయించబోయాడు. నీ తియ్యని అధరామృతం, నీ బిగికౌగిలి లేక తపించే నన్ను కొంచెం దయచూడు అని కొంగుపట్టుకొన్నాడు. ఆమె చేతిలోని లీలారవిందంతో కొట్టబోయినట్లు బెదిరించింది. తప్పుచేసిన మగవాడు పట్టుకోవలసినది కొంగుకాదు, కాళ్ళు అని హెచ్చరిక చేసినట్లు కనిపించింది కాబోలు, కృష్ణుడు వెంటనే పాఠం నేర్చుకొన్నాడు.

పాటలగంధి చిత్తమున బాటిలు కోపభరంబు దీర్ప నె
ప్పాటను బాటుగామి మృదుపల్లవకోమలతత్పదద్వయీ
పాటలకాంతి మౌళిమణిపం క్తికి వన్నియపెట్ట నాజగ
న్నాటకసూత్రధారి యదునందను డర్మిలి మ్రొక్కె, మ్రొక్కినన్.
[పారిజా. 1_120]

అతడు కాళ్లమీద పడితేపడ్డాడు. ఆమె ఊరుకొంటుందా?

జలజాతాసనవాసవాదిసురపూజాభాజనంబై తన
ర్చ్చలతాంతాయుధు కన్నతండ్రిశిర మచ్చో వామపాదంబునం
దొలగంద్రోచె లతాంగి, యట్లయగు; నాధు ల్నేరము ల్నేయ బే
రలుకం జెందినయట్టి కాంత లుచితవ్యాపారము ల్నేర్తురే?
[పారిజా. 1_121]

నిజమే. కోపంలో మగవాళ్లకే ఒళ్లు తెలియదు. ప్రణయకోపంలో ఆడువాళ్లకి తెలుస్తుందా? అలా తన్ని నప్పుడు రసికుడు తప్పి పట్టుకోడు. ఉద్దీపితమన్మథరాజ్యం ప్రాప్తించిం దనుకుంటాడు. కృష్ణుడు అలాగే అనుకొన్నాడు.

నను భవదీయదాసుని మనంబున నెయ్యపుగిన్క బూని తా
చినయది నాకు మన్ననయ, చెల్వగు నీ పదపల్లవంబు మ
త్తనుపులకాగ్రకంటకవితానము దాకిన నొచ్చు నంచు నే
ననియెద నల్క మానవుక దా యిక నైన నరాళకుంతలా! [పారి. 1_123]

ఈ మాటలు విన్నాక సత్య లేచింది. వంటిమీద బట్టలు సరిగ్గా లేవు. సగంసగం మేను కనబడుతూంది. కొప్పు ఊడింది. ఆ ముడి వృథాగా దోపుకొంటూ చను కట్టుమీద పైటచెంగు కప్పుకొంటూ చిరుచెమట కమ్మిన

మొగంతో వోరచూపులు చూస్తూ, పెదవి అదురుతూ ఉంటే—

ఈనయుగారపుం బ్రియము లీ పస లీ మొగమిచ్చమాట లే
లా నిను నమ్మియుండిన ఫలం బిదె తోడన కల్గె నాకు నీ
యానసుమీ ననుం జెనకి యూరడిపెట్టిన నవ్వువారలం
గాన వెరుంగునే పసులకాపరిభావజమర్మకర్మముల్? [పారిజా. 1_125]

గొడ్లుతోలుకొనేవాడికి సరసం ఏం తెలుస్తుంది? కృష్ణదేవరాయలవారుకూడా యాదవాన్వయంలోనే జననం పొందారని తిమ్మనగారు మొదటే చెప్పి పునాదివేశారు (పారి. 1-19). రాయలవారిని భుజాలు తడుముకోమని తిమ్మన గారు ఈ పద్యంలో కావాలనే ఈమాట బిగించారు కాబోలు. సత్యభామ అంతటితో ఊరుకోలేదు. 'పలుపోకల మాయలు నీకు వెన్నతో పెట్టిన' వంది. పారిజాతపరిమళం నాకు ప్రకటించి నన్ను వేళాకోళం చేయాలని వచ్చావంది.

మానంబె తొడవు సతులకు_మానమ ప్రాణాధికంబు మాన మఖిలస
మ్మానములకు మూలంబగు_మానరహిత మైన బ్రతుకు మానిని కేలా?
[పారిజా. 1_129]

ఆమె అభిమానవతి. లోకంలో అందరాదువాడూ మొగుడు కొట్టినందుకు ఏడవరు. తోడికోడళ్ళు దెప్పినందుకు ఏడుస్తారు. సత్య అలాంటిది కాదు; మొగుణ్ణి కొట్టినందుకు కాక తోడికోడళ్ళలో చులకనైనందుకు బాధపడుతుంది. 'అత్తగారి ముఖం ఎలా చూస్తాను? సిగ్గుసిగ్గు! తోడికోడళ్లు నవ్వకముందే ఏమిటో తేల్చుకొంటాను. ఆ తరువాత నువ్వు సుఖంగా ఉండవచ్చు' అంది.

ఈసున పుట్టి డెందమున పెచ్చిన శోకదవానలంబుచే
గాసిలి యేడ్చి ప్రాణవిభు కట్టెదుటన్ లలితాంగి పంకజ
శ్రీసఖమైన మోముపయి జేల చెరంగిడి బాలపల్లవ
ప్రాసకషాయకంఠ కలకంఠవధూకలకాకలీధ్వనిన్. [పారిజా. 1-133]

ముక్కుతిమ్మనగారు ముద్దుముద్దుగా వీడిపించారు. ప్రణయకోపంతో చెయ్యి విదిలించుకుని, కళ్లెర్రచేసి, పిట్ట వలసిన నాలుగూ తిట్టి పెట్టవలసిన చీవాట్లూ పెట్టాక ఆడది ఆఖరు ఆయుధం ఉపయోగించి బావురు మంటుంది. అది లైన్‌క్లియర్ సిగ్నల్. మగవాడు వెంటనే నిండు కౌగిలిలో పొదివిపట్టుకొని బుజ్జగిస్తే అలుక తీరుతుంది. కృష్ణుడు అంతే చేశాడు.

ఆ రమణీలలామ మదినంటిన కోపభరంబు నిల్పగా
నేరక నెవ్వగం బొగుల నీరజనాభుడు నిండుకౌగిటం
జేరిచి బుజ్జగించి ననుజెక్కుల జాఱకొనంగ జారుక
న్నీరు కరంబునం దుడిచి నెయ్యము దియ్యము దోప నిట్లనున్.
[పారిజా. 1-134]

"ఇంద్రుడు యుద్ధానికి వచ్చినాసరే పారిజాతాన్ని నీకు తీసుకువచ్చి ఇస్తాను. నీపెరటిచెట్టుగా ఆ వృక్షాన్ని నాటుతాను" అని బాసచేశాడు. నీలమేఘశ్యాముని ప్రతిజ్ఞా గర్జన విన్న సత్యభామ కడిమిచెట్టులాగా వికసించింది. ఆమె చెలికత్తెలు మయూరికలలాగ చెలరేగారు.

ఇక్కడితో పారిజాతాపహరణంలో ప్రథమాశ్వాసం ముగిసింది. దీనితోపాటు తిమ్మనగారి ప్రయోజనంకూడా నెరవేరింది. "కావాలని కోపంతో తన్నిన తన్నే మన్నన

అని కృష్ణుడు భావించాడో, తమ దేవేరి కాలు పారపాటున తగిలితే సర్దుకుపోలేరా?'' అని తిమ్మనగారు రాయలవారికి మెత్తని చీవాట్లు పెట్టారు. రాయలవారు గ్రహించుకొన్నారు. ఆయనకు ఇదే కొత్త కథా? తాము 'సత్యా వధూప్రీణనం' వ్రాయనేవ్రాశారు. ప్రణయకోపంతోగాక గ్రీష్మతాపంతో వాడిపోయిన ప్రియురాలికి వట్టివేళ్ళవిసన కర్రతో విసరడం వారికి స్వానుభవమే. ఉత్తరోత్తరా ఇలా వర్ణించారు.

తీలగు కంతువెంబడిన తెమ్మెరలు గ్రవిదీప్తి కల్కి పా
తాళము బట్టుచుండదనుతావులు గ్రుచ్చిలబట్టి యౌషధీ
పాలనకొప్పగించె నన బైసురభిశ్వాసనంబు నించె గాం
తాలసవక్త్రసీమ విటులార్చు నుశీరపు దాళవృంతముల్. [ఆము క్త. 2_63]

పారిజాతాపహరణంలో తిమ్మనగారు నాయకునిచేత గ్రియురాలి కాళ్ళకు మొక్కించడం చూశాక అల్లసాని పెద్దనగారుకూడా ఆమోదించినట్టున్నారు. స్వరోచి పెళ్ళి వర్ణనలో సన్నెకల్లు ఇలా తొక్కించారు:

జగతీనాథవతంస మానతశిరస్సమ్మేళనన్ నెయ్యపుం
జగడంబుల్ గ్రియమొప్ప మాన్పెడుతరిం జంచత్కిరీటాగ్ర
త్నగణస్పర్శసహాంబుగావలసియో నా గోర్కి దైవారున
మ్మగువం బాదతలంబుపట్టి సనెకల్ మట్టించె మోదంబునన్. [మను.సం_93]

పెళ్ళినాటినుంచి గ్రియురాలి కాళ్ళకు మొక్కడం గ్రాప్తిస్తుచేయించాలని పారిజాతాపహరణం చదివాకనే పెద్దనగారికి స్ఫురించినట్టుంది. రాయలవారూ, పెద్దనగారూ ఇద్దరూ ఈ కావ్యంలోని మొదటి ఆశ్వాసాన్ని గొప్పగా మెచ్చుకొనేఉంటారు. పారిజాతాపహరణంలో.. ఇంకో

నాలుగాశ్వాసాలూ, మరో 372 గద్యపద్యాలూ ఉన్నాయి. అయితే అవి మొదటి ఆశ్వాసంలోని 140 గద్యపద్యాలలోని శిల్పానికి వేలువిడిచిన బంధువుల్లాగ కనబడతాయి. మిగతా ఆశ్వాసాలకథలో బిగువు లేదు.

రెండో ఆశ్వాసంలో కృష్ణుడు మాధ్యాహ్నికస్నానం చేస్తాడు; శృంగారం చేసుకొంటాడు. సత్యభామదగ్గరకు నారదుడు వస్తాడు. 'అమ్మా, కృష్ణుడు యుద్ధానికైనా నిన్ను విడిచివెళ్లగలడా? అలాంటివాణ్ణి అపార్థం చేసుకోకు' అని చెప్పి, 'నీమగడు నాదీనచేత ఎలాంటి ఎలాంటి కార్యమైనా సాధించుకొంటాడు' అని చెప్తాడు. తరువాత సాయంకాలం అవుతుంది. చీకటి, చుక్కలు పొడుస్తాయి. చంద్రుడు ఉదయిస్తాడు. ఇక్కడ తిమ్మనగారు చక్కని చంద్రోదయవర్ణన చేశారు.

అమరు లమృతాంబునిధిలోని యమృతరసము
వెండిచేరుల బటికంపు గుండ కట్టి
చేదుకొనియెదరో నాగ శీతరోచి
మెరుగుమెయితోన యల్లన మిన్ను వ్రాక. [పారిజా. 2-10]

ఈపద్యాన్నే ఒక సంకలనకర్త మరోగ్రంథంలోని దని ఉదాహరించాడు. ఇది చిమ్మపూడి అమరేశ్వరుని విక్రమసేనంలోని పద్యం అని ఆంధ్రసాహిత్యపరిషత్తువారి ప్రతిలో ఉంది.[1] పారిజాతాపహరణంలో చంద్రుణ్ణి వర్ణించాక

---

1. విస్మృత ప్రబంధ పద్యావళి. చిమ్మపూడి అమరేశ్వరుడు-విక్రమసేనం. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక. సంపుటి 37. సంచిక 4-6. పద్యం 41. ఈ పద్యాన్ని గ్రంథనామం, కర్తనామం తెలియరానివి అన్న శీర్షికలో వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రచురించారు. ప్రబంధ రత్నావళి, పుట 157.

నాయికానాయకులు చంద్రికావిహారాలు చేస్తారు. వినోద క్రీడలో ఓలలాడి సిచురిస్తారు. తరువాత మేలుకొలుపులు. కృష్ణుని ప్రయాణసన్నాహం. దారిలో కనబడే వింతలను వర్ణించి భార్యకు చెప్పడం. మేరుపర్వతం దాటుతాడు. ఈ ఆశ్వాసంలో కృష్ణుడు గరుత్మంతునిపై ప్రయాణంచేస్తూన్న కథ చీమనడక నడుస్తుంది.

తృతీయాశ్వాసంలోని తీరు చూస్తే ద్వితీయాశ్వాసం లోని కథే వేగంగా నడిచిందనిపిస్తుంది. స్వర్గంలో శ్రీకృష్ణుని ఇంద్రాదులు సేవిస్తారు. రాజుగారు ఊరేగుతున్నప్పుడు పుర స్త్రీలు చూసినట్లు కృష్ణుణ్ణి అనిమిషకాంతలు చూస్తారు. ఈ సంగతి తిమ్మనగారు పదిపద్యాలలో చెప్పారు. తరువాత శ్రీకృష్ణుడు తన తల్లి అదితిని చూస్తాడు. ఆమె డగ్గావతా రాల వర్ణన సుదీర్ఘంగా చేస్తుంది. గణసమక్ష-ణికంలో కృష్ణలీలలు వర్ణిస్తుంది. తరువాత కృష్ణుడు వైజయంతానికి చేరుతాడు. రాయలవారి నివాసమందిరం మరియు కూటాన్ని వర్ణించినట్లు తిమ్మనగారు వైజయంతిని పొడుగాటి వచనంలో వర్ణించారు. తరువాత ఆకాశ గంగా తీర నందన వనంలోని విశేషాలపై శ్రీకృష్ణుడు ప్రత్యక్ష వ్యాఖ్యానం చెప్తాడు. మూడో ఆశ్వాసం ముగుస్తుంది.

నాలుగో ఆశ్వాసంలో మొదట పారిజాతం దగ్గరకు చేరుతారు. కృష్ణుడు దానిని వర్ణిస్తాడు. అప్పుడు సత్యభామ ఇలా అంటుంది:

నావుడు సత్యభాము నిజనాథున కిట్లను నేల తామసం
బీవిబుధ ధినాయకమహీరుహమిం బెకలించి లోకసం . .

భావితమైన నీపలుకుబంతము సెల్ల మదీయగేహకే
భీవనవాటి వేసుక దలీర్పగ నిల్పుము జీవితేశ్వరా. [పారిజా. 4_11]

వెంటనే అది పట్టుకుపోతే ఎలాగ! ఇంకా బోలెడు పద్యాలలో పుష్పాపచయం, జలక్రీడలు వర్ణించాలి. 11-వ పద్యంలో సత్యభామ 'నీల తామసం' అంది. 50-వ పద్యంలోగాని పారిజాతాపహరణం జరుగ లేదు. స్వర్గంలోని కావలివాళ్లు ఇది తగునా అని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు సత్యభామ జవాబు చెప్పింది. ఆమె ముఖంపై చిరునవ్వు అంకురించింది. జారిన కొంగూ, వాడిన కొప్పూ సవరించుకుంటూ ఇలా చెప్పింది:

వినుడు సురేశ్వర వనపాలకులు! వారి
బొడమిన ఈ దివ్యభూరుహమున
కింద్రాణి యెవ్వతె? ఇంద్రుండు నెవ్వడు?
తోడి యిందిరను, గౌస్తుభము నెవ్వ
డధిపుడై ధరియించె నతడె చేకొనుగాక
తెకతేగ యిది యేమి యొకరి సొమ్మో
యిదె నాదు విభునిచే నీవదాన్యనగంబు
నొడియించుకొని యేగుచున్నదాన
బలుమ లేటికి దా వీరపత్నియేని
మీళచీచేవి తనము ప్రాణేశుడైన
మఘవు నిట బంపి సత్యభామావిధేయు
వలన మరలంగగొనుటెపో వానితనము. [పారిజా. 4_59]

తన భర్త తనకు విధేయుడని అతని సమక్షంలోనే చెప్పి 'బస్తీమే సవాల్' అని సత్య ప్రకటించింది. వనపాలకులు ఈ మాటలు శచీవిధేయునికి చెప్పడానికి వెళ్లారు. చతుర్థాశ్వాసంలో యుద్ధప్రయత్నాలు మొదలవుతాయి.

పంచమాశ్వాసంలో ఇంద్రోపేంద్రుల యుద్ధం 38 పద్యాలలో వర్ణన. తరువాత క్రిందపడ్డ ఇంద్రుణ్ణి కృష్ణుడు లేవనెత్తుతాడు. 'నీత ప్పేం లేదు. ఏదో నీమురదలు కావా లంటే చెట్టుకోసం వచ్చాను. నీ వజ్రాయుధం నువ్వుతీసుకో. నీసొమ్ము నా కెందుకు?' అన్నాడు. దానికి ఇంద్రు డిలా జవాబు చెప్పాడు.

సొమ్మన నెద్ది యేననగ సొమ్మున కివ్వడ గర్త వీవు నీ
సొ మ్మఖిల ప్రపంచమును శూరకులంబు నలంకరించు నీ
వమ్మహి నుండునంతకు ననన్యదురాపము పారిజాతభూ
జమ్మును నుండు నన్న వికసన్ముఖుడై హరి వీడుకొల్పుచున్.

[పారిజా. 5-40]

ఇంత జ్ఞాన ముంటే అంత యుద్ధం ఎందుకో! పారిజా తంతో కృష్ణుడు ద్వారక చేరుకొన్నాడు. ఆ చెట్టుమహిమ వల్ల చెనిటివాళ్లు వినడం మొదలుపెట్టారు. గుడ్డివాళ్లకు కళ్లు వచ్చాయి. కుంటివాళ్లు నడవసాగారు. పారిజాతాన్ని ప్రతిష్ఠిం చాక నారదుడు వచ్చి పుణ్యకవ్రతం ప్రతిపాదించాడు. సత్యభామ ఆనోము నోచింది. కృష్ణరాయల దేవేరులలో ఎవరో ఒకరు చేసిన వ్రతంలాగా దానిని తిమ్మనగారు వర్ణించారు. నోము నోచి సత్యభామ నారదునికే భర్తను దానంచేసింది. ఆ జడదారి కృష్ణుని చేత పనులు చేయించు కొన్నాడు.

మేళవించినవి సుమ్మీ దీని మెట్లని మాంసలాంసంబున మహతి జేర్చి
మి న్నేటి జలము సుమ్మీ తొలంకెడు నని డాచేత మణికమండలు వొసంగి
యిది జపోచితము సుమ్మీ జతనం బని వలచేత బద్మాక్షవలయ మిచ్చి
యీశాను డిచ్చె జుమ్మీ మాఱు నిది యనిశార్దూలచర్మంబు జింక జొనిపి

పొమ్ముపొమ్మని యొకకొంతపోవబోవ_రమ్మురమ్మని మరల చేరంగబిలిచి
కపటనటనాపరుండైన కంసవైరి_బరమమును నవ్వుటాలకు బహులుగొనియె.
[పారిజా. 5_56]

ఈ నవ్వులాట కొద్దిసేపే. వెంటనే చతురవాచా
ప్రౌఢితో ఒక పాదభ్రమకం (5-93), ఒకగోమూత్రికాబంధం
(5-94), నాగబంధం (5-95), ఛురికాబంధం (5-96),
చక్రబంధం (5-97), ద్వ్యక్షరికందం (5-98) ద్వికంద
క్రౌంచపదం (5-99, 100), భుజగప్రయాతగర్భస్రగ్వినీ
(5-101) మొత్తం ఎనిమిది బంధచక్రకవితలతో నారదుడు
స్తుతించాడు. అతడు త్రికాలవేదికనుక చక్రబంధంలో 'కృష్ణ
రాయకృతి', 'సందితిమ్మకవి' అనే పేర్లు వచ్చేటట్లుస్తుతించా
డనుకోవాలి. ఈ చిత్రగతులలో స్తుతి అయ్యాక కథ కంచికి
వెళ్లింది. ఈ కావ్యం చివర తిమ్మనగా రిలా స్వవిషయం
చెప్పుకొన్నారు.

కౌశికగోత్రవిఖ్యాతు డాపస్తంబసూత్రు డార్యోలపవిత్రకులుడు
నందిసింగామాత్యునకును దిమ్మాంబకుదనయుండు సకలవిద్యావివేక
చతురుడు మలయమారుతకవీంద్రునకు మేనల్లుండు కృష్ణరాయక్షితీశ
కరుణాసమాలబ్ధనచతురంతయానమహాగ్రహారసన్మానయుతుడు
తిమ్మయార్యుండు శివపరాధీనమతి య_ఘోరశివగురుశిష్యుండు పారిజాత
హరణ మను కావ్య మొనరించె నాంధ్రభాష_నాదివాకరతారా
సుధాకరముగ. [పారిజా. 5_108]

ఈ పారిజాతాపహరణకావ్యం కృతి ఇవ్వడానికిముందే
రాయలవారు తిమ్మనగారికి పల్లకీలు, అగ్రహారాలు ఇచ్చి
సన్మానించారని ఈపద్యంవల్ల తెలుస్తున్నది. పారిజాతాపహా
రణంలో. రాయలవారి కళింగవిజయాన్ని సంపూర్ణంగా వర్ణిం

చలేదు కాబట్టి ఇది క్రీ. శ. 1519 కి పూర్వం రచించినట్టు కనబడుతుంది. తిమ్మనగారికి రాయలవారి పరిచయం చిన్న ప్పుడే ఏర్పడడానికి ఆస్కారం ఉంది. ఈయన మేనమామ మలయమారుతకవి నందిఘంటకవులలో ఘంటసింగయ్య. ఆ జంటకవులు కృష్ణరాయలవారి తండ్రి నరసానాయకునికి వరాహపురాణం అంకితం ఇచ్చారు. అప్పటినుంచీ బాలరా యలకు, చిన్నతిమ్మనగారికి మైత్రి ఉండేదేమో! రాయలవారు రాజ్యానికి వచ్చిన దగ్గిరనుంచీ తిమ్మనగా రాకొలువులో ఉండేవారేమో అని రాయవాచకంవల్ల తెలుస్తున్నది. మొదటి జగడాన విజయంరాగానే దానిని ముక్కుతిమ్మన గారు వర్ణించారు. రాయలవారి ఆస్థానకవిగా ఆయన క్రీ. శ. 1522 దాకా ఉన్నారని చెప్పడానికి శాసనప్రమాణంఉంది. ఆసంవత్సరం రాయలవారు గయలో వేయించిన జయశాసనం తిమ్మనగారే వ్రాశారు.[1] దానిలో పారిజాతాపహరణంలోని ఈ క్రిందిపద్యంకూడా ఉంది.

తిరుమలదేవీవల్లభ-కరుణామయహృదయ రాజకంఠీరవ యీ
శ్వరనరసభూపురందర-వరనందనబాసదప్పవరగండాంకా.[పారి.2-105]

ఈ గయశాసనంవల్ల తిమ్మనగారు రాయలశాసనాలు వ్రాసే విద్యాధికారిపదవిలో ఉన్నా రనిపిస్తుంది. కొన్ని సంస్కృతశాసనాలను వారు వ్రాశారేమో భావిపరిశోధన వల్ల ఏమైనా బయటపడవచ్చు.

---

1. ఈశాసనాన్ని మొదట కె. వి. హెచ్. శర్మగారు ఆంధ్ర సాహిత్యపరిషత్ పత్రిక 47 సంపుటి, 2-3 సంచికలలో ప్రచురించారు. 1959 ఫిబ్రవరి నుండి కొన్ని నెలలు-1960 దాకా భారతిలో ఈశాసనం గురించి చర్చలుజరిగాయి.

తిమ్మనగారు పారిజాతాపహరణాన్ని హరివంశంనుండి అనువదించారనీ, మూలంలోని కల్పనలు కొన్ని యథాతథంగా దించారనీ కొందరు పరిశోధకులు నిరూపించడానికి ప్రయత్నిస్తున్నారు.[1] "మూలగ్రంథంలోని చాల భాగముల ననుసరించియే ఈ కవివరుడు ప్రాసినను ఱెక్కచోట్లలో గాథలనుమార్చియు, సంక్షేపము చేసియు, బొత్తిగా వదలియు, లేని వర్ణనాదులు విస్తరించియు, పెంచియు, భేదములుగావించెను" అని పరిశీలకులు ఒప్పుకుంటున్నారు.[2] ఇక అనువాదం ఏమిటి? ఆధారాన్ని తీసుకున్నాడు అనాలి. నిజానికి పుట్టపర్తినారాయణాచార్యులు గారు చెప్పినట్లు "ప్రతిదానిని గీర్వాణముతోముడిపెట్టనిది మనకు తృప్తిలేదు.[3] తిమ్మనకావ్యానికి కన్నడంలో ఉన్న 'హరికథాసారం' అనే గ్రంథం మాతృక అని నారాయణాచార్యులుగారు చెప్పున్నారు. కొన్ని కన్నడపద్యాలను ఆయన మక్కికి మక్కి తెనిగించారట. అల్లసాని పెద్దన గారు 'హరికథాసారం' తెలుగులో రచించినట్లు లాక్షణికులు కొన్నిపద్యాలు ఉదాహరిస్తున్నారు. తెలుగులో పెద్దన గారూ, తిమ్మనగారూ ప్రాసిన కావ్యాలనుండి పద్యాలను కన్నడకవి అనువదించాడేమో పరిశోధించాలి.

---

1. విజయనగరసామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్ర. వేంకట్ మల్లి అచ్యుతరావుగారు. ద్వితీయభాగం, పుట 239.

2. పారిజాతాపహరణం. పరిమళోల్లాస వాఖ్యతో. పీఠిక - నాగపూడి కప్పుస్వామి అయ్యర్.

3. తెలుగు భాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 8-వ సంపుటి. పుట 820.

ముక్కుతిమ్మనగారు పారిజాతాపహరణమొక్కటే గాక 'వాణీవిలాసం' అనే ఇంకొక కావ్యంకూడా వ్రాశారట. ఈసంగతి కూచిమంచి వెంకటరాయకవి వ్రాసిన కవిమనోరంజని అనే అప్పకవీయవిమర్శనవల్ల తెలుస్తున్నదట.[1] ఇది నేడు అలభ్యం. దొరికితే పారిజాతంలాగే వీనులవిందు చేస్తుంది.

ఒకసారి తిమ్మనగారు తమ పీనులకు కొత్తకుండలాలు పెట్టుకొన్నారట. ఒక భట్టు ఆయనదర్శనం చేసుకొని ఇలా ప్రశంసించాడట.

మాకొలదిజానపదులకు_నీకవితాఠీవి యబ్బునే కూపనట
ద్వైకములకగగనధునీ_శీకరముల చెమ్మ? నందిసింగయతిమ్మా!

ఈపద్యం వినగానే తిమ్మనగారు సంతోషించారు. ఇవ్వడానికింకేం దగ్గిర లేక చెవినున్న ఒక కుండలం తీసి భట్టును తిమ్మనగారు సత్కరించారు. మరునాడు కొలువుకూటానికి ఒక్కకుండలంతోనే ఆయన వెళ్లారు. "ఏమిటి విశేషం?" అని రాయలవారు అడిగారట. తిమ్మనగారు జరిగినది మనవిచేశారు. ఆపద్యాన్ని చదివారు. రాయలవారు విని మూడవపాదంలో 'గగనధునీ' అనే మాటను 'నాకధునీ'అని మారిస్తే బాగుంటుందన్నారు. వెంటనే తిమ్మనగారు రెండోకుండలం తీసి రాయలవారికి బహూకరించారు.

మంచిపద్యాలు చెప్పడమే కాదు, మంచిపద్యాలను మెచ్చుకోగలగడం సత్కవిలక్షణం!

---

1. విజయనగరసామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయ చరిత్ర, 2-వ భాగంలో తేటమల్ల అచ్యుతరావుగారు చెప్పారు. పుట 218.

8

చరిగొండ ధర్మన్న

నాదెండ్లగోపమంత్రి

ద్ర రంగస్థలంమీద నేడు అశేషప్రచారం గల నాటకాలలో గయోపాఖ్యానం ఒకటి. ఒక్కటే ప్రాణంగా సంచరించిన కృష్ణార్జునులు పరస్పరం పోరాడుకున్న ఈ కథ తొలిసారిగా కృష్ణదేవ రాయల వారి కాలంలోనే కావ్యరూపాన మన సాహిత్యంలో వెలసింది. చరిగొండ ధర్మన్న అనే కవి చిత్రభారతం అనే ఎనిమిది ఆశ్వాసాల కావ్యాన్ని ప్రాశాడు. ఇది గయో పాఖ్యానం కాదు గాని కృష్ణార్జునుల యుద్ధాన్ని కథనం చేస్తుంది. ఇందులోకూడా అర్జునుడు అభయమిచ్చినడమే యుద్ధకారణం. కృష్ణునివల్ల ప్రాణభయం పొందినవాడి పేరు చతుర్ధనుడు. అతడు ఒకనాడు వేటకు వెళ్లాడు. అక్కడ అతని కంటికి గుర్రం కనబడింది. మెచ్చుకొని ఆ రాజు దానిని

నగరుకు తీసుకుపోయాడు. ఒక మంచిరోజుచూసి దానిపై సవారి చేయపోయాడు. ఆ గుర్రం అతనితో ఎగిరి అన్ని లోకాలూ చూపించింది. తిరిగి అతణ్ణి రాజ్యానికి తీసుకు వస్తున్నప్పుడు ఆ గుఱ్ఱపు నోటి నురుగు అర్ఘ్యమిస్తున్న కృష్ణుని చేతిలో పడింది. అత డీ అపచారానికి కారణ భూతుణ్ణి ముప్ఫయిరోజుల్లో చంపుతానని ప్రతిజ్ఞ చేస్తాడు. ఆ ప్రతిజ్ఞ చేస్తున్నప్పుడు నారదుడు అక్కడ ఉన్నాడు.

తాను అపచారం చేసినట్టుగాని, కృష్ణుడు శపథం చేసినట్టుగాని తెలియని చతుర్ధన మహారాజుకు నారదుడు ఈ సంగతులు కాస్తా చెపినివేస్తాడు. చతుర్ధనుడు భయపడి దేవేంద్రుణ్ణి రక్షించమంటాడు. అతడు 'కృష్ణుని చేతిలో ఓడిపోయాను. నేను రక్షించలేను' అంటాడు. పారిజాతా పహరణ కథ చెప్తాడు. చతుర్ధనుడు శివుణ్ణి ప్రార్థిస్తాడు. అతడు 'నేనూ పూర్వం కృష్ణుని చేతిలో అపజయం పొందిన వాణ్ణే' అని ఉషాపరిణయంకథ చెప్తాడు. బ్రహ్మకూడ నిరాకరించి కథ చెప్తాడు. తనను కాపాడేవాడు ఎవడూ లేడే అని చతుర్ధనుడు పరితపిస్తున్న సమయంలో అతని రాజ్యప్రాంతాలలో ఉన్న అడవిలో అర్జునుడు వేటాడడానికి వస్తాడు. చతుర్ధనుడు తాను ఎవరి భారినుండి శరణుకోరుతున్నదీ చెప్పక అర్జునుణ్ణి వేడుకొంటాడు. అతడు అభయప్రదానం చేస్తాడు. పాండవులు భీష్మున్ణి సంప్రదించారు. ఆయన కౌరవ పాండవులను కలిపాడు. యాదవులతో ఈ నూటఅయిదు గురు అన్నదమ్ములూ పద్దెనిమిది రోజులు యుద్ధంచేశారు. కృష్ణుడు చక్రాయుధాన్ని ధరించి ఒక్కధర్మరాజునుతప్ప

అందరినీ సంహరించాడు. ధర్మరాజువద్దకు కృష్ణుడు వచ్చి 'ఒక్క వర మిచ్చాను. ఎవర్ని బ్రతికించమంటావు?' అన్నాడు. అతడు చతుర్థనుడినే బ్రతికించ మన్నాడు. పాండవులు అభయమిచ్చిన వాడిని కాపాడలేక నాయారనే అపఖ్యాతి తప్పుతుంది అన్నాడు. కృష్ణుడు మెచ్చుకొని అందర్నీ బ్రతికించాడు.

ఈ కథ చిత్రంగా ఉంది కనుకనే దీనికి చరిగొండ ధర్మన్న చిత్రభారతం అని పేరు పెట్టాడు. ఇది బ్రహ్మాండ పురాణంలో ఉంది.[1] ఈ కథ ప్రాక్తన రాజావళీ విశేష చరితములలోని మిగుల నాశ్చర్యహేతువైన కథ.[2] ఇలా వంతునకు శుకయోగి చెప్పిన కథను నైమిశారణ్యంలో సూతుడు శౌనకాది మహాములకు చెప్పాడట. ఈ కథను విచిత్ర గతిలో అలంకారసరణి మీర, రసములు చిప్పిల, మెచ్చులొలుక, చరిగొండ ధర్మన రచించాడు. ఇతడు 'శత లేఖినీ సురత్రాణ' బిరుదంగలవాడు. తెలంగాణాలోని చరిగొండ గ్రామం వాడు. ఇది మహబూబునగర్ జిల్లాలో ఉంది.[3] ఆకాలంలో దానిని చరిగొండసీమ అని పిలిచేవారు.

నేడు కరీంనగర్ జిల్లాలో ఉన్న ధర్మపురికి చరిగొండ ధర్మన్న వెళ్లాడు. అక్కడి నరసింహస్వామికి భక్తుడైన ఎనుములపల్లి పెద్దసగారు ఆగోజుల్లో చిత్తపుఖాన్ మంత్రిగా ఉండేవారు. ఆప్రభువు ఈ మంత్రికి బంగారు చామరాలు,

---

1. చిత్రభారతం, 1-11.
2. ,, 1-38.
3. ఆంధ్రకవితరంగిణి, 8 వ సంపుటి, పుట 114.

పల్లకీలు, వెల్లగొడుగులు మొదలైన రాచమర్యాదలన్నీ ఇచ్చాడు. ఖాన్ అనే పేరు ఉండడంవల్ల ఇతడు మహమ్మదీయుడని పొరపడడానికి ఆస్కారం ఉంది గాని చిత్తపు ఖాన్ హిందువే. బోయకులంలో పుట్టి చిన్నప్పుడు పశువులు కాచుకొంటూ తిరిగిన సీతడు అనే స్వప్రయోజకుడు ఆనాటి తెలంగాణాలోని మహమ్మదీయుల కొలువులో చేరాడు. సైనికుడుగా చేరి వాడు సేనాని అయ్యాడు. చిన్న జాగీరు, చిత్తపఖాన్ అనే పేరు సంపాదించుకొన్నాడు. క్రీ. శ. 1480-85 ప్రాంతాలలో రాచకొండకు ఏలికగా ఉన్నాడు. ప్రజానురంజకు డయ్యాడు. క్రీ. శ. 1503 లో కుతుబ్-ఉల్-ముల్క్-నుండి వరంగల్లును జయించి మహమ్మదీయులు పాడుచేసిన దేవాలయాలు బాగుచేయించి దైవాలను పునఃప్రతిష్ఠ చేయించాడు. పాకాల చెరువు మొదలైనవి తవ్వించాడు. దురదృష్టవశాత్తూ ఇతడు ఆట్టే కాలం ఓరుగల్లు పాలించలేకపోయాడు. క్రీ. శ. 1512 లో కులీకుతుబ్ షా ఇతణ్ణి ఓడించాడు. అందుచేత చిత్తబుఖాన్ గజపతులను ఆశ్రయించాడు. కృష్ణదేవరాయలవారు కళింగ దండయాత్ర చేస్తున్నప్పుడు తన విలుకాండ్రతో ఇతడు విజయనగర సేనలను చీకాకు పెట్టాడు.[1] ఈయుదంలోనే చిత్తబుఖానుడు మరణించాడేమో అని పరిశోధకులు భావిస్తున్నారు.[2]

---

1. రాయవాచకం, 94-95.

2. షితాబుఖాను అను సీతాపతిరాజు, ఆదిరాజు వీరభద్రరావు గారు, లక్ష్మణరాయపరిశోధనమండలి సంచిక, హైదరాబాదు, పుట 50.

క్రీ. శ. 1503-1512 మధ్య ఓరుగంటిని చిత్తపుఖాను పాలించాడు. ఆకాలంలోనే ఎనుమలపల్లి పెద్దనమంత్రి ఉండేవాడు. ఈ వైభవాలను చరిగొండ ధర్మన్న తన చిత్ర భారతంలో పేర్కొన్నాడు కనుక ఈ కాలంలోనే చిత్ర భారత రచన జరిగిందని చెప్పవచ్చు. ధర్మన్న నుతించిన తెలుగుకవులలో పిల్లలమర్రి పినవీరభద్రయ్య లేడు.

ఘనునన్న పార్థ్య దిక్కనసోమయాజుల వర్ణించి వేములవాడ భీము
నాచనామాత్యు సోము శ్రీనాథు చిమ్మ-పూడి యమరేశు బమ్మెరపోతరాజు
శంభుదాసుహుళిక్కి భాస్కరు డునాది-యైనకవుల కెల్ల నెయ్యమునెరగి.
[చిత్రభారతం, పీఠిక 8]

ఇతడు కవులను నుతించాడుగాని పోతరాజుగారి లాగే కుకవుల ఊసే ఎత్తలేదు. ఇతడు తన కవిత్వంగురించి కృతిపతిచేత ఇలాగా చెప్పించాడు.

శతలేఖిన్యవధానపద్యరచనాసంధాసురత్రాణచి
హ్నితనామా చరికొండ ధర్మకవీ! నీ వాగ్విలాసంబు లా
శితికంఠోజ్జ్వలజూటకోటరకుటీశీతాంశురేఖాసుధా
స్రవితగంగాకనకాబ్జనిర్భరరసావిష్కృతమాధుర్యముల్.
[చిత్రభారతం, పీఠిక 18]

ఇది అతిశయోక్తి కాదు. ఇతడు వ్రాసిన ఎనిమిది ఆశ్వాసాలలో ఎక్కడ ఏపద్యం తీసుకున్నా మధురంగానే ఉంటుంది. ప్రబంధలక్షణాలకు కావలసిన అష్టాదశవర్ణనలతో చిన్న కథను 1304 గద్యపద్యాలను పెంచాడు. కృష్ణార్జునుల యుద్ధానికి కారణభూతుడైన చతుర్థనుడు అసలు మూడో ఆశ్వాసంలోగాని రాడు. ప్రథమాశ్వాసం

కథ ఎత్తుకోడానికే సరిపోయింది. తుల్యుడనే ముని తపస్సు చేసుకుంటున్నాడు. ఏయే ఋతువులు ఎలా ఉండగా తపస్సు చేసినదీ చెప్పి ఋతువర్ణనలు చేశాడు. ఆ ఋషితపస్సు చెడగొట్టడానికి రంభ వచ్చింది. ఆమెను దేవేంద్రు డెలా పంపినదీ వివరించారు. ఆమెతో ఇతర అప్సరసలు వచ్చారు. మన్మథుడు సిబ్బందితో బయలుదేరాడు. వసంతవర్ణన, పుష్పావచయం, జలకేళి, తడిబట్టలలో అందాలు, ఇలాగ వివిధవిషయాలతో గ్రంథం పెరిగింది. మునిచుట్టూ చేరిన అప్సరసలు వాయగా రాని పలుకులు పలికారు.[1] రంభ వీణ వాయించసాగింది. ముని కళ్లు తెరిచాడు. ఆమెను నఖశిఖపర్యంతం వీక్షించాడు. సకలావయవాలూ ముప్పయి పద్యాలలో వర్ణించాడు. తనవితీరక ఇంకోపద్యంలో వితర్కించాడు.

ముని తన వలలో పడ్డాడని రంభ సంతోషించింది. స్వర్గసౌఖ్యా లన్నిటికి తానే కారణం అని చెప్పింది. తనువులు నొచ్చినపిదప పొందే బ్రహ్మానందకేళికంటె ప్రయాస లేని వనితాసంగమం మిగుల సౌఖ్యం అంది.

నీవీమోక్షము గోరి యోగముల నెంతే డస్సి డెందంబులో
నే వెంటం గొనరాని మోది యమృతం బేలా విచారింప? నా
నీవీమోక్షము జేసి యాగముల నెంతే నెమ్మదిండాయు నీ
నే వెంటన్ జనకండ గల్గు నమృతం బిచ్చోట నామోవిపైన్.

[చిత్రభారతం, 3-82]

---

1. చిత్రభారతం, 3-80.

ఆమె ఇలాగ అన్నాక మునికి కోపం వచ్చింది. ఆడ గుట్టాని వై పుట్టు అని శపించాడు. రంభ తల్లడిల్లింది.

విటుడు పల్లొత్తిన గటగట పడు మోవి యినుపక ళ్లెములకు నెట్టు లోర్చు
గొనగోరు తాకిన గ్రొవ్వారు దేహంబు ఘనక శాఘాతుల నేగతి సహించు
కలిపపయ్యెద మోప దలకడి యంసంబుపక్కర నేరీతి నిక్కి తాల్చు
నొరులు పాదాంభోజయుగళిమోవగనున్న యే నన్యులవహింప నెట్లు నేర్తు
సంతతము మందగమనాలసంబు లైన-నాదు పాదంబు లిల పవనంబులీల
పర్వ బెట్టంగ జాలునే పరమయోగి-వర్య ! నాకిట్టి దుర్దశ వలదు, మాన్పు !
[చిత్ర భారతం, 3-95]

నలకూబరుడంతటివాడు మత్పదాంభోరుహలాక్ష కుంకుమ బొట్టుగ గైకొని ఎల్ల వేళలా ఉంటాడే, నాకీయాడ గుర్రపుమూపు వచ్చిందా అని మొత్తుకుంది. శాపవిమోచనం చెప్పమంది. చతుర్థనుడనే రాజును సకలలోకాలూ తిప్పిన తరువాత నీకు విముక్తి కలుగుతుందని ముని చెప్పాడు. అలాగే జరిగింది. అయితే రంభకు విముక్తి కలిగినా రాజు పీకలమీదకు వచ్చింది. అది అర్జునుణ్ణి చుట్టుకొంది. కృష్ణుడు మండిపడ్డాడు.

నాసహాయమ్మ్ లేకున్న నరుడు నరుడు నాసహాయంబు గలిగిన నరుడుహరుడు.
[చిత్ర భారతం, 6-147]

అని కృష్ణుడు రుజువుచేశాడు. ధర్మన్న ఈ కృష్ణార్జునులయుద్ధాన్ని మహాభారతసంగ్రామమంత విరివిగా వర్ణించాడు. కురుపాండవులు మనుష్యవ్యూహాన్ని రచిస్తారు. యాదవులాావలవ్యూహంలో ఎదురొక్కంటారు. ఒకనాడు వ్యూహాల్లో, వ్యూహాల్లో వ్యూహాలు పన్నుతారు. శకటా

కారంబుగా మోహరంబు మీరంబన్ని యందు నంతర
వ్యూహంబుగా పద్మవ్యూహంబు సమకట్టి, దాని మధ్య
ప్రదేశంబున సూచీవ్యూహం బేర్పరచి పాండవులు
యుదం చేసారు. ఈయుదవరనలు మూలంలోనివో లేక
ధర్మన్న స్వకపోలకల్పితాలో? ఇతనికి యుద్ధాలేకాక వేట
బాగా తెలుసు. చతుర్థనుని వేట 32 గద్యపద్యాలలో వర్ణిం
చాడు. మనుచరిత్రలో అల్లసాని పెద్దనగారు వర్ణించిన దాని
దగ్గర్లో ఉంటుంది. ఎటొచ్చీ ఇది ముందు వ్రాశాడు. పిన
వీరయ్య, నండిఘుంటకవులు ఇది ఫాషన్ చేసిపోయారు.

అల్లసాని పెద్దనగారికి ముందే వేటను సవిస్తరంగా
వర్ణించిన ధర్మన్న, నందితిమ్మనగారికంటే ముందుగా పారి
జాతాపహరణంకూడా తనగ్రంథంలో సూచించాడు. 26
గద్యపద్యాలలో ఇంద్రుడిచేత ఈకథ చెప్పించాడు. అయితే
ఇందులో నారదుడు పువ్వు తెచ్చి ఇవ్వడు. సత్యభామ అల
గడం, కృష్ణునికాలితో తన్నడం వగైరాలు లేవు. నరకా
సురవధ తరువాత యకాయకిని స్వర్గానికి వెళ్ళడం, అక్కడ
శచీదేవి అవమానం చేయడం, సత్యభామ చిన్నబుచ్చు
కోవడం ఉన్నాయి. కృష్ణుడు ఊరడిస్తాడు.

ఏమిటి కింత వంత తరశేక్షణ! చెప్పు మటన్న లేచి య
శ్శ్యామిని చన్నుదోయిపయి పయ్యెదకొంగు దలంగి జార
నెమ్మో మరవాల్చి యూరుపుల ముంగర ముత్యము గందనేడిచెం
గోమలనూతనస్వరము గ్రోలుచు గోయిలపిల్లయో యనన్.

[చిత్రభారతం, 5-94]

ముక్కు-తిమ్మనగారి కన్నా ముందుగానే •షిచ్చినా,

అంత ముద్దుగా ధర్మన్న ఏడ్వలేకపోయాడు. అయితే ఈ సత్యభామ కోపం వస్తే తల కట్టుకు పడుకోదు. చెంపమీద చెయ్యి వేసుకుని ఆలోచిస్తుంది. శచీదేవి అవమానించాక సత్యభామ తన విడిదికి పోయింది.

ఈసునుఁ గోపము న్మది వహించి పులోమజ వేడిమాట లా
గాసిలి మేన సొ మ్ముడిపి కన్నుల గ్రమ్మెడు నీట జందనం
బోసరిలంగ జేసి శిర మొయ్యన వంచి కపోలపాళిపై
జేసయకొల్పి యొక్కయెడ జింతిలుచుండెడు నంతలోపలన్.

[చిత్రభారతం, 5-91]

తెలుగుసాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయే సాహిత్యకల్పనలు కొంచెం ముందుగానే ఊహించిన చరి కొండ ధర్మన్న కవిత్వం గజ్జెలగుర్రంలాగా కదనుతొక్కుతుంది. వాస్తవాని కితడు మంచి గుట్టుం, చక్కని కవిత్వం ఒక్కలాగే ఉంటాయి అంటాడు.

పదముల చొప్పును వడియొ-ప్పిదము నలంకారలక్ష్మి పేర్మియు ధారా
స్పదభావము గల్గి శుభ-ప్రదమై హాయ మమరి సత్ప్రబంధమురీతిన్.

[చిత్రభారతం, 3-160]

•

ఈ సత్ప్రబంధాన్ని రాయలవారి ప్రతికవ్వి ఆశ్రితుని ఆశ్రితుడు వ్రాశాడు. అయితే ఇదే కృష్ణార్జునసంవాదాన్ని రాయలవారి ఆశ్రితుడుకూడా వ్రాశాడు. నేడు ప్రచారంలో ఉన్న కథలతో గయోపాఖ్యానాన్ని నాదెండ్లగోపమంత్రి ద్విపదకావ్యంగావ్రాశాడు. ఇతడు అప్పాజీతిమ్మరుసయ్యగారి కడగొట్టుమేనల్లుడు. మొదట గుత్తిదుర్గానికి పాలకుడుగా ఉండేవాడు. తరువాత కొండవీడు పాలించాడు. ఇతని అన్న

అప్పనమంత్రికే మాదయగారి మల్లన రాజశేఖరచరిత్ర అంకితం ఇచ్చాడు.

నాదెండ్ల గోపమంత్రి సంస్కృతగ్రంథాలు చాలా చదువుకొన్నాడు. కృష్ణమిశ్రుడు రచించిన ప్రబోధచంద్రోదయం నాటకానికి చంద్రికావ్యాఖ్యను గోపమంత్రి వ్రాశాడు. అందులో అవతారికలో తన అన్న అప్పమంత్రిని గురించి చెప్పాక, తన సంగతి ఇలా వ్రాసుకొన్నాడు.

తస్యానుజ స్తరుణభాస్కరదివ్యతేజాః
నాదెండ్లగోపసచివో నయమార్గవేత్తా
చాణక్యభట్టిశివదేవయుగంధరాదీన్
యః పూర్వమంత్రితిలకానపి ధిక్కరోతి. 1

[ప్రబోధచంద్రోదయవ్యాఖ్యావతారిక, 10]

ఇంతటి నయమార్గవేత్త కనుకనే తిమ్మరుసయ్యగారు కొండవీటి రక్షణ ఈతని భుజాలపై పెట్టారు. కృష్ణరాయల వారీసుర్గాన్ని క్రీ. శ. 1515 లో జయించారు. అప్పాజీ చేతిలో పెట్టారు. ఆయన మేనల్లుడిని పాలకునిగా చేశారు. నాదెండ్లవారి వంశకర్త విశ్వామిత్రుడు. మూసికొండపేటిలో యజ్ఞం చేశాడట. అక్కడ రాఘవేశ్వరుని ఆలయం ఉంది. దానికి గోపమంత్రి ప్రాకారగోపురాలు కట్టించాడు. ఇది క్రీ. శ. 1520 లో జరిగింది. ఈనిర్మాణం జరిగాక ఆదేవునికి అంకితంగా ఈ ద్విపదకావ్యం గోపమంత్రి చెప్పాడు. అందు చేత దీని రచనాకాలం క్రీ. శ. 1520 తరువాతనే అని చెప్పవచ్చు.

---

1. శ్రీకృష్ణార్జునసంవాదం, పీఠిక, పుట 29.

ఇందులో 1513 ద్విపదపాదా లున్నాయి. కల్పన లేవీ గొప్పగా లేకపోయినా కథనం సాఫీగా ఉంది. అన్నీ విరివిగా వర్ణించాలనే ఉబలాటం ఎక్కడా లేదు. నుడికారపు రుచులు ఉన్నాయి. ఈ గయోపాఖ్యానాన్ని గోపమంత్రి స్వయంగా కల్పించాడో, లేక ఏపురాణంలోనుంచైనా తీసుకొన్నాడో తెలియదు. ఇందులో సుభద్రచేత కృష్ణుడు రాయభారం పంపించడంకూడా ఉంది. ఆమెను పంపిస్తూ "తేకువ గయుని బుత్తెమ్మను మట్లుగాకున్న మధుబిందుకల హమూహసనుము" అంటాడు. చిన్నమాటలలో పెద్దఅర్థం ఇమిడింది. సుభద్ర అర్జునునితో ఇలా అంటుంది.

ప్రాణప్రదంబైన పద్మాక్షు విడిచి-ప్రాణేశ గయుని చేపట్టిన మేలె
బెదరి మీదెరుగక పేరోడ నిడిచి-పదరుబట్టిన నెట్టి పనువయ్యజూడ
ఎందును దెవటి చెట్టెవ్వరికైన-మంచుగా దను మాట మరి నిజంబయ్యె.

[కృష్ణార్జున. 678-682]

సుభద్ర ఒక్కర్తే కాదు. ద్రౌపతికూడా ఇలాగే హితోపదేశం చేస్తుంది.


ముంగొంగురత్నంబుముంగిటి బనిడి-తంగేటి జున్ను రాధాభర్త మనకు
నిటువంటి శౌరికి నేలనొక్కో నేడు-కటకటా మనమోద ఘటియిల్లె కినుక
ఛాయయో గ్రహగతి చాలని వేళ-పాయని చుట్టాలు పగవారు గారె.

[కృష్ణార్జున. 916-921]

ఈయుగంలో వెలసిన ప్రౌఢకావ్యాలముందు గోపమంత్రి ద్విపద వెలవెలపోవచ్చునుగాని మన సాహిత్యంలో వెలువడిన మొదటిగయోపాఖ్యానం వ్రాసినందుకు అతడు స్మరణీయుడే అవుతాడు.

9

అల్లసాని పెద్దన



లుగుసాహిత్యంలోని పంచకావ్యాలలో మను చరిత్రను మొట్టమొదట లెక్కపెట్టతారు. ఆంధ్రప్రబంధకవులలో ప్రథమపూజ అల్లసాని పెద్దనగారికే చేస్తారు. ఆదికవులు, కవిబ్రహ్మలు, ప్రబంధ పరమేశ్వరులు, నవీనగుణసనాధులు, కవిసార్వభౌములు మొదలైన అజానుబాహు లెందరున్నా మన సాహితీ రంగంలో అందరికన్నా ఒక జానెడు ఎత్తుగా కనిపించే జాణ ఆంధ్రకవితాపితామహుడే. దీనికి కారణం కృష్ణదేవరాయల వారు అందరికన్నా పెద్దపీట వేసి పెద్దనగారిని దానిమీద నిలబెట్టడం కానేకాదు. ఆయన సహజంగా ఉన్నతుడు. రాయలవారి పీట లేకపోయినా, జానెడు కాకపోతే, బెత్తెడయినా ఎత్తుగా అల్లసాని పెద్దనగారు కనబడకపోరు. దానికి కారణం, ఆయనలో పూర్వకవుల శుభలక్షణాలన్నీ కేంద్రీకృతం అయాయి. నన్నయగారి ప్రసన్నకథాకలితార్థ

యుక్తి, తిక్కనగారి సంభాషణశైలిలోనే పాత్రచిత్రణ, ఎఱ్ఱయగారి ఔచిత్యవంతమైన తెలుగు వాతావరణం, నాచనసోమని కొత్తచమత్కారాలూ, శ్రీనాథుని శయ్యా సౌభాగ్యప్రీతీ పెద్దనగారికి ఒక్కరూపున మూర్తీభవించి సాక్షాత్కరిస్తాయి. అందుకే రాయలవంటి వారు సహితం ఆయనకు జోహారు అన్నారు.

అల్లసాని పెద్దనగారు వాస్తవానికి ఎప్పుడు కృష్ణ రాయల ఆస్థానంలో చేరారో చెప్పలేం. పెద్దనగారు రాయలవారి బాల్యగురువని కొందరు భావిస్తారు.[1] అయితే ఈ ఊహకు ఆధారం కనబడదు. రాయలవారూ, పెద్దనగారూ నూత్నయౌవనంలో స్నేహితులు కావచ్చు. కాని వారికి గురుశిష్యసంబంధం ఉన్నట్టు కనిపించదు. రాయలవారి విద్యాగురువు ఎవరో నికరంగా చెప్పలేం. తిరుమల తాతాచార్యులవారు మతగురువులే. మఠసంస్థాపకుడు. పెద్దనగారు మాత్రం తమకు శఠగోపయతీంద్రులదయవల్ల చతుర్విధ కవిత్వాలూ అబ్బినవని చెప్పుకొన్నారు. క్రీ. శ. 1512 నుండి 22 దాకా అహోబిలమఠానికి పాలకులుగా ఒక శఠగోప యతి ఉన్నారు. ఈయన ఆ మఠంలో సప్తమపీఠాధిపతి. వీరి పేరు వాసంతికాపరిణయం అనే రూపకం వ్రాశారు. వారి వద్దనే పెద్దనగారు సాహిత్యశిక్షణ పొందారు. పీఠాధిపత్యం వహించడానికిముందు శఠగోపయతి పూర్వాశ్రమంలో విద్యాదానం చేస్తూఉండేవారనుకోవాలి. మఠమున్న

---

1. విజయనగరసామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్ర, 2-వ భాగం. వేటమళ్ళ అచ్యుతరావుగారు. పుట 114.

అహోబిలక్షేత్రం పెద్దనగారి జన్మస్థానమైన కోకటగ్రామానికి ఐదారామడల చేరువలోనే ఉంది. నేడు కడపజిల్లాలో జమ్మలమడుగుతాలూకాలో ఉన్న గండికోటవద్ద కోకట మనే గ్రామం ఉంది. అందులో అల్లసానివారి కాపుర ముండేవారు. ఈ గ్రామం కాశీరామేశ్వరాలకు పోయే ఘంటాపథం ప్రక్కన ఉంది.

పెద్దనగారు చిన్నప్పుడే అహోబిలం వెళ్ళి శఠగోప యతికి శిష్యులై పురాణాలు, ఆగమాలు, ఇతిహాసాలూ మొదలైనవాటిలో కథార్థాలను తెలుసుకొని ఉంటారు. ఆ మఠాధిపతి విద్యానిలయుడు.[1] ఆశు, మధుర, చిత్ర, విస్తరకవిత్వాల మర్మాలు తెలిసినవాడు. వాటిని పెద్దన గారికి శఠగోపయతి విడమరిచి చెప్పిఉంటాడు. ఈయన బోధవల్ల పెద్దనగారు భాషలో 'అపరశేషభోగి' అయ్యారు. అనర్గళంగా ఆశుకవిత్వం చెప్పే విద్యను అలవర్చుకొన్న పెద్దనగారికి ఎక్కడకు వెళ్ళినా దిగ్విజయమే.

నూత్నయౌవనంలో ఆయన చంద్రగిరి వెళ్ళి బాల కృష్ణరాయల పరిచయం ఏర్పరచుకొనిఉంటారు. రాయల వారు పట్టం కట్టుకొన్న వెంటనే మూడిళ్ళ తురకలతో ముమ్మరంగా యుద్ధం చేశారు. ఆ యుద్ధభూమిలో రాయల వారితోపాటు ముక్కతిమ్మనగారు, అల్లసాని పెద్దనగారు, మాదయగారి మల్లనవంటి కవులు ఉన్నారు.[2] అప్పటికి పెద్దనగారు హరికథాసార మనే కృతిని రచించి తమగురువు

---

1. మనుచరిత్ర, 1_6.
2. రాయవాచకం, పుట 89.

శరగోపయతికో, యిష్టదైవానికో అంకితం ఇచ్చినట్టుంది. ఈ గ్రంథం నేడు నష్టమైనా లాక్షణికులు ఉదాహరించిన కొన్ని పద్యాలు దక్కాయి. అందులో షష్ట్యంతంలాగ కనబడే ఈ పద్యం ఒకటి ఉంది.

శరకోపయతికి ఖలతరు-కుఠారరూపమతికి శరగురుమతవ్యాత్త-
గ్భూధరపతికి జతురాగము-పతనాయతనియతికి యజపాధికభృతికిన్.

[ఆనందరంగ. 3-317]

ఈ పద్యాన్ని కస్తూరి రంగకవి అఖండయతికి ఉదాహరణగా తన ఆనందరంగరాట్ఛందంలో ఉదాహరించాడు. ఇది అల్లసానిపెద్దనగారి హరికథాసారంలోని దని చెప్పాడు. ఇందులో వటపత్రశాయిగా పవ్వళించిన నాటినుంచి బలరామావతారంలో ప్రలంబాసురుని సంహరించేదాకా హరికథలన్నీ ఉన్నాయి అనుకోవచ్చు. వటపత్రశాయిని పెద్దసగా రిలావర్ణించారు:

ఆడేవో త్తముడు సుధాం-భోధివటైకాగ్రిను దళమున బాలుండై
చేబోయిచేత దక్షిణ-పాదము గొని నోట జేపె బక పక నగుచున్.

[ఆనందరంగ. 3-66]

ఈ పద్యాన్ని వర్ణప్రాసానికి ఉదాహరణగా కస్తూరి రంగకవి ఉదాహరించాడు. ప్రలంబాసురవధను ఇలా పెద్దన గారు వర్ణించారు.

అంబరమ్ము వగుల నార్చి ప్ర-లంబాసురు డాగ్రహము వెలయ గదిరిన వే
ళం బలరాముడు చేముస-లంబున వాని తల ద్రుంచె లావు మెరయుగన్.

[ఆనందరంగ. 3-42]

ఈ క్రిందిపద్యం ఆశ్వాసాంత పద్యంలాగా ధ్వనిస్తోంది.

లేకపోతే వైవం సాక్షాత్కరించినప్పుడు ఏపాత్రయినా చెప్పినది కావచ్చు.

శయధృతఫణివలయభవా-ద్యనిహితవిశుద్ధసంవిదాత్మకమాయా
మయనానావిధలీలో-దయ సదయకటాక్షశైలతనయాధ్యక్షా!
[ఆనందరంగ. 3-339]

ఈ హరికథాసారంలో కూడా క్రొద్దిగా శృంగారం ఉండదేమో అని ఈ క్రిందిపద్యం నల్ల అనుమానం కలుగు తూండి.

బాలరసాలకిసాలము-క్రోలుచు పలికెడి పికంబకోయన జాలా
జాలిపడియానయభిమధు-రాలాపము లనియె నాదగణమున వినన్.
[ఆనందరంగ. 3-336]

ఈ కావ్యంలో వీరస్వర్గ ప్రస్తావన ఉంది. చూడండి.

తెంపరియై మది యింత చ-లింపక ననిలోన దెగియె నివ్వడతడు నై
లింప సభనుండునతడు బ-దంపడి యార్యులు వచింప దా నిట్లనియెన్.
[ఆనందరంగ. 3-.66]

హరికథా సారంలో కూడా పెద్దనగారు హిమాలయ పుణ్యక్షేత్రాలు వర్ణించినట్లు ఒక సీసపాదంవల్ల తెలుస్తో ది. త్రివర్గప్రాసాసికి ఉదాహరణగా కస్తూరిరంగకవి దానిని ఉదాహరించాడు. ఇందులో 'త్రిశిరోత్రుడు వనజాతిదలాక్షుని గురించి తపముగైకొనిన చోటు' అని ఉంది (ఆనందరంగ. 3-78). మనుచరిత్ర రచించాక ముది మది తప్పినప్పుడు వ్రాసినది కాదు. చాలా తొలిరచన అని చెప్పవచ్చు.

రాయలవారి ఆస్థానంలో చేరిన తరువాత చాలా సంవత్సరాలవరకు పెద్దనగారు ఏవో ఆశుపద్యాలు ఇట్ట

మొచ్చినప్పుడు చెప్పడమేగాని తీరుబాటుగా కూర్చుని కావ్యాలు ప్రాసినట్టు కనబడదు. ఆయన కృతి ప్రాయాలంటే బోలెడంత వాతావరణం కావాలి. నిరుపహతిస్థలంలో అడపా తడపా లోనున్న ప్రియురాలి దగ్గిరనుంచి కర్పూర తాంబూలం తెచ్చే దూతిక, ఆత్మ కింపైన భోజనం, ఉయ్యాలమంచం, చెప్పిన పద్యం ఒప్పో తప్పో పోల్చుకోగలిగే రసజ్ఞులు, ఊహ తెలిసిన లేఖకులు, పాఠకులు ఉంటే గాని ఆయన రచించరు. ఈసంగతి ఆయన చెప్పిన పద్యం వల్ల తెలుస్తూంది.

నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చు క
ప్పురవిడె మాత్మ కింపయిన భోజన ముయ్యెలమంచ మొప్పు త
ప్పురయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరకినగాక యీరక కృతుల్ రచియింపు మటన్న శక్యమే?

అయితే ఈసాకు పద్యం చెప్పడానికి మనస్కరించినప్పుడు ఏకరువు పెట్టేదే. పెద్దనగారు యుద్ధభూమిలో సైతం పద్యాలు చెప్పినట్టు కనబడుతుంది. రాయవాచకంలో గ్రంథస్థం చేయలేదుగాని కృష్ణరాయలపై పెద్దనగారి చాటువులు కొన్ని ఉన్నాయి.

ఏపున కృష్ణరాయ జగతీశ్వరు ఖడ్గము మింటి మార్గమున్
జూపిన భానుమండలము జొచ్చి హుటాహుటి శత్రు లేకుచో
రేపటి భాపనయ్య పగలింటి మహోగ్రపు జంగమయ్య యో
హూపటి దాసరయ్య మమునన్ననచేయు మటందు రెంతయున్.

[ఆనందరంగ. 3_276]

•ఈ పద్యాన్ని అభేదయతికి (క-లమైత్రి) ఉదాహర

ణంగా కస్తూరిరంగకవి ఉదాహరించాడు. ఇది అల్లసాని పెద్దనగారిదని చెప్పాడు. పైపద్యంలో శత్రువులు హిందువులై తే సూర్యబింబాన్ని చూసి ఏమనేదీ చెప్పారు. ఈ క్రింది పద్యంలో మరణించిన మహమ్మదీయవీరులు ఏమంటారో చెప్పారు.

సమరక్షోణిని కృష్ణరాయలభుజాశాతాసిచే బడ్డ దు
ర్మదదోర్దండపులిందకోటియనవాతంబు సప్తాశ్వహా
ర్దిమునన్ గాంచి సిబా సహో హరిహరంగాఖూబుఘూడాకితే
తుముకీబాయిలబాయిదేమలికియందుర్మింటికిం బోవుచున్.

[చాటుపద్యమణిమంజరి, I. పుట 158]

పెద్దనగారి రిటువంటి చతురవచోధనులు. రాయల వారికి హితులు. అందుచేత తరుచుగా ఇద్దరూ కలిసే ఉండే వారు. మంచి కవిత్వం చెప్పడమేకాక ఉత్సాహాంగంలో కూడా పెద్దనగారు పాల్గొంటూఉండేవారు. పెద్దనగారి సలహాలకో, సాహిత్యానికో మెచ్చిన రాయలవారు ఒక అగ్రహారం దానంచేశారు. అది అల్లసాని పెద్దనగారి జన్మస్థలం కోకటమే. రాయలవారితోపాటు పెద్దనగారు క్రీ. శ. 1518 లో కళింగదండయాత్రలో పాల్గొన్నారు. అది బహుధాన్యనామసంవత్సరం. ఆయేడు వైశాఖపూర్ణిమనాడుచంద్ర గ్రహణం వచ్చింది. పెద్దనగారు బెజవాడలో ఉన్నారు. ఇటు వంటి పుణ్యకాలంలో ఏదీ దానంచేయకపోతే ఎలాగ? అని పెద్దనగారు బెజవాడ మల్లికార్జున దేవుని సన్నిధిలో సహిరణ్యోదక దానధారా పూర్వకంగా తమ అగ్రహారంలోని చేనులు కోకట సకలనాథుని లింగానికి ధారపోశారు. ఈ దానాన్ని శాసనంగా రాగిరేకులపై చెక్కించారు.

ఆసంవత్సరమే కార్తీకమాసంలో ఉత్థాన ద్వాదశి పుణ్యకాలంలో అల్లసాని పెద్దనగారు స్వగ్రామంలోని యరి కొత చేసు దానం చేశారు. ఈసారి చెన్న కేశస్వులకు ఇచ్చారు. ఆ బహుధాన్యసంవత్సరం విజయనగరం కోలు వులో ఉన్న వారికి అన్నివిధాలా సంతోషదాయకం. అంతకు ముందు రాయలవారు పొట్నూరిలో విజయస్తంభం నాటిం చారు. ఆయేడు లేకలేక రాయలవారికి పుత్రసంతానం కలిగింది. ఆ పుత్రోత్సాహంలో ఆయన లెక్కలేనన్ని పండుగలు, సంబరాలు జరుపుకొన్నారు. రాజధానిలో భువనవిజయం అనే సభామందిరం కట్టించారు. అందులో సింహపీఠికపై కొలువుండి రాయలవారు ప్రాజ్ఞుల గోష్ఠిలో కవితానుధురిమ గ్రోలుతూ ఉండేవారు. ఒకనాడు రాయల వా రొక గండపెండేరాన్ని బంగారుపళ్లెంలో ఉంపించి తెప్పిం చారు. ఉభయభాషలలో సమానంగా కవిత్వం చెప్పగల వాళ్లకే దీనిని స్వీకరించవచ్చని ప్రకటించారు. ఆసభలో ఉన్న వారు తక్కువవారు కాదు. బహుభాషావేత్త, కవి రాజబిరుదు గల కుమారడిండిమకవిసార్వభౌము డున్నాడు. ఇతడు వీరభద్రవిజయం అనే డిమము ప్రాశాడు. రసమంజరి, రసతరంగిణి, రసపారిజాతం మొదలైన ఎనిమిది గ్రంథాలను ప్రాసిన భానుదత్తుడు మరొకపక్క ఉన్నాడు. వాల్మీకి రామాయణానికి లఘు, గురుటీకలు ప్రాసిన ఈశ్వరదీక్షితులు కూడా ఆసీనుడై ఉన్నాడు. కర్ణాటకవికులసార్వభౌముడు భానుకవికుమారుడు మహాకవి తిమ్మన్న సముఖంలోనే ఉన్నాడు. కుమారవాల్మీకి నరహరి ఆసభలోనే ఒక పీఠం

అధిష్ఠించాడు. 'ఇరుసమయవిలక్కమ్' వ్రాసిన తమిళకవి హరిహరదాసు ఆ పేరోలగంలో కూర్చున్నాడు. రాయల వారితోపాటు పొట్నూరిదాకా వెళ్లిన కవి ఇతడు తన గ్రంథంలో సింహాచలక్షేత్రాన్ని ప్రశంసించాడు. జయస్తంభాన్ని వర్ణించాడు.

తమిళసంస్కృతకర్ణాటకవిపండితులతోగాటు తెలుగు కవులు ముక్కుతిమ్మనగారు, మాదయ్యగారి మల్లన్న, ధూర్జటి ఉండనేఉన్నారు. పెద్దనగారు సరేసరి – తోలిపీటమీదనే ఆసీనులయ్యారు. తిమ్మనగారు అప్పటికే పారిజాతాపహరణం కృతి సమర్పించారు. అగ్రహారాలు ఆందోళికలు పుచ్చుకొన్నాను. ఆసభలోని దిగ్దంతులందరూ అప్పటికే రాయల వారినల్ల వెల్లగొండుగులు, పింజామరలు మొదలైన రాచ మర్యాదలు పొందినవారే. అయితే రాయలవారు ప్రకటన చేశాక ఒక్కొక్కరు లేచి ఈ గండపెండేరాన్నికి నేనే తగిన వాడనని చెప్పలేకపోయారు. అప్పుడు రాయలవారిలా తెలుగుపద్యంలో చెప్పారు.

మద్దుగ గండపెండియురమున్ గొను డంచు బహూకరింపగా
నొద్దిక నా కొసంగుమని యొక్కరు గోరగలేదు లేకొకో....

అని ఇంకా ఏదో చెప్పబోతూ ఉండగా పెద్దనగారు లేచి నిలబడ్డారు. రాయలవారి ఉద్దేశాన్ని అయన గ్రహించారు. ఈగండపెండేరం సంస్కృతాంధ్రభాషలలో నైపుణ్యానికి బహుమతి అని గ్రహించారు. వెంటనే ఆపద్యం ఇలా పూర్తిచేశారు.

పెద్దన బోలు పండితులు పృథ్విని లేరని నీ వెరుంగవే
పెద్దన కీదలంచినను పేరిమి నా కిడు కృష్ణరాణ్ణపా.

ఆపద్యాన్ని అలా పూరించి, వెనువెంటనే సుదీర్ఘమైన సీసమాలికలో కవిత్వ మంటే ఎలా ఉండాలో, ఏ భాషలో ఏరీతిలో ఉండాలో వివరిస్తూ ఇలా చెప్పారు.

పూత మెరుంగులున్ బసరుపూపబెడంగులు జూపునట్టి వా
క్కైతలు? జగ్గు నిగ్గు నెనగావలె గమ్మనగమ్మనన్వలెన్
రాతిరియున్ బవల్ మరపురాని హాయల్ చెలి యూరజంపు ని
ద్రాతరితీపులో యనగ దారసిలన్వలె లోదలంచినన్
భాతిగ బైకొనన్వలెను బెదలికుత్తుకలోని పల్లటీ
కూతలనన్వలెన్ సొగసుకోరుకులు రావలె నాలకించినన్
జేతికొలంది కొగిటను జేర్చిన కన్నియ చిన్నిసొన్న మే
ల్మాతల చన్నుదోయివలె ముచ్చటగావలె బట్టి చూచినన్
డాతొడనున్న మిన్నుల మిటారపు ముద్దులగుమ్మ కన్నులా
వాతెర దొండపండువలె వాచవి గావలె బంట నూదినన్
గాతలదమ్మిచూలిదొర కైవసపుం జవరాలి సిబ్బెపు
న్నేతెలియబ్బురంపు జిగినిబ్బర పుబ్బగు గుబ్బిగుబ్బపొం
బూతలనూనెకాయ సరిపోడీమి కిన్నెర మేలుబంతి సం
గాతపు సన్నతంతి బయకారపు గన్నడగౌళపంతుకా
సాతతి తానతానలపసక్ దిగ్గటాడెడు గోట మీటుబల్
మ్రోతలనుంబలెన్ హారువు మొల్లము గావలె నచ్చతెన్గు లీ
రీతిగ సంస్కృతం బుపచరించెడు పట్టున భారతీవధూ
టీతపనీయగర్భనికటీభవదాననపర్వసాహితీ
భాతికనాటక ప్రకరభారత భారతసమ్మత ప్రభా
పాతసుధాప్రపూరబహుభంగఘుమంఘుమఘుంఘుమార్భటీ
జాతకతాళయుగ్మలయసంగతి చుంచువిపంచికామృదం
గాతతతేహితో త్తహితహావాధితధంధణుధాణుధింధిమి

వ్రాతనయానుకూలపదవారకుహూద్వహవారికింకిణీ
నూతనఘుల్ఘులాచరణనూపురఝూళిఝుళీమరందసం
ఘూతవియద్ధునీచక చకద్వికచోత్పలసారసంగ్రహా
యూతకుమారగంధవహవారిసుగంధవిలాసయుక్తమై
చేతము జలజేయవలె జిలన జలవలెన్ మనోహర
డ్యోతక గోస్తనీఫలమధుద్రవగోఘృతపాయసప్రసా
దాతిరసప్రసారరుచిరప్రసరంబుగ సారెసారెకున్.

[చాటుపద్యమణిమంజరి, 1-151]

ఈ పద్యాన్ని వింటున్నంతసేపూ ఈ పద్యంలో చెప్పినవన్నీ అందరికీ అనుభవంలోకి వచ్చేఉంటాయి. 'భళీ. మర్ఘూ' అని అందరూ మెచ్చుకొన్నారు. రాయలవారు సింహాసనం దిగి స్వయంగా తమ చేతులతో ఆ గండపెం డేరాన్ని పెద్దనగారి పాదానికి తొడిగారు. అప్పుడు పెద్దన గారిలా దీవించారు

క్షీరాంభోనిధియందు యోగసరణిం జిచ్ఛక్తి ప్రాపించి త1
ద్ధీరాజత్ఫకుబంతగోపవిలసద్ధీరాజగోలోకతా
స్ఫారాలోకనతేజగాత్రచలనస్ఫ్యంతాద్రిదంభోళికృ
త్తానగ్రజ్ఞానసనందనాదిమునిబృందాధిక్యసాముఖ్యవా
పూరాకారత నిద్ర జెందు కరుణాంభోరాశి నన్ బ్రోవుతిన్.

ఈ గండపెండేరం తొడిగిన సందర్భంలోనే ఆంధ్ర కవితా పితామహుడనే బిరుదు ఇచ్చిఉంటారు. క్రీ. శ. 1518 బహుధాన్యంలో శ్రీకృష్ణదేవరాయలు పెద్దనగారి బిరుదు వే

1. చాటుపద్యరత్నాకరంలో దీపాల పిచ్చయ్యశాస్త్రిగారుదాహరించారు. పుట 12.

శాసనంలోనూ చెప్పుకోలేదు. ఏడాది తిరిగాక క్రీ. శ. 1519 కార్తీకంలో ఆ బిరుదు కనబడుతుంది.

ప్రమూదిసంవత్సరం శత్రువులకే గాని రాయలవారికి ప్రమాదం కలుగచేయలేదు. గజపతులుకూడా విజయనగరంవారితో వియ్యం పొంది ప్రమాదం గడుపుకొన్నారు. రాయలవారికి ఇతోధిక శ్రేయస్సిద్ధి కలిగింది. కళింగం మీద అన్నివిధాలా జయం లభించింది. ఈశుభసమయంలో హితుడు, చతుర్వచోనిధి, ఆంధ్రకవితాపితామహుడు అయిన పెద్దనగారికి రాయలవారు కటకాదిసీమ నాయంకరం ఇచ్చారు. అంటే ఆప్రాంతాలకు గవర్నరుగా నియమించారు. క్రీ. శ. 1519 కార్తీకపున్నమినాడు చంద్రగ్రహణ పుణ్యకాలంలో, తమ నాయకరంలోని అనుగ్రహగ్రామం లోని వరదరాజు పెరుమాళ్లకు అంగరంగవైభోగాలకు, నిత్యనైవేద్యాలకు, దీపారాధనకు దానాలు చేశారు.

తీయని కవిత్వం చెప్పుకొనే కవికి నాయంకరం ఇవ్వడంలో ఒక అంతరార్థం కనబడుతోంది. ఎన్ని గ్రామాలను అగ్రహారాలుగా యిచ్చినా, పెద్దనగారు వాటి నిలా పుచ్చుకుని అలా మళ్ళీ దానం చేసేస్తున్నారు. పాండ్యరాజు ఎంత ధన మిచ్చినా దానిని భాగవతులకు, భగవంతునికి, మంది రాలకు దానం చేసేసి ఉత్తచేతులుజోడించి, 'తిరుప్పల్లాండు' తో దేవుని స్తుతించిన విష్ణుచిత్తులకథ రాయలవారికి జ్ఞాపకం వచ్చింది. అప్పుడు దేవుడు విశ్వకర్మను పిలిపించి పెరియాళ్వారులకు విల్లిపుత్తూరులో మణిమయసౌధం నిర్మించమని హుకుమ్ జారీచేశాడు. కాగా, పూర్వపు ఆ పెద్దభక్తునిలాగే

పెద్దనగారు రాయలకనులకు కనబడి ఒక నాయంకర మిస్తే గాని ఈయన ఏమీనిలుపుగోలేరని భావించిఉంటారు.

క్రీ. శ. 1522 లో ఉత్తరహిందూదేశంలో గయ దాకా జయించిన పిదప రాయలవారు రాజధానికి తిరిగి వచ్చారు. భువనవిజయంలో కొలువుండి ఒకనాడు పెద్దనగారిని చూశారు. ఈయన చేతిమీదుగా ఒక కృతిని పుచ్చుకోవాలనుకుని ఇలా అన్నారు.

సప్తసంతానములలో బ్రహ్మస్తిగాంచి
భిలము గాకుండునది ధాత్రికృతియగాన
కృతి రచింపుము మాకు శిరీషకుసుమ
పేశలసుధామయోక్తుల పెద్దనార్య. [మనుచరిత్ర, 1-14]

దిరిసెనపువ్వులాగా మెత్తని కవిత్వం చెప్పడంలో పెద్దనగారికి ఆయనే సాటి. ఆయన సకలపురాణకథలను గాలించినవారు. నవీనకావ్యరచనకు అనుకూలకథలను వెతుకుతున్నట్టు రాయలకు తెలుసు. మార్కండేయపురాణంలోని స్వారోచిషమనువుచరిత్ర చక్కగా, రసవంతంగా రచించవచ్చు నని సంగతి పెద్దనగారు చూచాయగా రాయలవారికి మనవి చేసేఉంటారు. అందుకే ఆ కథార్థస్మృతిని పేర్కొని ఇలా అన్నారు.

హితుడవు చతురవచోనిధి-వతులపురాణగమేతిహాసకథార్థ
స్మృతియుతుడ వాంధ్రకవితా-పితామహుడ వెవ్వరీదు పేర్కొనసీకున్!
మనువులలో స్వారోచిష-మనుసంభవ మరయ రసమంచితకథలన్
వినినింపు కలిధ్వంసక-మనఘ భవచ్చతురరచన కనుకూలంబున్.
[మనుచరిత్ర, 1-15, 16]

కృష్ణరాయలవారు కవితాస్త్రీలోలు రని పెద్దనగారికి తెలుసు. ఆయన చెప్పమన్న రసనమంచితికథను నిజంగా శిరీషకుసుమపేశలసుధామయోక్తులతో చెప్ప మొదలు పెట్టారు. కథ ఎత్తుకొనడంలో చకచక చెప్పడంలో పెద్దన గారు నిజంగా తిక్కనగారిలాంటివారు. విరాటపర్వం మొదలుపెడుతూ తిక్కనగారు ఒక్క వచనం చెప్పి తిన్నగా కథలోకి దిగారు. అలాగే పెద్దనగారుకూడా మార్కండేయ పురాణంలో ఎవరు ఎవరికి ఈకథ చెప్పినదీ మూడుముక్కల్లో ముక్తసరిగా వివరించి అరుణాస్పద మనే పురాన్ని చూపించారు. ఆ ఊళ్లో నాలుగువర్ణాలవారినీ, నాగవాసం వారినీ ఒక్క సీసంలో చెప్పి కథానాయకుని పేరు వెంటనే పరిచయంచేశారు. రసనమంచితమైన రచన చేయదలిచారు కనుక వేగం దెబ్బ తినకుండా కథ చెప్పాలని వారికి తెలుసు. ఇతరకవులైతే అరవైపద్యాల్లో, కనీసం ఆరు పద్యాలలో చేసే పురవర్ణన ఆరుపాదాల సీసంలో ముగించారు. కథానాయకుని ప్రవేశపెట్టడంలోనే ఎంతో ఔచిత్యముంది.

ఆపురి బాయకుండు మకరాంకశశాంకమనోజ్ఞమూర్తి భా
షాపరశేషభోగివిధాధ్వరనిర్మలధర్మకర్మదీ
క్షాపరతంత్రు డంబురుహగర్భకులాభరణం బనారతా
ధ్యాపనతత్పరుండు ప్రవరాఖ్యు డలేఖ్యతనూవిలాసుడై. [మను. 1-51]

ప్రవరుడు అందగాడు అని ఎత్తుగడలో చెప్పడం కథకు కావాలి. అతణ్ణి చూడగానే ఉత్తరోత్తరా అపూర్వ లావణ్యవతి వరూధిని ప్రేమిస్తుంది. కాబట్టి ఆ సౌందర్యం

ముండే చెప్పడం గొప్ప కథనశిల్పం. ప్రవరుడు ఎంత అంద గాడైనా విరాగి అని రెండు పద్యాలలో చెప్పారు.

వాని చక్కదనము వైరాగ్యమునజేసి-కాంక్షజేయు జారకామినులకు
భోగభావ్యమయ్యె బూచిన సంపెంగ-పొలుపు మధుకరాంగనలకుబోలె.
[మను. 1-52]

ఇది తరువాతికథకు మొదటి మెట్టు. ప్రధానపాత్రను పరిచయం చేస్తూ తొలిపద్యాలలోనే అతని శీలాన్ని చెప్ప గలగడం మహాకవుల రచనలోనే కనబడుతుంది. గురజాడ అప్పారావుగారు కన్యాశుల్కంలో మధురవాణిపాత్రను తొలిసారి రంగంమీద ప్రవేశపెడుతున్నప్పుడు ఇటువంటి రచనాశిల్పాన్ని చూపించారు. ఆమె నోరు తెరచి అనే మొదటి మాటలోనే ఆమె మనస్తత్వం తెలుస్తుంది. "మొగవాడికైనా ఆడదానికైనా నీతి ఉండాలి. తాక వద్దంటే చవినిపెట్టరుకదా!" అంటుంది.[1] అప్పారావుగారు అల్లసానివారి కోవలోని మహాకవి.

పెద్దనగారు ఒక్క పొల్లుమాట లేకుండా, ఒక్క అనవసరమైన పద్యం లేకుండా ప్రవరుని పాత్రను క్రమంగా పరిచయం చేశారు. అందగాడు, విరాగి అయినా సంసారే. కూరిమి సోమిదమ్మ ఉంది. యావనంలోనే యాగంచేశాడు. తల్లిదండ్రు లున్నారు. శిష్యు లున్నారు. ధనాఢ్యుడు. కుల శీలశమదమాదులు చూసి మెచ్చుకొని దోషం లేని సాల గ్రామదానం ఇస్తామని మహారాజులే వచ్చి ప్రార్థేయపడినా తీసుకోడు. అతనికి ఒక్కటే వ్యసనం. తీర్థయాత్రలు చేయా

---

1. కన్యాశుల్కం, ప్రథమాంకం, రెండోస్థలం.

లన్న కోరిక. తీర్థసంవాసు లొచ్చారని తెలిస్తే ఎంత దూర మైనా వెళ్ళి తీసుకువస్తాడు. ఇంటికి తీసుకువచ్చి అతిథ్య మిస్తాడు. ఇచ్చి, మృష్టాన్నభోజనం పెట్టి సంతృప్తులను చేస్తాడు. చేసి వాళ్లు కూర్చున్నదగ్గరకువచ్చి, లోకంలో ఉన్న సముద్రాలు, పర్వతాలు, నదులు, తీర్థాలు, వాటి మహత్వాలు తెలుసుకోవాలని చెప్పమని అడుగుతాడు.

అడిగి యోజనపరిమాణ మరయు, నరసి
పోవలయును జూడ ననుచు నూహ్యులు నిగుడ్చి
ననుదినము తీర్థసందర్శనాభిలాష
మాత్మ నుప్పొంగ నత్తరుణాగ్నిహోత్రి. [మను. 1_57]

ఇంత గాఢమైన వాంఛగల ప్రవరునింటికి ఒకసిద్ధుడు వచ్చాడు. అతడు, రమ్మారమి ప్రపంచం అంతా చుట్టి తిరిగి వచ్చాడు. అతడు ప్రవరునిలాగా తరుణుడే. వీళ్లూ పూళ్లూ పట్టే యాత్రలు ఇంత చిన్నవయసులో ఎలా చేశారని ప్రవరుడు అడిగాడు. తనదగ్గిర ఒక పాదలేపనం ఉందని, దాని ప్రభావంవల్ల వాయువేగ మనోవేగాలు సాధించానని సిద్ధుడు చెప్పాడు. ప్రవరుడు 'నన్నూ మీ శిష్యుని చేసుకోండి' అన్నాడు. ధన్యుణ్ణి చేయమన్నాడు.

అనుటయు రసలింగము సిద్ధు_తన వట్రువ ప్రేపసజ్జ దంతపుబరణిన్
నిసిచిన యొక పసరిది_యని చెప్పక పూసె దత్పదాంబుజయుగళిన్.
[మనుచరిత్ర, 1_78]

• ఈ పద్యంలో ఏ పసరో చెప్పలేదని తెలుపడం చాలా గడుసుశిల్పం. ప్రవరుడు హిమాలయాలకు వెళ్ళాడు. అది భస్మంతో కలిసిన భూతధాత్రిలో ఓషధులు మొలిచేటట్టు

చేయగల్గిన చల్లదనం కలది. అదనుతో చేసి చన్నివ్విసి యోషధులమన్మోదవు కొండలకెల్ల బిదుక నెరగడం ఈ హిమాలయంవల్లనే. ఆకొండమీద ఉన్నన్ని మూలికలు ఇంకెక్కడా ఉండవు. పసరు కరిగిపోయినా పేరు తెలిస్తే ప్రవరుడు ఆ మూలికలో ఆకులో సంపాదించి పసరుపిండి ఊరు చేరుకొంటాడు. అందుకే సిద్ధుడు పేరు చెప్పలేదని కవి చెప్పడం. పాదలేపనం కరిగిపోయింది కాబట్టి పస రేమిటో తెలియదు కాబట్టి ఇంటికి పోయేమార్గం చెప్పమని కనపడ్డ వాళ్లను ప్రతిమాలడం. కనపడ్డది వరూథిని. కవి ఆమెను చూపించడానికి ముందు ఆమె గాలిని వర్ణించాడు.

మృగమదసారభవిభవ-ద్విగుణితఘనసారసాంద్రపీతీగంధ
స్థగితేతరపరిమళమై-మగువపొలుపు దెలుపు నొక్క మారుత మొలసెన్.

[మనుచరిత్ర, 2-24]

అది ఆడగాలి. భోగినిని సూచించే తావి. ప్రవరుడు కాబట్టి తట్టుకోగలిగాడు. మరొకరైతే ఆ గాలికే వరూథిని వలలో పడతారు. ఆమె నర్మగర్భంగా చెప్పినవి అతడు పట్టించుకోలేదు. సూటిగా చెప్పినా వినిపించుకోలేదు. ఆమె హేతువాదం మొదలుపెట్టింది. అతడు 'నీవన్నయర్థమెల్ల నిజము కాముకుడైనవానికి' అని ఒప్పుకొన్నాడు. తను బ్రహ్మానందాధిరాజ్యంలో పదవీచ్యుతుణ్ణి కాలేనన్నాడు. ఆమె బ్రహ్మానందమంటే ఏమిటో వివరించింది.

ఎందే డెందము కదలింప రహిచే నేకాంతతన్ నిర్వృతిం
డెందుం గుంభగతప్రదీపకళికాశ్రీ దోప నందిందు బో

కొందే నింద్రియముల్ సుఖించగను నాయింపే పరబ్రహ్మ, 'మా
వందో బ్రహ్మ' యటన్న ప్రాజదువు నాంతం బర్థ మూహింపుమా.
[మనుచరిత్ర, 2_62]

ఆమెత త్తరం చూ స్తే సిగ్గూ వెగటూ పొడమాయి. అతడు నిస్పృహత తెలిపే చిరునవ్వు నవ్వాడు. 'ఈ పాండిత్యం నీకు తప్ప ఇంకెవరిలో చూశాం' అన్నాడు. 'తుచ్ఛసుఖాలు మీసాలపై తేనియ' లన్నాడు. ఇది విన్నాక ఆమెనోటంట మాట రాలేదు. 'వనిత తనంత తా వలచి వచ్చిన చుల్క-నగాదె యేరికిన్' అనుకొంది. మేను సోకితే తేనెలో పడ్డ ఈగలాగ కొట్టుకొంటా డనుకొంది. క్షాగలించుకొంది. అతడు 'హా శ్రీహరీ' అని ఓర్వమోము పెట్టుకొన్నాడు. ఆమెను త్రోసేశాడు.

ప్రవరునికి సిగ్గూ వెగటూ కలిగించేవిధంగా వర్తించి ప్రవర్తించడానికి కూడా కారణం లేకపోలేదు. మొదట వాళ్లు ఏకాంతంలో ఉన్నారు. అప్సు డామె నర్మగర్భంగా మాట్లాడింది. అతడు ఇంగితం తెలుసుకొనకపోతే హేతు వాదంలోకి దింపింది. అతనిచేత 'ఔను, కామానికి నిజమే' అనిపించింది. మరికొంతసేపు పోతే అతడు ఒప్పుకొనేటట్టు చేయగలిగినంత నెరజాణ ఎందుకింత తత్తరపాటు చూపెట్టింది? దానికి కారణం 'ఆనందో బ్రహ్మ' అనే పద్యానికి ముందు పెద్దనగారు చెప్పారు. ప్రవరుడు బ్రహ్మానంద రాజ్య పదవీచ్యుతికి ఒప్పుకోను అంటూ ఉంటేవరూథిని చెలిక త్తెలు అడ్డు వస్తున్నారు. వాళ్ళను రావద్దని కళ్లతోనే వారించింది. ఆ చెలిక త్తెలు తనను చూశారు; తను మరులుకొన్నవా

నిని చూశారు. ఇతణ్ణి వశం చేసుకోకపోతే వాళ్లలో తలెత్తుకోలేదు. అందుకే తొందర. ఆమె తీరుబాటుగా ప్రయత్నించినా, ప్రవరుడు, తాకినచోట అంటుకొన్న తావిని కడిగేసుకొని పోయేవాడు. అదివేరేకథ. పెద్దనగారు వరూథిని పాత్రను చిత్రించడంలో ఎంతోమనస్తత్వ పరిశీలన చూపించాడు. కథ అల్లడంలో ప్రతిచోటా జిగి బిగి చూపెట్టారు.

'అల్లసానివాని అల్లిక జిగిబిగి' అన్న శీర్షికతో విశ్వనాథ సత్యనారాయణగారు ఎన్నో సొగసులు చూపిస్తూ పెద్దనగారి ఉత్తమశిల్పాన్ని వివరించారు. కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు 'అల్లసాని పెద్దనార్య కవిత్వ తత్త్వము' అనే పేర సుదీర్ఘ విమర్శ చేశారు.[1] ఆవిమర్శ సారాన్ని చివర వారే ఇలా పొందుపరిచారు.

మనుచరిత్రము భాషావిషయములో ఉత్తమగ్రంథము. ఇంపు సలక్షణమగు భాష కలదు. కూర్పువిషయములో మధ్యస్థానములో నుండ దగినది. రసానుగుణమగు రీతులు వృత్తులు అంతగా లేవు. నీతివిషయములో నిది యధమగ్రంథము. దుర్నీతి గరపుచున్నది. కాని గృహస్థధర్మ వివరణాదికము లిందు బాగుగా నున్నవి. వర్ణనవిషయములో మనోహర గ్రంథము. చక్కని వర్ణనలు కలవు. రసవిషయములో నడిమితరములో జేరదగిన దనుటయు నతిశయోక్తియగునని తోచెడిని. శృంగారశాంత ములు పాడుచేయబడినవి. వీర మొకింత కలదు. ఉత్తమగ్రంథముకాదు.

పెద్దనగారి కావ్యం సత్కావ్యమే అని చాలామంది పండితులు తరువాత వ్రాశారు. ఎన్నో వాదోపవాదాలు,

---

1. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక, సంపుటి 10, సంచికలు 5, 6.

చర్చలు. సిద్ధాంతాలు, రాద్ధాంతాలూ జరిగాయి. కథా వస్తువులో ఐక్యత లేదని కొంద రన్నారు. స్వవచోవ్యాఘాతాలున్నాయన్నారు. కొందరు సాహిత్యపిపాసులు, పరిశోధకులు, పండితులు గ్రంథం సాంతం చదివినా సాధారణపాఠకులుమాత్రం మనుచరిత్రలో తొలి మూడు ఆశ్వాసాలే ఉత్కంఠతో చదువుతారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చెప్పినట్టు ఎవరేనా మిగతా ఆశ్వాసాలు చదివితే వరూధినీ ప్రవరులు మళ్లా కనబడతారేమో అన్న ఆసక్తితోనే చదువుతారు.[1] ప్రభాకరశాస్త్రిగారీ మనుచరిత్రను రెండు భాగాలుగా విభజించారు.

> నేడు మనుచరిత్ర మనబడు ఈ ప్రబంధమున తొలినాలుగా శ్వాసముల రచనము స్వరోచిస్సంభవ మనియు, నా తరువాత నారవ యాశ్వాసము తుదిదాక గల రచనము స్వారోచిష సంభవమనియు వేర్పరచి రెండు ప్రబంధములుగా నేను బేర్కొందును. రెండుప్రబంధములను రాయల కంకితముగా నొక కృత్యవతరణికతో నొక సంపుటముగా సంధానించినాడు. కనుక మొత్తముసంపుటమును మనుచరిత్ర మని పేర్కొనుచుందును [2]

మనుచరిత్రలో మిగతా మూడు ఆశ్వాసాలలోకూడా రసవంతమైన కవిత్వ ముందని సోదాహరణంగా నిరూపించడానికి కేతవరపు వెంకటశాస్త్రిగారు వ్యాసాలు వ్రాశారు.[3] పూర్వార్ధంలోనే కావ్యంలోని తేజంకూడా మందగిస్తుందని పింగళి లక్ష్మీకాంతంగారు అభిప్రాయపడినా పెద్దనగారి పెద్దరి

---

1. మిగడతరకలు_మనుచరిత్ర, పుట 163.
2. అందులోనే, పుట 153.
3. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక, సంపుటి 17, సంచిక 1.

కానికి గల కారణా లెన్నో ఆయన సవిస్తరంగా వివరించారు.[1] కాశీభట్ల బ్రహ్మాయ్యశాస్త్రిగారివంటి విద్వాంసులే ఇది ఉత్తమగ్రంథం కా దనినా ఇందులో పెద్దనగారు దుర్నీతిని ఆకర్షవంతగా చేయాలని చేయలేదు. ఆయనఉద్దేశ్యం మార్కండేయపురాణంలో ఉద్ఘాటించిన ఏకపత్నీవ్రతంలోని గొప్పతనాన్ని ప్రచారం చెయ్యడమే. ముగ్గురుపెళ్లాలను కట్టుకొని విహరిస్తున్న స్వరోచిని చూసి మరాళి తీవ్ర వాదాలు చేసిన చర్చలో పెద్దన ఆశించిన నిజమైన ప్రయోజనం కనబడుతుంది.

మెలతకు బతిపైనైనను-మెలతుకపై బతికినైన మేలగు టెందున్
గలయది మెలతకు బతికిన్-వలపు సమంబగుట జన్మవాసనచేలియా.
[మను. 6-66]

అని హంస మెచ్చుకొంటుంది. చక్రవాకి ఇలా తెగనాడుతుంది.

ముదమున నిమ్మహీశు డొక ముద్దియ చూడగ నొక్క కాంతతో
సదమదమై కడంగి రతిసల్పుట తెల్లముగా నెరింగియున్
మది నివరించి రోయ కభిమానము దక్కినవారికూరుములో
వదలక పెద్దసేసెదవు వండిగతిం దగ వీవిచారముల్. [మను. 6-69]

చక్రవాకి కావ్యసందేశాన్ని ఇలాగ విన్పిస్తుంది:

తగులు నెవ్వడొక్క తరుణికి నొకనికి-మెలత వలచు నదియ మేలనంగ
వచ్చు, గాని పెక్క వనితలపై గూర్మి-గలుగునటు బొంకు గాదె తరుణి.
[మను..6-74]

ఇది మార్కండేయపురాణంలో ఉన్న సందేశమే.

---

1. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 3-వ, సంపుటి, పుటలు 927-931.

పెద్దనగారు మూలాన్ని అనుసరించారు. తెలుగు మార్కండేయపురాణంలో మారన ప్రాసిన దానికి ఏమాత్రం గద్య పద్యాలలో తగ్గించకుండా ప్రాశారు. మొత్తం మనుచరిత్ర నంతా మారనగారు 148 గద్యపద్యాలలో రచించారు : పెద్దనగారి రచనలో మారనగారి పద్యాల ఛాయలు కనబడతాయిగాని పురాణంలో అక్కడక్కడ లోపించిన జౌచిత్యాన్ని పెద్దనగారు బాగా పోషించారు. ఈ ఇద్దరి కావ్యాలను మూలంతో తెపారువేసి చేకుమళ్ళ అచ్యుతరావుగారు చక్కని పరిశీలన చేశారు.[1] పెద్దనగారు ఏయేపూర్వకవులను అనుసరించినదీ పరిశోధకులు చాలా వ్యాసాలలో చూసించారు.[2] ఇది గ్రంథచౌర్యంకాదు. పూర్వకవీశ్వర వాక్ప్రయోగ దక్షత సత్కవిలక్షణాలలో ఒకటిగా అప్పకవి చెప్పాడు (అప్ప. 1-44). గ్రంథచౌర్యం ఎంత అవమాన కరమో పెద్దనగారికి బాగా తెలుసు. అందుకే కృత్యాదిని ఇలా కుకవినింద చేశారు.

బరువై తోచు కుటుంబరక్షణకుగా బ్రాహ్మాలి చింతన్ నిరం
తరతాళీదళ సంపుటప్రకరకాంతారంబునం దర్థపుం
దెరువాటుల్ గొనికొట్టి తజ్జ్ఞపరిషద్విజ్ఞాతచౌర్యక్రియా
విరసుండై కొగతింబడం గుకవిపృథ్వీభృత్సమీపక్షితిన్. [మను. 1-9]

పెద్దనగారు తమ కావ్యాన్ని పరిషత్తులో చదివి

---

1. విజయనగరసామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్ర, 2-వ భాగం, పుటలు 148-154.

2. మనుచరిత్ర, ఆనందముద్రణ, పీఠిక—తంజనగరం తేవప్పెరుమాళయ్య్. పుటలు 24-26.

వినిపించారు. భువనవిజయంలోని కవులందరూ ఓహో అన్నారు. రాజసన్నిధానంలో తన కృతి రాణించింది. రాయలవారు పరమానందంతో అంకితం పుచ్చుకొన్నారు. కృతిస్వీకరణ మహోత్సవంలో ఊరేగింపు బయలుదేరు తున్నప్పుడు రాయలవారు స్వయంగా పెద్దనగారు కూర్చున్న పల్లకీ తమ చేత్తో పట్టి ఎత్తారు. పెద్దనగారంటే అయనకంత భక్తిగౌరవాలు! ఆయనకవిత్వంలోని చేవ వారికి తెలుసు.

అరుణాస్పదాన్ని వర్ణిస్తూ పెద్దనగారు 'అచటపుట్టిన చివురుకొమ్మైన చేవ' అన్నారుగాని వారింట అందరూ చక్కని కవిత్వమే చెప్పగల రని ఒక కథ తెలియ జేస్తుంది. ఒకనాడు పెద్దనగారు పద్యం రాయడం మొదలు పెట్టారు.

మృదుతల్పంబు వికారలీల దిగి ధమ్మిల్లంబు చేబూని రా
గదదృగ్జాలముతోడ గౌను నలి మూగన్ మోము మార్వ్యెట్టుచున్
వదలంబారిన నీవి పట్టుకొని యా వామాక్షి యిల్లేగె ....

ఇంతదాకా వ్రాసి ముగింపు ఆలోచిస్తూ పెద్దనగారు ఎక్కడికో వెళ్లారు. వారి కుమార్తె ఇలా పూరించిందట.

దత్సదనభ్రాజికరత్నదీపకళికా స్తంభంబు క్రీనీడకున్.

ఇంత రసవంతంగా పూరించిన ఆ ఆడకూతురి పేరు మనకు తెలియదు. పెద్దనగారి కుటుంబజీవితం ఏమిటో తెలుసుకొనే అవకాశాలు కూడా లేవు. రాయలవారు మరణించినతరువాతకూడా జీవించిఉన్నారని ఆయన చెప్పిన ఈ చాటువువల్ల తెలుస్తుంది. విజయనగరంవారు వియ్యాలవా రన్న సంగతి మరచిపోయి రాయలవారు గతించగానే

గజపతులు దండెత్తారట. అప్పుడు పెద్దనగారు రీకిందిపద్యం చెప్పారట.

రాయరాహుత్తమిండరాచయేనుగు వచ్చియారట్లకోట గోరాడునాడు
సంపెటనరపాలసార్వభౌముడు వచ్చిసింహాద్రిజయశిల జేర్చునాడు
సాలగోలుసింహంబు చేరి ధిక్కృతి గంచుతల్పుల గరుల డీకొల్పునాడు
ఘనతర నిర్భర గండపెండెర మిచ్చికూతు రాయుల కొనగూర్చునాడు
ఒడలెరుంగవో చచ్చితో యుర్వీలేవో
చేరజాలక తలచెడి జీర్ణమైతో
కన్నడం బెట్లు సొచ్చెదు గజపతీంద్ర
తెరచినిలు కుక్క సొచ్చిన తెరగు దోప? [చాటు. I, పుట 162]


ఆంధ్రకవితాపితామహుడు వ్రాసి పంపించిన ఈపద్యం చదువుకొని గజపతి సిగ్గుతో వెళ్లిపోయాడట. అందరూ నిట్టూర్చి ఉంటారు. పెద్దనగారుమాత్రం దినదినం రాయల వారిని తలచుకొంటూ బాధపడుతూనే ఉన్నారు. ఆయన చెప్పిన ఇంకో చాటువు.

ఎదురైనచో దన మదకరీంద్రము నిల్పికేలూత యొసగి ఎక్కించుకొనియె
మనుచరిత్రం బందుకొనుపేళ బురమేగబల్లకి తన కేల బట్టి యొత్తె
గోకటగ్రామాద్యనేకాగ్రహారంబులడిగిన సీమలయందు నిచ్చె
బిరుదైన కవిగండపెండేరమున కీవతగుదని తాని పాదమున దొడిగె
ఆంధ్రకవితాపితామహా అల్లసాని-పెద్దన కవీంద్ర! యని తన్ను పిల్చినట్టి
కృష్ణరాయలతో దివి కేగలేగ-వ్రతికియున్నాడ జీవచ్ఛవంబనగుచు.
[చాటుపద్యమణిమంజరి, I, పుట 161]

అవసానకాలంలో ఆయన జీవచ్ఛవమే అయినా కృష్ణశేషు లయ్యాక ఆయన నిజంగా వ్రతకడం మొదలు పెట్టారు. ఆలయన సజీవకవి.

10

ధూర్జటి



జులు మత్తులు; వాళ్ళ సేవ నరకప్రాయం; వా రిచ్చే దాసీలు, పల్లకీలు, గుర్రాలు, నగలూ మొదలైనవి ఆత్మవ్యథాబీజాలు అని నిర్భయంగా నిజాన్ని చాటిన మొదటి తెలుగుకవి ధూర్జటి. ఇతడు శ్రుతులు అభ్యసించాడు. శాస్త్రగరిమలు శోధించాడు. తత్త్వాలు మథించాడు. శరీరం అస్థిరం అనీ, బ్రహ్మమే సత్యమనీ గుర్తించాడు. ఈ సంగతి సభల్లో వృథావచనాలుగా చెప్పేవాళ్ళను చూశాడు. నిండు యౌవనంలో రతిరాజద్వారసౌఖ్యాలలో సంతోషించాడు. బహురాజద్వారసౌఖ్యాలలో శాంతించాడు. వధూనఖాగ్రాలచే అతని ఒళ్లు కాయలుకాచాయట. వయోజాల రాపిడితో రొమ్ము రాపాడిందట. మన్మథవిహారక్లేశవిభ్రాంతిలో వయస్సు ఉడిగింది. జుత్తు రాలిపోయి శిరస్సు బట్టతల అయింది. మత్తెక్కిన రాజులు విద్వాంసులైన మిత్రులను రక్షించడం మానేశారు. జ్ఞానులు ద్రోహులయ్యారు. వాళ్లు

చేసే కపటాలు, ఈర్ష్యలు మొదలైన క్రియాదోషాలు అతడు సహించలేకపోయాడు. సన్యసిద్దా మనుకున్నాడు. అయినా మనస్సులోని క్రోపం మానడంలేదు. తను నివసించే సీమలోని దేవుడు శ్రీకాళహస్తీశ్వరుడు. ఆ దైవంముందు తన కోపాన్ని వెళ్ళగ్రక్కాడు; బాధలు చెప్పుకొన్నాడు. భయాలు నివేదించాడు; కోరికలు విన్నవించుకొన్నాడు. ఏమాత్రం భయపడకుండా, నిజం అణుమాత్రం దాచకుండా చిత్తశుద్ధితో, మహోద్వేగంతో అతడు ఒక శతకం చెప్పాడు. దాని పేరు శ్రీకాళహస్తీశ్వరశతకం.

ఈ శతకంవల్ల ధూర్జటి జీవితచరిత్రను ఊహించడానికి అవకాశాలు ఉన్నాయి. మరే శతకంలోనూ ఏకవీ చెప్పలేనంత ఆత్మకథ, సమకాలికపరిస్థితులూ ఇందులో ఉన్నాయి. అది, ఒకరిని చంపి పదస్థులై బ్రతుకుదామని రాజు లనుకొంటున్న కాలం. కృప, ధర్మం, ఆభిజాత్యం మొదలైనవి పాలించేవాళ్ళలో మృగ్యమవుతున్నాయి. అందుకే అత డిలా అన్నాడు:

రాజన్నంతయె పోవునా కృపయు ధర్మం బాభిజాత్యంబు వి
ద్యాజాతమ్ము సత్యభాషణము విద్వన్మిత్రసంరక్షయున్
సౌజన్యంబు కృతం బెరుంగుటయు విశ్వాసంబు గానున్న దు
ర్బిజశ్రేష్ఠులుగా గతంబు గలదే శ్రీకాళహస్తీశ్వరా. [39]

తిట్టుకవిత్వం చెప్పకపోతే ఎంత సత్కవికేనా భయపడక రాజులు నిర్లక్ష్యం చేసే రోజులు. ఈ సంగతి ధూర్జటి ఇలా గ్రంథస్థం చేశాడు:

క్షితినాథోత్తమ సత్కవీశ్వరుడు వచ్చెన్ మిమ్ములం జూడగా
నత డేమింట కవిత్వవైఖరిని సద్యఃకావ్యనిర్మాత త
త్ప్రతిభ ల్మించివి తిట్టుపద్యములు చెప్పం డాతడైనన్ మనుం
గ్రితమే బూనెను బొమ్మటించు నధముల్ శ్రీకాళహస్తీశ్వరా. [11_3]

విద్వాంసుడుగా పుట్టినందుకు బ్రహ్మను తిట్టుకొనే వారు. తెలివితేటలతోపాటు ఆకలిదప్పులనుకూడా ఎందుకు పెట్టాడో ఆతొత్తుదైవం అని దూషించుకొనేవారు. ధూర్జటి ఇలాగ చెప్పాడు:

వేధం డిట్టగరాదుగాని భువిలో విద్వాంసులన్ జేయునే
లాధీచాతురిజేసి జేసిన గుణామాటనేపోక ట్లు
ద్బాధాదుల్ గలిగింపనేల యిది కృత్యంబైన దుర్మార్గులం
జీధాత్రీశుల జేయ నేటి కకటా శ్రీకాళహస్తీశ్వరా! [83]

సమకాలికరాజుల దుర్మార్గాలకు ధూర్జటికి విసుగెత్తిపోయింది. బహుశా కృష్ణరాయలవారు గతించిన క్రొత్తరోజులలో కావచ్చు, ఉపమానాలలో, ఉత్ప్రేక్షలలో ధ్వని, వ్యంగ్యం, శబ్దాలంకారవిశేషభాషలు మొదలైన వాటితో ధూర్జటి కడు తియ్యగా కవిత్వం చెప్పే నూత్నయౌవనంలో కృష్ణరాయలవారు బతికేఉన్నారు. కాళహస్తి ప్రాంతాలనుంచి ధూర్జటి, తెనాలిప్రాంతాలనుంచి రామలింగకవి రాజధానీనగరానికి వచ్చి అక్కడ సానివాడలో పాతపుస్తకాలలో చదువుకొన్న విషయాలలో క్రొత్త అనుభవాలు గడిస్తున్నరోజు లవి. ఇద్దరూ పైలాపచ్చీసులో ఉన్నారు. ఇద్దరూ రసికులు. ఇద్దరూ జాణలు. ఏసాని కూతురు గానరసాన్ని ఆనడానికో వెళ్ళినప్పుడు ఒకరి

నొకరు చూసుకొని ఉంటారు. ఊళ్లో ఇద్దరు యువకవులు చాలా మంచి కవిత్వం చెప్తున్నారన్న సంగతి రాయలవారి చెవిన బడింది కాబోలు, పిలిపించుకొని కవిత్వం విన్నారు. ఆస్థానంలో ఉండమన్నారు. అష్టదిగ్గజాలలోనే చేర్చారు. ధూర్జటి పద్యాలలోని మధురిమ రాయలవారిని ముగ్ధులను చేసింది.

స్తుతమతియైన యాంధ్రకవిధూర్జటిపల్కుల కేల కర్ణులో
యతులితమాధురీమహిమ !1

అని ఆయన ఒకనాడు మనోజ్ఞసభలో ఆశ్చర్యంతో ప్రశ్నించారు. అప్పుడు కొంచెం రామలింగం లేచి ఇలా పూర్తి చేశాడు :

—హా ! తెలిసిన్ భువనైకమోహనో
దతసుకుమారవారవనితాజనతాఘనతాపహారిసం
ధితమధురాధగోదితసుధారసధారలు గ్రోలుటం జుమీ !

రాయలవారు ధూర్జటి కవిత్వాన్ని ఎంత మెచ్చుకున్నారో, రామలింగడు చెప్పిన కారణాన్నీ అంత హర్షించే ఉంటారు. అయితే ఈ ఇద్దరు యువకవులూ నాలుగు కాలాలపాటు రాయలవారి పోషణలో ఉండే అవకాశాలు నిండుకొన్నాయి. రాయలవారు క్రీ. శ. 1530లో మరణించారు. ఇద్దరు యువకవులూ వేరే ప్రభువుకు తెరువు చూసుకున్నారు. కృష్ణరాయల తరువాత ప్రాముఖ్యం వహించిన అచ్యుతదేవరాయలూ, అళియరామరాయలూ

---

1. ఈ పద్యపాదాన్ని, ఇంతదాకా, ధూర్జటివంశంలోని కుమార ధూర్జటి గ్రంథస్థం చేశాడు. (కృష్ణరాయవిజయం, 1-29).

కవిపోషకులే. అయితే ధూర్జటిహృదయం ఏ సంఘటనల వల్లనో గాయపడింది. రాజకీటాల నతడు చీదరించు కున్నాడు. రాజులను ఆశ్రయించుకొనే తిట్టుకవు లంటే అతనికి అసహ్యం వేసింది.

చదువుల్ నేర్చిన పండితాధములు స్వేచ్ఛాభాషణక్రీడలన్
వదరన్ సంశయభీకరాటవుల ద్రోవల్దప్పి భ్రమింపగా
మదనక్రోధికిరాతులందు గని భీముప్రౌఢిచే దాకినం
జెదరుం జిత్తము చిత్తగింపగదవే శ్రీకాళహస్తీశ్వరా. [70]

అతని కంతా సంశయమే. శరీరఘటనం అంతా విచారమే. మంత్రతంత్రాలు పరిశీలించాడు. సాంఖ్యాది యోగరహస్యాలు గురువులు చెప్తే విన్నాడు. అయినా శంక పోలేదు. బోధించిన గురువుల సంగతిమాత్రం తెలుసు కున్నాడు.

అయవారై చదివింపవచ్చు దన పాదాంభోజతీర్థంబులన్
దయతో గొమ్మనవచ్చు స్నేహితుని నర్థప్రాణదేవాదుల
న్నియు నా సొమ్మన వచ్చుగాని సిరుల న్నిందించి నిన్నాత్మని
ప్రియతం గానగరాదు పండితులకున్ శ్రీకాళహస్తీశ్వరా. [73]

చాలామంది వేషధారులే. అన్యులను స్తోత్రంచేయ నని ప్రతంపట్టినవాళ్లు రాజులను చేరి ఇంద్రుడనీ చంద్రుడనీ పొగడడం అతనికి వెగటు పుట్టించింది:

స్తోత్రం బన్యుల జేయనొల్లని వ్రతస్థు ల్వోలె వేసంబుతో
బుత్రీబుత్రకళత్రరక్షణకళాబుద్ధిన్ నృపాలాధముల్
పాత్రంబంచుభజింపబోదు రిదియు న్నాభవ్యంబె యెవ్వారి చా
రిత్రం బెన్నడు మెచ్చ నెంచ మదిలో శ్రీకాళహస్తీశ్వరా. [63]

ధూర్జటి తన మదిలో మరొక నిశ్చయం చేసు

కొన్నాడు. తన కవిత్వం ఇంకెవరికో ఇవ్వక శివునికే మీదు కట్టాడు.

నీకుంగాని కవిత్వ మెవ్వరికి నే నీసంచు మీదెత్తితిఁ
జేకొంటిం బిరుదంబు కంకణము ముంజే గట్టితిన్ బట్టితిన్
లోకుల్ మెచ్చ ప్రతంబు నాతనువుకిలున్ నేర్పులుంగావు చీ
చీ కాలంబులరీతి దప్పదు జుమీ శ్రీ కాళహస్తీశ్వరా. [114]

ధూర్జటి నిజంగా తన కవిత్వం దేవునికే ముడుపు కట్టాడు. 'శ్రీ కాళహస్తీశ్వరమహాత్మ్యం' అనే పద్యకావ్యం వ్రాసి దేవునికే అంకితం ఇచ్చాడు. ఈ గ్రంథాన్ని అతడు శతకరచనకు ముందు రాశాడో తరువాత వ్రాశాడో తెలియదు. బహుశ ముందుగానే అని భావించవచ్చు. దీనికి స్కాందపురాణం, వైష్ణవఖండంలో ఉన్న ఆరవ అధ్యాయం ఆధారం 'కావచ్చు. ఈ స్థలపురాణాన్ని ఏ సూతుడూ శౌనకాదిమహామునులకు చెప్పలేదు. కాళహస్తిచుట్టుపక్కల వున్న నారాయణవనాన్ని పాలించిన వీరనరసింహరాయలనే యాదవరాజుకు సాక్షాత్తూ శివుడే చెప్పాడు. ఈ రాజు చారిత్రకవ్యక్తి. నారాయణవనాన్ని క్రీ.శ. 1000లో ఇమ్మడి నరసింహరాయలు పరిపాలించాడు. ఇతడే చంద్రగిరికోటను నిర్మించాడు. ఇతనిచేత కాళహస్తి దేవాలయాన్ని కట్టించాలని దేవుడు సంకల్పించినట్లు ఈ పురాణం చెప్తుంది. అయితే క్రీ. శ. 12వ శతాబ్దంలో ఉండే రాకేంద్రచోళుడనే చోళరాజు కాళహస్తి దేవాలయం నిర్మించాడు. ఆ ప్రాంతాలలోనే ఏ పండితుడో ఈ స్థలపురాణాన్ని వ్రాసి స్కాందంలో ఇరికించి ఉంటాడు.

ధూర్జటి తెలుగులో ఈ మహాత్మ్యాన్ని 755 గద్య పద్యాలలో హృద్యంగా నాలుగాశ్వాసాల కావ్యంగా రూపొందించాడు. తన కృతికన్యారత్నానికి విద్యాపారంగతుడైన వరునిగా కాళహస్తీశ్వరుని ఎంచుకొనగానే దేవుడు దీవించాడట.

ఈశుభకావ్యరత్నమున కీశు నధీశుని జేసినన్ మహా
దేశికసార్వభౌముడు మదిం బ్రమదంబు వహించి ధూర్జటీ
నీశిగభక్తి కావ్యసరణిం గడుధన్యత బొంద నవ్యభా
షాశయతానిగుంభనరసస్థితి నొప్పు దలిర్పజెప్పుమా. [శ్రీకాళ. 1-8]

ఈ కావ్యం నిజంగానే నవ్యభాషా నిగుంఫనంతో రసస్థితి శతధా కనబడుతుంది. తక్కిన కవులందరూ భౌతికంగా పురవర్ణన చేస్తే ఇతడు ఆధ్యాత్మికసంపదతో పుర వర్ణన చేశాడు. కాళహస్తిలో కామినులు సహితం యోగిజనమే అని వర్ణించాడు.

పరిచితబిందుశైపుణి నపారకళానుభవప్రసక్తి నా
దరసవివేకసంపద సదాశుకవాక్యసుధానుభూతి మో
హరహితవృత్తి బ్రహ్మోదనంగరహస్యవిచారబుద్ధి న
ప్పూరమున గామినీజనులు పొల్తురు యోగిజనంబు పోలికన్ [శ్రీకాళ.1-24]

నారాయణవనంరాజుగారి పరిచారిక ఒక్కర్తె ఇట్టి వంటి యోగినే. ఈమె ఇంటికి శివుడు మిండజంగంవేషంలో వచ్చాడు. ఆయన సౌందర్యాన్ని చూసి కామశరసంతాపం పొందని కాంత మందుకైనా లేదట. ఈ జంగాసకి ఆ పరిచారిక కన్నడభాషాపదాలతో ఇలా స్వాగతం ఇచ్చిందట.

బిజమాడు దేవరు నిజకృపాదృష్టి జెన్నారు నాయిల్లు బిడారు మీకు
నాకుమీపాదార్చనము చేయ నడలింగమూ ర్తి! చేకు రెవచ్చిమూ ర్తమాడు
మొడయచి త్తేశ ! నాయనికిని మజ్జనంబాడి శివార్చన మాడబేకు
విచ్చేయుడు విభూతి పీడియం బందుకో జంగమస్వామి నా సదనమునకు
నోగిరంబులు మంచి మేలోగిరములు-నావటించెద బదరు మీ రారగింప
బ్రతిదినంబును జంగమార్చనము లేక-తనుపుపడనొల్ల విజితకందర్పయనుడు
[శికాళ. 1-35]

ఇలా అనగానే అతడు సంతోషించాడు. ఇది మహాత్మ్యరాలు. శివాచారియైన సుశీల అని కరుణించాడు. దానిని రతికి అంగీకరింపజేశాడు.

తాను గుమారజంగమసుధాకరమౌళియు గూడిమాడి యిం
పైన రతిప్రసంగముల నర్ధనిమీలిత నేత్రపద్మముల్
మానని చుంబనంబులును మాటలు చూడ్కులు వీడివీడిపో
నీని కవుంగలింతలు నసేకవిలాసములుం జెలంగగన్
ఎక్కడ బట్టినం గళల యిక్కువ, లెక్కడ నోరు సోకినన్
జక్కరలప్ప లేమిన సారసుధారసమట్టు లుండినన్
జక్కదనంబు పెన్నిధులు సంభ్రమ మొప్పగ నేమి సేసినన్
మక్కువ చెయ్యిలై మెరయు మిన్నుథ కేళి యొనర్చ నంతటన్. [1-42,43]

రాజుగారి భోజనసమయంలో పళ్లెం పెట్టవలసిన పని ఈ దాసీదానిదే. తపసి నలా సేవించుకొంటున్న దని రాజుగారి కోపమువుకు గైరుహాజరయింది. కడుపు కాలిన రాజుగారికి ఒళ్లు మండింది. ఆ నీలవేణి తలగొరిగించమని ఆజ్ఞ జారీచేశాడు. దానిని అమలుజరిపారు. ఆ పరిచారిక జంగం కాళ్లమీద పడింది. ఆయన హస్తమస్తక సంయోగంతో దానిని దీవించాడు. మళ్లీ కురులువచ్చాయి. మరు

నాడు కొలువులోకి వెళ్లగానే రాజుగారు ఆశ్చర్యపోయారు. సంగతి తెలుసుకొని జంగంకాళ్లమీద పడ్డారు. అతడు రాజుగారికి కాళహస్తిమాహాత్మ్యం పూసగుచ్చినట్లు కొన్ని కథలలో చెప్పాడు. పదిమంది భక్తులను పరమేశ్వరుడు కరుణించిన గాథల సంపుటమే ఈ స్థలపురాణం. ఆ 'వ్యక్తు' లెవరో చూడండి. (1) వసిష్ఠుడు; (2) బ్రహ్మ; (3) సాలె పురుగు; (4) పాము; (5) ఏనుగు; (6) చెంచుతిన్నడు; (7) బ్రాహ్మణపూజారి; (8) నక్కీరు డనే తమిళకవి; (9) ఇద్దరు సానికూతుళ్లు; (10) యాదవరాజు.

ఈ పేర్లన్నీ కృత్యాదిని మంగళాచరణంలో వచ్చే టట్టు ధూర్జటి పద్యం చెప్పాడు.

శ్రీవిద్యానిధియై మహామహిమచే జ్ఞాన్న వసిష్ఠాజలూ
తావాతాశనసామజూటవికగోత్రాదేవనతీక్రరా
జీవాత్మీయుగయాదవాధిపులకున్ శ్రేయస్కరంబైన యా
ర్యావామాంగము దివ్యలింగము మదీయాభీష్టము ల్నల్పెడున్. [1_1]

పైపద్యంలోని జాపితాలో లేని వ్యక్తి మరొకడు కావ్యంలో ఉన్నాడు. అతడు అగస్త్యుడు. ఈయన ధర్మపత్నిసమేతంగా దక్షిణానికి వచ్చాడు. కాళహస్తీశ్వరుడికి అభిషేకం చెయ్యడానికి తగిన జలం లేదని తపస్సు చేశాడు. శివుడు తన జటాజూటంలోంచి ఆకాశగంగ పాయను పంపాడు. అది సువర్ణముఖినది అయింది. ఈ కథకూడ ధూర్జటి ఈ కావ్యంలో కథనం చేశాడు.

ఈ పదికథలలో ధూర్జటి పద్ధెనిమిది వర్ణనలూ కాక ఎన్నో లౌకికవిషయాలు చెప్పాడు. కాళహస్తిపది

సరాలలో ఉండే చెంచుపల్లెలు ధూర్జటికి బాగా తెలుసు. వాళ్ల ఆచార వ్యవహారాలు, ఆటపాటలు, జాతరలు అన్నీ ఈగ్రంథంలో చెప్పాడు. తెరవేట, డేగవేట, ముంగివేట, ఏదువేట, సివంగివేట, ఇర్రివేట, గంటవేట, ఎద్దువేట మొదలైన వేట లెన్నో ధూర్జటి స్వయంగా చూశాడు. చెంచులు ఆడా మగా తాగి ఎలాగ తందనా లాడేదీ గమనించాడు.

మాటలాడదలంచి మరచిపోయెదువారు నడవబోవుచు దొట్రుపడెదువారు
నూరకుండెదమని యుండనోపనివారు లేచెదమని లేకలేనివారు
బనిశేని పని బట్టబయలు దిట్టెడివారు బాడనేరకయును బాడువారు
నెమ్మరైనవారికి నెల్ల మొక్కెడివారు వ్రీడావిహీనులై యాడువారు
జాల ద్రావియు మగుడ జేసాచువారు
దొడరి యుపదంశభాండము ల్దొసుకువారు
నైరి మృగయాదిదైవతయాత్రయందు
భానముల జేసి కబరదంపతులు రతుల. [శ్రీకాళ. 3-41]

ఈ చెంచుపల్లెలలో పుట్టిన తిన్నడు ఒకనాడు వేటాడుతూ కాళహస్తీశ్వరుని చూశాడు. 'ఈనట్టడవిలో ఎందు కున్నావయ్యా' అన్నాడు.

ఓ సామీ ఇటువంటి కొండదరిలో నొంటిం బులుల్ సింగముల్
గాసిం బెట్టెడి కుట్రనట్టడవిలో గల్లువ్విక్రీనీడ నే
యాసం గట్టితి వేటిగడ్డ నిలు నీ వాకొన్నచో కూడునీ
ళ్లేసుట్టంబులు దెచ్చి పెట్టెదరు? నీకిం దేటికేలింగమా! [శ్రీకాళ. 3-65]

తనతో వాళ్ళ ఊరికి వచ్చెయ్యమన్నాడు. రాకపోతే తానూ వెళ్లనన్నాడు. 'ఎన్నేళ్లనుండియో పస్తున్నా డీ యడవిలోన మహేశు' డని దొప్పలలో మాంసఖండములు

తీసుకువచ్చి పెట్టేవాడు. విల్లొక చంకలో ఉండేది. వీపున అంపపొది, చేతులలో దొప్పలు, పుక్కిళ్లలో పవిత్రమైన స్వర్ణముఖినీళ్లు, దేవు డానంజుళ్లు తినకపోతే ఇలాఅడిగే వాడు.

కాలమొక్రొవ్వమొ మాడం_గాలెనొ చవిగామొ కమ్మగామొ నీకున్ జాలమొ యలవడమొ తిన_వేలా కరఘట్లు? పార్వతీశ్వర! చెపుమా.

[శ్రీకాళ. 3_88]

నాగరిక భక్తులకన్నా ఈ ముగ్ధభక్తుడే గొప్పవా డని రుజువు చేయడానికి శివుడు కంటి రక్తబాష్పాలు కార్చాడు. అపుడు తిన్న డిలా నేత్రవైద్యం చేశాడు.

కోకపొట్లం బావిగొన నూది యొత్తుచు గషణోష్ణకరభభాగమున గాచి నెత్తి తంగేడాకు మెత్తి రేచకి నిమ్మ పంటిసీరున నూరి పట్టు వెట్టి తెల్లెగిం టెనపువ్వు దెచ్చి తద్రస మిడి కలివెపువ్వులు గోసి నలచి పిడిచి పేరిన నెయివెట్టి పెరుగువత్తులు వైచి చనుబాలతో రాచి సంకు చమిరి విన్నమందులు తానరి కన్నమందు_అడిగి తెచ్చిన మందులు నడవిమంను లెన్ని చేసిన మానక యిందుమౌళి_కన్ను తొడిబడి నెత్తురుగారుటయును.

[శ్రీకాళ. 3_110]

చేసిన వైద్యాలు వెల్లికలిసిన చింతపండు, నీట ద్రావిన ద్రావాలు అయిపోయాయని తిన్నడు తన కన్ను తోడి దేవుడి కిచ్చాడు. ఆయన రెండోకంట కూడా నెత్తురు కార్చాడు. తిన్నడు తన రెండోకన్నుకూడా ఇవ్వబోయాడు. దేవుడు ప్రత్యక్షమై వారించాడు. ముక్తి నిచ్చాడు. తిన్నడి గొప్పతనాన్ని తెలుసుకున్న శివ బ్రాహ్మడుకూడా మోక్షాన్ని పొందాడు. పొట్ట తోస్తే అక్షరం ముక్క లేని

ముగభక్తుని కథ ఎంత హృద్యంగా వ్రాశాడో, మహా విద్వాంసుడైన తమిళకవి నక్కీరుని కథకూడా ధూర్జటి అంత చక్కగా వ్రాశాడు. ఈ తమిళకవి చారిత్రిక ప్రముఖుడే.

తమిళవాఙ్మయంలో నక్కీరుడను పేరుగల కవు లిద్దరున్నారు. ఒకరు సంగం కవులు వర్ధిల్లిన క్రీ. శ. 300 ప్రాంతాల ఉండేవారు.[1] రెండోకవి క్రీ. శ. 650 ప్రాంతం వాడు. ఇతడు సుబ్రహ్మణ్యుని మీద 'మురుగాట్రుపడై' అనే కావ్యం వ్రాశాడు.[2] ఇతడే శైవభక్తులలో నక్కీర దేవనాయనార్ అనే పేర ప్రసిద్ధుడయ్యాడు. ఇతని చరిత్ర తమిళంలోనే రకరకాలుగా ఉంది. పరంజోతిమునివర్ తిరువిళయాడల్ పురాణంలో ఒకలాగ, పులియూర్ నంబి మరొకలాగ ఇతని కథను వ్రాశారు. తమిళదేశంలో ఉండే విభిన్నగాథలను ధూర్జటి సమ్మిళితం చేశాడు.[3]

పాండ్యరాజు కొలువులో నక్కీరుడు గొప్పకవి. ఆ రాజ్యంలో తామం వచ్చింది. ఒక పేద అర్చకు నికి సహాయం చేద్దామని శివుడే ఒక పద్యం వ్రాసిఇచ్చాడు. సభలో దానిని చదివితే రాజు సత్కరిస్తాడని చెప్పాడు.

---

1. *History of Tamil Language and Literature.* Prof. S. Vaiyapuri Pillai, P. 35.

2. Ibid, 113.

3. ఈ విషయమై చల్లా రాధాకృష్ణశర్మగారు విపులంగా పరిశోధనలు చేశారు. *Tamil Element in Telugu Literature.* (Unpublished) Pp. 131-146.

అర్చకుడు చదివాడు. నక్కీరుడు 'అందులో తప్పులున్నాయి' అన్నాడు. రాజు సత్కరించలేదు. అర్చకుడు పోయి దేవుని దగ్గిర మొరపెట్టుకొన్నాడు. దేవుడు సభలోకి స్వయంగా వచ్చి వాదించాడు. 'దేవుడు రాసినా సరే తప్పు తప్పే' అన్న ధోరణిలో నక్కీరుడు ఉన్నాడు. దైవానికి కోపంవచ్చి శాపం ఇచ్చాడు. శ్రీకాళహస్తీశ్వరుని సేవవల్ల విమోచనం వచ్చింది.

ఈకథను తమిళస్నేహితుల మూలంగా తెలుసుకొని ధూర్జటి ప్రాశస్త్యాన్ని గ్రహించాను. గ్రంథాదిని కన్నడపదాలు వాడినట్టే ఈ ఘట్టంలో అతడు తమిళపదాలు వాడాడు.

ఉణ్ణామల జనదంబిక-నణ్ణామల విశ్వనాథు నారాధించెఁ
మణ్ణాసయు బొన్నాసయు-బెణ్ణాసయు లేనివారి పెన్నిధు లగుటన్.
[శ్రీకాళ. 3-185]

శివభక్తులలో చాలామంది దక్షిణ దేశీయులే. అందుకే ధూర్జటి మరొక కథలో తమిళదేశంలో పుట్టిన సానికూతుళ్ల శివభక్తిని తెలియజేశాడు. ఈ సందర్భంలో సానివాడతో తనకు గల పరిచయం పచరించాడు. సమకాలిక సంప్రదాయాలు చిత్రించాడు. ఆ రోజుల్లో బాలింతలు బిడ్డలను ఎలా సాకేదీ సాని కూతుళ్ల పుట్టుక వర్ణించిన ఘట్టంలో ఇలా చూపించాడు.

అలదునలుంగుదేహమున వేణీశార్చ దడియొత్తు మెత్తని ధవళవస్త్ర
మున గాలిప్రేలి మన్ననబొట్టువెట్టు, గన్నవబెట్టు గాటుక కడుపునకును
బెట్టు, బొత్తులమీదబెట్టు, జన్నిచ్చు జోకొట్టు జోలలుపాడు మట్టెపరుచు
దలయంటు చిట్టాముదమున రక్షోర్ణంబు మునిడికోలలు మంచయున నమర్చి

ద్రాటనులిగాయ గూర్చి పాదముల గట్టి_యిప్పు వేపాకుపై జల్లు నిప్పులతివ
ర్పిప్పి యిడు దృష్టిదోషంబు తీరవీధి_బ్రేమమీరంగ బిడ్డల బెంచునపుడు.
[4_11]

ఈ బిడ్డలను తొట్టిలో పెట్టి కొక్కోక కళావిలాసము
లకు గల అర్థం జోలపాటగా పాడి కమనీయశైశవం
నుండీ వాళ్లకు వారధర్మ విద్యాబుద్ధులు వేశ్యమాత నూరి
పోసింది. అయితే వాళ్లు శివభక్తి అలవరచుకొన్నారు.
ఎదిగిన కూతుళ్లను తల్లి ఇలాగ తిట్టేది.•

రసికులు మీ గానరసమున వచ్చిరి పాడరే శివభక్తి పాడుగాను
జాణలు మీ విలాసము జూడవచ్చిరి చూడరే శివభక్తి చూరవోను
పల్లవు ల్మీతోడ భాషింపవచ్చిరి పలుకరే శివభక్తి పారిపోను
పార్థివు ల్నకలసంపద లీయవచ్చిరి పిలువరే శివభక్తి పెంపుచెడను
ధనము గలిగిన జంగమార్చన మొనర్పు_శివున కఖిలోపచారము ల్సేయవచ్చు
వనజముఖులార! నాసరివారిలోన_నిరుల మెరయుచుదలయొత్తి తిరుగవచ్చు.
[4_35]

తల్లి చీవాట్లు పెడితే పిల్లలు పోట్లాడుతూ ఉండే
వారు. ఆ సాని కూతుళ్లను దోచుకొందామని_దొంగలు
ఒక ఎత్తు వేశారు. 'ఎందుకూ? తల్లితో పోరగా పనిలేదు.
ఆ తిరుకాళహస్తిపతిని చూపిస్తాం' అని లేవదీసుకు
పోయారు. ఆ దొంగల బారినుండి వారిని దేవుడు
కాపాడడం ధూర్జటి చక్కగా చిత్రించాడు. కాళహస్తి
లోని ఆ దైవాని కా పేరు రావడానికి కారణ భూతులైన
ఏనుగు, సాలెపురుగు, పాము ఎలా ముక్తిపొందినదీ
ద్వితీయాశ్వాసంలో చెప్తాడు. వాటి పూర్వజన్మలు


నాలుగో ఆశ్వాసంలో వివరించాడు. కాళహస్తీశ్వరుని పేరు చెప్తే ధూర్జటి పరవశిస్తాడు. శ్రీనాథుని కెంత శివ భక్తో ధూర్జటికి అంతకు రెట్టింపు ఉంది. ప్రతిపద్యం గుండెల గుండెలలోంచి వెలువడుతుంది. లక్షణం, అలంకారం, పదబంధం, రసం మొదలైనవి వాటంతటవే కవితాధారలో తేలితేలి మనల్ని ఓలలాడిస్తాయి. అతని కవిత్వంలో మాధుర్యమే కాక, సర్వజ్ఞత్వము, బహుముఖ నిర్వహణశక్తి కనబడతాయి–పూర్వకవుల ననుసరించిన చోటకూడా. ఏ పద్యం తీసినా సహజంగా ఉంటుందిగాని ఎరువు తెచ్చుకొన్నట్టు ఉండదు. ఎరువు పద్యం పట్టుకొని వెళ్లి పాండ్య రాజు సభలో అవమానం పొందిన అర్చకుడు ఇలా బాధ పడడం ధూర్జటి చెప్తాడు.

తా నెరిగిన విద్య నృపా-స్థానములో నెరప గీర్తి సమకూరుంగా
కేనరునకు బరవిద్యా-ధీనత భూపాలసభల దేజము కలదే? [3_162]

ధూర్జటి పద్యాల్లో పరవిద్య మందుకైనా ఉండదు.

11

సంకుసాంల సరసయ్య



యలవారు ఒకనాడు తమ కుమార్తె మోహనాంగితో చదరంగ మాడుతున్నారట. ఆట మంచి రసకందాయంలో ఉంది. రాయలవారు మంత్రిసి, వీనుగునూ జోడించారు. ఆ రెండిటి మధ్య మోహనాంగి బంటొకటి చిక్కుకుంది. దాన్ని తొయ్యడమా, మానడమా అని ఆలోచిస్తూ ఆమె చిన్న కూనిరాగం తీసింది. "ఉద్ధతుల మధ్య పేదల కుండ దరమె?" అంది. ఇది గీతపద్యపాదం. రాయలవారికి చదరంగమంటే ఎంత ఇష్టమో పద్యాలంటేనూ అంతకన్నా ఎక్కువ. ఏదైనా కొత్తపద్యం వింటే ఒకటికి రెండుసార్లు చదివించుకొంటారు. "ఏమిటమ్మా ఆ పద్యం? పూర్తిగా చదువు" అన్నారు. ఆమె సిగ్గుపడింది. అయినా రాయలవారు చదవమన్నాక మానకూడదు. చదివింది.

ఒత్తుకొని వచ్చు కటిపచోద్వృత్తి జూచి
తరుణి తనుమధ్య మెచటికో తలగిపోయె

నుండెనేనియు గనబడకున్నె ! యహహా!
యుద్ధతులమధ్య భేదల కుండదరమె?

చక్కని పద్యం. "ఎవరు చెప్పినదమ్మా!" అని రాయలవారు ప్రశ్నించారు. "నాలుగువేల వరహాలు పెట్టి ఆ పద్యం ఒక కవిదగ్గర కొన్నా"నని మోహనాంగి చెప్పింది. ఇటువంటి కవిత చెప్పే ఆ కవి ఎవరో, ఏ గ్రంథం వ్రాశాడో, ఎందు కీపద్యం అమ్ముకోవలసి వచ్చిందో రాయలవారు వాకబు చేశారు. అయితే అప్పటికే ఆ కవి రాజదర్శనం కాక విసిగి వేసారి విజయనగరం విడిచిపెట్టి వెళ్లిపోయాడు. రాయలవారు విచారించారు.

ఈ కథకు కాళ్లూ, చేతులూ ఉన్నాయో లేవో గాని ఈ పద్యం మాత్రం ఒక కావ్యంలో ఉంది. దాని పేరు 'కవికర్ణరసాయనం.' ఈ ప్రబంధంలో నాయిక సకలావయవ వర్ణనలో నడుమువీధ చెప్పిన పద్యమిది. విమలాంగి అనే రాజకుమార్తె చిత్రపటాన్ని లిఖించి ఇద్దరు చిత్రకారులు మాంధాతదగ్గరకు తీసుకువచ్చి ఆమెను వర్ణించిన ఘట్టంలోనిది ఈ పద్యం (3-26). ఈ కావ్యాన్ని వ్రాసిన కవిపేరు సంకుసాల నరసయ్య. ఇతని ఇంటి పేరు లోని సంకుసాల బహుశా కడపజిల్లా పులివెందల తాలూకా లోని 'సుంకేసుల' కావచ్చు. ఆ గ్రామంలో ఒక నరసింహ స్వామి ఆలయ ముంది. ఆ దేవుని పేరే కవితల్లిదండ్రులు అతనికి పెట్టి ఉంటారు.

నరసయ్య తన తల్లిదండ్రుల పేరుగాని, కులగోత్రాదులుగాని ఎక్కడా చెప్పుకోలేదు. తాను భట్టిప్రరాశరుల

శిష్యుడ ననిమాత్రమే తెలియజేశాడు (1-77). క్రీ. శ. 1536 ప్రాంతాలలో భట్టపరాశరుల శిష్యులు ఉండేవారని శాసన ప్రమాణ ముంది.[1] సంకుసాల నరసయ్య ఈ పరాశర భట్టాచార్యులవారి శిష్యుడే కావచ్చు. ఈ గురువులవల్ల నరసయ్యకు సత్కృతుల పరిచయం ఏర్పడిందట. వాటి రసానుభవ హేతువువల్ల అతడు సముల్లసన్మానసు డైనాడు. నరసయ్యకు కవులంటే చాలా గౌరవం. ఘనమతులైన సత్కవులు అందరికీ అకారణబంధువులు. వాళ్లు మనస్సులో పున్న 'నెవ్వగలు' మాన్పి కావ్యానందం కలిగిస్తారు. కథాముఖంలో ఇంపుగా హితాహితబోధ చేస్తారు. ఇంద్రి యాతీతమైన భావాలను చూచినదానికంటె అద్భుతంగా తెలియజేస్తారు.

మనమున గొన్న నెవ్వగలు మాన్పి ఘటింతురు కావ్యసమ్మదం
బనఘకథాముఖంబున హితాహితబోధ మొనర్తు రింపుగా
గనుగొనుకంటె నద్భుతముగా నెరిగింతు రతీంద్రియార్థముల్
ఘనమతు లెల్లవారికి నకారణబంధులు గారె సత్కవుల్ ?

[కవికర్ణ. పీఠిక, 8]

అకారణబంధులైన సత్కవులంటే ఇంత అభిమానం కనుకనే నరసయ్య తన కావ్యానికి 'కవికర్ణరసాయనం' అనే పేరు పెట్టాడు. గ్రంథంచిట్టచివర ఇలా విజ్ఞాపన చేశాడు.

కవితావిచక్షణత గల - కవికంఠవిభూషణముగ నైకొనవలయుం
గవివరనృసింహవిరచిత - కవికర్ణరసాయన మను కావ్యము దీనిన్.

[కవికర్ణ. 6-218]

---

1. తిరుపతిదేవస్థానం శాసనాలు, సంపుటి 4, నెం. 73.

వాస్తవానికి దీనికి 'మాంధాతృచరిత్ర' అని పేరు పెట్టాలి. సాకేతపురాన్ని యవనాశ్వుడనే రాజు పాలిస్తూ ఉండేవాడు. అతనికి పుత్రులు లేరు. సంతానంకోసం అతడు ఇంద్రయాగం చేశాడు. మాంధాత జన్మించాడు. పెరిగి పెద్దవాడయ్యాడు. తండ్రి అతనికి పట్టం కట్టి రాజనీతులు బోధించి అడవులకు పోయాడు. మాంధాత ధర్మయుక్తంగా పరిపాలించాడు. శరత్కాలం వచ్చాక అతడు దిగ్విజయానికి వెళ్లాడు. స్వర్గాన్ని ముట్టడించాడు. తరువాత రావణునితో తలపడ్డాడు. రాయబారాలు జరిగాయి; విఫలమైనాయి. సంకులసమరం జరిగింది. మాంధాతరావణుల ద్వంద్వ యుద్ధాన్ని సాక్షాత్తూ శివుడే దిగివచ్చి ఆపాడు. మాంధాత మందరగిరిమీద జయస్తంభం నిలిపి రాజధానికి తిరిగి వచ్చాడు. అతనివద్దకు ఇద్దరు చిత్రకారులు వచ్చారు. కుంతలదేశాధిపతి కుమార్తె విమలాంగి చిత్రపటాన్ని తెచ్చారు. మాంధాత ఆ రూపాన్ని చూసి మోహించాడు. అతని చిత్రాన్ని ఆమెకు ఆ చిత్రకారులు అందజేశారు. ఆమెకూడ మరులుకొంది. ఇద్దరూ విరహంలో పడ్డాక వివాహం జరిగింది. మాంధాత భార్యతో క్రీడాగృహంలోకి వెళ్లాడు. నవోఢాసంగమంలో రాత్రీ పగలూ తెలియలేదు. వసంతం వచ్చింది. మాంధాత వనవిహారం చేశాడు. పుష్పాపచయం, జలక్రీడ మొదలైన ఆటపాటల తరువాత చీకటి పడింది. జారులు, నిటులు, వారకాంతలు చెలరేగారు. వేశ్యామాతను తిట్టుకొన్నారు. చంద్రుడు ఉదయించాడు. యువతీశృంగారకేళి జరిగింది. ఆ మదవతులు మధుపానం

చేశారు. పరవశించారు. తెల్లవారింది. మాంధాత నగరుకు వెళ్లాడు. అతని దగ్గరకు వసిష్ఠాదిమునులువచ్చారు. వాళ్లను సత్కరించి, తన పూర్వజన్మవృత్తాంతాన్ని చెప్పమన్నాడు. వాళ్లు చెప్పారు. కర్మస్వరూపం, ఉపాస్యబ్రహ్మస్వరూపనిర్ణయం, వేదవేదాంతపురాణస్వరూపనిరూపణం చేశారు. విరుద్ధ శ్రుతులకు సామరస్యం చెప్పారు. ప్రసన్నస్వరూపాన్ని నిరూపించారు. మాంధాత విరాగి అయ్యాడు. వసిష్ఠుడు అష్టాక్షరీ మంత్రాన్ని ఉపదేశంచేశాడు. మాంధాత తపస్సు చేసుకొందుకు వెళ్లాడు. దానిని చెడగొట్టడానికి ఇంద్రుడు అప్సరసలను పంపాడు. వాళ్లు కాస్తా మాంధాతకు శిష్యురాళ్లయ్యారు. ఇంద్రుడు బ్రహ్మతో సంప్రతించాడు. విష్ణుమూర్తివద్దకు రాయబారబృందంగా వెళ్లి 'దయచేసి మాంధాతకు ప్రత్యక్షమవ'మని మహాజకు పెట్టుకొన్నారు. దేవుడు మంజూరుచేశాడు; సాక్షాత్కరించాడు. మాంధాత కృతార్థు డయ్యాడు.

నాటకీయత లవలేశంకూడ లేని ఈ కథను ఆలంబనంగా చేసుకొని సంకుసాల నరసయ్య ఆరు ఆశ్వాసాల ప్రబంధాన్ని రచించాడు. పైగా దీనిని విన్న యతులు విటులుగా మారుతారనీ, విటులు యతులుగా మారుతారనీ సగర్వంగా ప్రకటించాడు.

యతి విటుడు గాకపోవు టెట్లస్మదీయ-కావ్యశృంగారవర్ణనాకర్ణనమున
విటుడు యతి గాకపోరాదు వెస నదీయ-కావ్యవైరాగ్యవర్ణనాకర్ణనమున.

[కవికర్ణ. పీఠిక, 22]

ఈ ప్రకటనలో అతిశయోక్తి లేదు. మన కావ్యా

లలో కనిపించే విచ్చలవిడిశృంగారవర్ణనల వెల్లువ ఈ నీటి బుగ్గలోనుంచే పుట్టింది. వాగెవదల్చిన కోర్కెలు ఈ గ్రంథంలో వలరాచశివాలు తొక్కుతాయి. తెలుగు కావ్యాలలో' చెలరేగే కామాన్ని ప్రేరేపించడానికి మన్మథుడు మామూలుపువ్వులు ఉపయోగిస్తే లాభం లేదని నిర్ణయించుకొన్నది ఈ గ్రంథంలోనే. చూడండి.

మధుమదోన్మత్తలై యల్క మరచి సఖులు
నూరెలకు దార బతులపై సోలునట్టి
చేడియల మన్మథుడు వెర్రి చెరకు వింట
నేసె నుమ్మెత్తవిరులచే నేసరేగి. [కవికర్ణ. 4-166]

ఉమ్మెత్తపువ్వుల బాణాలు వేయబట్టే శృంగారం ఇంత వెర్రితలలు వేయడం మొదలైంది. ఆ కాలంలో జనులు స్త్రీవిహారం చేస్తూ ఉండేవారు. అది కావ్యాలలో ప్రతిఫలించింది. చీకటిపడితే చాలు జారబజారు హోరెత్తేది కాబోలు. సంజెపొద్దున. పిశాచాలలాగా పట్టుకొంటే వదలని గుడిసెజంతలు పీథులు ఎలా వరిక్తట్టాలో నరసయ్య వర్ణించాడు.

చిటికలు వేయుచు జిరుపాట పాడుచు జార్చిపయ్యెద గూడ జేర్చుకొనుచు
గన్నెరూపములెల్ల గరసంజ్ఞ బిలుచుచు నెటకేని జనువాని కెదురుసనుచు
గడచిపోవచ్చిన గౌగిట బట్టి నీవా యంచు నదలి మోహంబు రేచి
చూపిన వెలకు నంతే పోయనుచు జంకె వేయుచు రోయుచు వెంటబడుచు
రూక లడుగుచు దుద బచ్చనాకులైన
నొడబడుచు హస్తగతమైన నొడియ నడిచి
దొడ్డబందాటమున గోక ద్రోసికొనుచు
గుడిసెజంతలు దెరువాటు గొట్టి రపుడు. [కవికర్ణ. 4-95]

తెరువాటుగొల్చే గుడిసెజంతలేకాక ముసుగుపెట్టు కొని గుడిసెలు దూరే కొత్త సిగ్గరిమిండలుకూడ ఆనాడు ముమ్మారంగానే ఉండేవారు. ఈ బజారు శృంగారాన్నే వడపోస్తే, ఆనాటి మధుపానగోష్ఠులలో, జలకేళులలో, వనవిహారాలలో సరససల్లాపాలు అవుతాయి. మరింత నిగ్గుతేరిస్తే నాయికానాయకుల సంభోగవర్ణనలుగా రూపొందుతాయి. వారకాంతలు చెలరేగిన ఆనాటి సమా జంలోకులకాంతలనుకవులుకనికరించి వాళ్లమానాన వదలి వెయ్యలేదు. రాజుగారు ఊరేగినప్పుడు చూసి మనసు పట్టలేకపోవడం తెగ వర్ణించారు. తన పెళ్లికి వెళుతున్న మాంధాతను చూసి పౌరకాంతలు ఎటువంటి మన్మథా వస్థలు పొందిందీ నరసయ్య 11 గద్యపద్యాలలో వర్ణించాడు.

భారపు నిండు వెక్కసపు బ్రాయపు జవ్వని యోర్తు మందిర
ద్వారమునందు నిల్చి నృపవంశమనోధవు చిత్తమోహనా
కారము జూడ వంగజవికారవశంబున నీవి జారినన్
గూరిన సిగ్గుమై దలుపు గొబ్బున మాటుగ జేసె నాభికిన్.

[కవికర్ణ. 3_167]

రాజును చూసిన కాంతల కోకముడి బిగువుసడలిందో లేదోగాని ఇటువంటి వర్ణనలలో మన కవులు హద్దులను సడలించడం పరిపాటే. మనుచరిత్రలో పెళ్లికి వెళుతున్న స్వరోచిసి చూసి పౌరకాంతలు ఎలా మరులుగొన్నారో అల్లసాని పెద్దనగారు పదిపద్యాలలో వర్ణించారు. ఒకావిడ స్నానం • చేస్తూచేస్తూనే ఆదరాబాదరాగా వచ్చి

చూసిందట. నీకు లోబడ్డానని ప్రమాణం చేయడానికే, సంప్రదాయం ప్రకారం, తడిబట్టలతో వచ్చినట్టుందట.

జిలుగుల బెట్టుచుం దొడల జెంద్రికపావడ యంట మైతడిం
బెళ పెళ లేని చీర గటిబింకపుజన్నుల జేర్చికొంచు వే
జలకము లాడియాడి యొక చాన కరస్థితకేళియై నృపున్
వెలువడి చూచె లోబడితి నీ కని బాసకు నిల్చెనో యనన్.

[మను. 5_68]

ఇలా తడిబట్టలతో వచ్చి రాజును చూడడం ఈమె ముక్కుతిమ్మన్నగారి దగ్గరనుంచి నేర్చుకొంది. ఆయన పారిజాతాపహరణంలో ముందే ఇలా వ్రాశారు.

కాళియ భేది జూచు తమకంబున మజ్జన మాడియాడి నీ
లాలక యోర్తు గంధసలిలార్ద్రికచంబుల జన్నుదోయిపై
వ్రాలిన సందిటం బొదివి రాజపథంబున కేగుదెంచె గో
పాలకమూర్తి గాన శిఖిబర్హము గానుక దెచ్చెనో యనన్.

[పారిజాత. 3_14]

ముక్కుతిమ్మన్నగారుకూడ ఈ ఘట్టంలో పది పద్యాలు వ్రాశారు. ఇటువంటి సన్నివేశంలో ఎంత మంచి కల్పనలు చేసినా రక్తికట్టవు. అందుకే నరసయ్య పారిజాతాపహరణంలోని ఈ ఘట్టాన్ని కుళవికవిత్వంతో పోల్చాడు.

ఇలరేని జూడ జనుతమి_లలన యొకతె తడబడిన యలంకారమునో
ఖ
కలయు వడిగూడని పద_సలనంబును గలిగి కుళవికవితయు బోలెన్.

[కవికర్ణ. 3_155]

కులస్త్రీలపట్ల కొంచెం గౌరవం చూపించి నరసయ్య ఇలా అన్నాడు:

కులసతి శిష్టపూర్ణమునకున్ మదినిల్పిన దాటరామికిన్
గులము మహోంబురాశి పతి కొండ గృహోంగణ మంధకూప మా·

కులసతి దుష్టమార్గమునకు న్మది నిల్పినయేని దాటగా
గుల మొక గోష్పదంబు పతి గుండు గృహాంగణ మోటపట్టగున్.
[కవికర్ణ. 4_104]

నరసయ్య కావ్యంమాత్రం రకరకాల శృంగారవర్ణనలకు ఆటపట్టు. మంచి భావుకతకు ఊనికిపట్టు. యతినిశ్చైతం పిటుని చేస్తానన్న పంతంకొద్దీ ప్రాసిన పద్యాలుకాబట్టి రౌడీతనం కనబడుతుంది. ఇతడు విటుణ్ణిశ్చైతం యతిని చేస్తానని ఛాలెంజి చేసి చెప్పిన ఘట్టాలు నిజంగా వేదాంతమయాలు.

ఎవ్వండ? నెందుండి యెచటి కేమిటికి నే బద్ధుండనైతి నేబంధనమున?
కారణం బెయ్యది? కాదు కారణ మెద్ది? యెద్ది కారణజన్య? మేది కాదు?
ధర్మ మేదేది? యధర్మంబు నే దిప్పు? డెందు వర్తించెద? నెందు నిలువ
నేది కృత్య? మకృత్య మెయ్యది? గుణసంవిశిష్ట మెయ్యది? దోషజుష్ట మెద్ది?
యను వివేకంబు లేక ప్రాయమున గ్రొవ్వి
పశువువోలె శిశ్నోదరపరుడు నరుడు
సంచరించుచు నజ్ఞానసంభవంబు
నధికతరమైన దుఃఖంబు ననుభవించు. [కవికర్ణ. 5_106]

ఈ దుఃఖాలను దాటడానికి, నిజంగా తరించడానికి ఒక్కటే మార్గమట.

శరణాగతులకు దక్కి - బతులకు మోక్షంబు లేదు భవనస్థుడు నిర్భరుడు సన నిరుదెరంగుల - బరగు బ్రపన్నుండు సుకృతిపరిపాకభిదన్.
[కవికర్ణ. 5_91]

సంకుసాల నరసయ్య నిజంగా ప్రపన్నుడు. అతడు నిజమైన వైష్ణవుడు. నరాంకితం చేస్తే తన కృతి దూష్య మవుతుందని దేవునికి అంకితమిస్తాడు. రాజులను ఇలా గర్హించాడు.

ఆందోళికలయందు నంతరచరులైన సవిక్రృతాకృతుల పిశాచజనులు
పరకరాళంబులై ప్రార్థింప గనుగోక వాయెత్తకుండు జీవచ్ఛవములు
వాలవీజనముల గ్రాలుచు నీగకు నంటీవిఖరవర్తులాండసములు
వేత్రపరంపరావిలకంటకాకృతి జేరబోరాని బహ్వాబరతరులు
శంఖనాగస్వరస్వరశ్రవణసమద - విస్ఫుటచ్ఛత్రవిస్ఫారితస్ఫటాక
విష్టవిషవైద్యవశవర్తిదుష్టఫణులు-ప్రభుదురాత్మలనెవ్వాను ప్రస్తుతించు?
[కవికర్ణ. పీఠిక, 24]

ఇటువంటివాడు రాజాశ్రయంకోసం విజయనగరం వెళ్ళి పడిగాపులు పడ్డాడనీ, రాజదర్శనం పెద్దనగారు పడనివ్వలేదనీ విశ్వసించడం కష్టమే. అయినా ఇతడు రాయలవారి కాలంవాడని చెప్పడానికి మోహనాంగి చదరంగంకథ పనికివస్తుంది. రాజులను ఇలాగే దూషించిన ధూర్జటినికూడ రాయలవారు మెచ్చుకొన్నారు. కనుక బహుశా ఇతణ్ణికూడ సత్కరించారేమో తెలియదు. నరసయ్య తనను మెచ్చుకొందుకు ఒక్కడుంటే చాలు నన్నాడు.

ఎల్లరు మెచ్చని మత్కృతి - నుల్లంబున మెచ్చుగాక యొక డుష్టర్షిపలం
బొల్లని పల్లవితామ్రము-గొల్లలుగా బొగడ నొక్క కోయిల లేదే?
[కవికర్ణ. పీఠిక, 20]

చాలా కోయిలలు ఇతణ్ణి పొగిడాయి. అసలు తనను తాను పొగడుకొనడంలో నరసయ్య అందెవేసిన చేయి. "మామకసాత్యవతేయ వాజ్మనయోదరక్ష సుధార్ణవోదయ విధాయకపార్వణశర్వరీవరా!" (5-158) అని కృష్ణపట్టిని ప్రశంసిస్తూ తనను వ్యాసులవారితో పోల్చుకొన్నాడు. ఆ నోటితోనే తాను అల్పుడనని చెప్పుకొంటాడు.

జ్ఞానప్రౌఢమహాకవీశ్వరవచస్సంస్తూయమానుండు ల
క్ష్మీనాథుండు మదల్పవాక్యరచనాస్వీకర్త గాకుండునే?
నానాభూపతు లెల్ల గానుకలు రత్నశ్రేణు లర్పింపగా
ధానాముష్టియుచుం గుచేలు గరుణన్ ధన్యాత్ముగా జూడడే?

[కవికర్ణ. పీఠిక, 23]

ఇది శ్రీ వేదాంతదేశికాచార్యులవారి ఈ క్రింది శ్లోకంలోని ప్రౌఢప్రయోగానికి అనుకరణ.

క్ష్మోణీకోణశతాంశపాలనకళా దుర్వారగర్వానల
క్షుభ్యత్క్షుద్రనరేంద్రచాటురచనాధన్యాన్ న మన్యామహే
దేవం సేవితుమేవ నిశ్చినుమహే యోసౌ దయాళుః పురా
ధానాముష్టియుచే కుచేలమునయే దత్తేస్మ విత్తేశతాం.[1]

కవిత్వంలో సంకుసాల నరసయ్య ఎంతమాత్రం కుచేలుడు కాడు. కుబేరుడే. అయితే నూలిపోగంత కథను తీసుకొని 1200 గద్యపద్యాలు వ్రాస్తే ఎంతటి కవైనా విసుగు పుట్టిస్తాడు. "నృసింహకవియేకాక ఆంధ్రసంస్కృత కవులలో పెక్కురు గ్రంథమునందలి యేకభాగపరిచయమున మహాకవివతంసులుగ గన్పింతురు. తుదమొట్ట చదివితిమా, ఉన్న గౌరవము పోవును. దీనికి ప్రధానకారణము కవులలో నూటికి తొంబదితొమ్మిదిమందికి గ్రంథముయొక్క సమష్టి మీద దృష్టి యుండదు; చదివెడువారికి అట్టి చూ పుండరా దేమో!" అన్న ఒక రసజ్ఞుని మాటలు కొంత నిజమే.[2]


---

1. ఈ సంగతి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు గుర్తించారు. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక, సంపుటి 6, పుటలు 270-274. ఈ వ్యాసంలో వారు సంకుసాల నరసయ్యను కొంచెం ప్రాచీనుణ్ణి చేశారు.

2. కవికర్ణరసాయనం-దిగుమర్తి సీతారామస్వామి. భారతి, సంపుటి 26, సంచిక 11.

12

చింతలపూడి ఎల్లన్న
(రాధామాధవకవి)



ధిక శృంగారదేవతగా నేడు రసరాజ్యాన్ని పరిపాలిస్తున్నది. రాధామాధవుల ప్రణయమే నిగ్గుతేరిన ప్రణయమని ఈనాడు రసికులందరూ భావిస్తారు. విరహంచేత ఆర్తురాలైన రాధిక మీదా, సహజంగా ధూర్తుడైన కృష్ణునిమీదా కనీసం ఒక గేయమో, పద్యమో అల్లని తెలుగుకవి ఉండడు. అయితే మన ఆంధ్రసాహిత్యంలో మొట్టమొదట రాధాకృష్ణులచేత పరస్పరం ముద్దుపెట్టించిన మొనగాడు శృంగారిశేఖరుడైన శ్రీనాథుడు. ఆయన తన భీమఖండంలో కృతిపతిని దీవిస్తూ ప్రాసిన తొలిపద్యాలలో రాధాకృష్ణుల ప్రణయం చిత్రించాడు.

వాలికమోము మత్తవనబర్హికిశోరకలాస్యలీల బై
వాలిచి పచ్చకప్పురపు వాసనతోడి ముఖారవింద తాం •

బూలపు మోవి మోవిపయి మోపుచు రాధకు నిచ్చు ధూర్తగో
పాలుడు ప్రోచుగావుత నపారకృపామతి మంత్రియన్నినిన్. [భీమ. 1-ని]

రాధపెదవిమీద కృష్ణుని పెదవి మోపించి ముద్దు పెట్టించిన శ్రీనాథుడు తానుమాత్రం పెదవులు మూసుకొన్నాడు. ఈ ఒక్కపద్యంలో తప్ప రాధాకృష్ణుల ప్రస్తావన మరెక్కడా తేలేదు. తేవడానికి ఆస్కారంకూడ లేదు. అయినా, ఈపద్యమైనా అతడు చెప్పినందుకు తెలుగువాళ్లు ఎంతనికి ఋణపడతారు. తానువ్రాసిన అన్ని కృతుల్లోనూ పద్యాలన్నిట్లా చరిత్రకు తోడ్పడినట్టే ఈపద్యంలో కూడా శ్రీనాథుడు సాహిత్యచరిత్రకు సహాయం చేశాడు. క్రీ. శ. 1365 కు పూర్వం హరివంశాన్ని అనువదించిన ఎర్రాప్రెగడ నుండి సుదీర్ఘ గతనలో శ్రీకృష్ణుని ప్రియురాలుగా రాధపేరు ఎక్కడా కనబడదు. క్రీ. శ. 1475 కు పూర్వం భాగవతాన్ని సవిస్తరంగా రచించిన బమ్మెరపోతరాజుగారి శ్రీకృష్ణ చరిత్రలో అతని ప్రేయసిగా రాధఊసే కనబడదు. అందుచేత తెలుగుదేశానికి క్రీ. శ. 16-వ శతాబ్దంలో వంగదేశం నుంచి రాధ దిగుమతి అయిందనే అపోహ ఒకప్పటి ప్రచారంలో ఉంది. క్రీ. శ. 1428-30 ల మధ్య భీమఖండాన్ని వ్రాసిన శ్రీనాథుని పద్యంలో రాధప్రస్తి ఉండడంవల్ల అనాటికే తెలుగువాళ్ళకు ఆమెతో ముఖపరిచయ ముందని చెప్పవచ్చు.

అయితే రాధాకృష్ణుల ప్రణయజీవితాన్ని సంపూర్ణ కావ్యంగా వ్రాసి ఈ శృంగారాన్ని తెలుగువాళ్లకు సుపరిచితం చేసిన మహానుభావుడు చింతలపూడి ఎల్లన్న. అతని

కావ్యంపేరు రాధామాధవం. ప్రాసీప్రాయగానే ఈ ప్రసిద్ధం సుప్రసిద్ధమైంది. దీనిని విన్నతరువాత ప్రాసినవారి పేరు శ్రోతలు మరిచిపోయారు. అతణ్ణి రాధామాధవకవి అని పిలిచారు. అదే చివరకు సిరపడిపోయింది. కవికూడ తాను ప్రాసిన అనంతరగ్రంథాలలో తన పేరు రాధామాధవు డనే చెప్పుకొన్నాడు. అయితే ఇతడు తనగురించి పనికివచ్చే వివరాలు ఆట్టే చెప్పుకోలేదు. రాధామాధవంలో గద్య ఇలా ఉంది :

ఇది శ్రీమన్మదనగోపాలచరణకమల సేవాధురీణ సత్కళాపాకీర్ణ కృష్ణభట్టారకపౌత్ర చింతలపూడి కామయప్రభుసుపుత్ర సుకవిధేయ రాధామాధవ ఎల్లనార్యప్రణీతంబైన రాధామాధవం బను శృంగార ప్రబంధంబు...

ఈ గద్యవల్ల కవి మదనగోపాలభక్తుడనీ, కళాకోవిదు డనీ, ఇతని తాతపేరు కృష్ణంభట్టుగారనీ, తండ్రి కామయ్య గారనీ, వీళ్ళ ఇంటిపేరూ, ఊరిపేరూ చింతలపూడిగ్రామ మనీ తెలుస్తున్నది. అయితే కవి ఫలానాజిల్లావాడని నిశ్చితంగా చెప్పలేం. ఏమంటే తెలుగుదేశంలో ఆరుజిల్లా లలో పడకొండు చింతలపూడిగ్రామా లున్నాయి. వాటి వివరాలు చూడండి :—

విశాఖపట్నంజిల్లా:— (1) చింతలపూడి (పీరవల్లితాలూకా), (2) చింతలపూడి (గోలుకొండతాలూకా), (3) చింతలపూడి (గోలు కొండమన్యం).

తూర్పుగోదావరిజిల్లా:—(4) ప్రాపచింతలపూడి (అమలాపురం తాలూకా), (5) వన్నెచింతలపూడి (అమలాపురంతాలూకా), (6) చింతలపూడి (ఎల్లవరంతాలూకా).

పశ్చిమగోదావరిజిల్లా:— (7) చింతలపూడి (చింతలపూడి తాలూకా).

కృష్ణాజిల్లా:—(8) చింతలపూడి (గుడివాడతాలూకా).

గుంటూరుజిల్లా: —(9) చింతలపూడి (తెనాలితాలూకా), (10) చింతలపూడి (రేపల్లెతాలూకా)

నెల్లూరుజిల్లా:— (11) చింతలపూడి (దర్శితాలూకా)

ఈ పదకొండు గ్రామాలలో ఏ ఒక్క చింతలపూడి గ్రామమైనా ఎల్లన్న స్వగ్రామ మవడానికి వీలుంది. అయితే అతడు తూర్పుగోదావరిజిల్లావాడని భావించడానికి ఆస్కారాలున్నాయి. క్రీ. శ. 1402 ప్రాంతాలలో చింతలపూడివారు ఈ సీమలో ఉమ్మట్లు శాసనప్రమాణాలున్నాయి.[1] చింతలపూడి కాచన్నగారు తమ తండ్రి కృష్ణరాజుగారికి సుకృతంగా సర్పవరం భావనారాయణస్వామికి ఒక సుక్షేత్రం దానం చేశాడు. రాధామాధవకవి బహుశా ఈ చింతలపూడివారి వంశంలోనివాడు కావచ్చు. తూర్పుగోదావరి జిల్లా ఎల్లవరంతాలూకాలో ఒక చింతలపూడిగ్రామ మున్నదని చూశాం. ఈ తాలూకా పేరులోని 'ఎల్ల' శబ్దానికీ, రాధామాధవకవిపేరులోని 'ఎల్ల'శబ్దానికీ ఏదైనా సంబంధ మున్నదేమో చూడాలి. ఇది కేవలం బాదరాయణ సంబంధమో, కాదో భావిపరిశోధనవల్లగాని తేలదు.

చింతలపూడి ఎల్లన్న చిన్నప్పటినుంచి మదనగోపాల భక్తుడని భావించవచ్చు. అతడు 'కృష్ణా, వల్లవీవల్లభా' అనే మకుటంతో చెప్పాడే అని ఊహాగానం చేయడానికి

1. ఆంధ్రకవితరంగిణి, 4 వ సంపుటం, పుట 205.

ఆస్కారమ ముంది. ఈ మకుటంతో ఉన్న తొమ్మిదిపద్యాలూ రాధామాధవప్రబంధంలో అక్కడక్కడ కనబడతాయి.[1] శతకంలో తాను ప్రాసిన మంచిపద్యాలను సండగోబ్బిచి తంగా అతడు వాడుకొన్నాడని భావించవచ్చు. బాలక్రీడల నుంచి లీలావిహారకాలదాకా కృష్ణచరిత్రను ఈ శతకంలో ఎల్లన్న కీర్తించినట్లు కనబడుతుంది. చూడండి:

బాలక్రీడల గన్నతల్లికి మనఃప్రహ్లాదముం జేయుచున్
హేలాహైత్రి ఘటించి గోపకులలో నేపాగ వర్తింపుచున్
గేలిం జారుడ వౌచు గోపికల కాగిళ్ళ న్వినోదించు ధీ
శాలిత్వంబులు నీక యొప్పు నవు గృష్ణా! వల్లవీవల్లభా! [రాధా. 1-135]

ఇందులో చక్కని శృంగారవర్ణనలుకూడ ఉన్నాయి. ప్రియురాలి విరహాన్ని వర్ణిస్తున్నాడు:

ఘనపీన స్తనకుంభమండలముపై గస్తూరి నొప్పారగా
గొనగోర న్నిను ప్రాసి యీవిధమునం గూర్చుందువే యంచు ఝు
ల్లన రోమాంచము నించి యశ్రువులు జాలై పార బద్మాక్షి వె
చ్చని నిట్టూర్పు నిగుమ్చునీధ్వతికి గృష్ణా! వల్లవీవల్లభా! [రాధా. 3-145]

అయితే తన ఇష్టదైవాన్ని ఎల్లన్న కేవలం శృంగార పురుషునిగానే కాక పరబ్రహ్మంగా కూడ ఊహించుకొన్నాడు.

సిరవిజ్ఞానవిశేషనిశ్చలితదృష్టిం దుష్టి జూడంగ సా
గరకల్లోలఘటాపరంపరలలో గన్పట్టు సర్వాకృతిక్
బరమబ్రహ్మవిలోకనాత్ములకు శుంభద్దివ్యతేజస్థితిక్
శరణత్వంబును జూపుచుండుదువు కృష్ణా! వల్లవీవల్లభా! [రాధా. 1-13]

---

1. రాధామాధవంలో ఈ మకుటమున్న పద్యాలు ఇవి: 1-22, 1-23, 1-24, 1-133, 1-135, 2-26, 2-106, 2-107, 3-145.

చింతలపూడి ఎల్లన్న సర్వం శ్రీకృష్ణమయంగా భావించాడు. ఇలా కీర్తించాడు :

నీవే యజ్ఞములుఁ దదీయఫలముల్ నీవే కులాచారముల్
నీవే మంత్రము నీవె తజ్జపములుఁ నీవే మనోవాంఛయుఁ
నీవే మోక్షము నీవె చిద్విభవము న్నీవే ఖితర్కింప నా
నావర్ణాశ్రమధర్మమార్గులకు కృష్ణా! వల్లవీవల్లభా! [రాధా. 1-24]

శ్రీకృష్ణుని చిద్విభవం బహుశా ఎల్లయ్య ఎర్రయ్యగారి హరివంశంవల్ల తెలుసుకొని ఉంటాడు. ఆయన కవిత్వమంటే అతని కెంతో గౌరవం. గంగాతరంగాల సంగీతంలాగా ఎర్రయ్యగారి మృదుమధురవచనాలుంటాయని అతని విశ్వాసం. అందుకే వారిని ఇలా నుతించాడు.

నానావిధపటునటదీ-శానశిరస్సరిదభంగసలిలోర్మిఘటా
నూనధ్వనిమృదుమధుర-వ్రోనిధి శివదాసు గొలుతు సుకవిశశాంకున్. [రాధా. 1-12]

ఈ పద్యంలోని 'శివదాసు' అన్న పేరుతో ఎర్రాప్రెగడగారినే పేర్కొన్నాడని ఎల్లన వ్రాసిన మకోగ్రంథంలోని పూర్వకవిస్తుతినల్ల నిరూపించవచ్చు. ఎర్రయ్యగారి బిరుదు శంభుదాసుడైనా, ఎల్లనమాత్రం 'శివదాసు' అనే పిలుస్తాడు. అతడు తన తారకబ్రహ్మరాజీయంలో కవిత్రయాన్ని ఇలా నుతించాడు.

భారతకావ్యహార మొకభాగము నన్నయభట్టు గూర్చెము
క్తారమణీయవాక్యముల దక్కిన భాగము సోమయాజి పెం
పార నొనర్చె రెంటి గలయఁ శివదాసుడు మధ్యనాయక
శ్రీ రచియించె కారద ధరింప కవిప్రియకీర్తి మించఁగన్. [R. 347]

---

1. మద్రాసు ఓరియంటల్ లైబ్రరీ ట్రయన్నియల్ కాటలాగు, సంపుటి 3, భాగం 3, పుట 108.

ఎర్రయ్యగారి రచనలు నిజంగా గొలికిపూసలే. వారి రచనలలోని మెత్తదనాన్ని ఎల్లన్న అలవరచుకొన్నాడు. అయితే కవిత్వం ఉండవలసిన చోట్ల గట్టిగాకూడ ఉండాలి. ఆవిద్య శ్రీనాథుని రచనలవల్ల ఎల్లన బాగా అవగాహనచేసుకొన్నాడు. అందుకే కవిసార్వభౌముణ్ణి ఇలా నుతించాడు.

సూనాస్త్రప్రదమోదస్ఫురితనవోజాతకాఠిన్యముల్
బూనంజాలు వచోవిలాసముల నేర్పుల్ చూపి కర్ణాటక
క్ష్మానాథేంద్రు సభల్ గవిత్వవిజయోత్సాహంబు గైకొన్న మా
శ్రీనాథుం కవిసార్వభౌము గొలుతుల్ సేవాంజలుల్ గీర్కొనన్.

[రాధా. 1-13]

పూర్వకవుల పుస్తకాల ధర్మమా అని ఎల్లన మృదుమధురగంభీరవాచావిశేషాలు తెలుసుకొన్నాడు. సంస్కృతంలో సుప్రసిద్ధకావ్యాలేకాక అప్పుడప్పుడే ప్రచారం పొందుతున్న, ఒకటి రెండు శతాబ్దాలక్రిందటి గ్రంథాలను కూడ అతడు పఠించాడు. వాటిలో జయదేవుడు రచించిన రాధామాధవకావ్యం ఉంది. ఈ జయదేవుడు ప్రఖ్యాతమైన గీతగోవిందాన్ని వ్రాసిన జయదేవుడో కాడో తెలియదు. సంస్కృతవాఙ్మయంలో చాలామంది జయదేవులున్నారు. గీతగోవిందాన్ని వ్రాసిన జయదేవుడు క్రీ. శ. 1090–1140 ప్రాంతాలవాడు.[1] ఇతడుకాక క్రీ. శ. 1300 ప్రాంతాలలో చంద్రాలోకం, రసమంజరి మొదలైన అలంకారశాస్త్రాలూ, ప్రసన్నరాఘవం అనే రూపకం వ్రాసిన జయదేవుడొకడు

1. సంస్కృతవాఙ్మయచరిత్ర, ద్వితీయసంపుటం–మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు, పుట 324.

డున్నాడు.[1] గంగేశపండితుడు వ్రాసిన తత్త్వచింతామణి అనే తర్కశాస్త్రానికి వ్యాఖ్యగా ఒక జయదేవుడు ఆలోకం వ్రాశాడు. ఇతని శిష్యుడు టీక వ్రాశాడు.[2] వీళ్లుకాక శృంగారమాధవ మనే చంపూగ్రంథాన్ని వ్రాసిన ఒక జయదేవుడుకూడ ఉన్నాడు. ఇంతమంది జయదేవులలో ఎవరు రాధామాధవం వ్రాశారో తెలియదు. బహుశా శృంగారమాధవ చంపూకావ్యాన్నే ఎల్లన్న రాధామాధవం అన్నాడేమో! అతడు జయదేవుణ్ణి ఇలా నుతించాడు.

నుతియింతు వాగ్విశేష-స్థితి రాధామాధవంబు చెప్పిన విద్యా
చతురాననుు నీలాచల-పతిహితు జయదేవసుకవిపంచప్రదరున్.

[రాధా. 1-10]

జయదేవుడు వ్రాసిన రాధామాధవాన్ని చదివాక దానిని అనువదించాలనే కోరిక ఎల్లనకు జనించిందికాబోలు. ఒకనాడు అతడు పూర్వకవుల మృదుమధుర గంభీర వాచా విశేషాలతో, భావరసగర్భితమైన వివిధపదబంధాలతో ఒక ప్రబంధం రచిద్దా మనుకొంటూ ఉంటే రాధాసమేతంగా కృష్ణుడు ప్రత్యక్షమయ్యాడట. 'కవితాకల్పవల్లి' అనే ద్వ్యక్షరాక్షరకలితమైన తన దివ్యమంత్రాన్ని ఉపదేశించాడట. రాధామాధవం అనే శృంగారకావ్యాన్ని రచించి తనకు అంకితమివ్వమని బోధించాడట. ఎల్లన్న ఇలా పొంగిపోయాడు.

బోధించి యిష్టదైవము - రాధాసతి గూడి సౌమ్యరమ్యాకృతి హృ
త్సాధమున దోచి కృష్ణుడు - రాధామాధవము చెప్పరా యని పలికెన్.

---

1. సంస్కృతవాఙ్మయచరిత్ర-II, పుటలు 256, 413.
2. అదేగ్రంథంలో, పుట 127.

ఇష్టదైవంబు పొడకట్టి హృదయవీథి-దనకు గృతిజెప్పుమని ప్రసాదంబుసేసి
నింతకంటెను సౌభాగ్యమేమిచెప్ప-డైవకృపగల్గెనేని వింతలె శుభములు.
[రాధా. 1_26, 27]

ఈ కావ్యం ప్రారాకా నిజంగానే ఎల్లన్నకు శుభాలు చేకూరాయి. క్రీ. శ. 1519 లో బహుశా రాయలవారు కళింగవిజయంనుంచి తిరిగివస్తున్నప్పుడు చింతలపూడి ఎల్లన విజయనగరసార్వభౌముని దర్శనం చేసుకొని తన కవిత్వం వినిపించదలిచాడు. అతని శక్తిసామర్థ్యాలు పరీక్షించడానికి అల్లసాని పెద్దనగారు ఒక సమస్య ఇచ్చారు. నగరు, తగరు, తొగరు, వగరు అనే మాటలు ప్రాసస్థానంలో వాడుతూ రామాయణపరంగా ఎల్లన్నను పద్యం చెప్పమన్నారు. అతడు ఆశువుగా ఇలా చెప్పాడు.

నగరు పగాయె నింక విపినంబుల కేగుడు రాజ్యకాంక్షకుం
దగరు కుమారులార యని తల్లి వగల్ మిగులంగ దోపగా
దొగరున రక్కగట్టి మది దోపక గద్దదఖిన్నకంఠయై
వగచుచున్న జూచి రఘువంశవరేణ్యుడు తల్లి కిట్లనున్.

ఈ పద్యాన్ని విన్నాక అందరూ సంతోషించారు. ఇవే మాటలు వాడుతూ భారతపరంగా పద్యం చెప్పమన్నారు. ఎల్లన ఆశువుగా ఇలా రచించాడు.

తొగరుచి కన్నుదోయి గడు దోపగ గర్ణుడు భీమసేనుపై
దగరు ధరాధరంబుపయి దాకిన భంగిని దాకి నొచ్చి తా
వగరుచుచు న్వెసన్ బరుగువారిన నచ్చటి రాజలోకముల్
నగరు సుయోధనాజ్ఞ మది నాటుటజేసి ధరాతలేశ్వరా!

దీనిని మెచ్చుకొన్నాక రాయలవారూ, ఇతరకవులూ ఇవే మాటలతో భాగవతపరంగా ఒక ఆశుపద్యం చెప్పమన్నారు. ఎల్లన్న చెప్పాడు.

వగరుపుమాత్రమే వసుదు వశ్యుడు కాడు సఖీసఖిశ్వ మె
న్న గరుడవాహనుండు మము నా డటు డించుట యెల్ల నుద్ధవా
తగరని కాక మోహపు లతాతనులైన విడంగజూతురే
తొగరుచి యౌషధీశునకు దోపగజేయుమి పీడనాడగన్.

ఈ సమీక్ష పూర్తికాగానే ఎల్లన్న వ్రాసిన రాధా మాధవకావ్యాన్ని అల్లసాని పెద్దన మొదలైన కవులున్న సభలో రాయలవారు విన్నారు. పిని మెచ్చుకొన్నారు. ఆభరణాలు మొదలైన కానుక లిస్తూ ఎల్లన్నకు రాధా మాధవకవి అనే బిరుదిచ్చారు. దీనిని అతడు ఈ కావ్యపు గద్యాంలో చేర్చుకొన్నాడు. ఈ సన్మానాన్ని గ్రంథాదిని అవతారికలో ఇలా వివరించాడు.

రాధామాధవ మచ్యుతాంకితముగా బ్రౌఢక్రియం జెప్పి త
న్మాధుర్యంబున గృష్ణరాయవిభు గర్ణాకేశు మెప్పించి నా
నాధాత్యప్రతిమాన సత్కవులలోనన్ భూషణశ్రేణితో
రాధామాధవనామ మండిన జగత్ప్రఖ్యాతచారిత్రుడన్.[రాధా. 1-30]

ఈపద్యంలోని 'ధాత్యప్రతిమాన సత్కవులు' అనే మాట అల్లసాని పెద్దనగారినే సూచిస్తున్నది. వారికి ఆంధ్ర కవితా పితామహ' బిరుదు ఉంది. ఇది వారు క్రీ. శ. 1519 ప్రాంతాలనాసనాలలో వాడారు కనుక రాధామాధవకవికి రాయలవారి సన్మానం క్రీ. శ. 1519 లోనో, లేక ఆతరువాతనో జరిగిందని చెప్పవచ్చు. రాయలవారు సత్కరించాక ఎల్లన్న ఇతర ఆస్థానకవుల్తోపాటు విజయనగరానికి వెళ్లి అక్కడ స్థిరపడిపోయాడు. ఇదే తరుణంలో కళింగదేశం నుంచి ఎందరో కవులూ, పండితులూ వారి ఆస్థానంలో చేరి రాజధానికి వెళ్లారు. సౌందర్యలహరికి వ్యాఖ్య వ్రాసిన

లొల్ల లక్ష్మీధరుడు, పారిజాతాపహరణం రూపకాన్ని వ్రాసిన దివాకరుడు, సంగీతసూర్యోదయాన్ని రచించిన బండారు లక్ష్మీనారాయణకవి మొదలైన సంస్కృతకవ యితలు పిళ్ళలో ముఖ్యులు. రాధామాధవకవికూడ ఈ పండితులతోపాటు విజయనగరానికి చేరుకున్నాడని భావించ వచ్చు.

రాజధానికి చేరుకొన్నాక రాధామాధవకవి అక్కడ పదేళ్ళ పాటు సుఖంగా జీవించాడు. కొంతమంది రాజకీయో ద్యోగులతో సంబంధ బాంధవ్యాలు పెట్టుకొన్నాడు. నంజయ్య గారి తిమ్మరసయ్య అక్కడ మంచి పదవిలో ఉన్నాడు. కంపాచారు లెక్కలు వ్రాసే 'చీఫ్ మిలిటరీ అకౌంటెంట్' ఉద్యోగంలో ఉండేవాడు. ఇతనికో, రాధామాధవకవితో చాలా సఖ్యం ఏర్పడింది. ప్రస్తుతం మనకు తెలియని బంధుత్వం కూడా ఏర్పడింది. ఇటువంటి ఉద్యోగస్థుల తోనూ, ఇతర కవిమిత్రులతోనూ హాయిగా జీవిస్తూ రాధా మాధవకవి 'తారకబ్రహ్మరాజీయం' అనే ముక్కొక ప్రబంధం రాయడం మొదలు పెట్టాడు. దీనిని పూర్తిచేసేలోగా కృష్ణ రాయలవారు మరణించారు. రాజ్యంలో కల్లోలాలు వచ్చాయి. చివరకు కృష్ణరాయల సవతితమ్ముడు అచ్యుత దేవరాయలు రాజ్యానికి వచ్చాడు. ఇతనివద్ద సంజయ్యగారి తిమ్మనసు ఉద్యోగం కొనసాగించాడు. ఈ తిమ్మనసుకు తన రాజుగారి ఇష్టాయిష్టాలు బాగా తెలుసు.

అచ్యుత దేవరాయలుకూడ సాహిత్యపోషకుడే, ప్రతి యేడూ ఒక గ్రంథం వ్రాయించి తిరుపతి వెంకటేశ్వరునికి

సత్కావ్యపుష్పాంజలి సమర్పిస్తూ ఉంటాడు. తన ఉద్యోగులుకూడ తనలాగే కావ్యాలు వ్రాయించి దేవునికి అంకితం చేయిస్తే అచ్యుతరాయలు మెచ్చుకొంటాడు. అందుచేత నంజయ్యగారి తిమ్మరసు రాధామాధవకవిని చూసి ఇలా అన్నాడు.

పరమహితుఁడవు తారకబ్రహ్మరాజు-మను ప్రబంధంబు నీ చెప్పినది మదాత్మ
నాయకుండగు శ్రీరఘునాయకునకు-నంకితము సేయఁదలయు నాకభిమతముగ.
[R. 3+7]

ఎల్లన సంతసించి దీనికి అంగీకారం తెలిపాడు.

నావుడు నీకు నంకిత మొనర్పదలంచినవాడ బంధుసం
భావన; నీకు నిష్టముగ బ్రహ్మమయుం డగు రామభద్రధా
త్రివరమౌళి కంకిత మిదే యొనరించిన మంచి పైడికిం
దావి ఘటిల్లె నేమియన? నంజయతిమ్మ! వివేకభూషణా! [R. 347]

రాధామాధనకవి బంధుసంభావన చేసిన నంజతిమ్మరసు బాగా చదువుకొన్నవాడే. చక్కని సంస్కారమున్నవాడు. ఇతనిగురించి కవి ఇలా చెప్పాడు.

వేదపురాణశాస్త్రసుఖవిద్యల కెల్ల గురుండు బ్రహ్మవి
ద్యాదృఢబుద్ధి నేర్చు లిపు లన్నియు వ్రాయు సమస్తదేశభా
షాదు లెరుంగు స్వామిహితమైన ప్రయోజన మాచరించు నా
నాదికలం బ్రసిద్ధుడగు నంజయతిమ్మన బోల రెవ్వరున్. [R. 347]

ఈ తిమ్మయ్యకోరికపైన రామునికి అంకితమిచ్చిన తారకబ్రహ్మరాజీయం ఎన్ని ఆశ్వాసాలో తెలియదు.[1]

---

1. కోరాడ రామకృష్ణయ్యగారు అయిదు ఆశ్వాసాలు అన్నారు. (విష్ణుమాయానాటకం, పీఠిక, పుట 13.)

మద్రాసు ప్రాచ్యలిఖితగ్రంథాలయంలో రెండు ప్రతులున్నాయి. ఒకదానిలో నాలుగాశ్వాసా లున్నాయి (R. 347). ఇంకోప్రతిలో రెండాశ్వాసా లున్నాయి (R. 719). ఈకావ్యం రామతారకమంత్రంయొక్క మాహాత్మ్యాన్ని తెలియజేస్తుంది. దీనిని సంస్కృతంలో నారాయణాశ్రమి అనే యతి రచించాడట. ఇతడు ప్రయాగక్షేత్రవాసి. దీనిని రాధామాధవకవి తెనిగించాడు. ఆగమాంతపరిచితమైన ఈ కావ్యాన్ని అతడు శృంగారరసంతో ముంచెత్తాడు. రెండో ఆశ్వాసంలో ఒక బ్రాహ్మణపతివ్రతుని కథ ఉంది. ఇతడు తీర్థయాత్రలకు పోతూ దారిలో ఒక బోయదానిని చూచాడు. దాని ప్రేమలో పడ్డాడు. అది మగనాలు. అయితే పరదారాగమనం పాపంకాదని ఆ కామకుడు ఎంతో సమర్థించుకొన్నాడు.

అమరాధీశుడు స్వర్గ మేలఁడె యహల్యాజారుడయ్యెఁ? శుచి
త్వముతోడం బరదారసంగమము విద్వాంసుల్ నివారింపుటల్
తమ భార్యల్ నియమస్థులై సతతలీలాహీనులం బాయు దో
సముల దోస మటంచు నే నెరుగ నే సందేహ మింకేటికిఁ? [R. 347]

ఈ పద్యంలోని భావాలే తరువాత శేషం వెంకటపతి (క్రీ. శ. 1704-31) ప్రాసిన తారాశశాంక విజయంలోని 'లోకములోన కొంద రబలుల్ తమసతులం దనియింపలేక' అనే పద్యానికి వరవడి. 'పరనారీసంభోగము పరమసుఖం' బని బ్రహ్మంతవాడే కూతుర్ని చెరిచాడని తారకబ్రహ్మ రాజీయంలోని పాత్ర అంటాడు.

సరకమని చదివి చెప్పియు_ధరణీపతి దండభయము దగిలించియు మా
న్తగుగాక యధమపురుషుల_వారివారు అజ్ఞులెక్ రమింపరా సరసతులక్?
[R 847]

కావ్యానాయికలలో స్వీయకన్న పరకీయ మంచిదనే ఉద్దేశానికి పునాదులు పడుతున్న కాలంలో ఈ కావ్యం రచనా జరిగింది. అందుకే ఇంతి బరితెగించిన భావాలు. ఈ ఉద్దేశాలు వెర్రితలలు వేసి మన కావ్యాలలో పరకీయ శృంగారం కట్లు తెంచుకొని ప్రవహించింది. పరకీయలకు పట్టం దేవతగా రాధ వెలసింది. అయితే రాధామాధవంలోమాత్రం రాధ స్వీయ. శాస్త్రోక్తంగా కృష్ణుని పెళ్లాడిన ఇల్లాలు. ఈమె సహస్రగోపు డనే గోపాలుని కూతురు. ఈమె అందాన్ని నారదుడు కృష్ణునివద్ద వర్ణిస్తాడు. ప్రేమకలిగి కృష్ణుడు సాక్షాత్తూ సరస్వతినే రప్పించి ఆమెను రాయబారానికి పంపుతాడు. వాణి మధురవాణిగా రాధవద్దకు వెళ్లి కృష్ణునిపై ఆమెకు అనురాగం కలిగిస్తుంది. రుక్మిణీకల్యాణంలాగ రాధాకల్యాణం కూడ అన్నివివరాలతో-తండ్రి ఇష్టపడడం, అన్న అడ్డు చెప్పడం మొదలైన ఘట్టాలతో నిండివుంది ఎటొచ్చీ అక్కడ రుక్మిణి గుడిలోనుంచి ఎత్తుకుపోయాడు. ఇక్కడ రాధను స్వయంవరమండపంలో దండవేశాక తీసుకుపోతాడు. భార్య మొగంచూసి రుక్మిని కొంచెం ఎగతాళిచేసి విడిచిపెట్టినట్లే రాధ సోదరుణ్ణికూడ శుద్ధకోతిని చేసి ఆమెముఖంచూసి విడిచిపెడతాడు. చాలా చిన్నకథను తీసుకొని అయిదాశ్వాసాల గ్రంథంగా ఎల్లన్న రచించాడు. ఇతని రచనావిధానం పింగళిసూర్యన్నలాంటి ప్రతిభావంతునికే దారిచూపింది.

---

1. రాధామాధవం పీఠికలో నడకుదుటి వీరరాజుగారు సూరన్న-ఎల్లన్నల గ్రంథాలను తైపారువేశారు.

రాధామాధవకవి తన ప్రతిభను మరొక కావ్యంలో కూడ ప్రదర్శించాడనే పండితలోకం భావిస్తున్నది. దాని పేరు విష్ణుమాయానాటకం. ఈ కావ్యానికి రెండు రకాలలో గద్య లున్నాయి. ఒకదాంట్లో దాని రచయిత అనంతయ్య అని ఉంది; రెండోదాంట్లో రాధామాధవకవి అని ఉంది. విష్ణు మాయానాటకాన్ని మడికి అనంతయ్య వ్రాసి ఉంటాడని చాగంటి శేషయ్యగారు భావించి నిరూపించడానికి ప్రయత్నించారు. వారి వాదాన్ని పటిష్ఠం చేయడానికి కావలసిన సాక్ష్యాలను సేకరించి మనం అనంతయ్యచరిత్రలో చెప్పుకొన్నాం.[1] క్రీ. శ. 1347-1400 ప్రాంతాలలో ఉన్న మడికి సింగన్నకు అనంతయ్య అనే సోదరు డున్నాడు. అతడు కవి అని సింగన చెప్పలేదు. అయినా అనంతయ్య కవి అయితే అతడు ఈ గ్రంథం వ్రాయడానికి ఆస్కారముందని, సింగన గ్రంథంలోని పద్యాలను పోలిన పద్యాలను విష్ణుమాయానాటకంనుంచి తీసి తెలపారువేశాం. పోలికలు చాలా స్పష్టంగా ఉన్నాయి. అంతమాత్రంచేత అనంతయ్యే వ్రాశాడనలేము. మడికి సింగన్న పుస్తకాలను చదివిన మరేకవైనా వ్రాయవచ్చు. చింతలపూడి ఎల్లన గోదావరి ప్రాంతాల వాడు కనుక ఆ సీమలోని కవియైన సింగన్న గ్రంథాలను చదివి ఉండకపోడు. అందుచేత ఈ పోలికలున్న పద్యాలను రాధామాధవకవి వ్రాసినా వ్రాసి ఉండవచ్చు. కాబట్టి విష్ణుమాయానాటకాన్ని రాధామాధవకవి రచించాడనే

1. సమగ్రాంధ్రసాహిత్యం-IV, రెడ్డిరాజులయుగం, పు. 79-91.

వాదాన్ని పటిష్ఠం చేయడానికి ఆధారాలు దొరుకుతాయేమో చూద్దాం.

విష్ణుమాయానాటకం అనే పేరు విచిత్రమైనది. కావ్యం నాటకం కాకపోయినా ఈ పేరు పెట్టడంలో కవి యొక్క ప్రత్యేకమైన అభిరుచి తెలుస్తుంది. రాధామాధవ కవికి ఇటువంటి ఊహలున్నాయా అని చూద్దాం. రాధ స్వయంవరానికి వచ్చిన రాజులను పేరొక్కని ఆసభను ఇలా వర్ణించాడు :

వెండియుం బెక్కు వికారంబుల విలాసంబులు చూపుచు బరిభగ్న వ్రీడానురాగఘట్టితాభోగంబగు మనంబుతో రాగరసరంజితంబును లోల దృగ్విన్యాసంబును బహురూపచేష్టాకలితంబును గృతకరకంకణఘలఘలా త్కారంబును మోహాయవనికాక్రాంతంబును నై మదనమాయానాటక సద్విధానరంగమండలతాండవలోలంబగు నర్తకచక్రంబను బావంబు దోప నప్పు డప్పెనురాచకొలువు చెలువారె... [రాధా. 4_237]

ఈ వచనంలో మదనమాయానాటకం అనేప్రయోగం చేయడంవల్ల విష్ణుమాయానాటకం అనే పేరు రాధామాధవ కవి పెట్టగలడని తెలుస్తున్నది.

సాధారణంగా కవులు రెండుమూడు గ్రంథాలు వ్రాసినప్పుడు తొలిరచనలలోని పద్యాలభావాలను అనంతర గ్రంథాలలో పొందుపరుస్తారు. కొన్నిచోట్ల తొలిరచనల లోని పద్యాలను యథాతథంగా తరువాతి కావ్యాలలో వాడుకొంటారు. రాధామాధవంలోని పద్యాలు ఏమైనా విష్ణుమాయానాటకంలో ఉన్నాయా అన్న విషయం పరిశో

భీష్మాం. స్వయంవర మండపంలో ప్రవేశించిన రాధను వర్ణిస్తూ నూగారుసంగతి ఇలా చెప్పాడు.

లలితనీలమణిశలాకనా రనుపేర_నిలిపెగాక నలువ నిలుపడేని
గురునితంబబింబకుచకుంభభరమున_వెలది ఁరుసదునడుము విరుగకున్నె?

[రాధా. 4_226]

ఇదే పద్యం విష్ణుమాయానాటకంలో కూడ కనబడుతుంది. కొలనులో మునిగి స్త్రీరూపాన్ని పొందిన నారదుణ్ణి చంద్రకేతుడనే రాజు చూసి మోహిస్తాడు. అప్పుడు చేసిన సకలావయవ వర్ణనలో ఇలాఉంది.

లలితనీలమణిశలాకయా నూగారు_నిలిపెగాక నలువ నిలుపకున్న
గురునితంబబింబకుచకుంభభరమున_వెలది యసదునడుము విరుగకున్నె?

[విష్ణు. 5_178]

ఈ ఘట్టంలోనే చంద్రకేతుడు ఇంకా ఇలా వర్ణిస్తాడు.

అమృతాంశు డంత దానము తా నొనర్చినో
పొలతినెమ్మోముతో బోల్పబడియె
నళు లెట్టి పుణ్యాటవుల నిష్ఠ మెలగెనో
యింతిపెన్నెరులకు నీడు వడసె
దమ్ము లెన్నెన్ని తీర్థంబుల దోగెనో
నతిక్రాలుగన్నుల సాటి నొందె
గజము లే క్షేత్రమార్గముల వర్తించెనో
చెలువనడకకు సరి చెప్పవలసె
గాంచనము భూమి నేమేమి కర్మములకు
వచ్చెనో చానమైచాయ వన్నెకెక్కె
జిలుక లే సత్యవాక్యముల్ పలికినవియె
యబలమధురోక్తులకు సమ్మతయ్యె నిపుడు.

[విష్ణు. 5_180]

సరిగ్గా ఇదే పద్యం రాధామాధవంలో ఉంది. స్వయంవరమండపంలో తన ముందు నిలబడ్డ రాధను చూసి మాధవుడు ఇలాగే అనుకొంటాడు. విష్ణుమాయానాటకంలో ఆఖరిపాదంలో 'అబల మధుగోక్తులకు సమ్మతయ్యె నిపుడు' అని ఉంది. రాధామాధవంలో 'సవతియ్యె నిపుడు' అనే మంచిపాఠం ఉంది. ఇంతే తేడా.

ఈ రెండు గ్రంథాలలోనూ ఇలాగ ఒకే పద్యాలు ఉండడంవల్ల విష్ణుమాయానాటకానికీ, రాధామాధవకవికీ సంబంధం కనబడుతున్నది. రాధామాధవంలోని ఆశ్వాసాల మొదటనున్న పద్యాలే విష్ణుమాయానాటకంలో కనబడతాయి-ఒక్కటితప్ప.


ఈపట్టికలో ఒకేఒక పద్యం విభిన్నమైనది. అది విష్ణుమాయానాటకం పంచమాశ్వాసం మొదట ఉన్నది. ఇలాగ కొత్తగా ఒకటి గ్రహించిన కవి మిగతా ఆశ్వాసాలలో వేరే పద్యాలు గ్రహించక రాధామాధవంలోని ఆశ్వాసాది పద్యాలనే ఎందుకు వాడుకొన్నాడో తెలియదు. ఆశ్వాసాంత పద్యాలు రెండు కావ్యాలలో పూర్తిగా విభిన్నంగా ఉన్నాయి. రచనావిధానంలో కూడ విభిన్నపద్ధతులు కనబడతాయి. రాధామాధవం ప్రబంధధోరణిలో ఉంది. విష్ణుమాయానాటకం పురాణరీతికి దగ్గర్లో ఉంది. ఒకేకవి రెండు పద్ధతులలో రెండు కావ్యాలు గ్రహించవచ్చని ఎర్రయ్యగారి నరసింహపురాణం, హరివంశాలే నిరూపిస్తాయి. విష్ణుమాయానాటకాన్ని రాధామాధవకవి రచించాడనే నిర్ణ

రాధామాధవం	విష్ణుమాయానాటకం
ద్వితీయాశ్వాసం మొదట__ శ్రీరాధాధరమధురసు [నిశిత ధారసధారాప్రశాంతదారుణ_ స్మారశరానలధీరో [పాలా! దారగుణావాలనవమదన గో_	ద్వితీయాశ్వాసం మొదట__ శ్రీరాధాధరమధురసు [నిశిత ధారసధారాప్రశాంతదారుణ_ స్మారశరానలధీరో [పాలా! దారగుణావాలనవమదన గో_
తృతీయాశ్వాసం మొదట__ శ్రీకరరాధావదనసు ధాకరబింబప్రసన్నదరహాసరుచి వ్యాకోచదృగుత్పల! వి ద్యాకేవలమూల! నవమదన గోపాలా!	తృతీయాశ్వాసం మొదట__ శ్రీరాధానఖరక్షత తారేశకళానిరంతదర్పకదగ్ధో దారాంధకారజగదా ధారగుణావాల! నవమదన గోపాలా!
చతురాశ్వాసం ఆదిలో__ శ్రీరాధామదవద్వ [ముద్రా క్షోరుహామకరీకలాపశోభన_ ప్రారంభజృంభసునిశిత ధారానఖజాలనవమదన గోపాలా!	చతురాశ్వాసం ఆదిలో__ శ్రీరాధామదవద్వ [ముద్రా క్షోరుహామకరీకలాపశోభన_ ప్రారంభజృంభి! సునిశిత ధారానఖజాల! నవమదన గోపాలా!
పంచమాశ్వాసం ఆదిలో__ శ్రీరాధానఖరక్షత తారేశకళానిర స్తదర్పకదర్పో దారాంధకార! జగదా ధార! గుణావాల! నవమదన గోపాలా!	పంచమాశ్వాసం మొదట__ శ్రీకరరాధాకైరవ రాకాసితకిరణమునివిరాజితచేతో వైకుంఠనిలయగుణర త్నాకరకల్లోలనవమదన గోపాలా!

యానికి తగినంత ఆధారం ఆంతరంగికసాక్ష్యాలవల్లి సేకరించాం. భావిపరిశోధనలవల్ల అనంతయ్యగద్య ఈ గ్రంథానికి ఎలా దఖలుపడిందో తేల్చాలి. రాధామాధవకవి గ్రంథాలను బాగా పరిశీలించవలసిన అవసరం ఎంతో ఉంది.

13

పిడుపర్తి కవులు



ద్రసాహిత్యంలో వైష్ణవానికి తాళ్లపాక కవులు చేసినంత సేవను వీరశైవానికి పిడుపర్తి కవులు చేశారు. ఈ కుటుంబంలోని చిట్టచివరి ప్రసిద్ధుడు రెండవ బసవకవి. ఇతడు క్రీ. శ. బహుశ 1480లో జన్మించి మలిరాయల యుగంలో రచనలు చేశాడు. పాల్కురికి సోమనాథుని ముఖ్యశిష్యుడు శివరాత్రి కొప్పయ్యగారి వంశంలోనే ఈ పిడుపర్తికవులు జన్మించారు. ప్రతాపరుద్రుని మంత్రి ఇందులూరి అన్నయ్యచేత పాల్కురికి సోమనాథుడు తన ప్రియశిష్యుడు శివరాత్రికొప్పయ్యకు డోకిపర్రు అగ్రహారం ఇప్పించాడు. ఈ కొప్పయ్యగారి మనుమని మనుమడు ఈ వంశంలో తొలికవిగా కనబడుతున్నాడు. అతని దగ్గరనుంచి ఈ కవులను గురించి కొన్ని వివరాలు తెలుసుకొందాం.

పిడుపర్తి నిమ్మయ్య :- కొప్పయ్యగారి మనుమని మనుమడు. క్రీ. శ. 1440 ప్రాంతాల ఉండిఉంటాడు. ఇతడు అష్టభాషావేది. భవుల కెన్నడూ కవిత్వం చెప్పని

ఘనుడు.[1] ఇతని కృతు లేమిటో తెలియవు. రెగళిక నిమ్మ నాథుడనే కవి ఒక డున్నాడు. అతడు వ్రాసిన 'నిజలింగ చిక్కయ్యకథ' అనే యక్షగానంలో ఇతని పేరు కృతికర్తగా పొరపాటున కనబడుతున్నది (R 279).[2]

పిడుపర్తి మొదటి బసవకవి :-ఇతడు నిమ్మయ్యగారి పినతండ్రికొడుకు. కాబట్టి ఈయనకూడ క్రీ. శ. 1440 ప్రాంతాలలోనే జీవించి ఉంటాడు. గురుదీక్షాబోధ, పిల్ల నైనారుకథ, బ్రహ్మోత్తర ఖండం మొదలైన రచనలు చేశాడు. అయితే ఇందులో గురుదీక్షాబోధతప్ప మిగతవి దొరకవు. ఇతడుకూడ 'కవిత భవులకు జెప్పని సవినయుండు.' శ్రీనాథునిలాగ ఏయేవయసులో ఏయేరచనలు చేసినదీ బసవకవి తన గురుదీక్షాబోధలో ఇలా చెప్పుకొన్నాడు.

పిన్నప్రాయమున జెప్పితి శివకథలు - ప్రన్న తెనుంగున బదరితి కొన్ని
నడివయసున బిల్లనయనారుచరిత - నుడివితి ద్విపదగా (?) సూక్తులను
కాల మాసన్నంబుగా కటమునెన్నె - లాలితకావ్యకళాప్రౌఢి జేర్మి
సకలాగమపురాణసమ్మతమైన - యొక శివకథ నింక నొనరింపవలయు

కెరియ పద్మరసు అనే కన్నడకవి వ్రాసిన దీక్షావిధా నాన్ని ఈ పిడుపర్తి మొదటిబసవకవి అనువదించాడు. దీనికి మీనభూపాలు డనే రాజు ప్రోద్బలం. ఇది "కృతుల కైవడి చమత్కృతుల బుట్టించి చతురులు చేసిన చరితంబు కాదు." బహుశాస్త్రసారం.

---

1. పద్యబసవపురాణంలో ఈ వివరాలున్నాయి.

2. మద్రాసుప్రాచ్యలిఖితగ్రంథాలయం క్రైకాట్లాగు, సంపుటి 2, భాగం 8, పుటలు 787, 788.

పిడుపర్తి సోమనాథుడు :- ఈవంశపు కవులలో ఇతడు చాలా సుప్రసిద్ధుడు. మొదటి బసవకవికుమారుడు. తొలిరాయల యుగంలో జన్మించి మలిరాయల యుగంలో తొలిరోజులదాకా జీవించాడు. ఇతడు పాల్కురికి సోమనాథుడు ద్విపదగా వ్రాసిన బసవపురాణాన్ని 'పద్యభారతి'గా రచించి, తండ్రికోరికమీద, పాల్కురికి సోమనాథునికే అంకితమిచ్చాడు. ద్విపద బసవపురాణాన్ని సోమనాథుని తండ్రి ఇలా ప్రస్తుతించాడు.

ఆది వేదాగమసారసంగ్రహము సత్యజ్ఞానసంపాదనం
బది రుద్రాది మహాపురాతనకథావ్యాప్తంబు పాపాపహం
బది భక్తివివృద్ధికారణము ముక్త్యావాస మల్లౌను నీ
వది చెప్పందగు బద్యకావ్యముగ కావ్యప్రజ్ఞ సేద్యంబుగన్.

అతడు తండ్రి చెప్పినట్లే చేశాడు. శబ్దార్థసారాలు అతణ్ణి పెద్దచదివించాయి. అతనికి కావ్యనిర్మలశక్తి ఉంది. తండ్రిఅనుజ్ఞ మీరి నడవడు. ఆయన ఎలా చేయమంటే అలా చేస్తాడు. శివకవులు అంగీకరించే విధంగా ద్విపదలను పద్యాలుగా చేశాడు.

సోము డేమి చెప్పె సోమేశుద్విపదలే-పెట్టి పద్యములుగ బెనిచె నంచు
నన్య లనగవలదు నాయయ్యశిష్యుల-మగుట మనకు జెల్లు నవియు నిలుప.

ఈ పద్య బసవపురాణాన్ని వ్రాశాక పిడుపర్తి సోమనాథుడు ప్రభులింగ లీలలను ద్విపదలుగా వ్రాశాడు. వీటికి కన్నడంలో చామరసయ్య ఇరవై అయిదు గతులతో వ్రాసిన వెయ్యిన్నూటపదకొండు పద్యాలు మూలం.

వీరశైవమతాన్ని ఖడ్గంతో ప్రచారంచేసిన బసవే

శ్వరుడు 'అనుభవమంటపం' అనే వీరశైవ విద్యాపరిషత్తు నెలకొలిపాడు. దాని అధ్యక్షుడు అల్లమప్రభువు. ఇతణ్ణే ప్రభుదేవు డంటారు. ఇతని లీలలనే ప్రభులింగలీల లంటారు. కన్నడంలో ఉన్న ఈ లీలలను నెల్లూరి రామలింగయ్య ప్రోత్సాహంతో పిడుపర్తి సోమనాథుడు అయిదాశ్వాసాల ద్విపదకావ్యంగా వ్రాశాడు. పద్యాలైనా ద్విపదలైనా చక్కగా నడిపించే శక్తిమంతుడు. 'ప్రబంధ నిబంధన శక్తియుక్త' అనే బిరుదును గద్యలో వేసుకొన్నాడు. ఇతడు స్వతంత్ర ప్రబంధాలు నిర్మించకపోవడం విచారించదగ్గ విషయమే.

పిడుపర్తి రెండవ బసవన్న :-ఇతడు సోమనాథుని తమ్ముని కొడుకు. తన పెదతండ్రి ద్విపదలుగా వ్రాసిన ప్రభులింగలీలలను ఇతడు పద్యకావ్యంగా చెప్పాడు. దీనిని చల్లపల్లిగ్రామకరణం మల్లారాధ్యుడికి అంకితం చేశాడు. తన కృతిపతిని 'బంధురకవి సార్వభౌమ' అని కీర్తించాడు. ఈ రెండవ బసవన్న కవిత్వం "అంత శ్రేష్ఠమైనది కాదు. వ్యాకరణదోషము లున్నవి వ్యర్థపదప్రయోగము లధికము" అని చాగంటి శేషయ్యగారు వ్రాశారు.[1]


పిడుపర్తి కవులు భవులకు కవిత చెప్పని శీలవంతులు. అంతమాత్రాన వీరి కవిత భవులకు నిషిద్ధం కాదు. సాహిత్య చరిత్రలో సమగ్రమైన అవగాహనకు వీళ్ళ రచనలు చదవక తప్పదు.

---

1. ఆంధ్రకవితరంగిణి. 6 వ సంపుటి, పుట 243.

14

తాళ్ళపాక కవులు



లుగుసాహిత్యాన్ని శ్రీమంతం చేసిన కవి కుటుంబాలలో తాళ్లపాకవారి కుటుంబం చెప్పుకోదగినది. సంకీర్తనాచార్యుడు, పదకవితా పితామహుడు అన్నమాచార్యుడు పలికినదల్లా పాట అయితే అతని సంతతిలో అందరూ చదువులసరస్వతులే అయ్యారు. అన్నమయ్య అల్లుడూ, కూతురు కొడుకూ కూడ కవులే. ఈ కుటుంబంలో వ్యక్తులందరూ తెలుగు భాండారంలో చేర్చిన పదసంపదపై ప్రత్యేకంగా ఒక పుస్తకమే వ్రాయవచ్చు. అన్నమయ్యకాక ఈ కుటుంబంలో పన్నెండుమంది ప్రముఖులు కనబడుతున్నారు. వాళ్లలో రమారమి అందరూ సాహితీపరులే! సంకీర్తనలు రచించి పాడగలిగినవారే.

ఈ తాళ్ళపాకకవులు కేవలం రచయితలేకాక లాక్షణికులు. అన్నమయ్యగారి రెండవభార్యకొడుకు పెదతిరుమలయ్య సంకీర్తనలు వ్రాయడమేకాక మొదటిసారిగా

తెలుగుభాషలో ఉన్న 'బండిరాల' జాబితా చెప్పాడు. ఎక్కడ 'బండిరా' వాడాలో, ఎక్కడ సాధురేఫ వాడాలో నిర్దేశించాడు. ఆ రేఫరకారనిర్ణయాన్ని 53 పద్యాలలో చెప్పాడు. అందులోనూ అకారాదిగా వ్రాశాడు.[1]

అచ్చులు హల్లులు బరుసనె - వచ్చిన రేఫలును రాలు వర్ణించెద ముక్
మెచ్చుగ నాదికవీశ్వరు-లచ్చపడం గృతుల జెప్పినటువలె గృష్ణా. [2]

ఈ 53 పద్యాలూ తరువాత లాక్షణికులకు చాలా ఉపయోగపడ్డాయి. ఈ పెదతిరుమలయ్యగారి కుమారుడు చినతిరుమలయ్య సంకీర్తనలక్షణం తెలుగులో వ్రాశాడు. పాటలకుగూడ కావ్యగౌరవం సంపాదించి పెట్టాడు. "సంప్రదాయాగత జ్ఞానసహితుడైన మనుజు సత్కవితయు వేద మంత్రసమము" అని చాటాడు (సంకీర్తన లక్షణం, 23).

వేదమంత్రాలవంటి వచనాలు చేసిన ఈ కుటుంబంలోని వ్యక్తులు, వాళ్ళతో వియ్యమందినవాళ్ళ పేర్లు ఇచ్చిన (ప్రక్కపుటల్లోని) పట్టిక చూస్తే, వీళ్ళ సాహిత్యసేవ ఎంతో తెలుస్తుంది. ఈ కుటుంబంలోని కవులను ఎవరో సమకాలిక కవి, బహుశా తెనాలిరామకృష్ణుడు, ఇలా ప్రస్తుతించాడు :

చిన్నన్న ద్విపద కరగును-పన్నగ పెదతిరుమలయ్య పదమున కరగుట
మిన్నంది మెరసె నరసిం-గన్నకవిత్వంబు పద్యగద్యక్రమాన్.

అయితే నరసింగన్న వ్రాసిన రచనలు ఏమిటో తెలియవు. అన్నమయ్యగారి పెద్దభార్యకుమారుడే సుంకేసుల గ్రామంలో స్థిరపడి సంకుసాల నరసయ్య అనే పేర ప్రసిద్ధు

1. తాళ్ళపాకవారి లఘుకృతులు, పుటలు 69-80.

తాళ్ళపాక కుటుంబంలోని వ్యక్తులు

	పేరు	అన్నమయ్యతో సంబంధం	వివరాలు, రచనలు
1	తిమ్మక్క	మొదటి భార్య	సుభద్రాకల్యాణం – ద్విపద
2	నరసింగన్న	పెద్దభార్య కొడుకు	రచనలు తెలియవు
3	అక్కలమ్మ	రెండవ భార్య	రచనలు చేసినట్లు లేదు
4	పెదతిరుమలయ్య [క్రీ. శ. 1460–1546]	రెండవభార్య కొడుకు	చాలా రచనలు చేశాడు 1. శృంగారసంకీర్తనలు 2. ఆధ్యాత్మికసంకీర్తనలు 3. వైరాగ్యవచనగీతాలు 4. శృంగారదండకం 5. చక్రవాళమంజరి 6. శృంగారవృత్తశతకం 7. వెంకటేశ్వరోదాహరణం 8. నీతిసీసశతకం 9. సుదర్శనరగడ 10. లేఖరచనలు 11. భగవద్గీత – తెలుగు వచనం 12. ద్విపద హరివంశం

5	తిరుమలాంబ	కూతురు	రచయిత్రి కాదేమో!
6	రేవణూరి కొండయ్య	అల్లుడు	రామచంద్రోపాఖ్యానక ర్త
7	రేవణూరు వెంకటాద్యుడు	మునిమనుమడు (తిరుమలాంబ కొడుకు)	1. శకుంతలాపరిణయం 2. శ్రీపాదరేణుమాహాత్మ్యం
8	చినతిరుమలయ్య [1495_1553]	మనుమడు (పెదతిరుమలయ్య పెద్దకొడుకు)	అష్టభాషాకవిచక్రవర్తి 1. అధ్యాత్మశృంగారకీర్తనలు 2. తెలుగుసంకీర్తనలక్షణం 3. అష్టభాషాదండకం
9	పెదతిరువేంగళనాథుడు [క్రీ.శ. 1546 లో పోయాడు]	మనుమడు (పెదతిరుమలయ్య మూడవ కొడుకు)	సంకీర్తనలు పాడి, నాట్యం చేసేవాడు
10	చినతిరువేంగళనాథుడు, లేక చిన్నన్న [క్రీ.శ. 1565 లో పోయాడు]	మనుమడు (పెదతిరుమలయ్య నాల్గవ కుమారుడు)	1. అన్నమాచార్యచరిత్ర 2. అష్టమహిషీకల్యాణం(ద్విపద) 3. పరమయోగివిలాసం (ద్విపద) 4. ఉషాపరిణయం
11	తోనేటి తిరువేంగళనాథుడు [క్రీ.శ. 1544_45]	మనుమడు (పెదతిరుమలయ్య కడగొట్టు కొడుకు)	వైభవంగా బ్రతికాడు
12	తిరువెంగళప్ప [క్రీ.శ. 1553_54]	మునిమనుమడు (చినతిరుమలయ్య కొడుకు)	అమరుకాన్ని తెనిగించాడు. కావ్యప్రకాశానికి 'సుధానిధి', నామలింగానుశాసనానికి 'బాలబోధిక' వ్యాఖ్యలు.

డయ్యాడని వేటూరి ప్రభాకరశాస్త్రిగారి అభిప్రాయం.[1] దీనిని చాగంటి శేషయ్యగారు నిరాకరించారు.[2]

పెదతిరుమలయ్య చాలా వైభవంగా బ్రతికాడు, అప్పాజోశ్యమ్మకుసును అవసానదశలోఆదుకొన్నాడు. ప్రసాదం, హక్కును కొని సహాయం చేశాడు. మండపాలు కట్టించాడు. ఉన్నవాలు జరిపించాడు. అంగరంగభోగాలకు కట్టుదిట్టం చేశాడు. అతని కృషివల్లనే తాళ్ళపాకవారి రచనలు రాగి రేకులపైకి ఎక్కి చెక్కుచెదరకుండా నిలిచాయి.

పెదతిరుమలయ్యగారి నాలుగో కొడుకు చిన్నన్న ఈ కవులందరిలోనూ సుప్రసిద్ధుడు. ఇతడు జలజాతవాసిని చను బాలపుష్టితో కవిత్వం చెప్పనేర్చిన జాణ. ద్విపదలక్షణాన్ని నిర్దుష్టంగా నిర్వచించాడు. కవిత్వం ఎలా ఉండాలో వివరించాడు.

పలికి కస్తురివీణె గోసిన కరణి – డెలికప్పురపు గ్రోవి దెరచిన సరణి
విరవాది పొట్లంబు విడిచినమాడ్కి–పరిమళించుడు గవుల్ బళిబళి యనగ
గవిత చెప్పిన సులక్షణుని గవీంద్రు–డవునందుకే నేర్చినట్లు చెప్పెదను.
[అష్టమహిషీ. 175–180]

నిజంగా ఇన్ని పరిమళాలూ గుబాళించేట్టు చిన్నన్న అష్టమహిషీకల్యాణం రచించాడు. శ్రీవైష్ణవమతంలోని పన్నిద్దరాళ్వారుల చరిత్రను పరమయోగివిలాస మనేపేర

1. అన్నమాచార్యచరిత్ర, పీఠిక, పుట 83.
2. ఆంధ్రకవితరంగిణి, 8 వ సంపుటి, పుట 246.

'ద్రవిడప్రబంధం చూచి' తెలిసిగించాడు. రాయలవారికన్నా శ్రద్ధగా విష్ణుచిత్తుల కథ, గోదాదేవిచరిత్ర వ్రాశాడు.[1]

అమరానికి వ్యాఖ్య వ్రాసి, అమరుకాన్ని తెలిసిగించిన తిరువెంగళప్ప అన్నమయ్యగారి మునిమనమడు. అమరుక శతకాన్ని తెలిసిస్తూ ఆ పద్యాలలోని భావాలను వచనంలో వివరించాడు. ఇది అముద్రితం. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో రెండుప్రతు లున్నాయి (R 107, R 673). చిట్టచివరరి శ్లోకం, దానికి అనువాదం, వివరణ చూడండి.

సాలక్తకేన నవపల్లవకోమలేన
పాదేన నూపురవతా మదలాలసేన
యస్తాడ్యతే దయితయా ప్రణయాపరాధాత్
సంగీకృతో భగవతా మకరధ్వజేన.

యావరసార్ద్రిముక గిసలయారుణకోమలముక వినూత్నర
త్నావళినూపుర బును మదాలసభావను నౌ పదంబుచే
నే వరపూరుషుండు ప్రణయేర్ష్య బరాంగనచేత దాడితుం
డై విలసిల్లు వాడు కుసుమాయుధదేవునకుక బ్రియుండగున్. [R.107]

తిరువెంగళప్ప పాదతాడనాన్ని ఇలా కీర్తిస్తే ఇతని తాతగారి మేనల్లుడు రేవణూరి వెంకటాచార్యుడు 'గుబ్బల దెబ్బలు' ప్రశంసించాడు. శకుంతలా పరిణయంలో ఇలా వ్రాశాడు.

---

1. చిన్నన్న ఎక్కడొక్కడ ద్రవిడవేదాన్ని అనువదించినది చల్లా రాధాకృష్ణశర్మగారు గుర్తించారు. (Tamil Element in Telugu Literature, Pp. 113-168)


పంతము లేల బాల! నవపల్లవగల్లనవాల్లవంపు గో
రంతట జేర సైపవు రయమ్మున రొమ్మున గుమ్మ నీపు రో
డంతటి గుబ్బడెబ్బలపు మోమిని బాలిని చాలసీదు వి
భ్రాంతి కొకింత నీకు గృపగాదది సరా కపరాధమే మొకో! [R. 140]

ఈ వెంకటాచార్యుని పిలిచి ఒక రాజు కృతిచెప్ప మన్నాడు. తీరా అంతా రాసి తీసుకొని వెళితే ఒక కరణం విఘ్నం కలిగించాడట. అందుచేత దేవునికి అంకితమిచ్చాడు. ఇతడు శ్రీపావరేణు మాహాత్మ్యం అనే కృతికూడా రచించాడు.

'తేనెలపై తేట తిన్నని చెరకుపానకముల నేరుపర
చిన మేలుచక్కెరలు తీపుచల్లదమ్మోరలు చిక్కని
కప్రంబు జీవరత్నములు కల యమృతంపు మీగడమీది
తావులు' చిలుకుతూ కవులెల్ల చేయెత్తి మ్రొక్కగా అన్న
మయ్య రచనలు చేశాడు. ఈ తీపులకు తాళ్లపాక కవు
లందరూ వారసులే.

15

ఇతరకవులు



యుగంలో ఉన్నంతమంది కవులు మరేయుగంలోనూ కనిపించరు. అష్టదిగజాలముందు వీళ్లు దివిటీలముందు దీపాల్లాగా కనబడ్డా తక్కువవాళ్లుకారు. వీళ్లలో కొందరు మూసిన ముత్యాలు. స్థలాభావంచేత ఈసాహిత్యమూర్తుల గురించి విడివిడిగా, సుదీర్ఘంగా చర్చించలేకపోవడం విచారకరం. వీరే ఇతరకవులు ఈయుగంలో ఉన్నారో, వాళ్లు వ్రాసిన గ్రంథాలేమిటో తెలుసుకొని తృప్తిపడదాం.

1. యాదవామాత్యుడు:-ఇతడు క్రీ.శ. 1520 దాకా జీవించి ఉండవచ్చు. జైమినీభారతంలో పినవీరయ్య వ్రాసిన చంద్రహాసచరిత్రనే చంద్రహాసవిలాస మనేపేరుతో 'కదళీపాకము'గా వ్రాశాడు. చాలా అణకువగల కవి. పూర్వకవులను ఉద్దేశించి ఇలా చెప్పాడు.

ననున్నబోలిన కవిగల్గకున్న ధాత్రి_వరకవీంద్రులఁ బేరెట్లు వచ్చునీకు
చిన్నలుండుటచే గాదె పెద్దలను మ_దెలియగలుగుటయార్యులు దెలిసికొనుట.

తాను చిన్నవాడినని కవి చెప్పుకొన్నా 'చిన్నచేతిదివ్వె పెద్దగా వెలుగదా' అన్నట్లు అక్కడక్కడ జిగేలు మనకపోదు. ఇతని కవిత్వం ముద్దులు మూటకట్టి తేనెలొలుకుతూ ఉంటుందని వీరేశలింగంగారు సిఫార్సుచేశారు. యాదవామాత్యుడు విక్రమార్కచరిత్రను వచన కావ్యంగా వ్రాశాడు. సింహాసనంమీది ముప్ఫయిరెండుబొమ్మలూ చెప్పిన కథలే ఇవి. ఒక్కొక్కకథకు ముందు ఒకసీసపద్యంవ్రాశాడు. ఈగ్రంథం అముద్రితం (R. 344). ఈ యాదవామాత్యుడు లక్షణశిరోమణి అన్న

పేరుగల యాదవామాత్య చ్ఛందాన్నిగూడ చెప్పాడు. ఇతని గ్రంథా లన్నీ భద్రాద్రి రామునికే అంకితం.

2. పోశెట్టి లింగన్న:-ఇతనికాలం కచ్చితంగా నిర్ణయించ డానికి ఆధారాలు లేవు. ఇతడు వీరశైవుడు కనుక కులం, గోత్రం, తల్లి దండ్రుల పేర్లూ ఏమీ చెప్పుకోలేదు. ఈకవి అయిదు ద్విపద కావ్యాలు వ్రాశాడు: (1) నవచోళచరిత్ర, (2) మల్లాణచరిత్ర, (3) శంకరదాస మయ్యచరిత్ర, (4) వీరసంగయ్యదేవచరిత్ర, (5) శిష్యప్రబోధం. వీటిలో నవచోళచరిత్ర అచ్చుపడింది. పీఠిక వ్రాసిన పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు ఈకవి కమ్మరివృత్తివాడని చెప్పారు. ప్రాచీన శివభక్తులలో కమ్మరి గుండయ్యను ఈకవి మొదట స్మరించాడు. పోశెట్టి లింగయ్యకవి వల్ల కరికాలచోళుని గురించి లోకం చెప్పుకొనే కథలు తెలుగులో గ్రంథస్థమయ్యాయి.

3. హరిభట్టు:-ఇతడు చాలాకాలం మరుగుపడిన మాణిక్యం. అష్టఘంటావధాన విశిష్ట బిరుదున్నవాడు. ప్రబంధాలను దేశమాదరిస్తున్న కాలంలో పురాణాలను అనువదించిన దిట్ట. వరాహపురాణం పూర్వ భాగాన్ని అయిదాశ్వాసాల గ్రంథంగా తెలిగించి కంబంమెట్టు గ్రామ కరణం కొలిపాక ఎర్రయ్యకు అంకితమిచ్చాడు. నందిఘంట కవుల ఆంధ్రీ కరణముందు ఇది ఎక్కురాలేదు. వరాహపురాణంతరువాత ఇతడు మత్స్య పురాణం వ్రాశాడు. 'నరాధములకు' ఇంక కావ్యాలు అంకితం ఇవ్వ గూడదనుకొన్నాడు. బమ్మెర పోతరాజుగారి ప్రభావంలో పడ్డాడు. భాగవతపురాణంలోని షష్ఠ, ఏకాదశ, ద్వాదశస్కంధాలను అనువదిం చాడు. ఇతని కడపటి రచన నారసింహపురాణంలోని ఉత్తరభాగం. దీనిని ఇతని సంతతివాళ్లు నరాంకితంచేశారు. హరిభట్టు యౌవనంలో శృంగారి అనడానికి ఇతడు సంస్కృతంలో వ్రాసిన 'రతిరహస్యం' సాక్ష్యం. నరాధములపట్ల విముఖతగని రోజులలో ఈ హరిభట్టోపాధ్యా యులు చిన్నపల్లె అనే గ్రామాన్ని కృష్ణరాయలవారి మండలాధికారివల్ల దానంపొందాడు హరిభట్టు రచనలగురించి సోదాహరణమైన అంచనా అవసరం.

4. ప్రౌఢకవి మల్లన:–కవిత్వం వారకాంతలాగ ఉండవద్దా అని ఇతడు తన రుక్మాంగదచరిత్రలో ఇలా ప్రశ్నించాడు:

సౌరభ్యంబును బంధచాతురి తగఁ శయ్యాచమత్కార శృం
గారంబుఁ వివిధార్థముల్ సరససాంగత్యంబు నానాకళా
పారీణత్వము మంజువాగ్విభవముఁ పాంచాలరీతిఁ తగఁ
వారస్త్రీయనుబోలె నొప్పవలదా వర్ణింప కావ్యంబిలఁ?

[రుక్మాంగద. 1_24]

సానిహూతుళ్ల ప్రౌఢత్వాన్ని వర్ణించే ఈ రసికుడు తన గ్రంథాన్ని నరాంకితం చేయలేదు. దాక్షారామభీమేశ్వరునికి అంకితంచేశాడు. ఇది తెలంగాణాలోని దాక్షారామమో, తూర్పుగోదావరిజిల్లాలోదో చెప్పలేం. మోహినీ రుక్మాంగద కథ సుప్రసిద్ధం. దీనిని మొదట కావ్యంగా ఈ ప్రౌఢకవే చెప్పాడు.

5. వెన్నెలకంటి సూరన్న:–'కవుల పుట్టిల్లు వెన్నెలకంటి యిల్లు' అని సగర్వంగా చెప్పుకొన్న వంశంలోని సుప్రసిద్ధుడు. క్రీ. శ. 1530_1555 ల మధ్య ఉండేవాడని చెప్పవచ్చు. ఇతడు ఆశు, విస్తర, విచిత్ర, మాధుర్య కవిత్వచాతుర్యశీలుడు. సారస్యవిద్యాప్రవీణుడు. ఎనిమిది ఆశ్వాసాలుగా విష్ణుపురాణం ఆంధ్రీకరించాడు. ఇందులో నరకాసురవధ, ప్రహ్లాదచరిత్ర, ధ్రువోపాఖ్యానం, రుక్మిణీకల్యాణం మొదలైన ఘట్టాలన్నీ ఉన్నాయి. శేషాద్రి రమణకవులు చెప్పినట్లు ఇతని రచన 'పోతనరచనకు దీసిపోవుచున్నది.' అయితే వెన్నెలకంటి సూరన్న కవిత్వంలో వెన్నెలకంటె చల్లని ఘట్టాలు కొన్ని లేకపోలేదు. పారిజాతాపహరణ ఘట్టంలో నండితిమ్మనగారితో, ఖాండిక్య కేశిధ్వజ సంవాద ఘట్టంలో రాయలవారితో, తారాశశాంక సన్నివేశంలో శేషం వెంకట పతి రచనతో, ఇలాగే ఇతరఘట్టాలలో సమకాలిక అర్వాచీన కవుల రచనలతో తులపారువేస్తే సూరన్న వ్యక్తిత్వం బాగా వెల్లడవుతుంది.

6. పెదపాటి సోమయ్య:–లాక్షణికులు ప్రామాణిక కవిగా గుర్తించి ప్రయోగాలు ఉదాహరించిన ప్రాచీనులలో ఇతడొకడు. ఇతని అరుణాచలపురాణంలోనుంచి 10 పద్యాలు, కేదారఖండంనుంచి

9 పద్యాలు, శివజ్ఞానదీపికనుంచి 3 పద్యాలు, త్రిపురవిజయంనుంచి 1 పద్యం వేటూరివారి ప్రబంధరత్నాకరంలో ఉన్నాయి. పద్యం ఎలా ఉండాలో కేదారఖండంలో ఇలా చెప్పాడు:

పదలాలిత్యము వర్ణశుద్ధియును శబ్దసౌర్యముఁ బంగ్తి
స్పదభావంబును రాజయోగ్యతయుఁ దోషస్ఫూర్తిరాహిత్యముఁ
సదలంకారవిశేషముం గలిగి విశ్వప్రాణసౌభాగ్య మం
పదమై తేటియవోలె శ్రీలవలదా పద్యంబు వ్యాప్తిస్థితిన్ ?

[ప్రబంధ. 502]

ఇతని గ్రంథాలు పూర్తిగా దొరకక పోవడం దురదృష్టమే.

7. భానుకవి :–పంచతంత్రాన్ని తెనిగించిన కవులలో ఒకడు. దీనిని కృష్ణరాయలవారి ఆశ్రితుడు – నాట్యాచార్యుడు భండారు లక్ష్మీనారాయణకు అంకితమిచ్చాడు. కృతిపతికి సూక్ష్మలిఖితాచార్య రాయబయాకరతోడరమల్ల అభినవభరతాచార్య అనే బిరుదులున్నాయి. కృతిపతిని ఆశ్వాసం మొదటా, చివరా సంబోధించడం ఆచారం. ఇతడు కావ్యంలో ఎక్కడ నీతులు చెప్పినా ఆ పద్యాలను కృతిపతిసంబోధనతోనే వ్రాశాడు. ఇతర పంచతంత్రాలలో లేని మరొక విశేషం ఇతని కావ్యంలో ఉంది. 'రాజకీరము గణిక' అనే కథను ప్రథమాశ్వాసంలో మిత్రభేదంలో చెప్పాడు.

8. కోడూరి వల్లభాచార్యులు :–పావులూరి మల్లన తరువాత గణితశాస్త్రాన్ని ఆంధ్రీకరించినవాళ్ళలో ఇతడు చెప్పుకోదగ్గవాడు. రాయలవారికి ఆప్తుడైన బొమ్మలాటలకాళయ్య ప్రోత్సాహంవల్ల ఈకవి లీలావతిగణితంలోనుంచి పాటిగణితం తెలిగించి కాళయ్యకు అంకితమిచ్చాడు. ఈ కవికి ఔచిత్యం బాగా తెలుసు. కృతిపతిని, కీర్తిని కూడా లెక్కించాడు. కాళయ్య తన అర్ధరాశిలో సగం తన గురువుగారు కుమార తాతాచార్యుల కిచ్చాడట. ద్విజులకు శేషతృతీయల్ రెండిచ్చి

శేషపాదం కవిశ్రేణి కిచ్చాడట. స్నేహంతో చెలులపు శేషనవమభాగ పంచకం ఇచ్చాడు. మిగిలిన వెయ్యిన్నూటపదహార్లు కవిమహాంగ్రుని కిచ్చాడట. ఈ శ్లోకాల్లో వెనకటి వెళితే బొమ్మలాటకాళ్యు ఆ స్తి 15066 నాణాలని తేలుతుంది. ఆ పాటిగణితం ఎంత విలువచేస్తుందో ఖరీదులుకట్టే షరాబులు చెప్పాలి.

9. ఎడపాటి ఎర్రన :-కృష్ణరాయలవారు నా పద్యం వింటే చాలు, నాకృతి తీసుకొంటే చాలు అని కవులు ఉవ్విళ్ళూరే కాలంలో ఈ కవి 'కృష్ణరాయజనకాంతునకీయక దాచిపెట్టి' మల్లాణచరిత్ర అనే కావ్యాన్ని చుండికాళియమంత్రికి అంకితంచేశాడు. ఇది మూడాశ్వాసాల శృంగారప్రబంధం. ఎర్రన రచనలు ప్రసిద్ధమే అనడానికి సాక్ష్యంగా ఇతని కుమారనైషధంలోనుంచి 16 పద్యాలను పెదవేటి జగన్న తన ప్రబంధరత్నాకరంలో ఉదాహరించాడు. ఇతడు 'సరసకవితాభుజ్య' అనే బిరుదు తన గద్యలో వేసుకొన్నాడు. ఇతని కవిత సరసమే.

10. పుత్తేటి రామభద్రుడు:-అష్టదిగ్గజాలలో అయ్యలరాజు రామభద్రుడున్నాడని పండితలోకం భావిస్తూ వచ్చేది. క్రీ. శ. 1050_70 ప్రాంతాలలోఉన్న గొబ్బూరి నూకరాజుకు రామాభ్యుదయం అంకితమిచ్చిన అయ్యలరాజు రామభద్రుడు అష్టదిగ్గజాలలో ఉండడానికి ఆస్కారంలేదని, పుత్తేటి రామభద్రుడే రాయలనారి ఆశ్రితుడు కావచ్చునని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రతిపాదించారు. నిడుదవోలు వెంకటరావుగారు దీనిని సోదాహరణంగా సమర్థించారు. కృష్ణరాయలవారు సంస్కృతంలో వ్రాసిన సకలకథాసారాన్ని ఇతడు అనువదించాడు. సమకాలీక కవులనుసైతం అనుసరించేపద్యాలున్నాయి. బ్రౌనుదొరగారి అభిప్రాయం ప్రకారం ఇది ప్రశస్తగ్రంథంకాదు. 'చదివినవారు గాఢరసక్రియజెప్పు, మహాప్రబంధముల్ చదివినవారు నేర్చినకొలంది రచింపకయుంట'లేదు అని రామభద్రుడే సకలకథాసార సంగ్రహం అవతారికలో అన్నాడు (1_19). ఇతడే అష్టదిగ్గజాలలో ఉంటే గొప్పవాడనే చెప్పాలి.

11. మాచిరాజు బసవన్న:—ఇతడు లాక్షణికుడు. కవిసర్వ గారుడం, ప్రయోగసారం అనే గ్రంథాలు వ్రాశాడు. ఇతణ్ణి చిత్రకవి పెద్దన, అప్పకవిలాంటిప్రముఖులే ప్రస్తుతించారు. ఇతని గ్రంథాలు అముద్రితాలు.

12. త్రిలోకభేది:—ఈ కవి ద్విపదకావ్యాలుగా హరిశ్చంద్ర, నవనాథచరిత్రలు వ్రాసిన గౌరనమనుమడే. ఇతడు 'సకలధర్మసారం' అనే కావ్యం వ్రాశాడు. దీనిని ఇటీవల డా॥ శ్రీపదురాజు రామరాజు గారు సంపాదించారు. ఈ కవి క్రీ. శ. 1485 ప్రాంతాలవాడని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ సకలధర్మసారం నాలుగాశ్వాసాల గ్రంథం. ఇందులో దానాలు, వ్రతాలు మొదలైనవాటి ప్రశంస ఉంది. ఈ కవిగురించి ఇంకా పరిశోధనలు చెయ్యాలి.

13. వెల్లంకి తాతంభట్టు:—కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలో 'వెల్లంకి' గ్రామముంది. తాతంభట్టు బహుశా ఈ గ్రామంవాడే కాకచ్చుకాని అతడు దేశమంతా తిరిగాడు. గజపతి అశ్వపతి నరపతుల చేతా, మాళవేశ్వరునిచేతా మన్ననలు పొందాడు. ఇతడు అష్టభాషా ప్రక్రియలబ్ధుడు, సన్నుతసాహిత్యచక్రవర్తి, అనవద్యసర్వవిద్యా సాదృశ్యుడు, విద్వజ్జనవ్రాతవిశ్రుతుడు. అయితే ఇతడు వ్రాసిన కావ్య లేవీ దొరకలేదు. సంక్షేపభాగవతం వ్రాశాడని తెలుస్తున్నది. ఇతని కవిచింతామణి, ఛందోదర్పణం అనే లాక్షణికగ్రంథాలుమాత్రం దొరుకుతున్నాయి. అవి సుప్రసిద్ధాలు. ఈ కవి ఏనుగులను దానం పుచ్చుకొని, వాటిని మేపగల స్తోమతగలవాడు.

సాహితీసమరాంగణచక్రవర్తి కృష్ణరాయలయుగంలో సాహిత్యం వీరుగుపాడి[1].

---

1. ఆంధ్రపత్రిక మన్మథ సంవత్సరాదిసంచిక, 1955-56.

ప్రమాణగ్రంథాలు

1. ఆంధ్ర కవితరంగిణి—చాగంటి శేషయ్యగారు.
2. ఆంధ్రకవుల చరిత్ర II-కందుకూరి వీరేశలింగంగారు.
3. ఆంధ్రపత్రిక ఉగాదిసంచికలు
4. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక సంచికలు
5. ఆంధ్రుల సాంఘికచరిత్ర - నురవరం ప్రతాపరెడ్డిగారు.
6. ఆముక్తమాల్యద ఉపోద్ఘాతము - మేడేపల్లి వెంకటరమణాచార్యులుగారు.
7. ఆముక్తమాల్యద పర్యాలోకనం-వెల్దండప్రభాకరామాత్యుడు
8. ఆముక్తమాల్యద పర్యాలోకన భూమిక-ఈయూణ్ణి వెంకట వీరరాఘవాచార్యులుగారు.
9. ఆముక్తమాల్యద సంజీవని-వేదం వెంకటరాయశాస్త్రిగారు.
10. ఉద్భటారాధ్యచరిత్ర - తెనాలి రామకృష్ణుడు.
11. కన్యాశుల్కం - గురజాడ అప్పారావుగారు.
12. చాటుపద్యమణిమంజరి - వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.
13. చాటుపద్యరత్నాకరం - దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు.
14. తాళ్ళపాకవారి లఘుకృతులు.
15. తిరుపతి దేవస్థానం శాసనాలు.
16. తెలుగుభాషలో ఛందోరీతులు-రావూరి దొరస్వామిశర్మగారు.
17. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం.
18. పారిజాతాపహరణం : పరిమళోల్లాసం - నాగపూడి కుప్పస్వామయ్యగారు.
19. భారతి సంచికలు.

20. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం ట్రయన్నియల్ కాటలాగులు.

21. మనుచరిత్ర పీఠిక - తంజనగరం తేవప్పెరుమాళయ్యగారు

22. మొగడ తరకలు - వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.

23. మైరావణచరిత్ర పీఠిక - రామకృష్ణ కవులు.

24. రాయవాచకం.

25. లక్ష్మణరాయ పరిశోధకమండలి సంచిక.

26. విజయనగరసామ్రాజ్యమందలి ఆంధ్రేతరాజ్యచరిత్రము - వేంకటమళ్ళ అచ్యుతరావుగారు.

27. విష్ణుమాయానాటకం పీఠిక - కోరాడ రామకృష్ణయ్యగారు.

28. విస్మృతప్రబంధపద్యావళి.

29. సంగ్రహ ఆంధ్రవిజ్ఞానకోశం.

30. సంస్కృత వాఙ్మయ చరిత్ర - మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు.

31. సారస్వతాలోకము - రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు.

32. Archaeological Reports.

33. Epigraphia Indica.

34. Forgotten Empire.

35. History of Tamil Language & Literature - S. Vaiyapuri Pillai.

36. Studies on Krishnaraya of Vijayanagara - Dr. Oruganti Ramachandrayya.

37. Tamil Elements in Telugu Literature - Challa Radhakrishna Sarma.

BCI

Acc No 9122

No .....

LIBB114R103

BC

456

ముద్రణ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

పుస్తకం సంఖ్య	LIBB114B103
పుస్తకం పేరు	సమగ్ర ఆంధ్రపాపాత్యం 07
తారీఖు	26 August 2025
ముందు అట్ట	YES
వెనుక అట్ట	YES
మొత్తం పేజీలు	279
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	CT BCT
లేని పేజీలు	1-2, 125, 126, 127, 128
తయారు చేసినది	Salomi
పేజీలు విడదీసినది	Salomi
స్కాన్ చేసినది	Vyshnavi
పరీక్ష చేసినది	HHANU
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good